ఆర్షవిద్యా తరంగాలు - 02

# కఠోపనిషత్తు

## స్వామి పరమార్థానంద

ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్
అనుభవిస్తున్న నేనే ఎప్పటికీ అది, అనుభవించబడే వస్తువు ఎన్నటికీ కాదు.

**స్వామి పరమార్థానంద బోధనల స్ఫూర్తితో**

**తెలుగు సేత - మద్దూరి/కస్తూరి రాజ్యశ్రీ**

Third edition - Year 2025 1000 copies

**For Copies**

K V Raghava Rao

C - 804 Aparna Cyberzon Nallagandla, Hyderabad 500019

Mobile: 9849092368

Emails: raghavkasturi@gmail.com

for softcopy arshavdiya.app

www.telugubhakti.com

For our YouTube Channel

https://www.youtube.com/@arshavidyatarangini7911/playlists

**Printed at**

Sai Sri Printers

8-3-945 # 21

Pancom Business Centre

Ameerpet, Hyderabad --500073

e-mail : saisriprinters@yahoo.com

Ph.No.040-23730222,Cell:9985530222

**Price Rs. 200 = 00**

# ముందు మాట

పూజ్యశ్రీ పరమార్థానంద సరస్వతుల వారు శాస్త్రమాతకు ప్రతిరూపం. వేదాంత శాస్త్రమే వారి శ్వాస. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు. వారు బోధించే బ్రహ్మ విద్య శ్రోతలందరికీ కరతలామలకము.

**ఆచినోతిహి శాస్త్రాణి ఆచారేస్థాపయత్యపి ।**
**స్వయం ఆచరతే యస్మాత్తస్మాదాచార్య ఉచ్యతే ॥**

శాస్త్రము ఆకళింపు చేసుకొని, వారు ఆచరిస్తూ వారి బోధన ద్వారా ఇతరులను ఆచరింపజేసేవారే ఆచార్యులు అని చెప్పబడినది. ఇది స్వామివారి జీవనశైలి, బోధనాశైలి ద్వారా నేను తెలుసుకున్న సత్యం.

పూజ్యశ్రీ స్వామి వారి బోధనా పద్ధతి విశిష్టమైనది. గీతా, ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రములు మరియు ప్రకరణ గ్రంథములపై స్వామివారి బోధనలు అపూర్వము. వారు క్లిష్టమైన శ్లోకములను మొదట వాని యొక్క సారాంశమును స్పష్టముగా, సరళమైన రీతిలో వివరించి తర్వాత దాని యొక్క ప్రతిపదార్థమును వివరిస్తారు. అది శిష్యులకు సులభముగా అర్థం చేసుకొనుటకు దోహదపడును. స్వామి వారి బోధనలు ఈ విధముగా అత్యంత స్పష్టముగా, సరళముగా నుండుటచే అనేకమంది దేశ విదేశీ జిజ్ఞాసువులు వారి బోధనలను వినుటకై ఉవ్విళ్ళూరు చుందురు.

నా గురువర్యులైన పూజ్యశ్రీపరమార్థానంద స్వామివారి అనుగ్రహంతో ప్రస్థాన త్రయము మరియు ప్రకరణ గ్రంథములను బోధించుటలోనే నాకు సమయము సరిగా నుండుట చేత వారి బోధనలను తెలుగులో వ్రాయవలెననే నా సంకల్పము కార్యరూపంలో పెట్టుట సాధ్యపడలేదు.

భగవంతుడు నా సంకల్పమును శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీ గారి ద్వారా సఫలము గావించుట నాకెంతో సంతోషము కలిగించినది. రాజ్యశ్రీ గారు అనువాదం చేసిన స్వామివారి అద్వైత వేదాంత పరిచయము, ప్రశ్నోపనిషత్తు చదివియుంటిని. ఈ కఠోపనిషత్తు కూడా స్వామివారు చెప్పింది చెప్పినట్లు చక్కగా అనువాదం చేశారు. వారి అనువాదములు వారికి శాస్త్రముపై నున్న అత్యంత శ్రద్ధను వ్యక్తము చేయుచున్నవి.

యమధర్మరాజు పేరు వింటేనే అందరూ భయపడతారు. కఠోపనిషత్తుపై స్వామివారి బోధన వింటే యమధర్మరాజు మీద అత్యంత భక్తి శ్రద్ధలు కలుగుతాయి. శిష్యునిలో తీవ్ర

ముముక్షుత్వం ఉన్నప్పుడే గురువు యొక్క బోధనలు ఉపదేశములై అతడికి ఆత్మజ్ఞానమును ప్రసాదించగలవు. స్వామి వారు తీవ్ర ముముక్షువైన నచికేతుని గురించి చెప్పేటప్పుడు ఆ పాత్ర ఔన్నత్యమును అలా మన కళ్ళముందు నిలుపుతారు. గురుశిష్యులైన యమధర్మరాజు, నచికేతుల సంవాదము ద్వారా స్వామివారు బోధించిన ఉపనిషద్వాక్యములు చెవులలో ప్రతిధ్వనిస్తూనే వుంటాయి.

శ్రీమతి మద్దూరి రాజ్యశ్రీగారు కఠోపనిషత్తుపై స్వామివారి ప్రసంగాలను తెలుగులో అనువదించి పుస్తకరూపంలో అందించటం ఎంతో శ్లాఘనీయం. ఆధ్యాత్మిక చింతనా పరులైన తెలుగు వారందరికీ ఈ పుస్తకము శ్రేయస్సును కలుగజేయవలెనని ప్రార్థిస్తున్నాను.

నారాయణ స్మృతులతో

1-10-2016

**అక్షర విద్యా ట్రస్ట్**

New No.15, (Old No.7/1)

మహాలక్ష్మి వీధి, టి.నగర్, చెన్నై - 600 017.

ఫోన్ : 044 - 24328087

**స్వామిని సత్యవ్రతానంద**

# పరమార్థానంద స్వామి - అనన్య గురువు

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం**
**తథాఽరసం నిత్యమగన్ధవచ్చ యత్।**
**అనాద్యనన్తం మహతః పరం ధ్రువం**
**నిచాయ్య తన్మృత్యుముఖాత్ప్రముచ్యతే॥** – కఠ 1.3.15

ఆత్మ స్వరూపాన్ని తెలుసుకున్నవాడు యమధర్మరాజు నుంచి విముక్తి పొందుతాడు అని స్వయంగా యమధర్మరాజే చెప్పాడు. ఆత్మజ్ఞానం పొందటమెలా?

**అనన్యప్రోక్తే గతిరత్ర నాస్తి**
**అణీయాన్హ్యతర్క్యమణు ప్రమాణాత్॥** – కఠ 1.2.8

యమధర్మరాజే మార్గం చూపాడు. అనన్యగురువు చెప్తే నా నుంచి తప్పించుకుంటావు అన్నాడు. అనన్య గురువు అంటే అద్వైత ఆత్మను బోధించే ఉత్తమ ఆచార్యుడు. ఈ పుస్తకం మీ చేతికి వచ్చిందంటే మీకు అనన్య గురువు దొరికినట్టే.

ఉపనిషత్తు అంటే ఏమిటో వివరించటం నుంచే ఆయన ప్రత్యేకత గోచరిస్తుంది. ఉపనిషత్తు జీవాత్మ, పరమాత్మల ఐక్యం బోధిస్తుందనీ, ఎన్ని ఉపనిషత్తులు నేర్చుకున్నా అంశం ఒకటే అనీ, బృహదారణ్యకం లాంటి పెద్ద ఉపనిషత్తు పెద్ద ఆత్మ గురించి, ఈశావాస్యోపనిషత్తులాంటి చిన్న ఉపనిషత్తు చిన్న ఆత్మ గురించీ బోధించదని చెప్తారు. అలాగే ఒక ఉపనిషత్తు జీవ ఈశ్వర ఐక్యం చూపిస్తే, ఇంకో ఉపనిషత్తు ఈశ్వర జీవ ఐక్యం చూపిస్తుంది అంతే తేడా అనీ అంటారు.

ఉపనిషత్తుకి ఉన్న అనేక అర్థాల్లో ఒక అర్థం గురువు సమీపంలో కూర్చుంటే ఆత్మ గురించిన నిశ్చయజ్ఞానం కలుగుతుంది అని. పరమార్థానంద స్వామి బోధ వింటే (ఈ పుస్తకరూపంలో చదివితే) అంత నిశ్చయజ్ఞానం కలుగుతుందనటంలో ఏమాత్రం సందేహం లేదు.

పరమార్థానంద స్వామి ఆత్మ గురించి నాలుగు ప్రాథమిక ప్రశ్నలు వేస్తారు – ఎ. ఆత్మస్వరూపం ఏమిటి? బి. ఆత్మను ఎలా గుర్తించగలము? సి. దానికి కావాల్సిన సాధన ఏమిటి? డి. దాని గురించి తెలుసుకోవటం వలన కలిగే ఫలమేమిటి? కఠోపనిషత్తు ముగిసేలోపు ఈ ప్రాథమిక ప్రశ్నలకు మీకు సమాధానం దొరుకుతుంది.

ఆత్మ స్వరూపం గురించి ఇందులో అనేక నిర్వచనాలు ఉన్నాయి. అందులో ముఖ్యమైనది, మొట్టమొదటిది శుద్ధ చైతన్యానికి ఐదు లక్షణాలు ఉన్నాయి అని వాటిని చెప్పటమే కాకుండా ఈ ఉపనిషత్తు ముగిసేలోపు అనేకసార్లు చెప్పారు. అలా కొన్ని వాక్యాలు మన మెదడులోకి చొప్పిస్తారు బాగా.

పరమార్థానంద గారి బోధలో ఇంకో ప్రత్యేకత ఉంది. ఒక విషయం చెప్పి, ఏమిటి దానికి నిదర్శనం అని ఆయనే ప్రశ్న వేసి, ఆయనే జవాబు కూడా ఇస్తారు. ఉదాహరణకు మనిషికి మాత్రమే ఫ్రీ విల్ ఉంది, ఏమిటి దానికి నిదర్శనం? గాఢనిద్రలో మనసు పనిచేయదు కాని అది ఉంటుంది. ఏమిటి  నిదర్శనం?

అంతేకాదు కొన్ని కాన్సెప్టులు మనలో జీర్ణించుకుపోయేలా చూస్తారు. అధ్యారోప అపవాదం, కార్యకారణ సంబంధం, పంచకోశ వివేకం, అవస్థాత్రయ సాక్షీ, శరీరత్రయ విలక్షణం లాంటి కాన్సెప్టులు చక్కగా స్పష్టంగా అర్థమయిపోతాయి. అలాగే బంగారం, మట్టి, నీరు, కాంతుల తత్త్వాలను వివరించటం ద్వారా ఆత్మతత్త్వం గురించిన సంశయరహిత జ్ఞానం కలుగజేస్తారు.

నాకు ఆత్మ గురించి ఏమీ తెలియదు అనుకున్నా, ఒక్కసారి పరమార్థానంద గారి బోధ చదివి చూడండి, అరచేతిలో కమలం ఉన్నంత స్పష్టంగా అర్థమవుతుంది. నాకు అంతా తెలుసు, కఠోపనిషత్తు ముందే ఎక్కడో విన్నాను అనుకున్నా, ఇదే జవాబు. ఒక్కసారి ఆయన బోధను చూడండి, యమధర్మరాజు చెప్పిన శాస్త్రమంతా ఒక క్రమపద్ధతిలో అల్లుకుంటూ ఎలా వివరంగా చెప్పుకొచ్చారో మీకే తెలుస్తుంది.

ఆయన ఆశీస్సులతో,  ప్రోత్సాహంతో, ఆయన బోధలను వినే అవకాశం లేని తెలుగువారికి అందించాలన్న సదుద్దేశంతో అంతకు ముందు 'అద్వైత వేదాంత పరిచయం' పేరుతో ఒక చిరుప్రయత్నంగా ఒక పుస్తకాన్ని ప్రచురించాము. దానికి విశేష ఆదరణ లభించింది.

స్వామీజీ కూడా మా దంపతులను దీవిస్తూ, ఆయన స్వహస్తాలతో మాకొక లేఖ కూడా రాసారు. ఇప్పుడు కఠోపనిషత్తు తెలుగులో ప్రచురిస్తున్నామని విని మనస్ఫూర్తిగా అభినందించారు. మా మరో చిరు ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తూ ఆశీర్వదించారు.

ఈ సందర్భంలో నాలుగు విషయాలు మీకు మనవి చేస్తున్నాను. ఆత్మబోధ విషయం కష్టమైనది కాబట్టి సరళమైన వాడుక బాషలో అందరికి అర్థమవాలని రాయటం జరిగింది. ఇంకొకటి ఇది ఆషామాషీగా చదివి మర్చిపోయే విషయం కాదు. అందుకని స్వామీజీ

చెప్పినట్టే కొన్ని అంశాలు కావాలనే పదే పదే చెప్పటం జరిగింది. అలాగే అవగాహనకి వెసులుబాటు కలుగుతుందని అక్కడక్కడ ఆంగ్లపదాలను వాడటం జరిగింది. స్వామీజీ శంకరభాష్య బోధనలో చెప్పిన అంశాల్లో తేలికగా అందరికీ అర్థమౌతాయనిపించిన కొన్ని అంశాలను ఇందులో పొందుపరిచాను. ఈ విషయాలు సహృదయంతో స్వీకరిస్తారని ఆశిస్తున్నాను. స్వామీజీ బోధనలు ఇలా తెలుగులోకి తీసుకురాగలిగినందుకు నా జన్మ ధన్యమైనట్లుగా భావిస్తున్నాను. మీరు ఇంతటితో ఆగిపోకూడదనీ, స్వయంగా ఆయన బోధనలను సిడీల రూపంలోనైనా వినాలనీ ఆశిస్తున్నాను.

**నమో నమః శ్రీ గురుపాదుకాభ్యాం**

**మద్దూరి / కస్తూరి రాజ్యశ్రీ**

# దయాసత్సంగ్ స్పందన

**అథాధివిద్యమ్। ఆచార్యః పూర్వరూపమ్ అంతేవాస్యుత్తరరూపమ్। విద్యా సన్ధిః। ప్రవచనగ్ం సన్ధానమ్। ఇత్యధివిద్యమ్।** – శీక్షావల్లి, తైత్తిరీయం

గురువు దగ్గర ఉండి విద్య నేర్చుకునే విద్యార్థిని అంతేవాసి అంటారు. ఇప్పుడు ఆ పద్ధతి చాలామటుకు అంతరించిపోయినా మా గురువు రమామణి గారి దగ్గర మేము అంతేవాసులు మెలిగినంత సన్నిహితంగా మెలిగాము, ఇరయేళ్ళ పైనే. ఆ దంపతులను అమ్మా నాన్నగార్లనే పిలిచేవాళ్ళము.

ఆచార్యుడంటే జ్ఞానాన్ని సేకరించి, బోధ చేసి, తను చేసిన బోధకి ప్రతిరూపంగా నిలిచేవాడు. మా అమ్మగారికి ఈ మూడు వర్ణనలూ అతికినట్టుగా సరిపోతాయి.

రమామణి అమ్మగారు ఫిబ్రవరి 2వ తారీఖున స్వామి దయానంద సరస్వతిగారి దగ్గర దీక్ష తీసుకున్నారు. ఆవిడ జ్ఞానం పొందటమే కాక, వారికి బోధించిన వారి గురువు స్వరూపానంద సరస్వతి గారిని, ఉపదేశం చేసిన పూజ్య స్వామి దయానంద సరస్వతి గారిని, పరిపూర్ణానంద సరస్వతి స్వామిని, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ గారిని, స్వామి ప్రజ్ఞారణ్య గారిని, మరెందరో మహానుభావులను వారి దయాకుటీర ప్రాంగణానికి ఆహ్వానించి, వారి ప్రవచనాలు వినే మహాభాగ్యం కలిగించారు మాకు.

మా దయాసత్సంగానికి స్వామి సంపూర్ణానందగిరి వారిచే మాండ్యూకోపనిషత్తు చెప్పించి, స్వయంగా ఆమె కూడా వివరంగా చెప్పారు. అంతేకాకుండా మనీషా పంచకము, భజగోవిందము, ఆత్మబోధ, అష్టావక్రగీత మొదలైన ప్రకరణ గ్రంథాలను, ఈశావాస్యోపనిషత్తు, కేనోపనిషత్తులను గత 20 ఏళ్ళుగా మాకు బోధించి, మాలో ఆధ్యాత్మిక జ్ఞానం బలపడేలా చేసారు.

ఉపనిషత్తుల సారమైన భగవద్గీత పరిజ్ఞానంలో ఆమెకు ఆమే సాటి. ఆమె పట్టుపట్టి మాకు భగవద్గీత కంఠతా వచ్చి, దాని అర్థం కూడా కరతలామలకం అయ్యేలాగా, మేము నేర్చుకున్నది బెదరకుండా అప్పచెప్పేలా మమ్మల్ని తీర్చిదిద్దారు. ఆమె తలపెట్టిన దయాస్వరూప గీతామణి రచన చివర్లో ఆమె అనారోగ్యం పాలయ్యారు. ఒక పక్క యమధర్మరాజుతో పోరాడుతూ, ఇంకోపక్క ఈ శరీరం నేను కాదని ఆవిడ చేసే బోధకి ప్రత్యక్షరూపంలో నిలిచి, రాత్రనకా పగలనకా ఆ పుస్తకాన్ని 17వ అధ్యాయం వరకు అతికష్టమ్మీద తీసుకురాగలిగారు. 18వ అధ్యాయం మిగిలిపోయింది. కిం కర్తవ్యం? వెంటనే రామదండులా నడుం బిగించి అందరం తలో చెయ్యి వేసి ఆమె బోధ ఆధారంగా దాన్ని రచించి,

పుస్తకరూపం తెచ్చి ఆమె ముందు పెట్టాం. నా శిష్యుల్ని ఇంత స్థాయికి తెచ్చానన్న ఆనందభాష్పలతో ఆవిడ పరమపదం పొందారు. ఆమె చివరిశ్వాస వరకూ బ్రాహ్మీస్థితిలో ఉండటం చూసి బ్రహ్మానుభూతి ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా తెలుసుకున్నాము. అమ్మ మంత్రం **యాక్సెప్ట్ అండ్ ఎకామిడేట్.**

ఆమె లేని లోటుని ఆమె ద్విగుణీకృతంగా మాకు భర్తీ చేసారు. ఆమె ఒక్కరు ఇద్దరిగా విభజన చెంది, రాఘవరావు, రాజ్యశ్రీలనే దంపతుల రూపంలో మళ్ళీ మా కళ్ళముందు ప్రత్యక్షమయ్యారు. ఆశ్చర్యం ఏమిటంటే, వారు కూడా దయానంద సరస్వతీ స్వామి శిష్యులు . పూజ్యస్వామీజీ ప్రియ శిష్యులు పరమార్థానందస్వామి అంటే వారికి ఆరాధనా భావన.

స్వామీజీ ఒక క్రమపద్ధతిలో అద్వైత సిద్ధాంతాన్ని బోధిస్తారని చెప్తూ, ఈ దంపతులు మాకు అదే పద్ధతిలో బోధ మొదలుపెట్టారు. ఇద్దరూ కలిసి ముందుగా అద్వైతవేదాంత పరిచయం చెప్పారు. అది పుస్తకరూపంలో కూడా వెలువడింది. దాన్ని మేము మా పాఠ్యగ్రంథంగా చేసుకున్నాము. ఈ దంపతులు మాకు అనేక ఉపనిషత్తులు బోధిస్తున్నారు. వారి కుటుంబమిత్రులు శ్రీ విష్ణు ప్రసాదు గారు మాకు అనేక రకాలుగా అండగా నిలిచారు.

ఇప్పుడు, మా కోరిక మేరకు, రాఘవరావు గారు భగవద్గీత శంకరభాష్యం చెప్తున్నారు. శాస్త్రంలో ఏ సందేహం వచ్చినా తీరుస్తారు.

పరమార్థానంద స్వామిని మేము చూడకపోయినా, రాజ్యశ్రీగారు ఆమె బోధ ద్వారా, ఆయన్ను మా కళ్ళముందు ప్రత్యక్షం చేయిస్తున్నారు. నిద్రలో లేపి అడిగినా చెప్పగలగాలి అని కొన్ని మాకు నేర్పించారు. అందులో ముఖ్యమైనది –

ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది  ఎక్స్‌పీరియన్స్‌డ్
అనుభవిస్తున్న నేనే ఎప్పటికీ అది, అనుభవించబడే వస్తువు ఎన్నటికీ కాదు.

ఈ దంపతులు మాకు గురువులు కావటం ఈశ్వరానుగ్రహంగా భావిస్తున్నాము.

**– దయాసత్సంగ సభ్యులు**

# కృతజ్ఞతలు

**మద్దూరి/కస్తూరి రాజ్యశ్రీ**

**సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం**
**అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరాం**

అద్వైత వేదాంతాన్ని అలనాడు శంకరాచార్యుల వారు ప్రాచుర్యంలోకి తెస్తే ఈనాడు పూజ్య స్వామీజీ దయానంద సరస్వతి వారు దానికి బహుళ ప్రాచుర్యం ఇచ్చి ఎందరో శిష్యులను తీర్చిదిద్దారు. వారిలో ముఖ్యులు పరమార్థానంద స్వామి, తత్త్వవిదానంద స్వామి, ఆత్మలీనానంద స్వామిని, పరిపూర్ణానంద స్వామి. ఈశ్వరానుగ్రహం ఉంటే అద్వైత వేదాంతానికి వస్తామంటారు. పూజ్య స్వామీజీతో సహా అందరు స్వామీజీల బోధనలు మావారు, నేను విని తరిస్తున్నాము.

ఈ స్వామీజీలందరికీ పూజ్యస్వామీజీ మీద ఎనలేని గౌరవాభిమానాలు. ఆ విధంగా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ వారి బోధనలు మేము వినగలిగినందుకు గురుపరంపరకు శతకోటి కృతజ్ఞతలు.

పరమార్థానంద స్వామి గారు చెప్పిన ప్రస్థానత్రయం అంతా నేనూ, మావారూ విన్నాము. ఆయన బోధల ఆధారంగా రాసిన ఈ కఠోపనిషత్తును పుస్తకం రూపంలో మీ ముందుకు తీసుకురాగలుగుతున్నందుకు ఆయనకు ఎనలేని కృతజ్ఞతలు.

పరమార్థానంద స్వామి గారి బోధలను ఆధారంగా చేసుకుని మేము అంతకు ముందు ప్రచురించిన 'అద్వైత వేదాంత పరిచయం' పుస్తకాన్ని శివానంద ఆశ్రమంలో విడుదల చేసిన తత్త్వవిదానంద స్వామి గారికి అనేకానేక కృతజ్ఞతలు. ఆ సందర్భంలో పరమార్థానంద స్వామి గారు చాలా బాగా, ఒక క్రమపద్ధతిలో చెప్తారనీ, ఆయన బోధలననుసరించి రాసిన ఈ గ్రంథాన్ని ఎక్కడో మూలనపడేయకుండా జాగ్రత్తగా పెట్టుకుని చదువుతూ ఉండమని చెప్పటం ఆయన గొప్పదనానికి నిదర్శనం. ఆయన భాష్యంతో పాటు చెప్పిన ఎన్నో ఉపనిషత్తులు క్యాసెట్‌లలో విన్నాము.

అలాగే ఆత్మలీనానంద స్వామిని క్లాసులకు కొన్నేళ్ళుగా వెళ్ళి కొన్ని ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాల భాష్యం గురుముఖతా విన్నాము. స్వామినికి అనేక కృతజ్ఞతలు.

పరమార్థానంద స్వామి అంటే పూజ్య భావం ఉన్న సత్యవ్రతానందస్వామిని, మేము కోరిందే తడవుగా ఎంతో అభిమానంగా ముందుమాట రాసి ఇచ్చినందుకు ఆవిడకు ఎంతైనా ధన్యవాదాలు చెప్పుకోవాలి.

నా భర్త రాఘవరావు గారు, నా రచనా వ్యాసంగానికి ఒకప్పుడు శ్రీకారం చుడితే ఇప్పుడు, అద్వైత వేదాంతంలో తాను రమించటమేకాక నా చేత మేము పొందిన ఆత్మజ్ఞానానికి అక్షరరూపం కూడా ఇప్పిస్తున్నారు. దాని ఫలితమే ఈ కఠోపనిషత్తు. రాయటం వరకే నా వంతు. దానికి సర్వాలంకరణ చేసి పుస్తకరూపంలో తీసుకురావటం అంతా ఆయన శ్రమే. అందుకు ధన్యవాదాలు.

నా చేత మరికొన్ని అనువాదాలు చేయించి నీది సులభమైన శైలి అని మెచ్చుకున్న మా అన్న శ్రీ యం.యస్.కుమార్‌కు ధన్యవాదాలు, రచయిత్రిగా నాకు మంచి భవిష్యత్తు ఉందని నన్ను మనస్ఫూర్తిగా దీవించిన మా ప్రిన్సిపాల్ శ్రీ జగన్మోహన్‌రెడ్డి గారికి కృతజ్ఞతలు. మా కృషి వెనుక అజ్ఞాత వ్యక్తిగా ఉండి, ఎప్పటికప్పుడు వివరాలు కనుక్కుంటూ, ప్రోత్సహిస్తున్న మా ఆత్మబంధువు శ్రీ అట్లూరి లక్ష్మీబాయి గారికి నా కృతజ్ఞతలు. ఈ గ్రంథంలోని సంస్కృత భాగంలో ఉన్న లోటుపాట్లను శ్రద్ధగా సంస్కరించిపెట్టి, నా పేరు ప్రస్తావించనవసరం లేదని వినయంగా చెప్పిన శ్రీ కంభంపాటి రామశాస్త్రిగారికి కృతజ్ఞతలు. ఆయన తత్త్వవిదానంద స్వామికి చాలా దగ్గరవారు.

పరమార్థానంద స్వామి శంకరభాష్యంతో చెప్పిన కఠోపనిషత్తుకు అక్షరరూపాన్ని దివ్యజ్ఞాన సరోజినీ వరదరాజన్ గారు ఇచ్చారు. అందులోంచి కొన్ని అంశాలు తీసుకున్నాను. అందుకు వారికి కృతజ్ఞతలు. రామకృష్ణ మఠం వారి మంత్రపుష్పం నుంచీ, డాక్టర్ కె.అరవిందరావు గారి పుస్తకం నుంచీ మంత్రభాగం సరిదిద్దాము. అందుకు వారికి కృతజ్ఞతలు.

పుస్తకంలో తప్పులు దొర్లకుండా ఉండటానికి దుర్బిణీ వేసుకుని మరీ మరీ వెతికారు శ్రీమతి అరుణా యశోద, శ్రీ విష్ణుప్రసాద్, శ్రీ వై.యస్.రావు. ముగ్గురూ అనేక కోణాల్లో పుస్తకాన్ని పరిశీలించారు. శ్రీ డి శ్రీనివాసరాజు గారు ప్రచురణకై సమకూరిన రొక్కమును భద్రపరిచి మాకు అవసరమైనప్పుడు అందించారు. వారికి నా కృతజ్ఞతలు.

కఠోపనిషత్తుకి డి.టి.పి. వర్క్ చేసి పెట్టిన శ్యామల గారికి ధన్యవాదాలు. పుస్తక ప్రచురణ విషయంలో ప్రెస్‌తో కో ఆర్డినేటు చేసిపెట్టిన కుర్రా రవికి ఈ సందర్భంలో ధన్యవాదాలు. ఆకర్షణీయంగా ప్రచురించిన కృష్ణారావు గారికి నా ధన్యవాదాలు.

మా దంపతులం దయాసత్సంగంలోనూ, అపర్ణాసరోవర్ సత్సంగంలోనూ కొన్నేళ్ళుగా ఉపనిషత్తులను బోధిస్తున్నాము. మా ఈ ప్రయత్నం గురించి విని ఎంతో సంతోషించి, ఇతోధికంగా సాయం చేసారు వాళ్లందరూ. వాళ్ళకు అనేక ధన్యవాదాలు.

మేము అడగగానే, స్పందన రాసినందుకు దయాసత్సంగ్ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం. నువ్వు కస్తూరి వారి కోడలివి, వారికి మంచి పేరు తేవాలని హృదయపూర్వకంగా సదా ఆశీర్వదించే మా బాబాయి మద్దూరి సుబ్బారావు గారికి ధన్యవాదాలు.

## సర్వం పరమేశ్వరార్పణమస్తు

# విషయసూచిక


| వరుస సంఖ్య | విషయము | పుట సంఖ్య |
|---|---|---|
| 1. | ముందు మాట | 3 |
| 2. | పరమార్థానంద స్వామి – అనన్య గురువు | 5 |
| 3. | దయాసత్సంగమ్ స్పందన | 8 |
| 4. | కృతజ్ఞతలు | 10 |
| 5. | ఉపోద్ఘాతం | 15 |
| 6. | అధ్యాయము – 01 వల్లీ – 01 | 35 |
| 7. | అధ్యాయము – 01 వల్లీ – 02 | 76 |
| 8. | అధ్యాయము – 01 వల్లీ – 03 | 124 |
| 9. | అధ్యాయము – 02 వల్లీ – 01 | 159 |
| 10. | అధ్యాయము – 02 వల్లీ – 02 | 187 |
| 11. | అధ్యాయము – 02 వల్లీ – 03 | 216 |

# కఠోపనిషత్తు

## ఉపోద్ఘాతం

మన ప్రాథమిక శాస్త్రాలను వేదాలు అంటారు. వేదం అంటే జ్ఞానాన్ని సమకూర్చే గ్రంథం. నాలుగు పురుషార్థాల గురించి చెప్పి, వాటిని పొందే మార్గాలని వివరిస్తాయి వేదాలు. 'విద్' అనే ధాతువు నుంచి వచ్చింది వేదం. విద్ అంటే తెలుసుకోవడం. వేదాలు అపౌరుషేయం, మనిషి మేథస్సునుంచి వచ్చినవి కావు.

మనిషి రచించినవి కాకపోతే, ఎవరు రచించినట్టు? సాంప్రదాయం ప్రకారం అవి దైవం నుంచి వచ్చాయి, మానవాళి మంచి కోసం వాటిని ఋషులు వాళ్ళ సత్వగుణంతో అందుకున్నారు. అందుకని దైవాన్ని ట్రాన్స్‌మిటింగ్ సెంటరుతో పోలిస్తే, ఋషులను రిసీవింగ్ సెంటర్లనవచ్చు. రేడియో సంగీతం వినిపిస్తే, అవి ఈ సంగీతాన్ని తయారుచేయవు. అవి ఎక్కడనుంచో అందుకుని మనకు వినిపిస్తాయి. రేడియోలో శబ్దం మాత్రమే వినగలము కాని, రంగు,రూపు చూడలేము. ఎందుకు? రేడియో దానికోసం తయారు చేయబడలేదు.

అలాగే మనకు ప్రత్యక్షంగా దైవం నుంచి అందుకునే సత్వగుణం లేదు. ఋషులకు సత్వగుణం ఉంది. వాళ్ళు వేదమంత్రాలను అందుకుని మానవాళికి అందజేసారు. వేదాలను విన్నారు కాబట్టి శ్రుతి అని కూడా అంటారు. శ్రూయతే ఇతి శ్రుతిః.

వాళ్ళు ధ్యానంలో విన్నారు. ఆ విధంగా వేదాలు లేదా శ్రుతి మన ప్రాథమిక గ్రంథాలు. అవి నాలుగు –

1. ఋగ్వేదం 2. యజుర్వేదం 3. సామవేదం 4. అథర్వణ వేదం

ఈ వేదాలలో ఉన్న విషయాలను బట్టి వాటిని రెండు భాగాలుగా విభజించారు.

వేద పూర్వభాగం – ముందు భాగం. వేద అంతభాగం – చివరి భాగం. ఏమిటా విషయం?

వేద పూర్వభాగంలో కర్మ లేదా చేయాల్సిన పనుల గురించి ఉంది. అందుకని దీన్ని కర్మకాండ అని కూడా అంటారు. ఇందులో అంతులేని వైదిక కర్మలు ఉన్నాయి. వాటికి వాడిన పరికరాన్ని బట్టి వాటిని మూడు భాగాలుగా విభజించవచ్చు :–

1. కాయికకర్మలు 2. వాచికకర్మలు 3. మానసకర్మలు

1. **కాయికకర్మలు** – ఇవి భౌతిక శరీరంతో చేసే పనులు. దీనిలో మనసు కూడా పాత్ర వహించకపోలేదు. అన్ని రకాల పూజలు, ప్రదక్షిణలు, తీర్థయాత్రలు వగైరాలు.

2. **వాచికకర్మలు** – వాక్కు ప్రధాన పాత్ర వహిస్తుంది. శారీరకంగా చూస్తే ఒకచోట కూర్చుని ఉంటారు. మనసు ఏదీ ఆలోచించకుండా స్థిరంగా ఉంటుంది. కేవలం వాక్కుపని చేస్తుంటుంది. విష్ణుసహస్రనామం లేదా లలితా సహస్రనామాలు వాచిక పారాయణం.

3. **మానసకర్మలు** – శరీరం పనిచేయదు. వాక్కుకి ఏమీ పాత్ర లేదు. మనసు మాత్రమే పనిచేస్తుంది. మానసకర్మలలో రకాలు ఇవి–

ఎ. **మానస పూజ** – షోడశ ఉపచార పూజని మానసికంగా చేయటం. ఖర్చులేదు కాని చాలా కష్టం. మనసు ఏకాగ్రత చెందాలి. మానసపూజ ఖర్చులేని వ్యవహారం అయినా, దాని ఫలం ఎక్కువ ఉంటుంది. ఎందుకంటే ఏకాగ్రచిత్తం ఉంటుంది కాబట్టి.

బి. **మానస పారాయణ** – ఏదైనా పారాయణాన్ని, ఉదాహరణకు, మొత్తం విష్ణుసహస్రనామాన్ని మనసులో చదువుకోవటం.

సి. **మానస జపం** – ఏదైనా నామాన్ని మనసులో జపించటం.

ఈ మూడురకాల మానస కర్మలను ఉపాసన లేదా ధ్యానం అంటారు. ఈ మూడు రకాల కర్మలు అనేక ఫలాలు పొందటానికి సూచించబడ్డాయి. ఇన్ని కర్మలు, ఇన్ని ఫలాలు ఎందుకు? మనిషికి అనేక రకాలైన కోరికలు ఉన్నాయి.

**బాలస్తావత్క్రీడాసక్తః తరుణస్తావఃతరుణీసక్తః।**
**వృద్ధస్తావచ్చిన్తాసక్తః పరమే బ్రహ్మణి కోపి న సక్తః॥** – భజగోవిందం 7

మనకు కోరికలు ఉన్నా లేకపోయినా టీవీ అనేక రకాల వస్తువులను చూపించి ప్రలోభ పెడుతుంది. మనకు ప్రకటనల మీద ఇష్టం ఉన్నా లేకపోయినా, ప్రతి టీవీ ప్రోగ్రాములోనూ, ఆఖరికి వార్తాప్రసరణ చేసేటప్పుడు కూడా ప్రకటనల జోరు కనబడుతుంది. ప్రతి మనిషికీ లక్షలాది కోరికలుంటాయి. అవి కూడా వయసు పెరిగిన కొద్దీ మారుతూ వస్తాయి. అందుకే అనేక కోరికలను తీర్చటానికి అనేక మార్గాలున్నాయి.

ఈ కోరికలన్నింటినీ ప్రధానంగా మూడు రకాలుగా విభజించవచ్చు. ఇంతకు ముందు మూడు రకాల కర్మల గురించి చూశాము. ఇప్పుడు మూడు రకాల కర్మఫలాలను చూద్దాం. అన్నిటి ఉద్దేశ్యం ఒకటే! మన కోరికలను తీర్చటం. వాటిని తీర్చటం ద్వారా సంతోషకరమైన జీవితాన్ని ఇవ్వటం.

ఏమిటా ఫలాలు? ఏదైనా ఆనందించాలంటే దానికి సంబంధించిన పరికరం ఉండాలి. కళ్ళులేని వానికి టీవి నిష్ప్రయోజనం. చెవిటివానికి రేడియో పెట్టి లాభం లేదు. అందుకే వయసు పెరిగేకొద్దీ, పరికరాలు కూడా పనిచేయటం మానేస్తాయి. దాంతో ఆనందం కలిగించే మార్గాలు తగ్గుతాయి. చూపు ఆనదు. చెవి పనిచేయదు. రాద్దామంటే చేయి సాగదు. ఉపాధి ఒక విధమైన పరికరం. ఆరోగ్యకరమైన శరీరం ఆరోగ్యకరమైన ఉపాధి.

మనిషి డబ్బు సంపాదన మోజులో పడి ఆరోగ్యం పోగొట్టుకుంటాడు మొదట్లో. ఆరోగ్యం తిరిగి పొందటానికి ఆ సంపాదించిన డబ్బుని వెదజల్లుతాడు. చివరికి రెండూ పోగొట్టుకుని నిల్చొడు నిస్సహాయంగా నిలుస్తాడు. ఈ క్రింది విధంగా వైద్యుల మీద తమాషాగా చెప్తారు.

**వైద్యరాజ నమస్తుభ్యం**
**యమరాజ సహోదరః ।**
**యమోఽస్తు హరతి ప్రాణాన్**
**వైద్యః ప్రాణాన్ ధనాని చ ॥**

ఓ వైద్యరాజా నీకు నమస్కారం. నువ్వు యమరాజు అన్నవి. ఎందుకు? యముడు ప్రాణాలు మాత్రమే తీస్తాడు! నువ్వు ప్రాణాలూ, ధనమూ రెండూ హరించి వేస్తావు అని డాక్టర్ల మీద చతురోక్తి ఉంది.

అందువల్ల ఆనందించటానికి రెండు అంశాలు కావాలి. ఒకటి ఆరోగ్యకరమైన ఉపాధి. రెండోది ఆనందాన్నిచ్చే వస్తువులు. వాటిని విషయం అంటారు.

ఈ రెండూ ఉంటే చాలదు. దానికి అనుకూలమైన వాతావరణం కావాలి. ఇంట్లో సఖ్యత ఉండాలి. ఇరుగుపొరుగుతో సఖ్యత ఉండాలి. దేశం ప్రశాంతంగా ఉండాలి. అందువల్ల మూడో అంశం లోకం.

మానవజాతి అంతా పాటుపడుతున్నది ఉపాధి, విషయం, లోకం అనే మూడు అంశాల కోసం. కర్మకాండలో ఈ మూడింటికోసం అనేక యజ్ఞాలు సూచించబడ్డాయి. ఈ లోకంలోనే కాదు సువర్లోక, మహర్లోకాల్లో కూడా ఎప్పటికీ యవ్వనంలోనే ఉంటాము. ఇవన్నీ కాయిక, వాచిక, మానసిక సుఖాలు. ఆ విధంగా మనకు మూడు రకాల కర్మలు, మూడు రకాల కర్మఫలాలూ ఉన్నాయి.

**పరీక్ష్యలోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో**
**నిర్వేద మాయాత్ నాస్త్యకృతః కృతేన।** – ముండక 1.2.12

తెలివైన వ్యక్తి ఈ ప్రాపంచిక ఫలాలను పొందినా వైదిక కర్మలను చేయటం ద్వారా, ఆశ్చర్యకరంగా ఒక నిజం గ్రహించి, నిర్వేదం చెందుతాడు.

సత్వగుణం ప్రధానంగా ఉండి, స్థితప్రజ్ఞ గల బ్రాహ్మణుడు తన అనుభవాల నుంచి సంఘాన్నో, పరిస్థితులనో తిట్టకుండా, మంచి నేర్చుకుంటాడు. ఏమిటది? ఈ ఫలాలన్నింటికీ లోపాలున్నాయని తెలుసుకుంటాడు, ఆంటీబయాటిక్స్‌లాగా. అంతకుముందు ఆంటీబయాటిక్స్ చేసే మేలును కీర్తించారు. ఇప్పుడు వాటి వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ గురించి చెప్తున్నారు. అలాగే కర్మఫలాలకు కూడా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. ఆంటీ బయాటిక్స్ తీసుకోవద్దని కాదు దీనర్థం.కాని వాటికుండే లోపాలు వాటికున్నాయి.

అలాగే ఈ కర్మఫలాలకు త్రివిధ దోషాలు ఉన్నాయి. అన్నీ మూడు సంఖ్యలో ఉన్నాయి.

త్రివిధ కర్మలు, త్రివిధ ఫలాలు, త్రివిధ ఫలదోషాలు.

1. **దుఃఖ మిశ్రితత్వం** – ప్రాపంచిక విషయాలు ఆనందం కలుగజేస్తాయి. నిజమే, కాని అవి దుఃఖంతో కలగలిపి ఉంటాయి. ఏ విషయం కూడా కల్తీలేని ఆనందాన్ని ఇవ్వలేవు. దుఃఖం ఎలా ఇస్తాయి? ఆ కర్మ ఫలాలని పొందాలంటే చాలా కష్టపడాలి. ఖంగారుపడాలి. దొరుకుతుందో లేదో అన్న చింత ఎప్పుడూ! ఒక్కోసారి విలువలని వదులుకోవాల్సి ఉంటుంది. అందువల్ల కర్మఫలం పొందటానికి కష్టపడాలి. పొందిన ఫలాన్ని నిలబెట్టుకోవటానికి కూడా అంతగానూ కష్టపడాలి. కారు కొనటం ఒక ఎత్తు, దాన్ని పోషించుకోవటం మరో ఎత్తు. ఆర్జనా దుఃఖం, పరిరక్షణా దుఃఖం.

ఎంత జాగ్రత్తపడ్డా, ఎప్పుడో అప్పుడు పోతుంది. వస్తువు పోతే ఇంకా బాధ వేస్తుంది.

**అంతవత్తు ఫలం తేషాం తద్భవత్యల్ప మేధసామ్।**
**దేవాన్ దేవయజో యాంతి మద్భక్తా యాంతి మామపి॥** – గీత 7.23

హే అర్జునా, ఈ సకామ భక్తులు పొందే ఫలాలు అశాశ్వతం.

వస్తువు పొందటం దుఃఖం, దాన్ని నిలబెట్టుకోవటం దుఃఖతరం, పోగొట్టుకుంటే దుఃఖతమం, దీన్ని దుఃఖమిశ్రితత్వం అంటారు. మిశ్రితత్వం అంటే దుఃఖంతో కలగలిసినది అని అర్థం.

2. **అశాశ్వతం** – ఏ కర్మఫలం పొందినా, దాని ఫలం అశాశ్వతం

**ప్లవా హ్యేతే అదృఢా యజ్ఞరూపా అష్టాదశోక్తమ్ అవరం యేషు కర్మ।**
**ఏతచ్ఛ్రేయో యే-భినన్దన్తి మూఢా జరామృత్యుం తే పునరేవాపి యన్తి॥**

– ముండక 1.2.7

ఎంత పొందినా తృప్తి ఉండదు. మనకన్నా తక్కువ ఉన్నవాళ్ళని చూసి తృప్తి చెందే బదులు, మనకన్నా ఎక్కువ ఉన్న వాళ్ళతో పోల్చుకుని బాధపడతాము. నాకు నాలుగు కార్లు, ఐదు ఇళ్ళు మాత్రమే ఉన్నాయి అంటాము, చెక్కుమీద రాసినట్టుగా. చెక్కుమీద వంద రాసినా, వంద కోట్లు రాసినా "మాత్రమే" రాసి తీరాలి. ఆశకి అంతులేదు మనకి. ఎంత పొందినా తృప్తిలేదు. ఎందుకు? ఏ ఫలమైనా అశాశ్వతం కాబట్టి.

3. **బంధకత్వం** – కర్మఫలం పొందినకొద్దీ, దానికి బంధీలమవుతూ వస్తాము. ఏ వస్తువైనా సరే మన దగ్గరికి పనివాడిగా వచ్చి, చివరికి మనకే యజమాని అయి కూర్చుంటుంది. మనం యజమానిగా మొదలయి, చివరికి దానికి బానిస అయిపోతాము. అందుకే మన ఇంట్లో పనిచేసే పనివాళ్ళు మనకి యజమానులు. ఈ విషయం మనం ఒప్పుకోవటానికి ఇష్టపడినా, ఇష్టపడకపోయినా అది నిజం. ఎలా చెప్పగలము? వాళ్ళు మనకు నిబంధనలు పెట్టారు. అది ఒప్పుకోవటం ఇష్టం లేదు మనకు. మనమే యజమానులమన్న భావన ఇవ్వటం కోసం వాళ్ళను బెదిరిస్తాము. వాళ్ళమీద అరుస్తాము. కాని వాళ్ళు వెళ్ళిపోతారేమో అని భయపడుతుంటాము. అందుకని మనం పరాధీనత నుంచి స్వతంత్రత వైపు పయనించే బదులు, పరాధీనత నుంచి మరింత పరాధీనతవైపు సాగుతున్నాము.

మన ఆనందానికి జీవిత ప్రారంభ దశలో కొన్ని విషయాలు చాలు. కాని ఎదుగుతున్నకొద్దీ వాటి సంఖ్య కూడా పెరుగుతూ వస్తుంది. దీన్ని బంధకత్వం అంటారు. కాఫీ, సిగరెట్టు లాంటివి లౌకిక ఉదాహరణలు. కాని వేదాంతంలో ప్రతీదీ బంధకత్వాన్ని పెంచేదే. కాని ఇది చాలామంది గ్రహించరు. ఏ కొందరో కళ్ళు తెరుస్తారు.

**మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే।**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః॥** – గీత 7.3

ఏ కొందరో గ్రహిస్తారు కర్మఫలాలకు దోషాలున్నాయని.

కొంతమంది దోషాన్ని గ్రహించినా, దాన్ని తప్పించుకోలేరు. జీవించినంత కాలం భరించాలి అనుకుంటారు. కాని కొందరు సాహసవంతులు మాత్రం ఇలాంటి లోపాలు లేని జీవిత గమ్యం ఏదైనా ఉందా అని తెలుసుకోవటానికి ప్రయత్నిస్తారు. నిర్దోష లక్ష్యం వెతుకుతారు. వేదమే ఇస్తుంది దానికి జవాబు. నిర్దోష లక్ష్యం ఉంది కాని, అది కర్మకాండలో రాదు అంటుంది. కర్మకాండ పురుషార్థాలన్నీ సదోష పురుషార్థాలు (ధర్మ, అర్థ, కామ). నిర్దోష పురుషార్థం అందులో లేదు.

అయితే ఏం చేయాలి? వేదంలో ఇంకో భాగం ఉంది. వేద పూర్వభాగంలో దొరకదు కాబట్టి వేద అంతభాగానికి వెళ్ళాలి. వేదాంతంలో ఈ మూడు దోషాలూ – దుఃఖమిశ్రితత్వం,

అతృప్తికరత్వం, బంధకత్వం – లేవు. అక్కడ స్వచ్ఛమైన ఆనందం ఉంటుంది. అసంతృప్తికి చోటు లేదు.

**యస్త్వాత్మరతిరేవ స్యాత్ ఆత్మతృప్తశ్చ మానవః।**
**ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే ॥** – గీత 3.17

అంతేకాదు – బంధం లేదా బానిసత్వం లేదు. అది స్వేచ్ఛాయుతం. అందువల్ల వేద పూర్వభాగం నుంచి వేద అంతభాగానికి వస్తాము. ఈ దోషాలు లేని లక్ష్యం ఏమిటి?

వేదాంతం నిర్దోష పురుషార్థం మోక్షం అంటోంది. దాన్ని బ్రహ్మ అని కూడా అంటారు. బ్రహ్మ = మోక్షం = పరమ పురుషార్థం (అత్యుత్తమ లక్ష్యం).

ఎక్కడ దొరుకుతుంది ఆ బ్రహ్మ? నాకు ఫోన్ నెంబరు ఇవ్వండి అని అడుగుతారు. వేదాంతం చెప్తుంది – అది నీకు ఎక్కడా దొరకదు. ఎందుకు? వేదాంతం చెప్తుంది. తత్ త్వం అసి అని.

ఆ బ్రహ్మ నీ అసలు స్వరూపం. ఆ బ్రహ్మ నువ్వే. నువ్వు వెతికే వస్తువులన్నీ లోపభూయిష్టం. ఆ వెతికే నువ్వు లోపాలకి అతీతమయిన బ్రహ్మవి.

గమనిక – బ్రహ్మా అని దీర్ఘం యిచ్చి రాస్తే, చతుర్ముఖ బ్రహ్మా అని అర్థం. బ్రహ్మ అంటే నిర్గుణ చైతన్యం. సచ్చిదానంద పరమాత్మ.

ఇది వింటే ఆశ్చర్యమేస్తుంది. ఎందుకు? ఇంతకాలం మనలో అనేక లోపాలున్నాయి అనుకుంటున్నాము. శారీరకంగా తృప్తి చెందము. అసలే సన్నగా ఉన్నామనో, లావుగా ఉన్నామనో, రంగు తక్కువనో, ఏదో ఒక బాధ. ఇంద్రియాలు సరిగా పనిచేయటం లేదని ఇంకో బెంగ. సరే మనసు విషయం చెప్పనే అఖ్ఖరలేదు. నాకు అన్నీ ఉన్నాయి కాని మనసే ప్రశాంతంగా లేదు అంటారు కొందరు. మనకేమీ తెలియదని మనమన్నా బాధపడతాము, లేదా మన చుట్టూ ఉన్నవాళ్ళన్నా రెచ్చగొట్తారు. కాని ఇక్కడ శాస్త్రం 'నువ్వే దోషరహిత బ్రహ్మవి' అంటున్నది.

ఈ రెండింటిలో ఏది నిజం? ఇప్పుడు నా లక్ష్యం మారింది. నేను బ్రహ్మను పొందటం కాదు నా లక్ష్యం. ఎందుకంటే నువ్వే ఆ బ్రహ్మవి అంది ఉపనిషత్తు. ఇప్పుడు నా లక్ష్యం నిజానిజాలు తేల్చుకోవటం. నేను దోషభూయిష్టమైన మానవమాత్రుడినా, దోషరహిత బ్రహ్మనా? కర్ణుని విషయం దీనికి సరియైన ఉదాహరణ. అతను సూతపుత్రుడుగా అవమానం పొందుతూనే ఉన్నాడు. ద్రౌపది స్వయంవరంలో కూడా క్షత్రియుడు కాకపోవటం వల్ల పాల్గొనటానికి వీల్లేదన్నారు. కాని తర్వాత కుంతీదేవి అతను తన పుత్రుడని చెప్పింది.

ఇప్పుడు కర్ణుడు సందిగ్ధంలో పడ్డాడు. ఇన్నాళ్ళు తనలో జీర్ణించుకున్న విషయం నిజమా? తను క్షత్రియుడన్న విషయం నిజమా? కుంతిని ఇదెలా సాధ్యమని అడిగాడు. ఆవిషయం కుంతి ఒక్కొక్క అంశంగా విడమర్చి చెపుతుంటే – మొదట్లో అపనమ్మకం (విపర్యః) కలిగింది. తర్వాత నిజం కావచ్చేమో అన్న భావన (సంభావన) కలిగింది. తర్వాత నమ్మకం (నిశ్చయం) కలిగింది. కర్ణునికి ఈ మూడు దశలూ అయ్యాయి.

అలాగే మొదట వినగానే కలిగేది అపనమ్మకం. నీకు ఆనందం కావాలంటే, నువ్వే ఆనందానివి. నీకు భద్రత కావాలంటే నువ్వే భద్రతవు. నీకు పరిపూర్ణత కావాలంటే, నువ్వే పరిపూర్ణుడవు. నిజానికి నిత్య, శుద్ధ, ముక్త, బుద్ధ, సత్య, పూర్ణ, అభయ, ఆనంద స్వరూపం – అన్నీ నువ్వే. ఈ మాటలు వింటే మొదట్లో నమ్మకం కలుగదు. ఏదో మనని ఉబ్బేస్తున్నారు అనుకుంటాము. దీన్ని అర్థవాదం అంటారు. తర్వాత విన్నకొద్దీ, ఏమో నేను బ్రహ్మని ఏమో అనిపిస్తుంది. గీత, ఉపనిషత్తులు నేర్చుకునీ, నేర్చుకునీ, పదేళ్ళ తరువాత నేను బ్రహ్మని అన్న నమ్మకం ఏర్పడుతుంది. విపర్యః నుంచి సంభావన నుంచి నిశ్చయానికి చేరుకుంటాము. దీనినే ఆత్మ విచారణ అంటారు. వేదాంతం ఆత్మ విచారణలోకి తీసుకువెళుతుంది. నేను లోపభూయిష్టమైన అశాశ్వతమైన మనిషినా, లేక దోషరహిత బ్రహ్మనా అన్నది తేల్చి చెప్తుంది. అందుకని వేదాంతాన్ని జ్ఞానకాండం అని అంటారు. ఇందులో సాధించాల్సింది ఏదీ లేదు, కేవలం తెలుసుకోవాలి. ఎవరి గురించి తెలుసుకోవాలి? నాగురించి. ఏం తెలుసుకోవాలి? నేను దోషభూయిష్ట వ్యక్తినా, దోషరహిత సత్యాన్నా? ఎలా తెలుసుకోవాలి?

వేదాంతం తత్ త్వం అసి అంటుంది. అందువల్ల బ్రహ్మని పొందే ప్రసక్తి లేదు. బ్రహ్మ ఎక్కడో వస్తువు అయితే, దాన్ని పొందటానికి అవస్థ పడాలి కాని అది నువ్వే అంటుంది వేదాంతం. మనం బ్రహ్మని ఉత్పత్తి చేయనక్కరలేదు. దాన్ని చేరనక్కరలేదు అంటే మన ప్రయత్నం కొద్దిగా మారుతుంది.

వేదాంతం చెప్పింది నిజమా కాదా అన్నది దృఢపరచుకోవాలి. ఇది చాలా ముఖ్యం. ఎందుకంటే ఇన్నాళ్ళూ మనం పరిమితి ఉన్న వ్యక్తి అనీ, మనకి జననమరణాలు ఉన్నాయనీ అనుకుంటూ వచ్చాము. ఇప్పుడేమో వేదాంతం దీనికి పూర్తి భిన్నంగా చెప్తోంది. నిత్య, శుద్ధ, ముక్త, బుద్ధ బ్రహ్మ అహమస్మి. మన గురించి మనకు ఉన్న భావన నిజమా, ఉపనిషత్తు బోధించే విషయం నిజమా?

మనం దాసులం అనుకుంటే ఉపనిషత్తు మనం స్వామి అంటోంది.
మనం అశాశ్వతం అనుకుంటే ఉపనిషత్తు మనం శాశ్వతం అంటోంది.
మనం పాపులం అనుకుంటే ఉపనిషత్తు మనం పాపానికి అతీతం అంటోంది.

అందువల్ల ఇప్పుడు ఆత్మ విచారణ చేయాలి. 'నేను బ్రహ్మ'ని అన్న విషయం తెలిస్తే ఏమవుతుంది? ఇన్నాళ్ళూ దేన్ని వెతుకుతున్నామో అది మనమే అని తెలుస్తుంది. వెతకబోయిన దైవం ఎదురుగా వచ్చింది అంటారు. ఎదురురావటం కూడా కాదు ఇక్కడే ఉంది. అది నేనే. ఇది లాభదాయకమైన విచారణ. ఇకమీదట సాధన అంటే ఏదో చేయటం కాదు. ఏదో తెలుసుకోవటం. అందుకని వేదాంతాన్ని జ్ఞానకాండ అంటారు. కర్మకాండ నుంచి జ్ఞానకాండకి రావాలి.

ఏదైనా తెలుసుకోవాలంటే దానికి ప్రమాణం కావాలి. గడ్డం పెరగటం, జుట్టు తెల్లబడటం, ముడతలు పడటం లాంటివి మన ప్రయత్నాలు లేకుండా వాటంతట అవి జరిగిపోతాయి. జ్ఞానం అలాకాదు. అలా జరిగేట్టయితే ఇన్ని స్కూళ్ళే ఉండవు. జ్ఞానం పొందటానికి ఒక ప్రమాణం కావాలి. ఉదాహరణకు రంగు,రూపు చూడటానికి కళ్ళు ప్రమాణం. శబ్దం తెలుసుకోవటానికి చెవులు ప్రమాణం.

ప్రమాతా ప్రమాణేన ప్రమేయస్య ప్రమా ప్రాప్నోతి.

సాధకుడు – ప్రమాతా, పరికరం – ప్రమాణం, వస్తువు – ప్రమేయం, జ్ఞానం – ప్రమ. ఒక ప్రమాత ప్రమాణం ద్వారా ప్రమేయం గురించి ప్రమ పొందుతాడు. ప్రమేయం అంటే వస్తువును బట్టి ప్రమాణం మారుతుంది. శబ్దాన్ని చెవులతోనే వినాలి. నాకు కళ్ళు బాగా పనిచేస్తాయి. వాటితో వింటాను అనలేము.

వేదాంత ప్రమాణాలు ఆరు. వాటిని షడ్ ప్రమాణాని అంటారు.

1. **ప్రత్యక్ష ప్రమాణం** – బాహ్య ప్రపంచాన్ని మన పంచేంద్రియాల ద్వారా తెలుసుకోవడం. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలని మన పంచ జ్ఞానేంద్రియాలయిన చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కుల ద్వారా ప్రత్యక్షంగా తెలుసుకుంటాము.

2. **అనుమాన ప్రమాణం** – ప్రత్యక్షంగా తెలుసుకోలేని దాన్ని పరోక్షంగా తెలుసుకోవటం. ఉదాహరణకు కారు హారన్ మ్రోగితే, కారు వస్తోందని గ్రహించటం. అంటే తార్కికంగా ఆలోచించటం. దీన్ని అనుమాన ప్రమాణం అంటారు. శాస్త్రం దీనికి ఒక ఉదాహరణ ఇస్తుంది.

**పర్వతః అగ్నిమాన్ ధూమతః కులాలవత్।**

కొండ మీద పొగ కనిపిస్తుంది. పూర్వకాలపు వంటింట్లో పొగ ఉంటే అగ్ని ఉందని తెలుసు. దాన్ని బట్టి కొండ మీద అగ్ని ఉందని ఊహిస్తాము. ఇది గ్రహించటానికి ముందు ప్రత్యక్ష ప్రమాణం ఉండి తీరాలి.

**యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః**

ఎక్కడ పొగ ఉంటే అక్కడ అగ్ని ఉంటుందన్న సూత్రం ప్రత్యక్ష ప్రమాణం ద్వారా తెలిసి వుండాలి.

3. **అర్థాపత్తి** – రెండు ప్రత్యక్ష ప్రమాణాల ఆధారంగా చేసిన తర్కం.ఒక వ్యక్తి పగలు ఉపవాసం వుంటున్నాడని తెలుసు. కాని అతను చిక్కిపోవటం లేదు. మనకి తెలిసిన ఈ రెండు విషయాల దృష్ట్యా, అతను రాత్రిళ్ళు తింటున్నాడని ఊహిస్తాము.

4. **ఉపమానం** – ఒకదానితో ఒకటి పోల్చటం. ఇది కూడా తెలియని విషయాన్ని తెలిసిన విషయంతో పోలుస్తాము. ఆమె ముఖము చంద్రబింబము వలె గుండ్రముగా ఉన్నది.

5. **అనుపలబ్ధి** – వస్తువు లేకపోవటాన్ని తెలుసుకోవటం. అక్కడ ఆ వస్తువు లేదని తెలుసుకోవటం కూడా జ్ఞానమే. గోడ దగ్గర కుర్చీ ఉందా? నా చేతిలో కుండ ఉందా?

ఇవి ఉన్నాయో లేదో తెలుసుకోవటానికి 'కన్ను' అనే ప్రమాణాన్ని ఉపయోగిస్తాము. కుండ లేదని ఎలా తెలుసు? 'నేను చూసాను.' ఏం చూసాను? కుండ లేకపోవటాన్ని చూసాను.

కుండ లేకపోవటాన్ని ఎలా చూడగలము? కుండ రంగు,రూపు ఏవి లేవు. అంటే 'అభావం'. ఆ అభావాన్ని అనుపలబ్ధి అంటారు.

6. **శబ్దప్రమాణం** – పదాల ద్వారా జ్ఞానం పెంపొందించుకోవాలి. ఇవి రెండు రకాలు–

1. **లౌకిక శబ్దం** – అపరావిద్య, అంటే భౌతిక శాస్త్రము, చరిత్ర లాంటి విషయాల గురించి చెప్పేది.

2. **వైదిక శబ్దం** – అపౌరుషేయ శాస్త్రము, సాక్షాత్తూ భగవానుడే ఋషుల ద్వారా అందించిన జ్ఞానము.

ఏ విద్యలోనైనా జ్ఞానం పొందటానికి పై ప్రమాణాలలో ఏదో ఒక ప్రమాణం వాడాలి. ఇవి వాడకపోతే మనం ఊహాగానాలు చేసి, మనకి తోచినట్టు ఆలోచిస్తాము. అవి సత్యదూరాలవుతాయి.

ఈ ప్రమాణాల్లో ఏది ఎన్నుకోవాలి?

ఇందులో మనకు తోచినది ఎన్నుకోవచ్చా? ఎన్నుకునే అధికారం లేదంటుంది శాస్త్రం. ఉదాహరణకు ఒక వేదాంత గోష్టికి వెళ్ళాలా లేదా అన్న విషయంలో మనకు అధికారం ఉంది.

కర్తుం, అకర్తుం, అన్యథా కర్తుం వెళ్ళాలనిపిస్తే వెళ్ళవచ్చు, అనిపించకపోతే మానేయవచ్చు, లేదా వేదాంత గోష్ఠికి కాకుండా ఇంకోచోటికి వెళ్లవచ్చు. మన ఇష్టం. కాని అక్కడికి వెళ్ళాక స్వామీజీ చేసే వేదాంత బోధని నేను చెవులతో వినను, కళ్ళతో చూస్తాను అనీ చెవులకన్నా కళ్ళు బాగా పనిచేస్తాయి అనీ అనలేము. మనం తెలుసుకోవాల్సిన వస్తువు మీద ఆధారపడి ఉంటుంది ప్రమాణం. రంగు, రూపు తెలుసుకోవాలంటే కళ్ళు ఉపయోగించాలి.

**ప్రమేయ అనుసారేణ ప్రమాణ వ్యాపారః కర్తవ్యః.**

జ్ఞానం తనంతట తాను ఉద్భవించదు. అలాగే ధ్యానం ద్వారా కూడా ఉద్భవించదు. అంటే సరియైన ప్రమాణం ఉపయోగించాలి.

**ప్రమాణ అభావాత్ జ్ఞానం న ఉపలభ్యతే.**

ఆత్మజ్ఞాన ప్రమాణం –

అహం బ్రహ్మ అస్మి అంటుంది వేదాంతం. నేను బాధితుడిని అంటుంది అనుభవం. ఏది నేను? దుఃఖ భూయిష్టమా? సచ్చిదానందమా?

ఆత్మ జ్ఞానం ఎలా పొందాలి? ఏ ప్రమాణం వాడాలి?

ఆరు ప్రమాణాల్లో మొదటి ఐదు పనికిరావు. కారు నడపటానికి ప్రత్యక్ష ప్రమాణం వాడతాము కాని ఆత్మజ్ఞానానికి పనికిరాదు.

**న చక్షుషా గృహ్యతే నాపి వాచా**
**నాన్యైర్దేవైస్తపసా కర్మణా వా।** – ముండక 3.1.8

ఆత్మ కళ్ళతోనో, వాక్కుతోనో ఇతర ఇంద్రియాలతోనో తెలుసుకోబడదు. తపస్సు వల్లనో, కర్మల చేతనో లభించదు.

తక్కిన ఐదు ప్రమాణాల వల్లా తెలుసుకోలేము. వాటిలో మొదటిది ప్రత్యక్ష ప్రమాణము. తక్కినవి తర్కం మీద ఆధారపడ్డా, వాటికి ఆధారం మళ్ళీ ప్రత్యక్ష ప్రమాణమే. చంద్రుని గురించిన సమాచారం కొంత సేకరించాక, దాన్ని బట్టి తక్కిన విషయాలు అంచనా వేస్తారు శాస్త్రజ్ఞులు.

ఇక మనకి మిగిలింది వైదిక శబ్ద ప్రమాణం. అందులో కూడా రెండు ప్రమాణాలున్నాయి.

1. వేద పూర్వభాగం – కర్మకాండ. 2. వేద అంతభాగం – జ్ఞానకాండ

కర్మకాండ కూడా ప్రయోజనం లేదు. ఎందుకంటే అది కూడా అనాత్మ ప్రపంచానికి చెందిన కర్మల గురించే బోధిస్తుంది. 14 లోకాలూ అనాత్మకు చెందినవి.

ఆ విధంగా మొదటి ఐదు ప్రమాణాలు, శబ్ద ప్రమాణంలో కర్మకాండకు చెందిన శబ్ద ప్రమాణము కూడా అనాత్మ లేదా బాహ్య ప్రపంచానికి చెందినవి. సాధ్య వస్తువుకు చెందినవి. ఇంతవరకూ సాధకుడు వేరూ, సాధ్యవస్తువు వేరూ.

సాధకుడు, సాధ్యవస్తువు గురించి తెలుసుకుని, దాన్ని సాధించటానికి ప్రయత్నిస్తాడు. ఇటువంటి జ్ఞాన మార్గాన్ని ఇంగ్లీషులో డైకాటమీ అంటారు. ఉదాహరణకు అమరనాథ్ గురించి తెలుసుకోవటం మొదటి అంశం. తర్వాత అక్కడికి వెళ్ళి దాన్ని ప్రత్యక్షంగా చూడటం రెండవ అంశం. ఇంతకు ముందు చూసినట్లుగా –

**ప్రమాతా ప్రమాణేన ప్రమేయస్య ప్రమా ప్రాప్నోతి.**

కాని ఆత్మజ్ఞానం విషయానికి వచ్చేసరికి ఇక్కడ పద్ధతి పూర్తిగా విరుద్ధం. తెలుసుకోవటానికి ప్రయత్నించే సాధకుడే, తెలుసుకోవాల్సిన సాధ్యం. అంటే వస్తువు వేరూ, సాధకుడు వేరూ కాదు. ఆత్మ సిద్ధ వస్తువు, సాధ్య వస్తువు కాదు.

దాన్ని ఎలా తెలుసుకోవాలి?

ప్రపంచాన్నంతా తేరిపార చూసే మన కన్నులను మనం స్వయంగా చూడలేము. అందరూ మీవి విశాల నేత్రాలని పొగిడితే వాటిని చూసుకోవాలని మనకు తపన పుడుతుంది. కాని వాటిని కళ్లజోడుతోనో, ఇతర పరికరాలతోనో చూడలేము. అద్దంలో మాత్రమే చూడగలము.

అలాగే ఆత్మను చూడటానికి శాస్త్రమనే అద్దం కావాలి. గురుశాస్త్ర ఉపదేశం కావాలి. ఆత్మ గురించిన జ్ఞానం పొందటమే అజ్ఞాన నివృత్తి. శాస్త్రం ఇచ్చే ఉదాహరణ కర్ణుడు. కర్ణుడికి తను సూత పుత్రుడినన్న అజ్ఞానం ఉంది. కుంతి వెళ్లి చెప్పింది, 'నువ్వు పాండవుడివి.' 'సరే నాకు ఇప్పుడు అర్థమయింది, ఆ ఆరవ పాండవుడు ఎక్కడ ఉన్నాడో చెప్పండి, నేను వెళ్ళి కలుస్తాను,' అంటాడా కర్ణుడు? జ్ఞానం పొందిన తక్షణం, అజ్ఞాన నివృత్తి జరిగిపోతుంది. వేరే ఏమీ కర్మ చేయనక్ఖరలేదు.

ఇంకో ఉదాహరణ రజ్జుసర్ప భ్రాంతి – తాడుని చూసి పాముని భ్రమిస్తాము. ఎవరో చెపితేనో, దానిమీద కాంతి పడితేనో అది పాము కాదు, తాడని తెలిసిపోతుంది. అజ్ఞాన నివృత్తి జరిగిపోతుంది. ఇంక కొత్తగా చేయాల్సింది ఏమీ లేదు. అందుకే దీన్ని జ్ఞానకాండ అంటారు. జ్ఞానమాత్రేన అజ్ఞాన నివృత్తిః.

ఏదైనా చేయాల్సి ఉంటే, సంశయ నివృత్తి చేసుకోవాలి. ఆత్మజ్ఞానాన్ని పొందటానికి మూడు అంశాలు ఉన్నాయి – శ్రవణ, మనన, నిధిధ్యాసనలు.

**శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో, విడవకుండా కొంతకాలం పాటు సమర్థుడైన గురువు వద్ద శాస్త్రం నేర్చుకోవటం. గురువు వద్ద నేర్చుకుంటున్నప్పుడు సంశయాలు కలిగినా గుర్తుపెట్టుకోవాలి తప్ప అడగకూడదు శ్రవణం స్థాయిలో. ఎందుకంటే ఈ విద్య కొత్త పంథాలో సాగుతుందని చూసాము.మనకు తెలిసిన దానికి భిన్నంగా ఉండటంతో నమ్మలేము. 'తత్ త్వం అసి,' అదే నువ్వు అంటే నేనేమిటి, బ్రహ్మ ఏమిటి అనుకుంటాము. కాని వినగా వినగా ఒకవేళ గురువుగారు అయితే అవచ్చేమో కాని నేను కాదు అనుకుంటాము. అందుకని అది అంగీకరించగలిగే వరకూ శ్రవణం చేస్తూనే ఉండాలి.

**మననం** – నేర్చుకున్న విషయంలో ఏదైనా సంశయం కలిగితే తోటి విద్యార్థిని అడిగో, గురువును అడిగో సంశయ నివృత్తి చేసుకోవచ్చు. ఏ గురువు కూడా సంశయ నివృత్తి చేయకుండా ఉండడు. అసలు శ్రవణం స్థాయిలోనే మనకు కలగబోయే సంశయాలను గురువే లేపి, ఆయన ముందే సమాధానాలు ఇస్తారు. అందుకే ఆత్మబోధ ఎప్పుడూ స్వయంగా చేయకూడదు. గురుశాస్త్ర ఉపదేశం ద్వారా అంటారు. శ్రవణ, మననాల ద్వారా నిస్సంశయ జ్ఞానం పొందుతారు. దాన్నే దృఢ జ్ఞానం అని కూడా అంటారు.

**నిధి ధ్యాసనం** – తిన్న ఆహారాన్ని అరిగించుకున్నట్టుగా పొందిన జ్ఞానాన్ని జీర్ణించుకోవాలి. ప్రజ్ఞ నుంచి స్థిత ప్రజ్ఞత పొందే స్థాయిని నిధి ధ్యాసనం అంటారు. అహం బ్రహ్మ అస్మి, నేను బ్రహ్మని అని ఐదేళ్ళుగా నేర్చుకునీ, నేర్చుకునీ ఆ బ్రహ్మ ఎప్పుడొస్తాడో, ఆత్మ సాక్షాత్కారం ఎప్పుడు కలుగుతుందో అని అడుగుతుంటారు. లేదా ఒక జ్యోతి కనబడి, మా గురువుగారి చుట్టూ తిరిగి, కిటికీలోంచి మాయమయిపోయిందంటారు. ఆత్మ సాక్షాత్కారం పొందబడే వస్తువు కాదు. అది సాధ్య వస్తువు కాదు. సిద్ధంగా ఉన్నదే. నేను నిత్య,శుద్ధ, ముక్త పురుషుడిని అన్న విషయాన్ని జీర్ణించుకోవాలి.

## ఉపనిషత్తు

ఉపనిషత్తుని రహస్య విద్య అంటారు. దానికి రెండు కారణాలు ఉన్నాయి.

1. ఆ విద్య పొందటానికి సిద్ధపడ్డవాళ్ళే అర్థం చేసుకోగలరు దానిని.

**న బుద్ధి భేదం జనయేత్ అజ్ఞానాం కర్మసంగినామ్।**
**జోషయేత్ సర్వకర్మాణి విద్వాన్ యుక్తః సమాచరన్॥** – గీత 3.26

2. ఒకవేళ రహస్యంగా ఉంచకుండా, బాహాటంగా బోధించినా కూడా అది రహస్యంగానే మిగులుతుంది. ఎందుకంటే చాలామంది దాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేరు. ఉపనిషత్తు

బోధ విని కూడా గురువు గారు చాలా బాగా చెప్పారు. కాని ఏం చెప్పారో చెప్పలేము అంటారు. అందుకే ఇది రాజవిద్యా రాజగుహ్యం అయింది.

ఉపనిషత్తులో మూడు చిన్న పదాలున్నాయి. ఉప, ని, షత్. 'ఉప' అంటే సమీపం. 'ని' అంటే బోధమీద అత్యంత శ్రద్ధాభక్తులతో నిశ్చయ జ్ఞానం పొందటం. 'షత్' అంటే అజ్ఞాన నిర్మూలనం. మూడు కలిపితే గురువు సమీపంలో నిశ్చయ జ్ఞానం పొందటం వల్ల అజ్ఞానం తొలిగిపోతుందని అర్థం.

ఉపనిషత్తు అంటే ఉపనిషత్తులో ఉన్న పదాలా లేక ఆ పదాలు అందించే జ్ఞానమా అని ఒక సందేహం కలుగుతుంది. ఈ సందేహం తక్కిన అపరా విద్యల విషయంలో కలగదు. అక్కడ పదాలకు ప్రాముఖ్యత లేదు. కాని ఉపనిషత్తు విషయంలో అర్థం తెలియకుండా కేవలం ఆ మంత్రాలను పఠిస్తారు కొందరు. అందువల్ల అందులోని పదాలను కూడా ఉపనిషత్తు అంటారు. అలాంటప్పుడు ప్రాథమిక అర్థం దేనికి – పదాలకా, వాటివల్ల కలిగే జ్ఞానానికా? ఈ ప్రశ్నని శంకరాచార్యుల వారే రేకెత్తించి, ఆయనే జవాబు చెప్తారు. ఉపనిషత్తు అంటే సంసార నివృత్తి చేసేది కాబట్టి, కేవలం పదాలు పఠిస్తే సంసార నివృత్తి అవదు కాబట్టి, ఆ పదాల వల్ల కలిగిన జ్ఞానమే ప్రాథమిక స్థానాన్ని పొందుతుంది.

'షత్'కి మూడు అర్థాలున్నాయి. 'నాశనం – విశరణం' 'చేరటం – గతి', బలహీన పరచటం–అవసాధనం'. ఈ మూడు అర్థాలూ మనం చూడబోయే కఠోపనిషత్తులో వస్తాయి. విశరణం అర్థం ఒకటి చాలు ఉపనిషత్తు సంసారాన్ని నాశనం చేస్తుంది అని చెప్పటానికి. బ్రహ్మవిద్య పొందితే మృత్యువునుంచి రక్షించబడుతారు.

బ్రహ్మజ్ఞానం ముముక్షువును పరబ్రహ్మ దగ్గరికి తీసుకువెళ్తుంది. ఇక్కడ'గతి' అర్థం వస్తుంది. ఈ ఉపనిషత్తులో అగ్నివిద్యగా చెప్పిన ఉపాసనను కూడా ఉపనిషత్తు అనవచ్చు. 'షత్'కి ఉన్న మూడో అర్థం – బలహీనపరచటం – అవసాధనం – వస్తుంది. ఈ ఉపాసన చేసిన వాళ్ళకు సంసారాన్ని బలహీనపరచి, తాత్కాలిక అమృతత్వాన్ని ప్రసాదిస్తుంది. వాళ్ళు స్వర్గలోకంలో చాలా ఎక్కువ కాలం ఉంటారు.

ఉపనిషత్తులు గురుశిష్య సంవాద రూపంలో ఉంటాయి. ఎందుకంటే దీన్ని సంప్రదాయ పద్ధతిలో గురు ముఖతః నేర్చుకోవాలి తప్ప స్వయంగా నేర్చుకోకూడదు. అందుకే సకల విద్యాకోవిదుడు అయిన నారదుల వారు కూడా సనత్కుమారుని దగ్గరకు వెళ్ళాడు ఆత్మ విద్య బోధించమని.

ఈ గురుశిష్యుల సంవాదం ఒక గురువుకూ, ఒక శిష్యునికూ మధ్య ఉండవచ్చు. ఒక గురువుకూ అనేక శిష్యులకూ మధ్య ఉండవచ్చు. అనేక గురువులకూ అనేక శిష్యులకూ మధ్య ఉండవచ్చు.

ముండక ఉపనిషత్తులో శౌనక అంగీరసుల మధ్య సంభాషణ, అలాగే కఠోపనిషత్తులో యమధర్మరాజు నచికేతుల మధ్య సంభాషణ జరిగితే, ప్రశ్నోపనిషత్తులో పిప్పలాద ఋషిని ఆరుగురు శిష్యులు ప్రశ్నిస్తారు. ఛాందోగ్యోపనిషత్తులో అనేక గురువులూ, అనేక శిష్యులూ ఉన్నారు.

మనకు నాలుగు వేదాలు ఉన్నాయి.వాటి శాఖలైన వేదాంతాలు లేదా ఉపనిషత్తులు 1180 ఉన్నాయి. వాటిలో చాలా కాలగర్భంలో కలిసిపోయాయి. నేడు 108 ఉపనిషత్తులు మాత్రం మిగిలాయి. వాటి సారాంశాన్ని అందించే 10 ముఖ్యమైన ఉపనిషత్తులకు శంకరాచార్యులవారు భాష్యం వ్రాసారు. వాటిని తేలిగ్గా గుర్తుంచుకునేందుకు ఒక పద్యరూపం ఉంది.

**ఈశ కేన కఠ ప్రశ్న ముండక మాండూక్య**
**తిత్తిరిః ఐతరేయం చ చాందోగ్యం బృహదారణ్యకం తథా॥**

ఈ పది ఉపనిషత్తులూ నాలుగు వేదాల నుంచి గ్రహించబడ్డాయి. వేదపూర్వ భాగం కర్మకాండని బోధిస్తుంది. వేద అంతభాగం జ్ఞానకాండకి చెందింది.

ఉపనిషత్తులన్నిటిలోనూ బోధ ఒకటే. జీవ ఈశ్వర ఐక్యం. అదే చెప్పి విసుగనిపిస్తే ఈశ్వర జీవ ఐక్యం. కఠోపనిషత్తులోనే అనేక నిర్వచనాలున్నాయి.

అందులో ఉదాహరణకు కొన్ని –

- ఆత్మ చైతన్య స్వరూపం
- సచ్చిదానంద స్వరూపం
- శరీరత్రయ వ్యతిరిక్తం
- పంచకోశాలకి అతీతం
- అవస్థాత్రయ సాక్షి
- జగత్కార్యకారణ విలక్షణం

ఇన్నిసార్లు ఇన్ని రకాలుగా చెప్పాలా అని అనిపిస్తుంది. దానికి అనేక కారణాలున్నాయి.

1. ప్రస్తుతం అందుబాటులో 108 ఉపనిషత్తులు ఉన్నాయి. వాటిలో పది ఉపనిషత్తులకు శంకరాచార్యులువారు భాష్యం చెప్పారు. నాలుగు వేదాల్లోంచి వాటి సారాంశం

ప్రతిబింబించేలా ఈ పదీ ఏరారు. మనం ఈ పది ఉపనిషత్తులు నేర్చుకోవాలి. కనీసం నాలుగైదన్నా నేర్చుకోవాలి.

2. ఉపనిషత్తులను శ్రవణ, మనన, నిధి ధ్యాసనల ద్వారా అధ్యయనం చేయాలంటారు. శ్రవణమంటే ఒక క్రమపద్ధతిలో, విడువకుండా, కొంతకాలం పాటు సమర్థుడైన గురువు వద్ద శాస్త్రం నేర్చుకోవటం. అంటే కనీసం నాలుగైదన్నా ఉపనిషత్తులు నేర్చుకోవాలి.

3. విద్యార్థిస్థాయి మూడు దశల్లో ఉంటుంది. ఉత్తమ, మధ్యమ, మంద అధికారి. ఉత్తమ విద్యార్థి ఒక్కసారి చెప్పగానే నేర్చేసుకుంటాడు. మధ్యమ అధికారికి రెండుసార్లన్నా చెప్పాలి. మంద అధికారికి పదేపదే చెప్పాలి. ఉపనిషత్తు కేవలం ఉత్తమ అధికారినే దృష్టిలో పెట్టుకోదు. అందుకని ఒక్కొక్క ఉపనిషత్తులోనూ పదేపదే జీవ ఈశ్వర ఐక్యం వస్తుంది.

4. ఉపనిషత్తు పరావిద్యలోకి వస్తుంది. తక్కిన దంతా అపరా విద్య. దీన్ని డైకాటమీ పద్ధతి అంటారని చూసాము. ఇక్కడ విద్యావిధానం ప్రత్యేకం. విద్య ప్రత్యేకం. విద్యార్థి ప్రత్యేకం. గురువు అంతకన్నా ప్రత్యేకం.

5. నిత్య, సత్య, శుద్ధ, ముక్త, అనంత, సచ్చిదానంద రూపం ఆత్మ అంటుంది ఉపనిషత్తు. ఇన్ని నిర్వచనాలు అవసరమా అంటే అవసరమే. ఎందుకంటే మనకు అన్ని అపోహలు ఉన్నాయి.

6. అనేక నిర్వచనాలు ఇవ్వటానికి కారణం ఏదో ఒకటి ఎవరో ఒకరికి అర్థమవుతుంది. ఎక్కడికైనా కొత్తచోటుకి వెళ్ళాలంటే ఒక్కొక్కరు ఒక్కో గుర్తు చెప్తారు కదా అలాగే అనేక విధాలుగా ఉపనిషత్తు ఒకటే విషయాన్ని అనేక కోణాల్లోంచి చెప్తుంది.

**అనుబంధ చతుష్టయం**

ఏదైనా నేర్చుకునేముందు దానికి సంబంధించి అనుబంధ చతుష్టయం తెలుసుకోవాలి.

1. అధికారి – విద్యార్థి అర్హత – సాధన చతుష్టయ సంపన్నుడు
2. విషయం – ఆత్మవిద్య
3. ప్రయోజనం – సంసార నివృత్తి, మోక్షప్రాప్తి
4. సంబంధం – జ్ఞానమనే మార్గం ద్వారా మోక్షమనే లక్ష్యసాధన

కఠోపనిషత్తులో ఈ అంశాలన్నీ ఉన్నాయి.

# కఠోపనిషత్తు

యజుర్వేదానికి రెండు భాగాలు ఉన్నాయి. కృష్ణయజుర్వేదం, శుక్ల యజుర్వేదం. కఠోపనిషత్తు కృష్ణయజుర్వేదానికి చెందింది. దీన్ని కఠక శాఖ అని కూడా అంటారు అందువల్ల కఠోపనిషత్తు పేరు వచ్చింది. ఇంకో కారణం ఇది కఠ ఋషి నుంచి వచ్చింది. కఠ ఋషి వైశంపాయన ఋషి శిష్యుడు. వైశంపాయన ఋషి వ్యాసమహర్షి శిష్యుడు. అలాగే మాకు గురువు శ్రీ పరమార్థానంద స్వామి. ఆయనకు గురువు దయానంద సరస్వతి స్వామి. అందరికీ గురువు ఆది శంకరాచార్యులు. గురు పరంపరలో అందరికీ వందనాలు.

కఠోపనిషత్తులో రెండు అధ్యాయాలు ఉన్నాయి. ఒక్కొక్క అధ్యాయంలో 3 భాగాలు ఉన్నాయి. వాటిని వల్లీలు అంటారు. ఇది కొంచెం పెద్ద ఉపనిషత్తు. ఇందులో మొత్తం 119 మంత్రాలు ఉన్నాయి. ఉపనిషత్తు సాధారణంగా గురుశిష్యుల సంవాదంగా ఉంటుందని చూసాము. ఇక్కడ గురువు సాక్షాత్తూ యమధర్మరాజు, శిష్యుడు నచికేతుడు.

## శాంతిపాఠం

ఒక్కొక్క వేదానికీ ఒక్కొక్క శాంతి పాఠం ఉంటుంది. ఏ వేదానికి చెందిన ఉపనిషత్తుకు ఆ వేదానికి సంబంధించిన శాంతి పాఠం ఉంటుంది.

| | | |
|---|---|---|
| ముండక, మాండూక్య, ప్రశ్న | – అథర్వణవేదం | – భద్రం కర్ణేభిః |
| చాందోగ్య, కేన | – సామవేదం | – అప్యాయంతు మమాంగాని |
| కఠ, తైత్తిరీయ | – కృష్ణ యజుర్వేదం | – సహనావవతు |
| బృహదారణ్యక, ఈశావాస్య | – శుక్ల యజుర్వేదం | – పూర్ణమదః |
| ఐతరేయ | – ఋగ్వేదం | – వాఙ్మేమనసి ప్రతిష్ఠితా |

శాంతిపాఠం పఠించటంలోని ఉద్దేశ్యం విచార విఘ్నాలు తొలగించుకోవటం. రెండు రకాల విఘ్నాలు ఉంటాయి. దృష్ట ప్రతిబంధకం, అదృష్టప్రతిబంధకం – కనబడే ఆటంకాలు, కనబడని ఆటంకాలు. ఉపనిషత్తు నేర్చుకునే సమయంలో ఆ ఆటంకాలను తొలగించమని సర్వజ్ఞుడైన భగవానునికి చేసే ప్రార్థనే శాంతి పాఠం.

## శాంతిపాఠం

**ఓం సహ నావవతు। సహనౌ భునక్తు। సహవీర్యం కరవావహై।**
**తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై॥ ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

సహ అంటే అతను. ఎవరు అతను? సాధారణంగా భగవంతుడు. వ్యాకరణపరంగా అతను అనే పదాన్ని సర్వనామం అంటారు. దానిని నామవాచకానికి బదులుగా వాడతారు.

ఉదాహరణకు – రాముడు మంచి బాలుడు, అతను పెద్దల మాట వింటాడు.

వ్యాకరణపరంగా సర్వనామాన్ని ఎవరికన్నా వాడుతారు. జంతువులకి కూడా. ఇక్కడ సహ అంటే భగవంతుడు. సర్వం విష్ణుమయం జగత్. భగవానుని విష్ణుమూర్తి అనండి, శివుడు అనండి ఎవరైనా.

నా అవతు, నౌ అవతు అంటే మా యిద్దరినీ రక్షించు. ఇంగ్లీషులో నౌ అంటే 'ఇప్పుడు' ఆ అర్థం కూడా సరిపోతుంది. ఇప్పుడు రక్షించు. తెలుగులో ఏకవచనం బహువచనం మాత్రమే ఉన్నాయి. సంస్కృతంలో ద్వివచనం కూడా ఉంది. 'నౌ' అంటే మాయిద్దరినీ. ఏ ఇద్దరినీ?

తనను, తన గురువును. ఎందుకు ఇద్దరే? తక్కిన శిష్యుల మాటేమిటి? ప్రతి విద్యార్థీ తనకోసం తాను ప్రార్థిస్తాడు. గురువుకు శిష్యులందరూ ముఖ్యమే. కాని విద్యార్థి తన గురువును మాత్రమే దృష్టిలో పెట్టుకోవాలి. తక్కిన వాళ్ళు ఎలా చదువుతున్నారు, ఏం చేస్తున్నారు అని ఆలోచించకూడదు.

హ – తప్పనిసరిగా ఎవరు రక్షించాలి? సగుణ, నిర్గుణ ఈశ్వరులిద్దరూ. దేని నుంచి రక్షణ? విద్యార్థిలోనూ, గురువులోనూ ఉండే లోటుపాట్ల నుంచి రక్షణ. విద్యార్థికి దేనికి? ఇక్కడ విద్య బ్రహ్మవిద్య. విద్యార్థికి లౌకిక వ్యవహారం నుంచి బయటకి రావటానికి సమయం పడుతుంది. అదికాక ఏకాగ్రత లేకపోవటం, సగం సగం వినటం, సగం విన్నదాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోవటం విద్యార్థి లక్షణాలు. వీటినుంచి రక్షణ కల్పించమని కోరుతున్నాడు. గురువుకు దేనికి? గురువుకు శ్రద్ధ, చెప్పగలిగే సామర్థ్యం ఉండాలి! ఇంకో శాంతి పాఠంలో 'నాకు మంచి గురువునివ్వు. ఆయన చెప్పలేకపోతే చెప్పే సామర్థ్యాన్ని ఇవ్వు' అని వస్తుంది.

సహనౌభునక్తు – భునక్తు అన్నా రక్షణే. మళ్ళీ అదే అర్థం.

జ్ఞానప్రధానేన అవతు అంటే జ్ఞానం పొందాలి.

జ్ఞానఫలప్రధానేన అవతు అంటే దాన్ని పొంది నేను మారాలి.

ఇదేదో యం.ఫిల్ డిగ్రీ పొందటానికి చదివే చదువు కాదు. నన్ను భగవంతుడు మార్చుగాక అన్న ప్రార్థన ఇది. ఎప్పుడో 15 ఏళ్ళ క్రిందట నన్ను ఎవరో లక్ష రూపాయలు మోసం చేసారని బాధపడే మనుష్యులం మనం. అటువంటి బాధలు అనేకం మనని సంసార

బంధంలో కట్టిపడేస్తాయి. ఒక బెలూన్‌ని 100 తాళ్ళు క్రిందకి లాగుతున్నాయనుకోండి. వాటిలో 99 తాళ్ళు కోసేసినా మిగిలిన ఒక్క తాడూ కిందకే లాగుతుంది దాన్ని ఎగిరిపోనీకుండా. అలాగే ఒక్క సమస్య పట్టి పీడిస్తున్నా, మనసు చిరాకు పెడుతుంది. అందుకని మనసు తేలికవు గాక అన్న ప్రార్థన.

సహవీర్యం కరవావహైః – పూర్తి బాధ్యత దేవుని మీదే పెట్టలేము. మన ప్రయత్నం మనం చేస్తే దేవుడు సహాయపడతాడు. మొదటి రెండు పదాలూ ఈశ్వర కృపని కోరితే మూడో పదం ఆత్మ ప్రయత్నాన్ని సూచిస్తుంది. మోక్షాన్ని భగవంతుడు నిర్ణయించడు. మనం ప్రయత్నిస్తే భగవంతుడు తోడ్పడుతాడు. అందుకే మోక్షాన్ని నాలుగు పురుషార్థాల్లో ఒకటిగా చేర్చారు. జ్ఞానానికి కూడా హెూమ్‌వర్క్ చేయాలి. గురువు చెపుతుండగానో, ఇంటికి వెళ్ళాకో నోట్స్ రాసుకోవాలి. రాయకపోయినా లాభం ఉంటుంది కాని దానికి తగ్గట్టుగానే ఉంటుంది. గురువు కూడా ముందు క్లాసులో ఏం చెప్పారో, ఇప్పుడేం చెప్పాలో చూసుకోవాలి. వీర్యం అంటే ఇద్దరి ప్రయత్నమూ ఉండాలి.

తేజస్వినావధీతమస్తు – బాగా విని, విన్నదాన్ని చక్కగా గుర్తుంచుకోవటాన్ని మేధాశక్తి అంటారు. సంస్కృతంలో దీన్ని గ్రహణ ధారణ శక్తి అంటారు. తేజస్వి అంటే తెలివిగా, తాజాగా ఉండటం. బ్రహ్మచారికి ఉపనయనం చేసేటప్పుడు ఒక మంత్రం చెప్తారు.

ఆ మంత్రం అర్థం ఇది వైదిక ఇయర్‌ప్లగ్. ఓ దేవా నువ్వు ఒకవైపు ఇయర్‌ప్లగ్‌గా ఉండాలి. నేను ఒక చెవిలో విన్నది ఇంకో చెవి నుంచి బయటకి వెళ్ళిపోకుండా, హృదయంలో చేరాలి. ఎంత అద్భుతమైన ప్రార్థన!

మా విద్విషావహై – మా మధ్య అపోహలు లేకుండు గాక. ఒకరిపై ఒకరికి శ్రద్ధ, ప్రేమ ఉండుగాక. గురువుకు విద్యార్థిపైన అభిమానం ఉండాలి. పక్షపాత బుద్ధి ఉండకూడదు. శిష్యునికి గురువు ఒక విజ్ఞాన ఖని అన్న నమ్మకం, గౌరవం ఉండాలి. ఏ ఇద్దరి మధ్యనన్నా అనుబంధం ఉండాలి. భార్యాభర్తల మధ్య చిక్కటి అనుబంధం లేకపోతే మధ్యలో పిల్లలు నలిగిపోతారు. ఇలాంటి అనుబంధం పెంచటం కోసమే గురుకులం పద్ధతి ఉండేది పూర్వం.

ఓం శాంతిః శాంతిః శాంతిః – మూడు రకాలైన విఘ్నాల నుంచి విముక్తి కోరుతున్నాము.

1. **ఆధ్యాత్మిక** – నా నుంచి ఆటంకాలు కలగకుండా చేయి. మనం మూడు అడుగులు ముందు వేద్దామని చూస్తే, మన మనసు మనను ఆరు అడుగులు వెనక్కి లాగుతుంది. నేనేమిటి ఆత్మజ్ఞానం పొందటమేమిటి అది నా తల మీంచి పోతుంది అని అపోహ పడతాము మనము. ఈ ఆటంకాలను పోగొట్టుకోవటం పూర్తిగా మన చేతిలో ఉంది.

2. **ఆదిభౌతిక** – పరిసరాల నుంచి, పక్కవాళ్ళ నుంచి, తోటి జీవరాసుల నుంచి కలిగే ఆటంకాలు. వీటి మీద మనకి అట్టే అధికారం లేదు. ఈ ఆటంకాలు లేకుండా చేయి.

3. **ఆదిదైవిక** – తుఫాను, వాతావరణంలో మార్పులలాంటి ప్రకృతి వైపరీత్యాల ఆటంకాలు. వీటిమీద మనకి బొత్తిగా అధికారం లేదు. వీటి నుంచి నన్ను కాపాడమని సర్వజ్ఞుడైన భగవంతుని ప్రార్థిస్తున్నాము.

# అధ్యాయం - 1 వల్లీ - 1

**మంత్రం - 1**

**ఓం ఉశన్ హ వై వాజశ్రవసః సర్వవేదసం దదౌ ।**
**తస్య హ నచికేతా నామ పుత్ర ఆస ॥**

**ప్రతిపదార్థం:** హ వై – పూర్వం; వాజశ్రవసః – వాజశ్రవసుడు; ఉశన్ – కోరికలున్నవాడు; సర్వవేదసం దదౌ – సర్వం దానం చేసాడు; తస్య – అతనికి; నచికేతా నామ – నచికేత పేరుగల; పుత్ర ఆస – పుత్రుడు ఉన్నాడు.

**తాత్పర్యం:** పూర్వం వాజశ్రవసుడను వ్యక్తి ఫలాల పట్ల కోరిక గలవాడై తన వద్ద ఉన్న వస్తువులన్నింటినీ దానం చేసాడు. అతనికి నచికేతుడను పుత్రుడు ఉన్నాడు.

**వివరణ:** కఠోపనిషత్తు ఒక కథ ద్వారా మొదలవుతుంది. అది నిజంగా జరిగిందా లేక అల్లబడినదా అన్నది మనకు సరిగ్గా తెలియదు. నిజానికి మనకు ఇక్కడ కావలసిన విషయం కథ ఎంతవరకూ నిజమన్న విషయం కాదు, కథలో చెప్పబడిన నిజం.

ఆత్మవిద్యను నచికేతునికి యమధర్మరాజు రెండవ వల్లీ నుంచి బోధిస్తాడు, భగవద్గీతలో అర్జునునకు శ్రీకృష్ణభగవానుడు బోధ రెండవ అధ్యాయం నుంచి మొదలుపెట్టినట్టుగా రెండింటిలోనూ మొదటి అధ్యాయానికి కూడా ప్రాధాన్యత ఉంది. కఠోపనిషత్తులో, నచికేతుని కథ ద్వారా నాలుగు అంశాలు మనకు సూచింపబడ్డాయి. ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగా చెప్పబడ్డాయి. అవి –

1. బ్రహ్మవిద్య మహిమ – బ్రహ్మవిద్య స్తుతి
2. గురు అపేక్ష – గురువు యొక్క ఆవశ్యకత
3. గురోః లక్షణాని – గురువు అర్హత
4. శిష్య లక్షణాని – శిష్యుని లక్షణాలు

పూర్వం ఒక వైదిక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతని పేరు వాజశ్రవసుడు. అతని పేరే అతనెలా వైదిక సాంప్రదాయాన్ని పాటించేవాడో సూచిస్తుంది. వాజ అంటే అన్నదానం. శ్రవస్ అంటే పేరు. అంటే అన్నదానం చేసినందుకు ఆ పేరు వచ్చింది.

వాజస్రవసుని ఇంకోపేరు ఉద్దాలకుడు. ఇతను శ్వేతకేతు తండ్రి అని కూడ వేరేచోట చదువుతాము. అందువల్ల అతనికి ఇద్దరు కొడుకులున్నారన్నమాట. ఇక్కడ అతనికొక పుత్రుడు నచికేతుడు ఉన్నాడు అని ఉపనిషత్తు చెప్తోంది.

వైదిక సాంప్రదాయం పాటిస్తున్న బ్రాహ్మణుడు పంచ మహాయజ్ఞాలను చేయాలి. అవి–

1. దేవయజ్ఞం – పరమాత్మని పూజించటం.
2. పితృయజ్ఞం – పితృదేవతలను తృప్తి పరచటం.
3. బ్రహ్మయజ్ఞం – శాస్త్రాలను అధ్యయనం చేసి, వాటిని బోధించటం.
4. మనుష్య యజ్ఞం – సత్రాలు నెలకొల్పటం, బావులు తవ్వించటం లాంటి మంచిపనులు, సంఘసేవ చేయటం.
5. భూత యజ్ఞం – పశుపక్ష్యాదులను ప్రేమగా చూడటం.

ఇలా ప్రకృతితో సమభావంతో మెలిగితే అంతఃశుద్ధి కలిగి, అద్వైత జ్ఞానం అలవడుతుంది.

అతను ఒక యజ్ఞం చేసి తన దగ్గరున్న సమస్తమూ దానంగా యిచ్చివేసాడు. ఆ యజ్ఞం పేరు ఉపనిషత్తు పేర్కొనదు కాని, తనకున్న సమస్తమూ యిచ్చే యజ్ఞం పేరు విశ్వజిత్ యజ్ఞం కాబట్టి, అతను ఆ యజ్ఞం చేసాడనుకోవచ్చు. అంతా యిచ్చేస్తారు కాబట్టి సన్యాసం తీసుకున్నదానితో సమానం.

ఈ యజ్ఞ యాగాదులు రెండు పద్ధతుల్లో చేస్తారు.

1. **సకామ సాధన** – ఐహిక సుఖాల కోసం లేదా ప్రాపంచిక విషయాల కోసం చేస్తారు. ఇవి చేయటం ద్వారా పుణ్యం పొంది, స్వర్గలోక ప్రాప్తి పొంది, మరుజన్మలో బాగుండాలన్న కోరికతో చేసే సాధన. అంటే స్వర్గలోక ప్రాప్తికి ఈ యజ్ఞం ద్వారా వచ్చే పుణ్యం క్రెడిట్ కార్డ్‌లాంటిదన్నమాట.

2. **నిష్కామ సాధన** – ఇహ, పరలోక సుఖాలు కోరకుండా, మోక్షం కోసం చేసే సాధన. దానికి కావాల్సినవి:

ఎ. **చిత్తశుద్ధి** – అది పొందటానికి సాధన చతుష్టయ సంపన్నుడై ఉండాలి.

బి. **పుణ్యఫలం** – పుణ్యఫలం ఉంటే బ్రహ్మనిష్ఠుడైన గురువు ఉపదేశం పొందుతాడు.

మోక్ష ఇచ్ఛ జ్ఞాన ఇచ్ఛకు దారితీస్తుంది. అది శాస్త్ర ఇచ్ఛకు, శాస్త్ర ఇచ్ఛ గురుశాస్త్ర శ్రవణప్రాప్తికి దారితీస్తుంది. శ్రవణప్రాప్తి జ్ఞానప్రాప్తికి, తద్వారా జ్ఞాన నిష్ఠకు దారితీస్తుంది.

కాని ఇక్కడ వాజశ్రవసుడు చేసిన యజ్ఞం సకామ సాధన. యజ్ఞం చేసాక దక్షిణ ఇవ్వటం అందులో ఒక భాగం. దక్షిణ యివ్వకపోతే యజ్ఞం అసంపూర్ణమవుతుంది. తామసిక యజ్ఞమవుతుంది. ఆ దక్షిణ సరియైనది కాకపోతే ఫలితం ఉండదు. ఉదాహరణకు బ్రాహ్మణుల చేత 101 సార్లు రుద్రం చదివించి, ఏ యాభయి రూపాయలో ఇవ్వటం విధిహీనమవుతుంది.

ఒక యజమాని ఒక సంకల్పం కోసం బ్రాహ్మణుల చేత యజ్ఞం చేయించుకుంటాడు. ఆ యజ్ఞఫలం బ్రాహ్మణులకు వెళ్లకుండా ఉండటం కోసం యజమాని వాళ్ళకు ధన రూపేణా లేదా వస్తురూపేణా దక్షిణ యిస్తాడు. దాన్ని కానుక అనలేము. ఎందుకంటే కానుక యిష్టంగా ఇచ్చేది. కాని దక్షిణ అలాకాదు. అది ఇచ్చితీరాలి. అది ఇవ్వకపోతే ఫలితం బ్రాహ్మణులకి వెళ్ళిపోతుంది. జీతం కూడా అనలేము. జీతం లౌకిక వ్యవహారాలకు వర్తిస్తుంది. కాని ఇక్కడ ఫలితం పారమార్థికం. ఈ దక్షిణ చిన్న సొమ్ము నుంచి అతి పెద్ద దానం దాకా ఉంటుంది.

కఠోపనిషత్తులో ముఖ్యపాత్ర నచికేతుడు. అతన్ని మొదటి మంత్రంలో పేర్కొన్నారు.

## మంత్రం – 2

**తగ్ం హ కుమారగ్ం సన్తం దక్షిణాసు నీయమానాసు**
**శ్రద్ధా౭౭ వివేశ సో౭ మన్యత॥**

**ప్రతిపదార్థం:** సం తం హ కుమారః – 7–10 వయస్సులోపు బాలుడుగా ఉన్న అతడిని; దక్షిణాసు నీయమానాసు – దక్షిణలు తీసుకువెళ్ళేటప్పుడు; శ్రద్ధా – శ్రద్ధ (వేదాల మీద), అవివేశ – ఆవేశించి; సః అమన్యత – (ఈ విధంగా) ఆలోచించసాగాడు.

**తాత్పర్యం:** దక్షిణలు తీసుకురావటం కుమారుడైన నచికేతుడు చూసాడు. అప్పుడు శ్రద్ధ అతడిని ఆవేశించింది. అతడు ఈ విధంగా ఆలోచించసాగాడు.

**వివరణ:** నచికేతుడు ముఖ్యపాత్ర అని ముందు మంత్రంలో చూసాము. అతను కుమారుడు, అంటే 7–10 వయస్సులోపు బాలుడు అని అర్థం. ఉపనయనం 8 ఏళ్ళకి చేస్తారు. అతను కుమారుడే అయినా వైదిక కుటుంబంలో పుట్టాడనీ, వైదిక కర్మల గురించి తెలుసనీ, వాటి మీద శ్రద్ధ ఉందనీ మనకి తెలుస్తోంది. ఇలాంటి శ్రద్ధ ఉన్న వ్యక్తికి వేదాంత శ్రద్ధ తేలికవుతుంది.

ఒక యజ్ఞం చేయాలంటే, దానికి ఒక్కొక్క వేదానికీ నలుగురు ఋత్విక్కుల చొప్పున, పదహారుమంది ఋత్విక్కులు ఉండాలి. పెద్ద యజ్ఞాలకు ఇంకా ఎక్కువ మంది కావాలి. యజమానీ, అతని భార్యతో కలిపి పద్దెనిమిది మంది అవుతారు.

సకామ కర్మలకు నియమాలు ఖచ్చితంగా పాటించాలి. తప్పు చేస్తే ప్రాయశ్చిత్తం చేయాలి. ఉదాహరణకు సంధ్యావందనం చేసేటప్పుడు ఆలస్యం చేస్తే – కాలాతీత ప్రాయశ్చిత్తం కింద అదనంగా ఇంకోసారి సంధ్యావందనం చేయాలి. యజ్ఞం విషయంలో ఒక్కోసారి మొత్తం యజ్ఞం మళ్ళీ చేయాల్సి వుంటుంది.

నిష్కామ కర్మలో కావాలని నిర్లక్ష్యం చేయకూడదు. కాని నియమాలు ఖచ్చితంగా పాటించనక్కరలేదు.

నచికేతునికి ఇది సకామ కర్మ అని తెలుసు. దక్షిణ సమయంలో శ్రద్ధ ఉండాలి.

దానం విషయంలో 6 అంగాలను పాటించాలని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

1. శ్రద్ధయా దేయం – శ్రద్ధగా ఇవ్వాలి.
2. అశ్రద్ధయా అదేయం – అశ్రద్ధగా ఇవ్వకూడదు.
3. శ్రియా దేయం – శక్తివంచన లేకుండా ఇవ్వాలి.
4. హ్రియా దేయం – వినయంగా ఇవ్వాలి.
5. భియా దేయం – గౌరవంగా ఇవ్వాలి.
6. సంవిదా దేయం – మనస్ఫూర్తిగా ఇవ్వాలి.

ఈ విషయాలు తెలిసిన నచికేతుడు దక్షిణ ఇచ్చేటప్పుడు, శ్రద్ధగా చూసి, ఈ విధంగా (తర్వాత వస్తుంది) ఆలోచించసాగాడు.

**మంత్రం – 3**

**పీతోదకా జగ్ధతృణా దుగ్ధదోహా నిరిన్ద్రియాః।**
**అనన్దా నామ తే లోకాస్తాన్స గచ్ఛతి తా దదత్ ॥**

**ప్రతిపదార్థం:** పీత ఉదకాః – నీళ్ళు త్రాగటం పూర్తి చేసాయి అంటే నీళ్ళు త్రాగే శక్తి లేదు; జగ్ధతృణా – గడ్డినంతా మేసాయి అంటే గడ్డిమేసే శక్తి లేదు; దుగ్ధదోహాః – చివరిసారిగా పాలు ఇచ్చాయి అంటే పాలు ఇవ్వలేవు; నిరిన్ద్రియా – దూడని ఈనలేవు; తాః దదత్ – ఇలాంటివాటిని ఇచ్చే; అనన్దానామ – ఆనందం లేని నరకలోకం; తే లోకాః–ఆ లోకాలను, తాన్ సః గచ్ఛతి – ఆ యజమాని (యజ్ఞకర్త) వెళ్తాడు.

**తాత్పర్యం:** నీళ్ళు త్రాగటానికీ, గడ్డిమేయటానికీ, పాలు ఇవ్వటానికీ, దూడని ఈనటానికీ శక్తిలేని ఆవులను దానం చేసే వ్యక్తి ఆనందరహితమైన లోకాలను పొందుతాడు.

**వివరణ:** ఈ మంత్రం నచికేతుని ఆలోచనాపరంపర. ఆ రోజుల్లో గోవులను కూడా సంపద కింద పరిగణించేవారు. బృహదారణ్యక ఉపనిషత్తులో జనకుడు ఆవులను దానం చేస్తానంటాడు.

ఇక్కడ నచికేతుని తండ్రి దానం చేస్తున్న ఆవులకు నీళ్ళు త్రాగే శక్తి లేదు. గడ్డి తినే శక్తి లేదు. పాలు ఇవ్వలేవు. దూడని ఈనలేవు. అటువంటి ఆవులను తీసుకున్న వాడికే ఎదురు ఖర్చు. ఇచ్చిన తండ్రికీ లాభం లేదు. అతను స్వర్గానికి పోడు. నంద అంటే సుఖం. ఆనందం

అంటే ఎక్కువ సుఖం. అనంద అంటే సుఖం లేదు. అంటే సుఖం లేని లోకాలకి ఆ యజమాని వెళ్తాడు.

అలాంటి ఆవులను తండ్రి ఎందుకు ఇచ్చాడు అని బాధపడ్డాడు. అవును. ఇలాంటి ఆవులను ఎందుకు ఇచ్చాడు? ప్రతికూలంగా ఆలోచిస్తే మంచివి ఇవ్వటం ఇష్టం లేదు, స్వార్థపరుడు అనిపించవచ్చు. కాని తార్కికంగా చూస్తే తప్పు. ఎందుకంటే అలాంటి స్వార్థపరుడు ఇలాంటి యజ్ఞం చేయడు. అతను చేసిన విశ్వజిత్ యజ్ఞానికి అన్నీ ఇవ్వాలి. అందుకే వట్టిపోయిన ఆవులతో సహా ఇచ్చాడనుకోవాలి.

**మంత్రం – 4**

**స హోవాచ పితరం తత కస్మై మాం దాస్యసీతి।**
**ద్వితీయం తృతీయం తగ్ం హోవాచ మృత్యవే త్వా దదామీతి॥**

**ప్రతిపదార్థం:** సః – అతను; పితరం ఉవాచ – తండ్రితో అన్నాడు; తత – తండ్రీ; కస్మైమాం దాస్యసీతి – నన్ను ఏ బ్రాహ్మణునికి ఇస్తావు? (తండ్రి పట్టించుకోలేదు); ద్వితీయం – రెండోసారి; తృతీయం– మూడోసారి; మృత్యవే త్వా దదామీతి – నిన్ను మృత్యువు (యమ ధర్మరాజు)కి ఇస్తాను; తం ఉవాచ – అతనితో చెప్పాడు.

**తాత్పర్యం:** నచికేతుడు తండ్రి దగ్గరకు వెళ్ళి తనను ఎవరికి ఇస్తాడని అడిగాడు. తండ్రి పట్టించుకోకపోతే రెండోసారి, మూడోసారి రెట్టించాడు. అందుకు తండ్రి చిరాగ్గా మృత్యుదేవతకి ఇస్తానన్నాడు.

**వివరణ:** ఈ మంత్రంలో నచికేతునిలో తండ్రిని కాపాడాలన్న తపన కనిపిస్తుంది. తను కూడా తండ్రి ఆస్తి అనుకున్నాడు. వట్టిపోయిన ఆవులకన్నా తను సేవచేయాలన్న తపన. దక్షిణగా వెళ్లటానికి సిద్ధంగా ఉన్నాడు. తననీ ఇస్తున్నాడనుకున్నాడు. తండ్రి పట్టించుకోలేదు. రెచ్చగొట్టాడు. గో టు హెల్ అన్నట్టుగా మృత్యుదేవతకి ఇస్తానన్నాడు. నిజంగా అనాలన్న ఉద్దేశ్యంతో అనలేదు.

కాని ఇక్కడ తల్లిదండ్రులకు ఇదొక హెచ్చరికలాంటిది. వాళ్లు మామూలుగా అనేసిన విషయాలను పిల్లలు, అత్యంత ఇబ్బందికరమైన సమయంలో మళ్ళీ గుర్తుచేస్తారు.

**మంత్రం – 5**

**బహూనామేమి ప్రథమో బహూనామేమి మధ్యమః।**
**కిగ్ం స్విద్యమస్య కర్తవ్యం యన్మయాఽద్య కరిష్యతి॥**

**ప్రతిపదార్థం:** బహూనామ్ ఏమి – అనేకమంది విద్యార్థుల్లో నేను; ప్రథమ – మొదటి స్థానంలో ఉన్నాను; బహూనాం మధ్యమ ఏమి – అనేకమందిలో మధ్యముడిని; కిమ్ స్విత్ కర్తవ్యం – ఏం పని ఉంది అక్కడ; యమస్య – యమధర్మరాజుకి; యత్ – దేనిని; మయా–నాచే; మయ అద్య కరిష్యతి – నా తండ్రి చేయించేది.

**తాత్పర్యం:** అనేకమంది విద్యార్థుల్లో నేను ప్రథముడిని. అనేక మందిలో మధ్యముడిని. నన్ను యముని దగ్గరకు పంపి, తండ్రి నాచేత ఏ పని చేయించబోతున్నాడు?

**వివరణ:** ఇక్కడ నచికేతుని ఆలోచనలు చూస్తాము. ఒక ఏకాంత ప్రదేశంలో కూర్చుని తన తండ్రి అలా ఎందుకన్నాడు అని తర్కించుకుంటాడు. నచికేతుని నిస్వార్థభావన చూస్తాము. అతనికి సేవ చేయాలన్న తపన ఉంది. కాని యమునిలాంటి గొప్ప దేవతకు తను ఎంతవరకూ న్యాయం చేకూర్చగలడు అన్నది ఒక తపన. దాని బదులు ఏ బీద బ్రాహ్మణుని దగ్గరికో వెళ్తే కొంతైనా సాయంగా ఉండగలడు. అంటే తను పనికిరానివాడా? ఈ ఆలోచన కోపం వల్ల వచ్చింది కాదు. బాధ నుంచి, పూర్తిగా సేవ చేయాలన్న తపన నుంచి వచ్చింది.

అందుకని ఆత్మపరిశీలన చేసుకుంటాడు. నచికేతునికి వేదాల మీద జ్ఞానం ఉంది. తండ్రి చెప్పి ఉండవచ్చు. తను శిష్యులలో ప్రథముడో, మధ్యముడో అవుతాడు కాని అధముడు మాత్రం కాదు. ఎటువంటి శిష్యుడో ఎలా నిర్ణయిస్తారు?

ఉత్తమ శిష్యుడు – చింతితం కుర్యాత్ ఉత్తమః – గురువు అడగకుండా చేసేవాడు.
మధ్యమశిష్యుడు – ప్రోక్త కార్యేతు మధ్యమః – గురువు చెబితే చేసేవాడు.
అధమ శిష్యుడు–న కుర్యాత్ అధమః ప్రోక్తం – గురువు చెప్పినా చేయడు.

**మంత్రం – 6**

**అనుపశ్య యథాపూర్వే ప్రతిపశ్య తథాఽ పరే।**
**సస్యమివ మర్త్యః పచ్యతే సస్యమివాజాయతే పునః॥**

**ప్రతిపదార్థం:** యథాపూర్వే – పూర్వీకులు ఎలా జీవించారో; అనుపశ్య – చూడు; తథా అపరే యథా ప్రతిపశ్య – ఈ తరం వాళ్ళు ఎలా జీవిస్తున్నారో చూడు; సస్యమ్ ఇవ – చెట్లు చేమల లాగా; పచ్యతే – నశిస్తాడు; సస్యమ్ ఇవ – చెట్లు చేమలలాగా; అజాయతేపునః – మళ్ళీ పుట్టాడు.

**తాత్పర్యం:** పూర్వీకులు ఎలా జీవించారో చూడు. ఈ తరం వాళ్ళు ఎలా జీవిస్తున్నారో చూడు. చెట్లు చేమలలాగా జనన మరణాలు పొందుతున్నాడు మనిషి అని నచికేతుడు తండ్రితో చెప్తాడు.

**వివరణ:** ఇక్కడ మనం కథని అల్లుకోవాలి. తండ్రి ఈ మాట కోపంతో అన్నా, అది నిలబెట్టుకోవాలి అనుకుంటాడు నచికేతుడు. నేనెవరు తండ్రి నిర్ణయం గురించి ఆలోచించటానికి అనుకుంటాడు. ఈ విషయాన్ని బట్టి ఇంటిపెద్దకి, లేదా నాయకుడి మాటకి విలువనివ్వాలి, అందరూ నిర్ణయాలు తీసుకోకూడదు అన్న విషయం తేటతెల్లమవుతుంది.

నచికేతుడు అన్నీ సర్దుకుని వెళ్తాడు. తండ్రి నేను అలా అనలేదు అంటాడు. నచికేతుడు విలువలకి కట్టుబడి ఉండాలనీ, వాక్యపాలనే, అదీ యాగశాలలో ఇచ్చింది, ముఖ్యమనీ చెప్తాడు. దీనివల్ల నచికేతుడు ధర్మానికి విలువనిస్తాడు అని తెలుస్తోంది. ఆచంద్రతారార్కం నిలిచేది ధర్మం, సత్యం. జీవితం బుద్బుదప్రాయం.

నిన్నెలా వదిలి ఉండను అని తండ్రి అంటే తండ్రికి నచ్చచెప్తాడు నచికేతుడు. 'నీ పూర్వీకులను చూడు. నువ్వు వాళ్ళకి చెడ్డపేరు తెస్తావా? పోనీ పూర్వీకులకే ఉంది ఇప్పుడు లేదంటావా? ఇప్పటి వాళ్లని చూడు. నేను వెళ్ళకపోతే కలిసి ఉంటాము. సరే, కాని ఎన్నాళ్ళు? కలుపు మొక్కలలాగే కొన్నాళ్ళే. బుడగలాగ కొన్నాళ్ళే. యమధర్మరాజు దగ్గరకు వెళ్లితీరాలని నచికేతుడు అనుకున్నాడు.

తండ్రికి ఇష్టం లేకుండా వెళ్లడు. అది అతని మానసిక ఎదుగుదలను చూపిస్తోంది. తండ్రి ఒప్పుకోక తప్పలేదు. హరిశ్చంద్రుడు సత్యానికి కట్టుబడ్డాడంటే చంద్రమతి దానికి దోహదం చేసింది. సత్యం పాటించాలంటే అందరూ తోడ్పడాలి.

### మంత్రం – 7

**వైశ్వానరః ప్రవిశత్యతిథిర్బ్రాహ్మణో గృహాన్।**
**తస్యైతాగ్ం శాన్తిం కుర్వన్తి హర వైవస్వతోదకమ్॥**

**ప్రతిపదార్థం:** వైశ్వానరః – అగ్నిదేవుడు; ప్రవిశతి – ప్రవేశిస్తాడు; గృహాన్ – ఇంట్లో; బ్రాహ్మణః అతిథిః – బ్రాహ్మణ అతిథిగా; కుర్వంతి – (ప్రజలు) చేస్తారు; ఏతామ్ శాంతిం తస్య – వీటిని ఇచ్చి శాంతి చేస్తున్నారు; వైవస్వత – వివస్వత పుత్రుడు యమధర్మరాజు; హర ఉదకం – నీళ్ళు తీసుకొనుము.

**తాత్పర్యం:** యమధర్మరాజు కుటుంబ సభ్యులు, అతనితో చెప్తున్నారు: 'బ్రాహ్మణుడొకడు అతిథిగా వచ్చినప్పుడు అగ్నిలాగానే ప్రవేశిస్తాడు. ప్రజలు అతనికి అతిథి మర్యాదలు చేసి శాంతింపజేస్తారు. యమధర్మరాజా, నువ్వు ఆ బాలునికి నీరు మొదలైనవి ఇవ్వు.'

**వివరణ:** కథ ఇంకొంచెం ముందుకు సాగుతుంది. కథ ముఖ్యం కాదు కాబట్టి ఉపనిషత్తు కొంతభాగం వదిలి ముందుకు సాగుతుంది. ఆ భాగాన్ని శంకరాచార్యులు

పూరిస్తారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోమని తండ్రి వాజశ్రవసునకు కొడుకు చేసిన హితబోధ వల్ల అతనిని యమధర్మరాజు దగ్గరికి పంపక తప్పలేదు. అలా నచికేతుడు యమలోకానికి వెళ్తాడు. ఇంకో భాష్యకారుడు నచికేతుడు సశరీరంగానే వెళ్లాడని, అతని పితృభక్తి వల్ల, శాస్త్రాల మీద, సత్యం మీద అతనికున్న శ్రద్ధ వల్ల అతనికా మహిమ వచ్చిందనీ వివరిస్తాడు.

ఏది ఏమైనా నచికేతుడు వెళ్ళేసరికి యమధర్మరాజు ఉండడు. యజమాని ఇంట లేనప్పుడు పరపురుషుడు లోనికి వెళ్లడు. తను పిల్లవాడే అయినా వెళ్లలేదు. పైగా తను సేవకుని హోదాలో వచ్చాడు. అందుకని బయట ఉండిపోతాడు. అలా మూడురోజులు అభోజనంగా ఉండిపోయేసరికి, యమధర్మరాజు కుటుంబ సభ్యులకి భయం వేస్తుంది. అతన్ని అతిథిగా భావించారు వాళ్ళు. అతిథి, అందులోనూ బ్రాహ్మణ అతిథిని గౌరవంగా చూడాలి. లేకపోతే యజమానికి ప్రత్యవాయ పాపం అంటుకుంటుంది.

బ్రాహ్మణ అతిథి అగ్నితో సమానం. అగ్ని శక్తివంతమైనది. దాన్ని సరిగా పూజిస్తే దీవిస్తుంది. లేకపోతే నశింపజేస్తుంది. బ్రాహ్మణులు కూడా అంతే. బ్రాహ్మణుడు, అందులోనూ గుణ బ్రాహ్మణుడు –

**శమో దమస్తపః శౌచం క్షాంతిరార్జవమేవ చ।**
**జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మస్వభావజమ్॥** – గీత 18.42

శమము, దమము, ధర్మాచరణ, శౌచం, క్షమాగుణం, ఋజుమార్గ జీవనము, శాస్త్రాల మీద శ్రద్ధ, శాస్త్ర అధ్యయనం, అధ్యాపనం, పరతత్త్వానుభవం – ఇవి అన్నీ బ్రాహ్మణుల స్వాభావిక కర్మలు.

బ్రాహ్మణుడు సంతృప్తి చెందితే వరాలు ఇవ్వగలడు. కోపం వస్తే శపించగలడు కూడా. అందుకని యమధర్మరాజు తన పని ముగించుకుని రాగానే, అతనికి అతిథి రాక గురించి చెప్తారు. ఇప్పటివరకూ మనం అల్లుకున్న కథ. ఇప్పుడు ఈ మంత్రం అందుకుని యమధర్మరాజుకి కుటుంబ సభ్యులు ఏం చెప్తారో చెప్తుంది. వైవస్వత ఉదకమ్ హర – యమధర్మరాజా వెళ్ళి నీళ్ళు తీసుకురా అంటే అతనికి సేవ చేయి అంటున్నారు.

### మంత్రం – 8

**ఆశాప్రతీక్షే సంగతగ్ం సూనృతాం చ ఇష్టాపూర్తే పుత్రపశూగ్ంశ్చ సర్వాన్।**
**ఏతద్వృఙ్క్తే పురుషస్యాల్ప మేధసో యస్యానశ్నన్వసతి బ్రాహ్మణో గృహే॥**

**ప్రతిపదార్థం:** అస్య – ఈ; అల్పమేధసః – బుద్ధిహీనుడైన; యస్య పురుషస్య గృహే – ఏ వ్యక్తి ఇంట్లో; బ్రాహ్మణః – బ్రాహ్మణ అతిథి; అనశ్నన్ వసతి – అన్నం తినకుండా ఉంటాడో;

ఆశాః – భవిష్యత్తు మీద ఆశలు; ప్రతీక్షే – జరుగుతుందని తెలిసి ఆశ; సంగతం – పుణ్యఫలం; సూనృతాం – మంచి మాటల వల్ల వచ్చిన పుణ్యం; ఇష్టాపూర్తే – సత్కర్మల ఫలం; సర్వాన్ – సమస్తమూ; పుత్ర పశూన్ చ – పుత్ర సంపద; పశువుల సంపద కూడా; ఏతత్ – అన్నింటినీ; వృఙ్క్తే – నశింపజేస్తాడు.

**తాత్పర్యం :** ఎవరి ఇంట్లో బ్రాహ్మణ అతిథి భోజనం చేయకుండా ఉంటాడో, అల్పబుద్ధి గల అతని ఆశలూ, ఆకాంక్షలూ నశిస్తాయి. తను చేసిన పుణ్యఫలం, మంచి మాటల వల్ల వచ్చిన పుణ్యం, సత్కర్మల ఫలం అన్నీ కోల్పోతాడు. పుత్రులు, పశువులు కూడా నశించిపోతాయి.

**వివరణ :** యమధర్మరాజుతో కుటుంబ సభ్యులు మీరు ఆలస్యం చేస్తే ప్రత్యవాయ పాపం అంటుతుంది అంటున్నారు. ధర్మం నిర్వర్తించకపోతే ఏ ఏ నష్టాలు కలుగుతాయో వివరిస్తుంది ఈ మంత్రం.

1. ఆశా – భవిష్యత్తు మీద ఆశ.
2. ప్రతీక్షా – జరుగుతుందని తెలిసి ఆశ.

ఆశకీ, ప్రతీక్షకీ సూక్ష్మ భేదం ఉంది. ఆశ అంటే మనకి ఇష్టమైనవి జరగాలన్న ఆశ. అది జరుగుతుందో లేదో తెలియదు. కాని ప్రతీక్ష అంటే జరుగుతుందని తెలిసి, దాని కోసం ఎదురుచూడటం. ఉదాహరణకు అందమైన భార్య కావాలని కోరుకోవటం ఆశ. పిల్లలు అమెరికా నుంచి ఫలానా రోజుకి వస్తున్నారన్న వార్త తెలిసి వాళ్ళ కోసం ఎదురుచూడటం ప్రతీక్ష.

3. సంగతం – సత్సంగం వల్ల వచ్చిన పుణ్యం
4. సూనృతాం – మంచి మాటల వల్ల వచ్చిన పుణ్యం

మన సంప్రదాయం వాచికతపస్సుకు ప్రాముఖ్యతనిస్తుంది. మనసు అంత శక్తివంతమైనది వాక్కు. కొంతమంది మంచి అంటే జరుగుతుందో లేదో కాని, చెడు అంటే జరుగుతుంది.

**యోగస్య ప్రథమం ద్వారం వాక్ నిరోధః** – వివేక చూడామణి

వాచికతపస్సు మొదటి సాధన. మాటలు అదుపులో ఉంటే విజయం వరిస్తుంది. లక్ష్మీదేవి నిలుస్తుంది. పేరు ప్రతిష్టలు కలుగుతాయి. నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందని సామెత.

5. ఇష్టం – కోరినవి అని కాదు. మతఃపరమైన కర్మలు, సత్కర్మల ఫలం.

ఇవి ఆరు ఉన్నాయి.

ఎ. అగ్నిహోత్రం – అగ్నిని పూజించటం
బి. తపః – తపస్సు
సి. సత్యం – నిజం పలకటం
డి. వేదానాం అనుపాల్యం – శాస్త్రాలను పఠించటం
ఇ. ఆతిథ్యం – అతిధులని గౌరవించటం
ఎఫ్. వైశ్వదేవం – చెట్లనీ, జంతువులనీ అభిమానంగా చూడటం, ఉదా: కాకులకి అన్నం పెట్టటం.
కాని ఇప్పుడు అతిధులని ఎలా తప్పించుకోవాలా అని చూస్తాం.

6. పూర్తం – లౌకిక కర్మలు, వాపీ, కూపం, తటాకం, బావులు తవ్వటం, ఆలయాలు కట్టటం, నదుల్లో పూడిక తీయడం.

7. పుత్రః – పిల్లలు. వారి వికాశం, మానసికంగా, శారీరకంగా, ఆధ్యాత్మికంగా.

8. పశూం – పశుసంపద. పూర్వం గోవులను కూడా సంపదగా చూసేవారు.

పైన చెప్పినవన్నీ ధర్మాచరణ చేస్తే లభిస్తాయి. ధర్మం నిర్వర్తించకపోతే నాశనమవుతాయి.

నచికేతుడు అన్నం తినకుండా మూడు రోజులు ఉన్నాడంటే, నచికేతుని శమ, దమ, తితీక్ష లక్షణాలు తెలుస్తున్నాయి. అంటే మనో నిగ్రహం, ఇంద్రియ నిగ్రహం, స్థితప్రజ్ఞత ఉన్నాయి అతనికి.

## మంత్రం – 9

**తిస్రో రాత్రీర్యదవాత్సీర్గృహే మేఽనశ్నన్ బ్రహ్మన్నతిథిర్నమస్యః।**
**నమస్తేఽస్తు బ్రహ్మన్స్వస్తి మేఽస్తు తస్మాత్ప్రతి త్రీన్వరాన్వృణీష్వ॥**

**ప్రతిపదార్థం:** మే గృహే తిస్రః రాత్రీః అవాత్సీః – నా ఇంట్లో మూడు రాత్రులు ఉన్నావు; అతిథి – అతిథిగా వచ్చి; అనశ్నన్ – అన్నం లేకుండా; నమస్యః – నమస్తే; హే బ్రహ్మన్ నమః అస్తు – ఓ బ్రాహ్మణా నీకు నమస్కారం; స్వస్తి అస్తు – పుణ్యం ఉండుగాక; తస్మాత్ ప్రతి – అందుకు ప్రతిగా; త్రీన్‌వరాన్ వృణీష్వ – మూడు వరాలు కోరుకో.

**తాత్పర్యం:** ఓ బ్రాహ్మణ అతిథీ! నమస్కరింపదగ్గ నువ్వు నా ఇంట్లో అన్నం తినకుండా మూడు రాత్రుళ్ళు గడిపావు. అందుకు ప్రతిగా నువ్వు నా నుంచి మూడు వరాలు కోరుకో.

**వివరణ:** ఈ మంత్రం యముని మాటలు. యమధర్మరాజు పెద్ద దేవత. కాని మనిషిని అతిథిగా సేవించటానికి పరిగెడతాడు. యమధర్మరాజు వినయానికి ప్రతీకగా నిలుస్తాడు,

శ్రీకృష్ణభగవానుడు తన బాల్యస్నేహితుడు కుచేలుని పేదరికం లెక్కచేయకుండా అతని మీద ఆదరాభిమానాలు చూపించినట్టుగా. యమధర్మరాజు చేసిన అపరాధం తెలిసి చేసింది కాదు. కాని అపరాధ భావంతో బాధపడ్డాడు. ఎవరైనా అన్నం లేకుండా ఉంటే బాధ కలుగుతుంది. అందులోనూ బ్రాహ్మణ అతిథి అన్నం లేకుండా ఉంటే ఇంకా బాధ. మూడు రోజులు అన్నం తినకుండా ఉన్నందుకు మూడు వరాలు కోరుకోమంటాడు.

అనశ్నన్ మాట ముందు మంత్రంలో వస్తుంది. దాన్ని ఇక్కడికి మళ్ళీ తెచ్చారు. 'అనశ్నన్' గా ఉన్నాడు కాబట్టి పాపం అంటుకుంటుంది. 'అనశ్నన్' గా ఉన్నాడు కాబట్టి పాప పరిహారంగా వరాలు ఇస్తున్నాడు.

## మంత్రం - 10

**శాన్తసఙ్కల్పః సుమనా యథా స్యాత్ వీతమన్యుర్గౌతమో మాఽభి మృత్యో।**
**త్వత్ప్రసృష్టం మాఽభివదేత్ప్రతీతః। ఏతత్ త్రయాణాం ప్రథమం వరం వృణే॥**

**ప్రతిపదార్థం:** మృత్యో - యమధర్మరాజా; గౌతమః - గౌతముడు; శాన్తసఙ్కల్పః - ప్రశాంత మనస్కుడై; సుమనాః - సంతుష్టి చెంది; వీతమన్యుః - కోపంపోయి; యథా స్యాత్ - ఎలా ఉంటాడో; త్వత్ ప్రసృష్టం - నేను వెనక్కి వెళ్ళినప్పుడు గుర్తించాలి; మా అభివదేత్ ప్రతీతః- నాతో ఎప్పటిలా మాట్లాడాలి; ఏతత్ - దీనిని; త్రయాణామ్-మూడు వరాలలో; ప్రథమం వరం - మొదటివరంగా; వృణే - కోరుతున్నాను.

**తాత్పర్యం:** యమధర్మరాజా! నీ దగ్గరనుంచి వెనక్కి వెళ్ళినప్పుడు నా తండ్రి గౌతముడు ప్రశాంత మనస్కుడై, కోపం పోయి, సంతుష్టి చెంది, నాతో ఎప్పటిలా మాట్లాడాలి. మూడు వరాలలో దీనిని మొదటి వరంగా కోరుతున్నాను.

**వివరణ:** నచికేతుడు మూడు వరాలలో మొదటి వరం కోరుతున్నాడు. కొన్ని వరాలు కలిపి ఒక వరంగా కోరి, తెలివిగా యమధర్మరాజుకి ఇది నా మొదటి వరం అని స్పష్టంగా చెపుతున్నాడు.

**గమనిక:** ముందు మంత్రాలలో చెప్పబడ్డ నచికేతుని తండ్రి వాజశ్రవసుడే గౌతముడు.

1. శాంత సంకల్పః గౌతమః - తన తండ్రికి మనోవ్యాకులత తీరాలి. యమధర్మరాజు ఏం చెప్తాడో అన్న బెంగ తీరాలి.
2. సుమనః - శాంతి పొందాలి.
3. వీతమన్యుః - కోపం పోవాలి, మా అభి - నా మీద

4. త్వత్ ప్రసృష్టం ప్రతీత – నేను వెనక్కి వెళ్ళినప్పుడు నన్ను గుర్తించాలి. యమధర్మరాజు తనని వెనక్కి పంపిస్తాడని ముందే చెప్పేసుకుంటున్నాడు. కాలమానంలో తేడా ఉంటుంది కదా భూలోకానికీ, యమలోకానికీ.

5. యథా స్యాత్ – నాతో ఎప్పటిలా మాట్లాడాలి.

ఈ ఐదు కోరికలూ కలిపి ఒక్క కోరికగా కోరుతాడు. నచికేతుడు చాలా తెలివైనవాడు, మోసగాడు కాదు. తండ్రి మాట నిలబెట్టటం కోసం యమలోకం వెళ్లాడు. అందుకని మొదటి కోరిక ద్వారా తండ్రి దుఃఖం తీరుస్తాడు.

### మంత్రం – 11

**యథా పురస్తాద్భవితా ప్రతీతః ఔద్దాలకిరారుణిర్మత్ప్రసృష్టః**
**సుఖంరాత్రీః శయితా వీతమన్యు – స్త్వాం దదృశివాన్మృత్యుముఖాత్ప్రముక్తమ్॥**

**ప్రతిపదార్థం:** ఔద్దాలకిః – ఉద్దాలకుడు; ఆరుణిః – అరుణుని కుమారుడు; మత్ ప్రసృష్టః – నాచే పంపబడిన; ప్రతీతః – నిన్ను గుర్తించి; యథా పురస్తాద్భవితా – అంతకు ముందులాగే నీతో ప్రవర్తిస్తాడు; సుఖం రాత్రీః శయితా – ప్రతిరాత్రీ సుఖంగా నిద్రించగలడు; మృత్యుముఖాత్– మృత్యుముఖం నుంచి; ప్రముక్తమ్ – తిరిగి వెళుతున్న; త్వామ్ దదృశివాన్ – నిన్ను చూసి; వీతమన్యుః – కోప రహితుడు; భవితా – అవుతాడు.

**తాత్పర్యం:** అరుణుని కుమారుడూ, నీ తండ్రీ అయిన ఉద్దాలకుడు నిన్ను చూసినప్పుడు అంతకు ముందులాగే నీతో ప్రవర్తిస్తాడు. రాత్రుళ్ళు ప్రశాంతంగా నిద్రపోతాడు. నీమీద కోపం చూపించడు అని యమధర్మరాజు మొదటి వరాన్ని ప్రసాదిస్తాడు.

**వివరణ:** ఉపనిషత్తు సంభాషణ రూపంలో సాగుతుంది. యమధర్మరాజు మూడు వరాలు కోరుకోమంటే, కొన్ని వరాలు కలిపి మొదటి వరంగా కోరతాడు నచికేతుడు. యమధర్మరాజు అతను కోరిన ప్రతి ఒక్కటీ పలికి, అది తీరుతుందని చెప్తాడు. ఒక్కముక్కలో చెప్పాలంటే తథాస్తు అంటాడు.

1. సుఖంరాత్రీః శయితా – శాంత సంకల్పః సుమనాకి జవాబు. నువ్వు వెళ్ళిన రాత్రే కాదు, నీ మీద దిగులు తీరి ప్రతిరాత్రీ సుఖంగా నిద్రిస్తాడు.

2. శాంతి పొందితేనే కదా సుఖంగా నిద్రించగలడు.

3. వీతమన్యుః – నచికేతుడు వాడిన మాటే వాడి, నువ్వు కోరినట్లే నీమీద కోపం పోతుంది.

4. మత్ర్పసృష్టః – నచికేతుడు త్వత్ర్పసృష్టం అన్నాడు. అంటే నేను వెనక్కి వెళ్ళినప్పుడు అని అర్థం. మత్ర్పసృష్టః అంటే నాచే పంపబడినప్పుడు. మృత్యుముఖాత్ – మృత్యుముఖం నుంచి, ప్రముక్తమ్ త్వామ్ దదృశివాన్ – తిరిగి వెళ్తున్న నిన్ను చూసిన వాడై అన్న పదాల ద్వారా నిన్ను ఖచ్చితంగా వెనక్కి పంపుతాను అని హామీ ఇస్తున్నాడు. నిన్ను గుర్తిస్తాడు అని కూడా చెప్తున్నాడు. నచికేతుడు వాడిన మాట ప్రతీతః వాడుతున్నాడు దానికి.

5. యథాపురస్తాత్ – నచికేతుడు యథాస్యాత్ అన్నాడు. ఎప్పటిలాగే మాట్లాడాలి అని. ముందులాగే ఆ కోరిక కూడా తీరుస్తాడు. ఆ విధంగా యమధర్మరాజు తథాస్తు అని ఒక్క ముక్కలో చెప్పకుండా నచికేతుని కోరిక ఒక్కొక్క వరాన్ని విడిగా పలికి మరీ తీరుస్తాడు. శాస్త్రంలో గొప్పదనం అదే. స్పష్టత ఉంటుంది.

మనం గుర్తించాల్సిన ఇంకో విషయం నచికేతుని తండ్రికి ఇక్కడ ఇంకో రెండు పేర్లు చూస్తాము ఉద్దాలకుడు, ఆరుణి. అంతకుముందు చూసినవి వాజశ్రవసుడు, గౌతముడు.

ఉద్దాలకుడు, ఆరుణి పేర్లు వచ్చినందుకు రెండు కథలు ఉన్నాయి. వాజశ్రవసుడు వేదాధ్యయనం చేస్తున్నప్పుడు, అతని గురువు ధౌమ్యుడు తన పొలాల్లోకి పారుతున్న నీటిని ఆపమన్నాడు. వాజశ్రవసుడు, ఆ చిల్లుకి అడ్డంగా పడుకుని పారుతున్న నీటిని ఆపాడు. అందుకని ఉద్దాలకుడు అన్న పేరు వచ్చింది. ఉద్దాలకుడు అంటే నీటిని ఆపినవాడు. రెండో కథలో అరుణ కుటుంబానికి చెందిన అమ్మాయిని ఉద్దాలకునికి ఇచ్చి పెళ్ళిచేసారు. అరుణ కుటుంబంలో పుత్రులు లేరు. అతను అరుణ కుటుంబానికి శ్రాద్ధకర్మలు చేస్తానన్న ఒప్పందం మీద పెళ్ళి చేసారు. అందుకని ఆరుణి అయ్యాడు.

## మంత్రం – 12

**స్వర్గేలోకే న భయం కిన్చనాస్తి న తత్ర త్వం న జరయా బిభేతి।**
**ఉభే తీర్త్వాఽ శనాయాపిపాసే శోకాతిగో మోదతే స్వర్గలోకే॥**

**ప్రతిపదార్థం:** స్వర్గేలోకే – స్వర్గంలో; న భయం కించన అస్తి – అసలు భయం లేదు; త్వమ్ తత్ర న – అక్కడ నువ్వు లేవు; జరయా న బిభేతి – వృద్ధాప్యం చేత భయపడరు; అశనాయా పిపాసే – ఆకలి దప్పులు; ఉభే – రెండింటినీ; తీర్త్వా – అతిక్రమించి; శోకాతిగః – శోకరహితులు; మోదతే – ఆనందిస్తారు.

**తాత్పర్యం:** స్వర్గలోకంలో అసలు భయం లేదు. మృత్యుదేవతవైన నువ్వు కూడా అక్కడ లేవు. వృద్ధాప్యం వల్ల భయపడరు. ఆకలిదప్పులు ఉండవు. అక్కడివారు శోకరహితులై ఆనందంలో మునిగి ఉంటారు.

**వివరణ:** నచికేతుడు రెండో వరాన్ని ఈ మంత్రంలోనూ, తర్వాతి మంత్రంలోనూ కోరుతున్నాడు. రెండవ వరంగా, స్వర్గఫలాన్ని ఇచ్చే యజ్ఞాన్ని చెప్పమని కోరుతున్నాడు.

మొదటివరం కుటుంబం కోసం, రెండవ వరం సంఘం కోసం అడిగాకే, మూడవ వరం తనకోసం కోరుతాడు. ఎందుకు స్వర్గసాధన యాగాన్ని కోరుతున్నాడు? నచికేతుడు దానికి సమాధానం చెప్తాడు. స్వర్గలోకం గొప్పలోకమనీ, ఊర్ధ్వలోకమనీ స్తుతిస్తాడు. అక్కడ ఏమి లేవో వివరిస్తున్నాడు. అక్కడ కొంచెం కూడా భయం లేక, అందులో ఉన్నవారు చక్కగా స్వర్గసుఖాలను అనుభవించవచ్చు. అక్కడ భయం ఎందుకు లేదు? మానవాళిని కబళించి వేసే వృద్ధాప్యం,అనారోగ్యం, ఆకలిదప్పులలాంటి శారీరక బాధలు ఉండవు. శోకం, దుఃఖం లాంటి మానసిక బాధలు ఉండవు.

ముఖ్యంగా అక్కడ – త్వం తత్ర న – అంటున్నాడు. అల్లరిగా అక్కడ నువ్వు ఉండవు కదా అంటున్నాడు. త్వం తత్ర న అంటే అసలు అర్థం కాలతత్వామైన నువ్వు ఉండవు అని. కాని శంకరాచార్యుల వారు ఆ అర్థం ఇవ్వరు. ఎందుకంటే స్వర్గలోకంలో కాలతత్వం లేదంటే అది మోక్షమే అవుతుంది. కాని అది నిజం కాదు కదా. అందుకని అక్కడ కాలతత్వం చాలా నిదానంగా ఉంటుంది. సాపేక్షికంగా భూలోకంతో పోల్చి చూస్తే లేనట్టే అనిపిస్తుంది అని తీసుకోవాలి. స్వర్గంలో శోకం లేదు సరికదా, ఆనందమే ఆనందం అంటున్నాడు. ఈ మంత్రం ద్వారా నచికేతుని నిస్వార్థగుణం ప్రస్ఫుటితమవుతోంది.

### మంత్రం – 13

**స త్వమగ్నిగ్ం స్వర్గ్యమధ్యేషి మృత్యో ప్రబ్రూహి తగ్ం శ్రద్దధానాయ మహ్యమ్।**
**స్వర్గలోకా అమృతత్వం భజన్త ఏతద్ద్వితీయేన వృణే వరేణ॥**

**ప్రతిపదార్థం:** మృత్యో – యమధర్మరాజా; స్వర్గలోకాః – స్వర్గలోకంలో జీవించేవారు; అమృతత్వం భజన్తే – అమృతత్వం పొందుతారు; స్వర్గ్యమ్ అగ్నిం – స్వర్గలోకానికి తీసుకుపోయే యజ్ఞం గురించి; సః త్వమ్ అధ్యేషి – నీకు తెలుసు; శ్రద్దధానాయ మహ్యమ్ – శ్రద్ధ కలిగిన నాకు; ప్రబ్రూహి – ఉపదేశించు; ఏతత్ – దీన్ని; ద్వితీయేన – రెండవ వరంగా; వృణే – కోరుకుంటున్నాను.

**తాత్పర్యం:** యమధర్మరాజా! స్వర్గలోకంలో జీవించేవారు అమరత్వాన్ని పొందుతారు. అక్కడకు తీసుకుపోయే యజ్ఞం గురించి నీకు తెలుసు. శ్రద్ధ కలిగిన నాకు దాన్ని ఉపదేశించు. దీనిని నేను రెండవ వరంగా కోరుకుంటున్నాను.

**వివరణ:** ఇంకా స్వర్గం గురించిన మాటలు. అక్కడ దు:ఖం నుంచి విముక్తే కాదు. అమరత్వం పొందుతారు. కాని ముండక ఉపనిషత్తులో స్వర్గలోకంలో పుణ్యఫలాన్ని అనుభవించిన తర్వాత వారు ఈ భూమ్మీదో అంతకంటే హీనమైన లోకాల్లోనో జన్మ పొందుతారు అని వస్తుంది.

**నాకస్య పృష్ఠే తే సుకృతేహోను భూత్వా ఇమం లోకం హీనతరం వా విశన్తి**

– ముండక. 1.2.10

ఇలా విభిన్న వాక్యాలు వచ్చినప్పుడు మీమాంస చేయాలి. ఇది తెలుసుకోకుండా చదవకూడదు. స్వర్గానికి వెళ్లటం కూడా కర్మఫలం వల్లనే జరుగుతుంది.

జాతస్యః హి ధృవో మృత్యుః – స్వర్గం కూడా శాశ్వతం కాదు. శాశ్వత స్వర్గం అంటూ లేదు. అందుకని శాశ్వతం అంటే సాపేక్షికంగా శాశ్వతం. భూమ్మీద కాలంతో పోలిస్తే చాలా, చాలా ఎక్కువ కాలం. పర్మనెంట్ జాబ్ అంటాము. కొన్ని యుగాలుగా ఎదురుచూస్తున్నాము అంటాము. అంటే చాలా ఎక్కువ కాలం అన్న అర్థంతో వాడతాము. అందుకని దీన్ని ఆపేక్షిక అమృతత్వం అంటారు.

ఈ మంత్రంలో అగ్నిః అన్న పదం వచ్చింది.

అగ్నికి మూడు అర్థాలు ఉన్నాయి.

1. ప్రత్యేక అగ్ని – దీన్ని ప్రత్యేక పద్ధతిలో, ప్రత్యేక మంత్రాలు చదువుతూ, ప్రత్యేక స్థానంలో వెలిగించాలి.

ఎ) ప్రత్యేక పద్ధతి – అరణి (చెక్కని) మథనం ద్వారా చేయాలి.
బి) ప్రత్యేక మంత్రాలు – వేరే వేరే అగ్నులకు వేరే వేరే మంత్రాలున్నాయి.
సి) ప్రత్యేక స్థానం – హోమ గుండం ఆకారాలు మారతాయి.

2. ప్రత్యేక యజ్ఞం – ప్రత్యేక అగ్నితో
3. ప్రత్యేక దేవత – విరాట్ దేవత లేదా వైశ్వానర దేవత ఉపాసన.

యమధర్మరాజు మూడు అర్థాలనీ వేరే వేరే సందర్భాలలో వాడతాడు. మనం జాగ్రత్తగా చూడాలి. ఇక్కడ అగ్ని అంటే విరాట్ దేవత ఉపాసన. స్వర్గానికి తీసుకువెళ్ళే ఆ యజ్ఞం నేర్పించమంటున్నాడు నచికేతుడు.

శ్రద్దధానాయ మహ్యమ్ – నాకు శ్రద్ధ ఉంది, నేర్పు అంటున్నాడు. స్వర్గం ఉంది అనుకోవటమే శ్రద్ధ, ఒక యజ్ఞం స్వర్గానికి తీసుకువెళ్తుంది అన్న భావన శ్రద్ధ. కర్మకాండ

అంతా శ్రద్ధ మీద ఆధారపడి ఉంది. అందుకని శ్రద్ధ గురించి చెప్తున్నాడు నచికేతుడు. ఈ మంత్రం ద్వారా నచికేతునికి శాస్త్రం మీద శ్రద్ధ ఉందని మనకు తేటతెల్లమవుతుంది.

ఇది రెండవ వరం అని కూడా స్పష్టం చేస్తున్నాడు నచికేతుడు.

ఈ మంత్రం ద్వారా ఉపనిషత్తుకు ఉన్న ఇంకో అర్థం వస్తుంది. ఉపనిషత్తు అంటే నిర్గుణ బ్రహ్మవిద్య లేదా సగుణ బ్రహ్మ విద్య అనవచ్చు. నిర్గుణ బ్రహ్మవిద్య అర్థం తీసుకుంటే ఉపనిషత్తు అంటే సంసారాన్ని నాశనం చేసి మోక్షాన్ని ఇచ్చేది అని అర్థం. అదే సగుణ బ్రహ్మవిద్య అర్థం తీసుకుంటే అది సంసారాన్ని బలహీనపరచి, ఉపాసకుని బ్రహ్మలోకానికి తీసుకువెళ్తుంది అని అర్థం. అమృతత్వాన్ని ఇచ్చే విరాట్ ఉపాసన గురించిన ప్రస్తావన వస్తుంది ఇక్కడ. అగ్నివిద్య అంటే విరాట్ విద్య అంటే సగుణ బ్రహ్మవిద్య. బ్రహ్మవిద్య అంటే ఉపనిషత్తు. ఇది తెలుసుకుంటే జన్మ మృత్యుజరాబాధలని తగ్గిస్తుంది.

### మంత్రం – 14

**ప్రతే బ్రవీమి తదు మే నిబోధ స్వర్గ్యమగ్నిం నచికేతః ప్రజానన్।**
**అనన్తలోకాప్తి మథో ప్రతిష్ఠాం విద్ధి త్వమేతం నిహితం గుహాయామ్॥**

**ప్రతిపదార్థం:** నచికేతః – ఓ నచికేతా; స్వర్గ్యమ్ అగ్నిం – నాకు ఆ యజ్ఞం; ప్రజానన్ – బాగా తెలుసు; తే – నీకు; ప్రబ్రవీమి – నేర్పిస్తాను; తత్ నిబోధ – నువ్వు తెలుసుకో (ఏకాగ్రతతో); అనన్తలోకాప్తిం – స్వర్గలోక సాధనం; అథో ప్రతిష్ఠాం – ఆధారం; అగ్ని – విరాట్ దేవతా; గుహాయాం నిహితం – ఆ అగ్ని హృదయంలో నివసిస్తుంది. త్వం విద్ధి – నీవు తెలుసుకో.

**తాత్పర్యం:** ఓ నచికేతా! స్వర్గానికి తీసుకువెళ్ళే యజ్ఞం గురించి నాకు బాగా తెలుసు. దానిని నీకు చెప్తాను. ఏకాగ్రతతో విను. స్వర్గానికి తీసుకువెళ్లేదీ, ప్రపంచానికి ఆధారమైనదీ అయిన ఆ అగ్ని హృదయమనే గుహలో ఉన్నది.

**వివరణ:** ముందు రెండు మంత్రాల్లో నచికేతుడు స్వర్గానికి తీసుకువెళ్ళే యజ్ఞం గురించి అడుగుతాడు. దానికి జవాబు యమధర్మరాజు చెపుతున్నాడు ఈ మంత్రంలో తత్ నిబోధ– శ్రద్ధగా వినాలని నొక్కి చెపుతున్నాడు. ఈ మంత్రంలో అగ్నికి మూడో అర్థం తీసుకోవాలి అంటే విరాట్ దేవత లేదా విశ్వరూప దేవత.

ఆ అగ్ని ప్రాశస్త్యం ఏమిటి? అది స్వర్గలోక సాధనం లేదా మార్గం. అంతేకాదు, ప్రపంచానికి ఆధారం,అలలకి సముద్రం ఆధారమయినట్టుగా. ఆ అగ్ని హృద్గుహలో అంటే

హృదయంలోఉంది? ఇక్కడ కూడా విరాట్ దేవత అర్థమే. విరాట్ దేవత సాధకుని హృదయంలో ఉంటాడు. అటువంటి అగ్నికార్యం నేర్పిస్తాను.

ఇది ఉపనిషత్తు కాబట్టి, కర్మకాండ కాదు కాబట్టి ఆ యజ్ఞం ఎలా చేయాలో వివరణ ఉండదు.

### మంత్రం - 15

**లోకాదిమగ్నిం తమువాచ తస్మై యా ఇష్టకా యావతీర్వా యథావా।**
**స చాపి తత్ప్రత్యవదద్యథోక్తమ్ అథాస్య మృత్యుః పునరేవాహ తుష్టః॥**

**ప్రతిపదార్థం:** తస్మై - అతనికి; లోకాదిమ్ - ఆదిలో ఉద్భవించిన; తం అగ్నిం - ఆ యజ్ఞాన్ని; యా ఇష్టకా - ఎటువంటి ఇటుకలు; యావతీర్వా - ఎన్ని; యథా వా - ఏ విధంగా; ఉవాచ - చెప్తాడు; సచాపితత్ ప్రత్యవదద్ - నచికేతుడు మొత్తం తిరిగి చెప్తాడు; యథోక్తం - చెప్పింది చెప్పినట్లుగా; అథాస్య తుష్టః మృత్యుః - నచికేతుని జవాబుతో సంతోషించిన యముడు; పునః ఏవ - మళ్ళీ; ఆహ - చెప్తాడు.

**తాత్పర్యం:** ఆదిలో ఉద్భవించిన ఆ యాగం గురించి యమధర్మరాజు నచికేతునికి చెప్తాడు. ఆ యాగానికి ఎటువంటి ఇటుకలు కావాలో, ఎన్ని ఇటుకలు కావాలో, ఎలా అమర్చాలో అంతా వివరిస్తాడు. నచికేతుడు యమధర్మరాజు చెప్పింది చెప్పినట్లుగా అప్పచెప్పితే, యమధర్మరాజు సంతోషించి మళ్ళీ ఇలా చెప్తాడు.

**వివరణ:** ఉపనిషత్తు చెప్తోంది, యమధర్మరాజు ఆదిలో ఉద్భవించిన యజ్ఞం గురించి బోధిస్తాడు అని. ఏ యాగానికి ఆ మంత్రాలు ప్రత్యేకంగా ఉంటాయి. ఉదాహరణకు ఆవునుంచి దూడని తోలటానికి వాడే కర్రని ఏరేటప్పుడు ఒక ప్రత్యేక మంత్రం ఉంటుంది. అలాగే ఇటుకలు ఎక్కడ్నుంచి తేవాలి, ఎలా తేవాలి, ఏ మంత్రం జపించాలి, ఇటుకలు పేరుస్తుంటే ఏదేవతకి మంత్రం జపించాలి, ఏ ఇటుకకి ఏ పేరు ఉండాలి వగైరా విషయాలు ప్రత్యేకంగా చెప్పబడుతాయి కర్మకాండలో. యజమాని ఎత్తును బట్టి, హోమగుండం ఎత్తు ఉంటుంది. హోమగుండం నుంచే జామెట్రీ వచ్చిందా అనిపిస్తుంది.

ఈ మంత్రం ద్వారా నచికేతుని మేథాశక్తి మనకు తేటతెల్లమవుతుంది. మేథాశక్తి అంటే గ్రహణ, ధారణ శక్తి. అంటే చెప్పింది గ్రహించటం, ఆ గ్రహించిన దాన్ని మనసులో ఉంచుకోవటం. నచికేతుడు 'యథోక్తం' - చెప్పింది చెప్పినట్లుగా అప్పచెప్తాడు. అతని ఫొటోగ్రాఫిక్ మైండ్‌కి ఇది నిదర్శనం. అప్పటి విద్యావిధానం కూడా మనకి తెలుస్తోంది. గురువు చెప్పినదాన్ని శిష్యుడు మళ్ళీ వల్లెవేస్తాడు.

ఇక్కడ అదనంగా మరో విషయం చెప్పుకోవాలి. విశ్వరూప దేవతని ఎలా ఆవాహనం చేయాలి? ఈ మంత్రంలో చేసి తీరాలన్న నియమం లేదు. యజ్ఞం రెండు పద్ధతుల్లో చేయవచ్చు.

1. కేవల కర్మ – ఉపాసనా రహిత కర్మ. ఇది చేస్తే కృష్ణగతి ద్వారా స్వర్గలోక ప్రాప్తి కలుగుతుంది.

2. ఉపాసనాసహిత కర్మ – ఇది ఇంకా శక్తివంతమైనది. ఇది చేస్తే శుక్లగతి ద్వారా బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతుంది. అక్కడనుంచి క్రమ ముక్తి కలుగుతుంది.

రెండు పద్ధతులకూ యజ్ఞం ఆలంబన.

లోకాదిః అనే పదానికి రెండు అర్థాలు ఉన్నాయి. రెండూ విరాట్ దేవతకూ సంబంధించినవే.

ఒకటి విరాట్ దేవత 14 లోకాలు పుట్టకముందు పుట్టాడు. రెండోది లోకాలలోని కార్యానికి కారణం విరాట్. ఇక్కడ విరాట్ అంటే అగ్ని. యమధర్మరాజు రెండు పద్ధతులు నేర్పుతాడు. నచికేతుడు శ్రద్ధగా నేర్చుకుని, అప్పచెప్పటంతో తృప్తి చెందిన యమధర్మరాజు అదనంగా ఇంకో వరం ఇస్తానని చెప్పి రెండు ఇస్తాడు. ముందు వరాలు దోషనివృత్తి కోసం ఇచ్చినవి. ఇవి తృప్తి చెంది ఇచ్చినవి.

## మంత్రం – 16

**తమబ్రవీత్ ప్రీయమాణో మహాత్మా వరం తవేహాద్య దదామి భూయః।**
**తవైవ నామ్నా భవితాఽయమగ్నిః సృఙ్కాంచేమామనేకరూపాం గృహాణ॥**

**ప్రతిపదార్థం:** ప్రీయమాణః – ప్రీతి చెందినవాడు; మహాత్మా– ఉదార స్వభావం గల; తమ బ్రవీత్ – నచికేతునితో చెప్పాడు; ఇహ అద్య – ఇక్కడ ఇప్పుడు; వరం తవ దదామి – నీకు వరమిస్తున్నాను; భూయః – మళ్ళీ; అయం అగ్ని తవ ఏవ నామ్నా భవితా – ఈ యజ్ఞం నీ పేరుతో ఉంటుంది; అనేక రూపాం – వివిధ రంగులు గల; ఇమామ్ – ఈ; సృఙ్కాచ– మాలను; గృహాణ – తీసుకో.

**తాత్పర్యం:** నచికేతుని జవాబుతో తృప్తిచెందిన మహాత్ముడు, యమధర్మరాజు అతనితో చెప్తాడు; 'నీకు ఇంకో వరం ఇస్తాను; ఈ యాగం ఇకముందు నీ పేరుతో ప్రసిద్ధమవుతుంది. ఇంకా, ఎన్నో రంగులు గల ఈ మాలను కూడా తీసుకో.'

**వివరణ:** మొదటి పాదం ఉపనిషత్తు చెప్తోంది, మహాత్ముడైన యమధర్మరాజు నచికేతునితో ఇలా చెప్తాడు. రెండవ పాదం యమః ఉవాచ. ఈ యజ్ఞానికి అంతకు ముందు పేరు లేదు. ఇప్పుడు యమధర్మరాజు దానికి నాచికేతాగ్ని అని పేరు పెట్టాడు. అతని పేరు నచికేతుడు.

అతని పేరుతో కలిగిన అగ్నికి 'నా' దీర్ఘం వచ్చి నాచికేతాగ్ని అని వస్తుంది. ఉదాహరణకు భట్టాచార్యుని మతాన్ని భాట్టమతం అంటారు.

అదికాక అనేక రూపాలు గల, అంటే వజ్ర వైడూర్యాలు ఉన్న ఖరీదైన హారం తీసి ఇస్తాడు. దాన్ని నచికేతుడు ఏం చేసాడు? ఇక్కడ చెప్పలేదు కాని రాబోయే మంత్రాల్లో యమధర్మరాజే స్వయంగా చెప్తాడు – నచికేతుడు దాన్ని తిరిగి ఇచ్చేసాడని.

ఈ మంత్రం మనకు హనుమంతుని గుర్తుచేస్తోంది. సీత ఖరీదైన కానుక ఇచ్చినా, అతనికి రామనామమే దానికన్నా ఖరీదైనది. హనుమంతుడు సీతారాములని కలిపాడు. అంటే హనుమంతుడు ఒక గురువుగా, జీవాత్మ పరమాత్మల ఐక్యం చూపించాడు.

## మంత్రం – 17

**త్రిణాచికేతస్త్రిభిరేత్య సన్ధిం త్రికర్మకృత్తరతి జన్మమృత్యూ।**
**బ్రహ్మజజ్ఞం దేవమీడ్యం విదిత్వా నిచాయ్యేమాం శాన్తిమత్యన్తమేతి॥**

**ప్రతిపదార్థం:** త్రిణాచికేతః – నాచికేత యజ్ఞాన్ని మూడుసార్లు చేసి; త్రిభిః సంధిమ్ ఏత్య – ముగ్గురితో సంబంధ బాంధవ్యాలు ఆశ్రయించి; త్రికర్మకృత్ – మూడు విధులు నిర్వర్తించి; జన్మమృత్యూ తరతి – జనన మరణాలను అతిక్రమిస్తాడు; బ్రహ్మజజ్ఞం – బ్రహ్మనుంచి పుట్టిన; ఈడ్యమ్ – అత్యంత పూజనీయమైన; దేవమ్ – భగవంతుని; విదిత్వా – తెలుసుకుని; నిచాయ్య – అనుభవించి; ఇమామ్ – ఈ; అత్యంతం శాన్తిమ్ – బ్రహ్మలోక ప్రాప్తి; ఏతి– పొందుతాడు.

**తాత్పర్యం:** నచికేత యజ్ఞాన్ని మూడుసార్లు చేసినవాడు, ముగ్గురిని ఆశ్రయించి, మూడు విధులని నిర్వర్తించినవాడు, జననమరణాలను అతిక్రమిస్తాడు. బ్రహ్మనుంచి ఉద్భవించిన వాడూ, పూజ్యనీయుడూ అయిన భగవంతుని గురించి తెలుసుకున్న అనుభూతి చెందిన వానికి బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతుంది.

**వివరణ:** 17, 18 మంత్రాలు ఉపాసనతో కూడిన కర్మఫలం గురించి చెప్తున్నాయి. కర్మ ఉపాసన సముచ్చయ ఫలం పొందటానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. దానికి జీవనశైలి, మంచి నడవడిక ముఖ్యం. ఇవి ఆయుర్వేద వైద్యునికీ, జ్యోతిష్కునికీ కూడా వర్తిస్తాయి.

**నిబంధనలు:**

1. త్రిభిః సంధిమ్ – మూడు రకాల సంబంధ బాంధవ్యాలు ఉన్నతంగా ఉండాలి. ఇప్పుడు అదే మనస్తత్వ శాస్త్రంలో కూడా చెప్తున్నారు.

ఎ. మాతృమాన్ భవతి – తల్లి వాత్సల్యం పొందాలి.
బి. పితృమాన్ భవతి – లౌకిక విషయాల్లో తండ్రి సూచనలు ఉండాలి.
సి. ఆచార్యవాన్ భవతి – పూర్వం గురుకులంలో ఉండేవారు. వీరిని శిష్యులు లేదా అంతేవాసి అంటారు. ఆచార్యుని బోధ పొందాలి.

బృహదారణ్యక ఉపనిషత్తులో నాల్గవ అధ్యాయం ప్రథమ బ్రాహ్మణంలో జనకుడు యాజ్ఞవల్క్యను తనకు బోధించమని కోరితే, ఇంతవరకూ తను తక్కిన ఋషుల నుంచి ఏం నేర్చుకున్నాడో చెప్పమంటాడు. అప్పుడు జనకుడు తాను ఆరుగురు ఆచార్యుల నుంచి నేర్చుకున్నాననీ, వాళ్లు చెప్పింది సత్యమేనని చెప్తాడు. అది సత్యమని నిరూపించటానికి వాళ్ళందరికీ తల్లి, తండ్రి, గురువూ ఉన్నారని చెప్తాడు. అందువల్ల తల్లి, తండ్రి, గురువు ఉన్నవాళ్ళకి శ్రేష్ఠమైన జ్ఞానం ఉంటుందని శంకరాచార్యుల వారు చెపుతున్నారు.

ఇంకో మూడు తీసుకుంటే – శృతి, స్మృతి, గురువుల జీవన విధానం వస్తుంది. లేదా ప్రత్యక్ష, అనుమాన, ఆగమ శాస్త్రాలు అనవచ్చు. ఈ మూడు రకాల్లో ఏ మూడు తీసుకున్నా జ్ఞానులు, ప్రకృతి, ధార్మిక విలువలు కలగలిపినట్లు అవుతుంది.

2. త్రికర్మకృత్ – 3 ప్రాథమిక కర్మలు.

ఎ. ఇజ్య – ప్రార్థన – యజ్ఞాలు.
బి. అధ్యయనం – శాస్త్ర పఠనం. చాలామంది నాకు భక్తిమార్గం చాలు, ఇది వద్దు అనుకుంటారు. అది దురదృష్టకరమైన అపోహ.
సి. దానం – తరతి జన్మమృత్యు – సంసార చక్రం దాటుతాడు.

తపః స్వాధ్యాయేశ్వర ప్రణిధానాని క్రియాయోగః – పతంజలి యోగసూత్రం.

ప్రణిధానాని అంటే కర్మఫలదాత అయిన ఈశ్వరునికి అర్పించటం.

3. త్రిణాచికేతః – నాచికేత యజ్ఞం మూడుసార్లు జీవితంలో చేయాలి.

విరాట్‌కి 3 పేర్లు –
ఎ. బ్రహ్మజజ్ఞం – సర్వజ్ఞ. బ్రహ్మ+జ – బ్రహ్మనుంచి పుట్టినవాడు – విరాట్ జ్ఞం – సర్వజ్ఞ.
బి. దేవం – దేవత
సి. ఈడ్యం – పూజనీయుడు.

కర్మసముచ్ఛయ ఫలం – బ్రహ్మలోక ప్రాప్తి, శుక్లగతి ద్వారా. తర్వాత క్రమముక్తి కలుగుతుంది. విదిత్వా – తెలుసుకుని. అంటే భగవంతుడు ఉన్నాడు, ఆయన్ని పొందటమే లక్ష్యం అని తెలుసుకోవాలి. నిచాయ– అనుభూతి చెందాలి.

ఉపాసనా సహిత నాచికేత యజ్ఞం చేసిన వ్యక్తి బ్రహ్మలోక ప్రాప్తి చెంది జన్మమృత్యువులను తప్పించుకుని, అమృతత్వం పొందుతాడు. కాని ఇది మోక్షం కాదు. ఆపేక్షిక అమృతత్వంగా తీసుకోవాలి.

### మంత్రం – 18

**త్రిణాచికేతస్త్రయమే తద్విదిత్వా య ఏవం విద్వాంశ్చినుతే నాచికేతమ్।**
**స మృత్యుపాశాన్ పురతః ప్రణోద్య శోకాతిగో మోదతే స్వర్గలోకే॥**

**ప్రతిపదార్థం:** య ఏవం త్రిణాచికేతః – ఎవరు పైన చెప్పిన యజ్ఞాన్ని ; త్రయం ఏతద్ విదిత్వా – మూడు స్పష్టంగా తెలుసుకున్నవాడు; నాచికేతం చినుతే – ఈ యజ్ఞం చేసినవాడు; విద్వాన్ – ఉపాసక; సః – అతడు; మృత్యుపాశాన్ – యమపాశాలను; పురతః ప్రణోద్య– మరణానికి ముందే జయిస్తాడు; శోకాతిగః – శోకానికి అతీతుడై; స్వర్గలోకేమోదతే – బ్రహ్మలోకంలో ఆనందిస్తాడు.

**తాత్పర్యం:** ముందు మంత్రంలో చెప్పిన మూడింటినీ తెలుసుకుని, ఎవరు నాచికేత యజ్ఞాన్ని చేస్తారో, అతను శరీరం పతనం కాకముందే మృత్యువును జయించి, శోకాలకు అతీతుడై, స్వర్గలోకంలో ఆనందిస్తాడు.

**వివరణ:** ఈ మంత్రం, అంతకు ముందు మంత్రంలో ఇచ్చిన భావాన్నే ఇంచుమించుగా మళ్ళీ చెప్తోంది. కర్మ ఉపాసన సముచ్చయ ఫలం విరాట్ ఐక్యప్రాప్తి. నాచికేత యజ్ఞం గురించిన ప్రస్తావన ఇంతటితో ముగింపుకు వస్తోందన్న సూచన ఇది అని శంకరాచార్యులవారు చెప్తున్నారు.

ఉపనిషత్తు చెప్తోంది ఈ ఫలాన్ని. మూడు విషయాలు స్పష్టంగా తెలుసుకున్న వ్యక్తికి స్వర్గలోక ప్రాప్తి, ఇక్కడ బ్రహ్మలోక ప్రాప్తి, అంటుంది. ఏమిటవి?

యా ఇష్టకా యావతీర్వా యథావాః

1. యా ఇష్టకా – ఎటువంటి ఇటుకలు
2. యావతీర్వా – ఎన్ని
3. యథావాః – ఎలా పెట్టాలి హోమగుండంలో

విద్వాన్ అంటే ఒక అర్థం ఆత్మజ్ఞాని. కాని ఇక్కడ విరాట్ ఉపాసన అని తీసుకోవాలి. అతను స్వర్గలోకేమోదతే – బ్రహ్మలోకంలో ఆనందిస్తాడు. కర్మలు చేసేవాని విషయంలో సూక్ష్మశరీరం కృష్ణగతిలో స్వర్గలోకం చేరుతుంది. ఉపాసన చేసేవాని విషయంలో సూక్ష్మశరీరం బ్రహ్మరంధ్రంలోంచి వచ్చి శుక్లగతిలో బ్రహ్మలోకం చేరుతుంది.

మరి జ్ఞాని విషయమో? జ్ఞానికి ప్రయాణం లేదు. ఇక్కడే ఇప్పుడే మోక్షం పొందుతాడు. ఉపాసకుడు కూడా అజ్ఞాని కిందకే వస్తాడు. మనుష్యలోకంలో ద్వంద్వాలు ఉన్నాయి. సుఖదుఃఖాలు, రాగద్వేషాలు ఉన్నాయి. స్వర్గంలో దుఃఖం దాదాపు లేదు. అంటే మోక్షంతో సమానం. ఈ మంత్రంలో స్వర్గలోకం అంటే బ్రహ్మలోకం.

జీవిస్తున్నప్పుడే మరణాన్ని జయించటం అంటే, జన్మరాహిత్యం పొందటం. పాపం పోయి, అజ్ఞానం తొలగి, రాగద్వేషాలకి అతీతంగా అవటం. అజ్ఞానం అంటే ఇక్కడ ఆత్మఅజ్ఞానం కాదు, ధర్మం గురించిన అజ్ఞానం. అజ్ఞానం వల్ల రాగద్వేషాలు కలుగుతాయి. అవి కర్మ చేయిస్తాయి. ఆ కర్మలు ధర్మ, అధర్మ కర్మలు అయి ఉంటాయి. వాటివల్ల పుణ్యపాపాలు కలుగుతాయి. సంసారమనే చక్రంలో పడేస్తాయి అవి. దానివల్ల జన్మమృత్యువలయం కొనసాగుతుంది. మళ్ళీ జన్మ ఎత్తితే మళ్ళీ అజ్ఞానం మొదలు. అలా మన జీవనచక్రం సాగుతుంది. వీటి నుంచి బయటపడలేము కాబట్టి యమపాశాలు చుట్టుకుంటాయి. యమపాశం ఒకటే, కాని మనం మన రాగద్వేషాల ద్వారా అనేక పాశాలను మనచుట్టూ చుట్టుకుంటాము.

సముద్రంలోని నీరు ఓడను ముంచలేదు, ఆ ఓడలోకి వస్తే గాని. అలాగే ప్రపంచంలోని ప్రతికూలత నిన్ను ముంచలేదు, నువ్వు దాన్ని లోపలికి రానిస్తే గాని.

**ఈశ్వరానుగ్రహాత్ ఏవ పుంసాం అద్వైతవాసనా.**

అద్వైత వాసనలు అంటాలంటే 'పుంసాం' – పురుషునికి (మానవులకు) ఈశ్వరానుగ్రహం ఉండాలి.

ఉపాసకుడికి బ్రహ్మలోక ప్రాప్తికి ఆటంకాలు తొలగి, శుక్లగతి తేలిగ్గా లభ్యమవుతుంది. అయినా బ్రహ్మతో లేదా విరాట్‌తో ఐక్యం శాశ్వత ఐక్యం కాదు. ఉపాసన అశాశ్వతం కాబట్టి, పుణ్యం కూడా అశాశ్వతం, ఐక్యం కూడా అశాశ్వతం. ప్రళయకాలంలో ఆ ఐక్యం కరిగిపోతుంది. కాని బ్రహ్మలోకంలో నిర్గుణ బ్రహ్మజ్ఞానం పొందగలిగితే, ఉపాసకుడు జీవన్ముక్తి, తర్వాత విదేహ ముక్తి పొందుతాడు. ఇది ఉపాసనఫలం కాదు, జ్ఞానఫలం. దీన్ని క్రమముక్తి అంటారు. ఈ మంత్రంలో త్రినాచికేత అంటే యజ్ఞం, విద్వాన్ అంటే ఉపాసక, చినుతే అంటే కర్మ అని అర్థం చేసుకోవాలి.

### మంత్రం – 19

**ఏషతేఽగ్నిర్నచికేతః స్వర్గ్యో యమవృణీథా ద్వితీయేన వరేణ।**
**ఏతమగ్నిం తవైవ ప్రవక్ష్యన్తి జనాస స్తృతీయం వరం నచికేతో వృణీష్వ॥**

**ప్రతిపదార్థం:** నచికేతః – నచికేతా; ఏషః అగ్నిః – ఈ యజ్ఞం; స్వర్గ్యః – స్వర్గప్రాప్తిసాధన, తే – నీకు; యం అవృణీథాః – నువ్వు కోరావు; ద్వితీయేన వరేణ – రెండవ వరంగా: ఏతమ్ అగ్నిమ్ – ఈ యజ్ఞాన్ని; తవైవ ప్రవక్ష్యన్తి జనాసః – నీ పేరుతో పిలుస్తారు జనులు; తృతీయం వరం వృణీష్వ – మూడోది కోరుకో.

**తాత్పర్యం:** ఓ నచికేతా! స్వర్గానికి తీసుకువెళ్ళే ఏ యాగాన్ని గురించి అడిగావో దానిని నీకు చెప్పాను. ఇకనుంచి ప్రజలు దాన్ని నీ పేరుతో పిలుస్తారు. మూడవ వరాన్ని కోరుకో.

**వివరణ:** యమధర్మరాజు చెపుతున్నాడు; 'స్వర్గలోక ప్రాప్తి కోసం నువ్వు కోరిన వరాన్ని తీర్చాను, దానికి నీ పేరు పెట్టాను. ఇప్పుడు మూడోవరం కోరుకో.' నచికేతుడు మర్చిపోయి ఉండవచ్చు కదా. ఎందుకు చెపుతున్నాడు? అతనికి ఋణపడి ఉండకూడదు. అతని జవాబుతో తృప్తిచెంది ఇంకోవరం ఇచ్చాడు. మూడోది అలాగే ఉంది.

### మంత్రం – 20

**యేయం ప్రేతే విచికిత్సా మనుష్యేఽస్తీత్యేకే నాయమస్తీతి చైకే।**
**ఏతద్విద్యా మనుశిష్టస్త్వయాఽహం వరాణామేష వరస్తృతీయః॥**

**ప్రతిపదార్థం:** ప్రేతే మనుష్యే – చనిపోయిన వ్యక్తి గురించి; విచికిత్స – ఈ సందేహాలు ఉన్నాయి; అస్తీతి ఏకే – కొంతమంది ఆత్మ ఉంది అంటున్నారు; నాయం అస్తీతి ఏకే – కొంతమంది ఆత్మలేదు అంటున్నారు; అయమ్ – ఇది; ఏతత్ – దీనిని; అహం త్వయా – నేను నీనుంచి; అనుశిష్టః – విని; విద్యామ్ – తెలుసుకుంటాను; ఏషః – ఇది; వరాణమ్ – వరాలలో, తృతీయవరః – మూడవ వరం.

**తాత్పర్యం:** మరణానంతరం శరీరం కాక ఆత్మ ఉంది అని కొందరు, లేదని కొందరు అంటున్నారు. ఈ సందేహాన్ని నిన్ను అడిగి తీర్చుకోవాలనుకుంటున్నాను. ఇదే నేను కోరే మూడవ వరం.

**వివరణ:** ఆత్మజ్ఞాన విషయం ఇక్కడ నుంచి మొదలవుతుంది. మొదటి వరం తండ్రి గురించి కోరాడు. అది ఇహలోక ఫలం. రెండవ ఫలం స్వర్గలోక ఫలం కోరాడు. అది పరలోక ఫలం. ఈ రెండు ద్వైత ప్రపంచానికి చెందినవి. ద్వైత ప్రపంచం అనాత్మ ప్రపంచానికి చెందినది. అది వేద పూర్వభాగం లేదా కర్మకాండకి చెందినది. ద్వైతాన్ని తాత్కాలికంగా

ఒప్పుకోవటాన్ని అధ్యారోపం అంటారు. అద్వైత బోధలో ఇది అతి ముఖ్యమైన మొదటి మెట్టు. తర్వాత అపవాదం కొస్తాం. అది ఆరోపించిన ద్వైత అనాత్మని ఖండించటం.

తాడును చూసి పాము అనుకుంటున్నాము. అంటే త్రాడు మీద పాముని ఆరోపిస్తున్నాము. దీన్ని రజ్జు సర్పభ్రాంతి అంటారు. ఈ భ్రాంతి వల్ల సత్యానృత మిధునీకృతం చేస్తున్నాము. కొంత సత్యాన్ని, కొంత అసత్యాన్ని కలుపుతున్నాము. అది పొడుగ్గా ఉంది, మెలికలు తిరిగి ఉంది, బుసలు కొడుతోంది అంటాము. అలాగే –

మనకి అహం అస్మి – నేను ఉన్నాను – తెలుసు.
అహం బ్రహ్మ అస్మి – నేను బ్రహ్మను – తెలియదు.

అనాత్మ అయిన దేహాన్ని ఆత్మగా భావిస్తున్నాము. అంటే అధ్యారోపణ చేస్తున్నాము. దేహమే ఆత్మ అనుకుని సంసారంలో చిక్కుకుపోతున్నాము. దాన్ని అపవాదం చేయకపోతే సంసార దుఃఖ నివృత్తి జరగదు. అపవాదం అంటే అధ్యారోపాన్ని నెగేట్ చేయటం.

కర్మకాండలో జీవాత్మ వేరు, పరమాత్మ వేరు. ఆత్మ కర్త, భోక్త. కర్మలు చేసి స్వర్గలోక ప్రాప్తి చెందుతుంది. జ్ఞానకాండలో జీవాత్మ, పరమాత్మల ఐక్యం చూస్తాము.

ఇప్పుడు మంత్రానికి వస్తే 20వ మంత్రంలో నచికేతుడు ఆత్మ విద్య గురించి అడిగాడు.

10–11 – మొదటి వరం.
12–19 – రెండవ వరం.

కొంతమంది మరణానంతరం శరీరానికి భిన్నంగా ఆత్మ వేరే ఉంది, అది ప్రయాణం చేస్తుంది అంటారు. మరికొంతమంది శరీరమే ఉంది. ఆత్మ లేదు అంటారు. ఈ సందేహాలు తీర్చు అన్నాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే – దేహ వ్యతిరిక్త తత్త్వం అస్తివా నవా?

ఈ సందేహాలు ఎందుకు వస్తున్నాయి? ఇది సైన్సుకి అందదు కాబట్టి, అపౌరుషేయ విషయం కాబట్టి, మరణానంతర జ్ఞానం లేదు కాబట్టి. ఎవరో ఆత్మ బరువెంతో చూద్దామనుకున్నారట. సరిగ్గా మనిషి చనిపోయే ముందు అతని బరువు చూసి, చనిపోయాక బరువు చూస్తే, ఆ రెండింటి మధ్య వ్యత్యాసమే ఆత్మ బరువు అనుకున్నారు. కాని చనిపోయాక బరువు, ముందుకన్నా ఎక్కువ ఉంది. అంటే ఆత్మ బరువు మైనస్‌లో ఉన్నట్టా? అంటే ఆత్మ ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలకు అందదు.

ఈ ప్రశ్నకి జవాబు చూసే ముందు, ప్రశ్నను సరిగ్గా అర్థం చేసుకోవాలి. శరీరంలో 5 అంశాలు ఉన్నాయి.

| **అంశాలు** | **మరణం తర్వాత** |
|---|---|
| 1. స్థూల శరీరం | నశిస్తుంది, కాలిపోతుంది. |
| 2. సూక్ష్మ శరీరం | సూక్ష్మ, కారణ శరీరాలు రెండూ ప్రయాణం చేస్తాయి, |
| 3. కారణ శరీరం | సూక్ష్మ, కారణ శరీరాలు వేరే శరీరాన్ని పొందుతాయి. |
| 4. ప్రతిబింబ చైతన్యం | సూక్ష్మ, కారణ శరీరాలతో ప్రయాణం చేస్తుంది. |
| 5. బింబ చైతన్యం | సర్వవ్యాపకం కనుక ప్రయాణం లేదు. |

స్థూల శరీరం, బింబచైతన్యం కాక, తక్కిన మూడూ ప్రయాణం చేస్తాయి, శాస్త్రం ప్రకారం. మనం ఎందుకు చూడలేము? అవి అగోచరం కాబట్టి. ఒక వస్తువును అగోచరం అని రెండురకాలుగా అనవచ్చు. మొదటి రకంలో అది ఉంటుంది కాని కనబడదు. కనబడకపోతే లేనట్టు కాదు. రెండో రకంలో అది ఉండదు.

సూక్ష్మ శరీరం, కారణ శరీరం, ప్రతిబింబ చైతన్యం (జీవాత్మ) – మూడూ ఉంటాయి కాని కనబడవు. బింబచైతన్యం ప్రయాణించదు, అది సర్వవ్యాపి కాబట్టి.

నచికేతుడు దేని గురించి అడుగుతున్నాడు? సూక్ష్మ శరీరం, కారణ శరీరాల గురించా? కర్మకాండ జీవాత్మ గురించా? జ్ఞాన కాండ జీవాత్మ గురించా? కర్మకాండ జీవాత్మ ప్రయాణం చేస్తుంది కాని, జ్ఞానకాండ జీవాత్మ సర్వవ్యాపకం కాబట్టి ప్రయాణం చేయదు. జ్ఞానకాండ ఆత్మ గురించి అని చెప్పటానికి 3 కారణాలున్నాయి.

1. నచికేతునికి ప్రయాణించే ఆత్మ గురించి తెలుసు. కర్మకాండలో ఆత్మ కర్త, భోక్త అనీ, అది మంచి కర్మలు చేస్తే, స్వర్గలోకానికి వెళుతుందనీ తెలుసు. స్వర్గలోకానికి తీసుకువెళ్ళే యజ్ఞం గురించి అందుకే అడిగాడు.

2. దేవైరత్రాపి విచికిత్సితం – తర్వాతి మంత్రంలో యమధర్మరాజు దేవతలకు కూడా అర్థం కాదు అని అంటాడు. దీన్ని సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ అంటారు. దేవతలకు కూడా అర్థం కానిది జ్ఞానకాండ జీవాత్మే.

3. నచికేతుడే 1-2-14లో దేని గురించి అడుగుతున్నాడో వివరణ ఇస్తాడు.

**అన్యత్ర ధర్మాద్ అన్యత్రాధర్మాత్ అన్యత్ర అస్మాత్కృతాకృతాత్।**
**అన్యత్ర భూతాచ్చ భవ్యాచ్చ యత్తత్పశ్యసి తద్వద॥**

ధర్మాధర్మ భిన్నమైనది, కార్యకారణాల నుంచి వేరైనది, కాలానికి అతీతమైనది ఏదో దాని గురించి చెప్పు అన్నాడు. శరీరం నశించాక ఏది మిగులుతుంది? అంటే ఆత్మతత్త్వం బోధించమంటున్నాడు.

అందుకని శంకరాచార్యుల వారు మొదటి రెండు వరాలూ ద్వైతం లేదా అనాత్మకి చెందినవనీ, అంటే అధ్యారోపానికి చెందినవనీ, మూడవది అద్వైత ఆత్మ అంటే అపవాదంకి చెందినదనీ అంటున్నారు. అలా అధ్యారోపం, అపవాదాలని సూచించే ఈ మూడు వరాల ద్వారా, ఉపనిషత్తు మనకు మోక్షం ఇవ్వటానికి ప్రయత్నిస్తోంది. ఎందుకంటే అధ్యారోపం అపవాదం రెండూ నేర్చుకుంటేనే ఆత్మబోధ పూర్తి అవుతుంది. మొదటి రెండు వరాల దగ్గరే ఆగిపోతే, ద్వైత ప్రపంచ ఖండన జరుగదు.

మూడవ వరంగా నచికేతుడు ఆత్మవిద్య కోరుతాడు. మనంతట మనం తెలుసుకోగలిగే విషయాన్ని గురువును అడగనక్కర లేదు. అందుకని మొదటి రెండు పాదాల్లో నచికేతుడు ఆత్మ గురించి సంశయాలు ఉన్నాయని చూపిస్తున్నాడు.

మరణానంతరం ఆత్మ ఉందా, ఉంటే దాని స్వరూపం ఏమిటి అన్నది సంశయం. వేదంలోనే వేదపూర్వభాగంలో వర్ణించిన జీవాత్మ వేరు, వేద అంతభాగంలో వర్ణించిన జీవాత్మ వేరు.

## మంత్రం – 21

**దేవైరత్రాపి విచికిత్సితం పురా న హి సువిజ్ఞేయమణురేష ధర్మః।**
**అన్యం వరం నచికేతో వృణీష్వ మా మోపరోత్సీరతి మా సృజైనమ్॥**

**ప్రతిపదార్థం:** అత్ర – ఈ విషయంలో; దేవైః – అపి – దేవతలకు కూడా; పురా – అంతకుముందు; విచికిత్సితమ్ – సందేహం ఉంది; ఏషః ధర్మః అణుః – ఈ విషయం సూక్ష్మమైనది; న హి సు విజ్ఞేయం – తేలిగ్గా అర్థం కాదు; అన్యం వరం వృణీష్వ – వేరే వరం కోరుకో; మా ఉపరోత్సీః – నన్ను బలవంతం చేయకు; ఏనం – ఈ వరాన్ని; మా – నన్ను; అతిసృజ – వదిలిపెట్టు.

**తాత్పర్యం:** నచికేతా ఈ విషయంలో దేవతలకు సైతం సందేహం ఉంది. ఇది ఎంతో సూక్ష్మమైనది. తేలిగ్గా అర్థం కాదు. వేరే వరం కోరుకో. నన్ను బలవంతం చేయకు, నన్ను వదిలిపెట్టు.

**వివరణ:** నచికేతుడు 20వ మంత్రంలో ఆత్మజ్ఞానం బోధించమని అడిగాడు. దానికి యమధర్మరాజు జవాబు చెపుతున్నాడు. యమధర్మరాజుకు గురువుగా అర్హత ఉంది. అతను శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ. కాని, నచికేతుడు సిద్ధంగా ఉన్నాడా? అధికారా? తప్పు అర్థం చేసుకుని, తప్పుగా చెప్తే, సాంప్రదాయం తప్పుగా వెళ్లిపోతుంది. కర్మలను నిష్కామంగా చేయాలి.

అతను అధికారా కాదా తెలుసుకోవటానికి యమధర్మరాజు ఎంట్రన్స్ ఎగ్జామ్ పెడుతున్నాడు. అధికారి కాకపోతే ఫలం ఉండదు. పైగా అపార్థం చేసుకోవచ్చు. అధికారి కావాలంటే సాధన చతుష్టయ సంపన్నుడై ఉండాలి. అంటే నాలుగు లక్షణాలు ఉండాలి.

1. **వివేకం** – నిత్యానిత్యవస్తు వివేకం ఉండాలి. ఆత్మ జ్ఞానమే మోక్షాన్ని ఇస్తుంది. అనాత్మ శాశ్వతం కాదు అని తెలుసుకోవాలి.

2. **వైరాగ్యం** – వివేకం నుంచి వైరాగ్యం పుడుతుంది. ద్వేషం వల్లో, ఎవరో చెప్తే బలవంతంగానో పుట్టేది వైరాగ్యం కాదు. అది ఎక్కువ కాలం నిలవదు. నిత్యానిత్య వస్తు వివేకం వల్ల కలిగిన జ్ఞానం వల్ల పుడుతుంది వైరాగ్యం.

3. **శమాది షట్కసంపత్తి** –

ఎ. శమ – మనో నిగ్రహం
బి. దమ – ఇంద్రియ నిగ్రహం
సి. ఉపరతి – స్వధర్మాన్ని తెలుసుకోవటం.
డి. తితీక్ష – స్థితప్రజ్ఞత
ఇ. శ్రద్ధ – గురుశాస్త్ర ఉపదేశం మీద నమ్మకం.
యఫ్. సమాధానం – ఏకాగ్రత

4. **ముముక్షుత్వం** – మోక్షమే కావాలనే తీవ్రకోరిక. నీటి కింద ఊపిరాడకుండా, ఉక్కిరిబిక్కిరవుతుంటే, ఎలా గిలగిలలాడతారో, అలాంటి తీవ్రత ఉండాలి.

నచికేతునికి మొదటి పరీక్ష నాలుగవ లక్షణం అయిన ముముక్షుత్వం మీద పెడుతున్నాడు. ఒక వ్యక్తికి ముముక్షుత్వం లేదా తీవ్ర జిజ్ఞాస ఉన్నట్టు ఎలా తెలుస్తుంది? అతని కోరికను నిరాశ పరచటం ద్వారా తెలుస్తుంది. ఏదైనా కోరితే నెల తర్వాత రమ్మంటే ఆ కోరికలో తీవ్రత లేకపోతే రాడు. వేదాంత బోధకు కాని, వేరే దేనికైనా కానీ వెళ్లేవాళ్లలో తీవ్రత లేకపోతే, కాస్త చినుకుపడినా మానేస్తారు.

ఏషః ధర్మః అణుః – ధర్మ అంటే మామూలుగా ధర్మం. ధర్మ–ధాతు నుంచి వచ్చింది. ధారణాత్ ఇతి ధర్మః – నైతిక విలువలు. అవి లేకపోతే సంఘం నిలవదు. కాని ఇక్కడ ధర్మ అంటే ఆత్మ. అది సృష్టి, స్థితి, లయ కారణం.

ఆత్మకు ఎందుకు అన్వయించాలి? నచికేతుడు ఆత్మ గురించి అడిగాడు కాబట్టి. ఆత్మను అణువుతో పోలుస్తారు. అణువు అసలు అర్థం చాలా చిన్నది. కాని ఆత్మ సర్వవ్యాపకం కాబట్టి చాలా పెద్దది. రెండింటికీ సమానంగా ఉన్న లక్షణం – రెండూ ఇంద్రియ అగోచరం.

న హి సువిజ్ఞేయం అంటున్నాడు. తేలిగ్గా అర్థం కాదని నిరాశపరుస్తున్నాడు. పదేళ్ళు నేర్చుకుంటున్న వాళ్ళు కూడా అంతా తెలిసింది ఒక్క ఆత్మ తప్ప, అనే ప్రమాదముంది. దీనిని సమర్థిస్తూ మొదటి పాదంలో దేవైః అపి విచికిత్సం అంటున్నాడు. అంటే దేవతలు కూడా తేలిగ్గా తెలుసుకోలేరు.

కేనోపనిషత్తు కథలో (మూడవ అధ్యాయం) దేవతలైన అగ్ని, వరుణుడు, ఇంద్రుడు కూడా ఆత్మని తెలుసుకోవటానికి ప్రయత్నించి విఫలమయ్యారని, చివరికి ఉమాదేవి వచ్చి ఇంద్రునకు బోధించిందనీ వస్తుంది. అందుకని తేలిగ్గా అర్థంకాని జ్ఞానం బోధించమని నన్ను బలవంతపెట్టొద్దు అంటాడు యమధర్మరాజు.

**ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్ ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః**
**ఆశ్చర్య వచ్చైన మన్యః శృణోతి। శృత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్॥** – గీత 2.29

గురువు దీని తత్త్వాన్ని ఆశ్చర్యకరముగా వర్ణిస్తాడు. శిష్యుడు ఆశ్చర్యకరమైన విషయంగా వింటాడు. అంతా విన్నాక కూడా అర్థం అవుతుందని చెప్పలేము.

## మంత్రం – 22

**దేవైరత్రాపి విచికిత్సితం కిల త్వం చ మృత్యో యన్న సువిజ్ఞేయమాత్థ।**
**వక్తా చాస్య త్వాదృగన్యో న లభ్యో నాన్యో వరస్తుల్య ఏతస్య కశ్చిత్॥**

**ప్రతిపదార్థం:** అత్ర– ఈ విషయంలో, దేవైః అపి – దేవతలకి కూడా; విచికిత్సితమ్ కిల – సందేహం ఉన్నది కదా; మృత్యో – యమధర్మరాజా; న సువిజ్ఞేయమ్ – సులభంగా అర్థం కాదు; త్వమ్ చ – నువ్వూ; యత్ ఆత్థ – దాని గురించి చెపుతున్నావు; త్వాదృక్ వక్తా అన్యో న లభ్యా – నీలాంటి గురువు మరొకరు దొరకరు; ఏతస్య తుల్య కశ్చిత్ – ఏదీ దీనికి సమానం కాదు; నాన్యో వరః – ఏ వరము.

**తాత్పర్యం:** ఈ విషయంలో  దేవతలకు కూడా సందేహం ఉంది కదా? యమధర్మరాజా, ఇది సులభంగా అర్థం కాదని నువ్వు చెప్తున్నావు కాని దీన్ని బోధించటానికి నీలాంటి గురువు మరొకరు దొరకరు. వేరే ఏ వరమూ దీనికి సమానం కాదు.

**వివరణ:** ఈ మంత్రం నచికేతుని జవాబు. ఇందులో అతని తెలివి తెలుస్తుంది. యమధర్మరాజు వద్దని చెప్పటానికి ఏ కారణాలు చెప్పాడో, అవే కారణాలు చెప్పి అందుకే అది నేర్చుకోవాలి అంటాడు. నువ్వు చెప్పావు కదా అందుకే అంటున్నాడు. అతను చెప్పిన కారణాలు –

1. **దేవైరత్రాపి విచికిత్సితం** – దేవతలకే తెలియకపోతే, అది ఎంతో విలువైనది అయి ఉంటుంది. అందుకే నాకు కావాలి అంటున్నాడు. మనిషి మనస్తత్వం అలాగే ఉంటుంది, ఎవరికీ లేనిది తనకి కావాలనిపిస్తుంది.

2. **న సువిజ్ఞేయం** – ఇది తేలిగ్గా అర్థం కాదు. స్వయంగా నేర్చుకునే విషయం కాదు. బాహ్యంగా సహాయం కావాలి. అంటే గురువు కావాలి. ఎవరికీ దొరకని అవకాశం నాకు దొరికింది. నాకు గురువు దొరికాడు అంటున్నాడు.

3. **తాదృక్ వక్తా అన్యోనలభ్యా** – ఆ గురువు కూడా ఎలాంటి వాడు? నీలాంటి గురువు ఎవరికీ దొరకడు. యమధర్మరాజు దేవతలలో గొప్పవాడు. పైగా అది అతనికి సంబంధించిన విషయం. అతను తప్ప ఎవరు చెప్పగలరు బాగా అంటున్నాడు.

**అన్యః ఏతస్యకశ్చిత్** – ఈ కారణాలు చెప్పి తన కోరికతో ముగిస్తున్నాడు. నువ్వు వందసార్లు అడిగినా ఇదే నా కోరిక. ఏ వరమూ దీనికి సాటిరాదు. తక్కినవన్నీ అనిత్యఫలాన్ని ఇస్తాయి.

ఈ మంత్రం ద్వారా నచికేతుడు తన పరీక్షలో బ్రహ్మాండంగా గెలిచాడు. తీవ్ర ముముక్షుత్వం ఉందని చూపించుకున్నాడు.

### మంత్రం – 23

**శతాయుషః పుత్ర పౌత్రాన్ వృణీష్వ బహూన్ పశూన్ హస్తిహిరణ్యమశ్వాన్।**
**భూమేర్మహదాయతనం వృణీష్వ స్వయం చ జీవ శరదో యావదిచ్ఛసి॥**

**ప్రతిపదార్థం:** శతాయుషః – వందేళ్ల ఆయుష్షు గల; పుత్రపౌత్రాన్ – పుత్రులు, మనుమలూ; వృణీష్వ – కోరుకో; బహూన్ పశూన్ – చాలా పశువులను; హస్తిహిరణ్యమ్ – ఏనుగులు, బంగారం; అశ్వాన్ – గుర్రాలను; భూమే – భూములు; మహత్ – విశాలమైన; ఆయతనమ్– రాజ్యాన్ని; వృణీష్వ – కోరుకో; స్వయం చ శరదః యావదిచ్ఛసి – నువ్వు కోరినన్నేళ్ళు; జీవ–జీవించు.

**తాత్పర్యం:** వందేళ్ళ ఆయుష్షు గల పుత్రులనీ, మనుమలనీ కోరుకో. అనేక పశువులనూ, ఏనుగులనూ, బంగారాన్నీ, గుర్రాలనూ కోరుకో. భూమ్మీద విశాలమైన రాజ్యాన్ని కోరుకో. నువ్వు కోరినన్నేళ్ళు జీవించు.

**వివరణ:** దీనితో కలిపి మూడు మంత్రాల్లో యమధర్మరాజు రెండో పరీక్ష పెడుతున్నాడు, నచికేతునిలో ఎంతమేరకు వైరాగ్యం ఉందో తెలుసుకోవటానికి.

ఒక వస్తువు మీద కోరిక ఎంత తీవ్రంగా ఉందో తెలుసుకోవాలనుకుంటే, దాన్ని పొందటం కోసం చేసే త్యాగం మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఎప్పట్నుంచో ఒక పుస్తకం

కొనాలని తపిస్తున్నాం అనుకోండి. తీరా అది బజార్లో దొరికినప్పుడు, దాని ఖరీదు 395 అంటారు. అంత పెట్టి కొనాలా అని వెనకాడితే తీవ్రత లేనట్టే. వేరే ఏదైనా ఖర్చు తగ్గించుకుని కొనాలనుకుంటే తీవ్రత ఉన్నట్లే.

ఇక్కడ్నుంచి యమధర్మరాజు ఎన్నో ప్రలోభాలు పెడుతున్నాడు. ముందు ఇహఫలం చూపిస్తున్నాడు. పుత్రపౌత్రాన్ వృణీష్వ – 99 శాతం దీనికి ప్రలోభం చెందుతారు. అర్థ,కామాలకి ఇది ప్రతీక. ఆ పిల్లలు నూరేళ్లు చల్లగా జీవిస్తారు. చేతికందివచ్చిన కొడుకు కళ్లముందే పోతే తల్లిదండ్రుల దు:ఖం వర్ణనాతీతం.

అనేక పశువులు, ఏనుగులు, గుర్రాలు కోరుకో. ఏనుగులని భరించటం చాలా కష్టం. అందుకని వాటికి కావాల్సిన డబ్బు (హిరణ్యం) కోరుకో. వాటికి చోటు లేదా అంటే భూమేర్మహదాయతనం వృణీష్వ – పెద్ద సామ్రాజ్యాన్ని కోరుకో. ఇవన్నీ తనివితీరా అనుభవించటానికి నీకు నువ్వు కోరినంత ఆయుష్షు ఇస్తాను. మృత్యుదేవతే స్వయంగా మాట ఇస్తున్నాడు. అంతకన్నా ఇంకేం కావాలి? ఈ శ్లోకాన్ని మనని మనం పరీక్షించుకోవటానికి తరుచూ చదువుకోవచ్చు.

**మంత్రం – 24**

**ఏతత్తుల్యం యది మన్యసే వరం వృణీష్వ విత్తం చిరజీవికాం చ।**
**మహాభూమౌ నచికేతస్త్వమేధి కామానాం త్వా కామభాజం కరోమి॥**

**ప్రతిపదార్థం:** ఏతత్ తుల్యం వరం – ఈ వరానికి సమానమైన వరం; వృణీష్వ – కోరుకో; విత్తం – ఎక్కువ సంపద; చిరజీవికాం చ – ఇంకా దీర్ఘాయుష్షు మహాభూమౌ – చక్రవర్తిగా; త్వమ్ – నువ్వు; ఏధి – ఉండు; నచికేతః – నచికేతా; త్వా– నిన్ను; కామానాం – కోరికలన్నింటిని; కామభాజం కరోమి – అనుభవించే వాడిగా చేస్తాను.

**తాత్పర్యం:** నచికేతా! దీనికి సమానమైన వరం ఏదైనా నీకు తోస్తే దాన్ని కోరుకో. సంపద, దీర్ఘాయుష్షు, భూమండలంలో చక్రవర్తిత్వం ఏదైనా కోరుకో. నిన్ను సమస్త కోరికలూ అనుభవించేటట్టు చేస్తాను.

**వివరణ:** యమధర్మరాజు మరికొన్ని ప్రలోభాలు పెడుతున్నాడు ఇందులో. నేను చెప్పినవి కాక నీకేదైనా కావాలంటే కోరుకో. మొహమాటం లేకుండా అడుగు. వాటి బదులు అనటం లేదు. మహాభూమౌ – అంతకు ముందు రాజ్యం ఇస్తానన్నాడు. ఇప్పుడు చక్రవర్తిని చేస్తానంటున్నాడు. కామానాం త్వా కామభాజం కరోమి – నీ కోరికలన్నింటినీ అనుభవించే వాడిగా చేస్తాను అంటున్నాడు.

చిన్నవయసులో డబ్బు లేదు, తీరిక లేదు. ఇప్పుడు పదవీ విరమణ అయ్యాక బాధ్యతలు తీరి చేతిలో డబ్బు ఆడుతోంది. సమయం పుష్కలంగా ఉంది కాని ఊర్లు తిరిగే ఆరోగ్యం లేదు అంటారు కొంతమంది. అలా నచికేతుడు బాధపడకుండా హామీ పత్రం జత చేస్తున్నాడు యమధర్మరాజు. అదీ ఒక షరతు మీద.

ఇక్కడ రెండు విషయాలు గమనించాలి మనము –

1. ఆత్మజ్ఞానం కావాలంటే ఇవన్నీ వదులుకోవాలి. అదే తీవ్ర జిజ్ఞాస.
2. దీన్ని బట్టి కర్మమార్గం వేరు, జ్ఞానమార్గం వేరు అని తెలుస్తోందంటున్నాడు శంకరాచార్యులు.

**మంత్రం – 25**

**యే యే కామా దుర్లభా మర్త్యలోకే సర్వాన్కామాగుశ్ఛందతః ప్రార్థయస్వ।**
**ఇమా రామాః సరథాః సతూర్యా న హీదృశా లమ్భనీయా మనుష్యైః॥**
**ఆభిర్మత్ప్రత్తాభిః పరిచారయస్వ నచికేతో మరణం మాఽనుప్రాక్షీః॥**

**ప్రతిపదార్థం:** నచికేతః – ఓ నచికేతా; కామాః – కోరిన వస్తువులు; మర్త్యలోకే యేయే దుర్లభా – మనుష్యలోకంలో అత్యంత అసాధ్యమైనవి; సర్వాన్కామాగుశ్చందతః – కోరికలన్నిటినీ కోరు, మొహమాటపడకు; ప్రార్థయస్వ – కోరుకో; ఇమారామాః – పురుషులను రంజింపజేసే అప్సరసలు; సరథాః – రథాలను సారధులతో కలిపి; సతూర్యాః – సంగీత విద్వాంసులు; ఈ దృశాః – ఇటువంటి స్త్రీలు; మనుష్యైః – మనుష్యుల చేత; న లమ్భనీయాః హి – పొందబడేవారు కారు; ఆభిర్మత్ప్రత్తాభిః – నాచే ఇవ్వబడిన వీరితో; పరిచారయస్వ – సేవలను పొందు; మరణం మా అనుప్రాక్షీః – మరణం గురించి అడగవద్దు.

**తాత్పర్యం:** నచికేతా! మానవలోకంలో తీర్చుకోవటానికి దుర్లభమైన కోరికలన్నీ మొహమాటపడకుండా తీర్చుకో. సారధులతో కూడిన రథాలను ఇస్తాను. సంగీత విద్వాంసులను ఇస్తాను. పురుషులను రంజింపజేసే అప్సరసలను ఇస్తాను. ఇటువంటి స్త్రీలు మనుష్యలోకంలో దొరకరు. వారిచేత నీకు కావాల్సిన సేవలు చేయించుకో, కాని మరణం గురించి మాత్రం అడగవద్దు.

**వివరణ:** యమధర్మరాజు పెట్టే ప్రలోభం ఇంకా కొనసాగుతోంది. మరికొన్ని కానుకలు ఇస్తానంటున్నాడు. ప్రలోభాలు రెండు రకాలు. రెండూ అర్థకామానికి చెందినవే. అయినా, ఒక రకం ఇహలోకానికి చెందినవైతే, ఇంకోరకం – పరలోకానికి చెందినవి. అవి ఇంకా ఉన్నతమైనవి. యమధర్మరాజు నచికేతుని మొహం చూస్తే, అర్థకామాలపై లేశమాత్రం ఉత్సాహం కూడా కనిపించలేదు. వినటానికి కూడా ఇష్టపడ్డట్టు లేదు. తొమ్మిదేళ్ల కుర్రాడు

కనురెప్పలు అల్లల్లాడించలేదు. ఏదైనా వస్తువు మొహమాటానికి వద్దన్నా కళ్లల్లో కోరిక కనపడుతుంది కొందరిలో. కాని నచికేతుడిలో అటువంటి ఆశ లేదు.

కామాః అంటే మామూలుగా కోరిక కాని ఇక్కడ కోరిన వస్తువులు అంటే అర్థపురుషార్థం కలుపుకోవాలి. ఇహలోక సుఖాలకి లొంగలేదని స్వర్గలోక సుఖాలను ప్రలోభ పెడుతున్నాడు. సారథులతో కూడిన రథాలను, సంగీత విద్వాంసులను, అప్సరసలను ఇస్తానంటాడు. ఇమా రామా అంటే పురుషులను రంజింపజేసే అప్సరసలు. ఈ స్త్రీలు భూలోకంలో దొరకరు. అటువంటి వాళ్ల చేత సేవ చేయిస్తాను. కాని మరణం గురించి మాత్రం అడగవద్దు.

కాని నచికేతుడు తనంతట తాను అడగలేదు సరికదా, యమధర్మరాజే స్వయంగా ఇహలోక పరలోక సుఖాలను ఇస్తానన్నా తృణపాయంగా త్యజిస్తున్నాడు. ఇక్కడితో రెండవ పరీక్ష కూడా ముగిసింది. నచికేతుని వైరాగ్యం తర్వాత మంత్రంలో చూస్తాము.

### మంత్రం – 26

**శ్వోభావా మర్త్యస్య యదన్తకైతత్ సర్వేన్ద్రియాణాం జరయన్తి తేజః**
**అపి సర్వం జీవితమల్పమేవ తవైవ వాహాస్తవ నృత్యగీతే॥**

**ప్రతిపదార్థం:** అంతక – మృత్యుదేవా; శ్వోభావా – అశాశ్వతమైనవి; మర్త్యస్య – మానవుడి; సర్వే ఇంద్రియాణాం – అన్ని ఇంద్రియాల; యత్ తేజః – వాటి శక్తిని; తత్ జరయన్తి – అవి వృధాచేస్తాయి; సర్వం జీవితమ్ అపి – జీవితం యావత్తు కూడా; అల్పం ఏవ – స్వల్పమే; తవ – నీ; వాహాః – గుర్రాలు; నృత్యగీతే – ఆటలూ పాటలూ; తవ ఏవ – నువ్వే ఉంచుకో.

**తాత్పర్యం:** మృత్యుదేవా! నువ్వు చెపుతున్న సుఖాలన్నీ అశాశ్వతాలు. అవి మనిషి ఇంద్రియాలన్నింటి శక్తినీ వృధా చేసేవే. జీవితమే చిన్నది. కనుక నువ్వు చెప్పిన గుర్రాలూ, ఆటపాటలూ నీ దగ్గరే ఉంచుకో.

**వివరణ:** 23–25 యమధర్మరాజు పెట్టిన ప్రలోభాలు. ఇందులో నచికేతుని జవాబు వస్తుంది. అనంతసాగరం మీద వాన కురిసినా అది చలించనట్టుగా, ఈ ప్రలోభాలకి లొంగలేదు నచికేతుడు.

తవైవ వాహాస్తవ నృత్యగీతే – నీ గుర్రాలూ, ఆటపాటలూ నువ్వే ఉంచుకో అంటాడు, ముక్కు మీద గుద్దినట్టుగా. కాని మనకొక సందేహం రావచ్చు. నచికేతుడు ఇహ పరలోక సుఖాలను ఎందుకు వద్దన్నాడు? తెలిసి అన్నాడా? చిన్నపిల్లవాడు కాబట్టి తెలియక అన్నాడా? ఒక చిన్న పిల్లవాడికి 500 నోటు, చాక్లెట్ చూపించి ఏది కావాలంటే చాక్లెట్ కోరుకుంటాడు. 500 నోటుతో ఇంకా బోలెడు చాక్లెట్లు కొనుక్కోగలడని తెలీదు అతనికి.

అందని ద్రాక్షపళ్లు పుల్లన అంటారు. అందని వస్తువులు వద్దని కొంత వైరాగ్యం చూపిస్తాము. అది ఎంతో కాలం నిలవదు. వివేకం వల్ల జనించిన వైరాగ్యమే నిలుస్తుంది. వివేకం అంటే నిత్యానిత్య వస్తు వివేకం. ఈ మంత్రంలో నచికేతుడు మొదటి మూడు పాదాల్లో ఎందుకు వద్దన్నాడో వివరణ ఇస్తాడు. అలా ఆ పాదాలు అతని వివేకాన్ని సూచిస్తే, నాలుగో పాదం అతని వైరాగ్యాన్ని సూచిస్తాయి.

**ఇహాముత్ర ఫలభోగ విరాగః**

అన్ని జీవరాసులకూ కర్త, భోక్త, ప్రమాత లక్షణాలు ఉంటాయి. కాని మనిషికి కర్త, ప్రమాతగా ప్రత్యేకత ఉంది. మనిషికి, ఫ్రీవిల్ ఉంది. భోక్తగానే ఎక్కువగా ఉంటే జంతు లక్షణాలు అధికమవుతాయి. కర్త,ప్రమాతా లక్షణాలను పెంపొందించుకుంటే దేవతల లక్షణాలు పెంపొందుతాయి.

ఈ సుఖాలన్నీ ఎందుకు కాదన్నాడో తనే వివరిస్తాడు. శ్వోభావా – భవ అంటే సందేహాలైన ఉనికి; శ్వః అంటే రేపు అంటే భవిష్యత్తులో ఉంటామో ఉండమో సందేహం.

స్వఃభవిష్యవః న భవిష్యవః న శక్తుం। అంటారు శంకరాచార్యులు.

**మా కురు ధనజనయౌవనగర్వం**
**హరతి నిమేషాత్కాలః సర్వమ్**
**మాయామయమిదమఖిలం**
**బుద్ధ్వా బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా** – భజగోవిందం

ఈ వస్తువుల వలన కలిగే ఆనందం శాశ్వతం కాదు. దీనికి ఎవరు కారణం? ఎంత ధైర్యమో చూడండి. సర్వస్య అంతకః – నిన్ను సర్వస్య అంతం కరోతి అంటారు, నువ్వు హరించి వేస్తావు అని యమధర్మరాజును అంటున్నాడు. వస్తువులు ఉన్నా కన్ను, చెవి, వగైరాలు పనిచేయవు.

సర్వేంద్రియాణాం జరయన్తి తేజః – ఇంద్రియాలు వాటి శక్తిని కోల్పోతాయి. అప్సరసలు కలగజేసే ఆనందం అనర్థమే. ఎందుకంటే మనిషికున్న పుణ్యం, వీర్యం, ప్రజ్ఞ, తేజస్సు, యశస్సు, ఐశ్వర్యం అన్నీ నశించిపోతాయి కాలంలో.

బ్రహ్మలోకం మాటేమిటి? అది కూడా ప్రళయకాలంలో అవ్యక్తంలోకి వెళ్లిపోతుంది. అటువంటి దాన్ని ఏ తెలివైన వ్యక్తి ఎన్నుకుంటాడు?

**మంత్రం – 27**

**న విత్తేన తర్పణీయో మనుష్యో లప్స్యామహే విత్తమద్రాక్ష్మ చేత్త్వా।**
**జీవిష్యామో యావదీశిష్యసి త్వం వరస్తు మే వరణీయః స ఏవ॥**

**ప్రతిపదార్థం:** మనుష్యః – మనిషి; విత్తేన – ధనం చేత; న తర్పణీయః – తృప్తి చెందేవాడు కాడు; త్వా అద్రాక్ష్మ చేత్ – నిన్ను చూస్తే; విత్తమ్ లప్స్యామహే – సంపదను పొందుతాం; త్వం – నువ్వు; యావత్ ఈ శిష్యసి – ఎంతవరకు పాలిస్తావో; జీవిష్యామః – జీవిస్తాం; మే వరణీయః – నాచే కోరదగిన; వరః తు స ఏవ – వరం అదే.

**తాత్పర్యం:** మనిషి ధనంతో తృప్తి చెందడు. నిన్ను దర్శిస్తే కావాల్సినంత ధనం లభించి తీరుతుంది. నువ్వు పాలించేవరకు నా ఆయుష్షుకు ఢోకా లేదు. కాబట్టి నేను కోరదగ్గ వరం అదొక్కటే.

**వివరణ:** ముందు మంత్రంలో భోగ లేదా కామ పురుషార్థం గురించి చూశాము. ఇప్పుడు అర్థ పురుషార్థ పరిమితి చూస్తాము.

నచికేతునిలో ఉన్న వివేకం ఇంకా చూస్తాము. అతను వయోవృద్ధుడు కాదు, జ్ఞానవృద్ధుడు. అతనికి కామ, అర్థ పురుషార్థాల పరిమితి తెలుసు. ఇవి తెలిస్తేనే ధర్మ, మోక్షాలకు వెళతాడు.

మనుష్యః విత్తేన న తర్పణీయః – డబ్బు ఆనందం, పూర్ణత్వం, శాంతి, భద్రత, శాశ్వతత్వాలను ఇవ్వదు. అలా ఇచ్చేటట్టయితే ధనవంతులందరూ సమానంగా, ఆనందంగా ఉండాలి. డబ్బుకూ, ఆనందానికీ కార్యకారణ సంబంధం లేదు.

అందుకని డబ్బు ఉంటే ఆనందం, లేకపోతే దుఃఖం అనుకోవటంలో అర్థం లేదు. ఆనందం మనకున్న దానిలో లేదు, మన మనసులో ఉంది.

వేదాంతం ఎక్కడా డబ్బు వద్దని చెప్పదు. ఐశ్వర్యం కోసం లక్ష్మీ పూజ చేస్తారు భక్తులు. నచికేతుడు తెలివైన వాడు. అతనికి కూడా డబ్బు కావాలని తెలుసు. కాని అది కోరి నా కోరికను వృథా చేసుకోను. మన స్నేహం వల్ల నువ్వే ఇస్తావు, నిన్ను చూసాను కాబట్టి. జీవిష్యామః యావదీశిష్యసి – నువ్వు అధికారంలో ఉన్నంతవరకూ నాకేం ఢోకా లేదు. అతని అధికార కాలం దాదాపు అనంతం. దీన్నిబట్టి యమధర్మరాజు అన్నది అతని పేరు కాదు. అది కూడా ఒక పదవే అని తెలుస్తోంది.

**మంత్రం – 28**

**అజీర్యతామమృతానాముపేత్య జీర్యన్మర్త్యః క్వధఃస్థః ప్రజానన్।**
**అభిధ్యాయన్ వర్ణరతిప్రమోదాన్ అతిదీర్ఘే జీవితే కో రమేత॥**

**ప్రతిపదార్థం:** అజీర్యతామ్ – వృద్ధాప్యం రానివారు; అమృతానామ్ – అమరులు; ఉపేత్య – పొంది; ప్రజానన్ – తెలుసుకుని; జీర్యన్ – క్షీణించే; మర్త్య – మరణించే; క్వధఃస్థః– కింద భూలోకవాసి; వర్ణ – సంగీతం; రతి – సుఖాలు; ప్రమోద – ఆనందం; అభిధ్యాయన్ – ఆలోచించి; అతి దీర్ఘే – దీర్ఘకాలమైనా; జీవితే – జీవితంలో; కః రమేత – ఎవరు ఆశపడతారు?

**తాత్పర్యం:** వార్ధక్యం లేనివారూ, అమరులూ అయిన మిమ్మల్ని పొంది నిజాన్ని తెలుసుకున్నాను. నేను జరామరణం అనే రెండు రోగాలు ఉన్న భూలోకవాసిని; ఆటపాటలు, ఆనందం ఏవీ శాశ్వతం కావని ఆలోచించి తెలుసుకుని ఎవరు ఆశపడతారు?

**వివరణ:** ఏ తెలివైన వ్యక్తి ఇటువంటి అశాశ్వతమైన వస్తువుల కోసం తపిస్తాడు? ఒక వస్తువు అశాశ్వతం అని తెలిస్తే, ఎవరు దానిని కోరుతారు, దానికన్నా ఉన్నతమైన దాన్ని (మోక్షాన్ని) కోరుతారు గాని.

జీర్యన్మర్త్యః – మనకి భీతికొల్పేవి రెండు రోగాలు – వృద్ధాప్యం, మరణం. యమధర్మరాజు వీటిలో పొంచి ఉంటాడు ఎప్పుడూ. ఎప్పుడు కబళిస్తాడో తెలియదు.

వర్ణరతి ప్రమోదాన్ అభిద్యాయన్ – వర్ణ అంటే సంగీతం, రతి అంటే సుఖాలు. ప్రమోద అంటే ఆనందం, అభిద్యాయన్ అంటే ఆలోచించి, ప్రజానన్ – తెలుసుకున్నాను. ఈ సుఖాలేవీ శాశ్వతం కావు, జరామరణం తప్పవు, అదృష్టం కొద్దీ నీ దగ్గరకు వచ్చాను.

అజీర్యతామ్, అమృతానామ్ – అమరులు అయిన మిమ్మల్ని, పొంది, తెలుసుకున్నాను. దేవతలు కూడా శాశ్వతం కాదు. యమపదవి కూడా శాశ్వతం కాదు. దీన్ని కౌముతిక న్యాయం అంటారు. కిం ఉత నుంచి వచ్చింది. బ్రహ్మలోకమే శాశ్వతం కాకపోతే, ఇంక మానవమాత్రుడిని నేనెంత?

సంసార రోగం నా సమస్య. సంసార రోగ ఔషధం జ్ఞానం. కాబట్టి నాకు ఆత్మజ్ఞానమే కావాలని నొక్కి చెప్తున్నాడు నచికేతుడు.

### మంత్రం – 29

**యస్మిన్నిదం విచికిత్సన్తి మృత్యో యత్సామ్పరాయే మహతి బ్రూహి నస్తత్।**
**యోఽయం వరో గూఢమనుప్రవిష్టో నాన్యం తస్మాన్నచికేతా వృణీతే॥**

**ప్రతిపదార్థం:** మృత్యో – యమధర్మరాజా; యస్మిన్ ఇదం విచికిత్సన్తి – దేని గురించి ఈ సందేహం ఉందో; సామ్పరాయే మహతి – పరలోక విషయంలో గొప్ప ఫలాన్నిచ్చే; యత్ – ఏది ఉందో; తత్ – దానిని; నః బ్రూహి – నాకు చెప్పు; యః వరః – ఏ వరం;

గూఢమ్ అనుప్రవిష్టః – గోప్యంగా ఉంచబడిందో; అయం – ఈ; తస్మాత్ – దానికన్నా; అన్యం నచికేతా న వృణీతే – మరో వరాన్ని నచికేతుడు కోరడు.

**తాత్పర్యం:** యమధర్మరాజా! ఏ విషయంలో ఈ సందేహం ఉందో, పరలోక విషయం గురించి దేనిని తెలుసుకుంటే గొప్ప ఫలం లభిస్తుందో, ఏ నిజం గోప్యంగా ఉందో, దానిని నేను తెలుసుకోవాలి. మరో వరాన్ని నచికేతుడు కోరడు.

నచికేతుడు ఈ వరాన్ని గట్టిగా కోరుతున్నాడు. ఇంకా మాట్లాడితే దబాయిస్తున్నాడు. ఈ మంత్రంతో తన కోరికను ముగిస్తున్నాడు. ఈ వరం ఎందుకు కోరుతున్నాడో కారణం మూడవపాదంలో వివరిస్తున్నాడు.

అయం వరః – ఈ వరం మామూలుది కాదు. ఎందుకు? గూఢం అను ప్రవిష్టః – గోప్యంగా ఉంది, తేలిగ్గా అందుబాటులో లేదు. దేవతలకి కూడా తేలిగ్గా అర్థం కాదని యమధర్మరాజే చెప్పాడు కదా. అలాంటిది తనకి అవకాశం వచ్చినప్పుడు పొందవద్దా అంటున్నాడు.

యస్మిన్ ఇదం విచికత్సన్తి – దేని గురించి అందరికీ అనుమానం ఉందో దాన్ని తనకి మంచి గురువు దొరికినప్పుడు తెలుసుకోవద్దా అంటున్నాడు.

ఆత్మ గురించి 12 దర్శనాలు ఉన్నాయి. ఆరు నాస్తిక దర్శనాలు, ఆరు ఆస్తిక దర్శనాలు ఉన్నాయి. అందువల్ల ఆత్మ గురించి అనేక నిర్వచనాలు ఉన్నాయి. ఆత్మ – శరీరం, మనసు, జడం, అణుప్రమాణం, సర్వవ్యాపకం వగైరా. ఎంతమంది మనుష్యులుంటే అన్ని ఆత్మలున్నాయని ఒక వాదన. ఇందులో ఏది నిజం?

సాంపరాయే మహతి – శరీరం మరణించాక, జీవించి ఉన్న ఆత్మ గురించి చెప్పమంటున్నాడు. అంటే ఆత్మవిద్య గురించి మూడు విషయాలు చెప్తున్నాడు నచికేతుడు. అది నిగూఢం, దాని మీద అనేక సందేహాలున్నాయి. అది దేశ కాల అతీతమైనది.

అన్యం నచికేతా న వృణీతే – దాన్ని మించి వేరే ఏదీ కోరడు నచికేతుడు అంటున్నాడు.

21–29 మంత్రాల్లో నచికేతుడు వివేకం, వైరాగ్యం తీవ్రముముక్షుత్వం చూపిస్తున్నాడు. నచికేతుడు గురించి చెప్పిన కథలో నచికేతుని ఏకాగ్రత, శ్రద్ధ, తితీక్ష తెలుస్తోంది. వీటి ద్వారా నచికేతుడు సాధన చతుష్టయ సంపన్నుడని, ఆత్మవిద్య పొందటానికి అధికారి అనీ తెలుస్తోంది.

# అధ్యాయం - 1 వల్లీ - 2

## మంత్రం - 1

**అన్యచ్ఛ్రేయోఽన్యదుతైవ ప్రేయ**
**స్తే ఉభే నానార్థే పురుషం సినీతః।**
**తయోః శ్రేయ ఆదదానస్య సాధు**
**భవతి హీయతేఽర్థాద్య ఉప్రేయో వృణీతే।।**

**ప్రతిపదార్థం:** అన్యత్ శ్రేయః – శ్రేయోమార్గం వేరే ఉంది; ఉత – మరియు; ప్రేయః అన్యత్ ఏవ – సుఖాన్ని ఇచ్చే ఇంకోటి ఉంది; తే ఉభే నానార్థే – ఈ రెండూ రెండు విభిన్న ఫలాలను ఇస్తాయి; పురుషం సినీతః – జీవిని బంధిస్తున్నాయి; తయోః – ఈ రెండింటిలో; శ్రేయః ఆదదానస్య – శ్రేయోమార్గాన్ని ఎన్నుకునేవారు; సాధుభవతి – విజయం సాధిస్తారు; యః ప్రేయో వృణీతే – ఎవరు కర్మమార్గాన్ని ఎన్నుకుంటారో; సః – అతడు; అర్థాత్ హీయతే – లక్ష్యం నుంచి పతనం చెందుతాడు.

**తాత్పర్యం:** శ్రేయోమార్గం, ప్రేయోమార్గం రెండూ రెండు విభిన్న ఫలాలను ఇస్తాయి, జీవిని బంధిస్తున్నాయి;. వాటిలో శ్రేయోమార్గాన్ని ఎన్నుకునేవారు విజయం సాధిస్తారు. ప్రేయోమార్గాన్ని ఎన్నుకునేవారు లక్ష్యం నుంచి పతనం చెందుతారు.

**వివరణ:** మొదటి వల్లీలో నచికేతుని కథలో, నచికేతుడు మూడు వరాలు కోరాడు. మూడో వరంగా ఆత్మ జ్ఞానం కోరాడు. యమధర్మరాజు పెట్టిన పరీక్షలో నచికేతుడు తాను సాధన చతుష్టయ సంపన్నుడనని నిరూపించుకున్నాడు. కాని యమధర్మరాజు ఆత్మజ్ఞాన బోధ చేసేముందు, ఆధ్యాత్మ గురుస్తుతి; విద్యార్థి స్తుతి; విద్యాస్తుతి చేస్తాడు. ఆత్మజ్ఞానం వల్ల మోక్షం కలుగుతుందని చెప్తాడు. అందువల్ల మొదటి పదమూడు మంత్రాల్లో గురువు, విద్య, మోక్షము, శిష్యుల గురించి స్తుతి ఉంటుంది. ప్రత్యేకించి నచికేతుడి మీద కూడా. నచికేతుడు అసహనం చెంది తన ప్రశ్నని 14వ మంత్రంలో మళ్ళీ వేస్తే, అసలు బోధ దాని తర్వాత మొదలవుతుంది.

ఈ మంత్రంలో మనుష్యులకు ఉన్న రెండు మార్గాలని సూచిస్తున్నాడు. వాటి పేర్లు శ్రేయోమార్గం, ప్రేయోమార్గం. ధర్మార్థ కామ పురుషార్థాలను సాధించటానికి వెళ్ళే మార్గం ప్రేయోమార్గమని, మోక్షమార్గం శ్రేయోమార్గమనీ అంటారు.

వేదాల్లో రెండు భాగాలు ఉన్నాయి. వేదపూర్వభాగం, వేద అంతభాగం. వేద పూర్వభాగం కర్మ ప్రధానం. కర్మకాండలో అనేక కాయిక, మానసిక, వాచిక కర్మలు ఉంటాయి, ధర్మార్థ కామాలు పొందటానికి.

వేద అంతభాగం జ్ఞాన ప్రధానం. దీని వల్ల మోక్షం కలుగుతుంది. వేద అంతభాగాన్ని ఉపనిషత్తులు అని కూడా అంటారు. కర్మ మార్గానికి, జ్ఞాన మార్గానికి అనేక తేడాలున్నాయి.

| **కర్మ మార్గం** | **జ్ఞాన మార్గం** |
|---|---|
| 1. అనాత్మ సుఖాన్నిస్తుంది | ఆత్మ సుఖాన్నిస్తుంది. |
| 2. బాహ్య వస్తువుల మీద దృష్టి పెడతాము | నేనేమిటి అన్నదాని మీద దృష్టి పెడతాము. |
| 3. చుట్టూ ఉన్నవాళ్ళు మారాలి అనుకుంటాము | నేను మారాలి అనుకుంటాము. |
| 4. బాహ్యముఖంగా చూస్తాము | అంతర్ముఖులం అవుతాము. |
| 5. దీన్ని ప్రేయో మార్గం, ప్రవృత్తి మార్గం అంటారు | దీన్ని శ్రేయో మార్గం, నివృత్తి మార్గం అంటారు. |
| 6. ఇది మనకి ప్రియమైనది | ఇది మనకు శ్రేయస్కరమైనది. |
| 7. కర్త, భోక్తా భావన ఉంటుంది | అకర్తా, అభోక్తా భావన ఉంటుంది. |
| 8. ఇహ, పరలోక సుఖాలనిస్తుంది | మోక్ష ఫలాన్నిస్తుంది. |

లోకేస్మిన్ త్వివిధా నిష్ఠా – మూడు మార్గాలున్నాయి మనుష్యులకు – కర్మ మార్గం, ఉపాసన మార్గం, జ్ఞాన మార్గం. మరి భక్తి మార్గం మాటేమిటి? భక్తి మార్గం విడిగా లేదు. ఈ మూడింటిలోనూ కలగలిపి  ఉంది. షోడశోపచార పూజ చేస్తే అది కాయిక భక్తి. స్తోత్రాలు చదివితే వాచిక భక్తి. విచారణ చేస్తే జ్ఞానభక్తి.

తయోః శ్రేయః ఆదదానస్య సాధు భవతి– జ్ఞానమార్గాన్ని ఎన్నుకునేవాళ్ళు వేళ్ల మీద ఉంటారు. వీరికి మేలు కలుగుతుంది.

కర్మ మార్గాన్ని ఎన్నుకునేది ఆస్తి పెంచుకోవాలని, తద్వారా శాంతిభద్రతలు పొందాలని, కాని యమధర్మరాజు ఇది సరియైన మార్గం కాదు అంటున్నాడు. అటువంటి వాడు లక్ష్యం నుంచి పతనం చెందుతారు. ఈ ప్రాపంచిక సుఖాల వెంట పరుగెత్తిన వ్యక్తికి, అంటే ప్రేయో మార్గాన్ని ఎన్నుకున్న అతనికి బుద్ధి పనిచేయదు. ప్రాపంచిక సుఖాలు తాత్కాలికం కాబట్టి అవి పొందినా శాశ్వతంగా నిలుపుకోలేదు. వాటి వెంట పరుగులు తీయటంలో ఆధ్యాత్మిక మార్గాన్ని కాలదన్నుకుంటాడు.

శ్రేయోమార్గాన్ని పరమపురుష లేదా మోక్షం అంటారు. ప్రేయోమార్గాన్ని ధర్మార్థ కామ లేదా అపరమ పురుష అంటారు. మనుష్యులకు ప్రియమైనది ప్రేయోమార్గం, కాని శ్రేయస్సు కోరేది, శ్రేయోమార్గం. ఈ రెండింటిలో ఒకటే ఎన్నుకోవాలన్న యమధర్మరాజు మాటలను ఆధారంగా తీసుకుని, శంకరాచార్యులు ఒక విషయం నిరూపిస్తున్నారు. ఈ రెండూ రెండు

భిన్న ధృవాలనీ, ఒకదానితో ఒకటి కలపలేమనీను. కర్మకాండ, ఉపాసనకాండ అయ్యాక, అక్కడే ఆగిపోకుండా జ్ఞానకాండలోకి మనిషి రావాలి. మొదటి రెండు కాండలు మనిషిని జ్ఞానమార్గానికి అధికారిని చేస్తాయి. జ్ఞానం పొందటానికి వీలుగా చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత ఏర్పరుస్తాయి.

**మంత్రం – 2**

**శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతః తౌ సమ్పరీత్య వివినక్తి ధీరః।**
**శ్రేయో హి ధీరోఽభి ప్రేయసో వృణీతే ప్రేయో మన్దో యోగక్షేమాద్వృణీతే॥**

**ప్రతిపదార్థం:** శ్రేయశ్చ ప్రేయశ్చ – శ్రేయస్సు, ప్రేయస్సు రెండూ; మనుష్యమ్ ఏత – మనుష్యులని సమీపిస్తాయి; ధీరః – వివేకి; తౌ సంపరీత్య – వాటిని లోతుగా విశ్లేషించి, వివినక్తి – ఆత్మసుఖం, అనాత్మ సుఖం మధ్య తేడా తెలుసుకుని, ప్రేయసః – ప్రేయస్సు కంటే వేరైన; శ్రేయః అభివృణీతే – జ్ఞానమార్గాన్ని ఎన్నుకుంటాడు; మన్దః – అవివేకి; ప్రేయ వృణీతే – ప్రేయస్సుని ఎన్నుకుంటాడు; యోగక్షేమాత్ – వృద్ధి, రక్షణ కోసం.

**తాత్పర్యం:** శ్రేయోమార్గం, ప్రేయో మార్గం రెండూ మనిషిని సమీపిస్తాయి. ధీరుడు వాటిని విచారణ చేసి, ప్రేయస్సు కంటే వేరైన శ్రేయోమార్గాన్ని ఎన్నుకుంటాడు. మందబుద్ధి కలవాడు శారీరక వృద్ధి, రక్షణ కోరి ప్రేయోమార్గాన్ని ఎన్నుకుంటాడు.

**వివరణ:** ఇంకా విద్యార్థి స్తుతి కొనసాగుతోంది. ఈ శ్రేయోమార్గం, ప్రేయోమార్గం అన్నవి మనిషికి మాత్రమే ఉన్నాయి. ఎందుకంటే మనిషికి ఎన్నుకునే స్వేచ్ఛ ఉంది.

**ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః॥** – గీత 6.5

ఎలా తెలుసు మనకు? జీవితంలో ఘర్షణ ఎప్పుడు వస్తుంది? ఎన్నుకునే అవకాశం ఉన్నప్పుడు. పశుపక్ష్యాదులకు ఆ ఘర్షణ లేదు. ఆవు ఏ దేశంలోనైనా శాకాహారే. పులి ఏ దేశంలోనైనా మాంసాహారే. కాని మనిషికి ఏ విషయం తీసుకున్నా అనేక రకాలు ఉన్నాయి. ఒక ఇల్లు కట్టాలంటే, దానికి పెట్టే కిటికీలే 750 రకాలు ఉన్నాయి. అందులో ఏది ఎన్నుకోవాలి? ఘర్షణ. ఎన్నుకున్నాక కూడా ఆ ఘర్షణ తీరదు. ఎన్నుకున్నది కాక రెండోది బాగుందనిపిస్తుంది.

శ్రేయస్సు, ప్రేయస్సు మనిషి ముందు స్వయంవరంలోలా నిలుచుంటాయి. ధీరుడు శ్రేయస్సుని ఎన్నుకుంటాడు. ఇక్కడ ధీరుడు అంటే బలవంతుడు కాదు, సాత్వికుడు, తెలివైన వాడు. తెలివిని పెంచి పోషించి, వివేకాన్ని వాడేవాడు; అన్ని అంగాల లాగే బుద్ధి కూడా

వాడకపోతే పనిచేయదు. ధీరుడు వివేకం ఉపయోగించి కర్మఫలంలోని పరిమితులు తెలుసుకుంటాడు. కర్మఫలంలో మూడు లోపాలు ఉన్నాయి. అవి ముందు చూసాము. ఇప్పుడు మళ్ళీ ఒకసారి చూద్దాము.

1. దుఃఖ మిశ్రితత్వం – ఏదైనా వస్తువుని పొందటానికి ఎంత అవస్థ పడాలో, దాన్ని నిలబెట్టుకోవటానికి కూడా అంతే అవస్థ పడాలి. అది ఉంటే ఒక బాధ, పోతే ఒక బాధ.

2. అతృప్తికరత్వం – ఎంత ఉన్నా తృప్తి ఉండదు. ఇంకా ఏదో కావాలనే ఉంటుంది.

3. బంధకత్వం – మనం ఇష్టపడ్డ వ్యక్తికి, లేదా వస్తువుకు బంధీలవటం. కాఫీ లేకపోతే తలనొప్పి వస్తుంది కొందరికి. మత్తుమందుకు, మాదకద్రవ్యాలకు అలాగే బానిసవుతున్నారు మరికొందరు.

ధీరః తా సంపరీత్యా – ధీరుడు వాటిని లోతుగా విశ్లేషించి, ఆనందం ఉన్నది వస్తువుల్లో కాదు, నాలో అని తెలుసుకుంటాడు.

స్వామి దయానంద సరస్వతి చెప్తారు, **'సమస్య నువ్వే. పరిష్కారం నువ్వే.'** వస్తువులో ఆనందం ఉంటే అందరికీ సమానంగా ఆనందం ఇవ్వాలి కదా. ఒకళ్ళు వంకాయ అంటే పడి చచ్చిపోతే, ఇంకోళ్ళు దాన్ని తింటే వాంతి చేసుకుంటారు. అందుకని ధీరుడు అనాత్మ సుఖం, ఆత్మానందాల మధ్య తేడా తెలుసుకుని, జ్ఞానమార్గాన్ని ఎన్నుకుంటాడు. అదే మందబుద్ధి కలవాడు, ప్రేయోమార్గాన్ని ఎన్నుకుంటాడు. యోగక్షేమాలను కోరుకుంటాడు. యోగం అంటే వృద్ధి చెందటం. క్షేమం అంటే నిలబెట్టుకోవటం. మానవ సంబంధాలన్నింటిలోకి దీర్ఘకాల అనుబంధం భార్యాభర్తలది. తల్లిదండ్రులతో, అన్నదమ్ములతో, పిల్లలతో అనుబంధం కొన్నాళ్ళే ఉంటుంది కాని జీవనసహచరితో చిరకాలం ఉంటుంది. భార్యాభర్తల అనుబంధం కన్నా శాశ్వతమైనది భగవంతునితో అనుబంధం. మీ యోగక్షేమాలను నాకు అప్పచెప్పండి నేను చూసుకుంటాను అంటున్నాడు కృష్ణభగవానుడు.

**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥** – గీత 9.22

దాని ఖరీదు ఏమిటి? పత్రం,పుష్పం,ఫలం, తోయం. డబ్బు ఇవ్వమని కోరటం లేదు. ఏదిచ్చినా నిజంగా దేవుడి మీద భారం వేసి నిశ్చింతగా ఉండగలిగితే దాని ఫలం అద్భుతం.

ఎందుకు ఎక్కువ మంది ప్రేయోమార్గాన్ని ఎన్నుకుంటారు? దీనికి శంకరాచార్యులు చక్కటి ఉపమానం ఇస్తున్నారు. ఒక పాత్రలో పాలు,నీరు కలిపి ఉంచితే, హంస తప్ప మనిషి విడదీయలేడు. అలాగే వేద పాత్రలో కూడా కర్మమార్గం, జ్ఞాన మార్గం కలిసిపోయి ఉంటాయి. అందువల్ల ఒక్కోసారి కర్మకాండ భాగంలో జ్ఞానచింతన, జ్ఞానకాండ భాగంలో

కర్మ గురించిన వర్ణనా ఉంటాయి. ఉదాహరణకు తైత్తరీయ ఉపనిషత్తులో శీక్షావల్లీలో కర్మ, ఉపాసనల గురించి ఉంటుంది. అలాగే ఛాందోగ్య, బృహదారణ్యక ఉపనిషత్తులలో కూడా ఉంది. అది ఎందుకంటే కర్మలన్నింటినీ ప్రేయో మార్గం క్రింద తీసిపారేయలేము.

కర్మయోగంలా చేసిన కర్మలు జ్ఞానమార్గానికి సంసిద్ధం చేస్తాయి కాబట్టి, అవి శ్రేయో మార్గంలోకే వస్తాయి. కామ్య కర్మలు, నిషిద్ధ కర్మలు, ప్రాయశ్చిత్త కర్మలు, స్వర్గప్రాప్తి కోసం చేసే నిత్య నైమిత్తిక కర్మలూ ప్రేయో మార్గంలోకి వస్తాయి. అదే నిత్య నైమిత్తిక కర్మలు నిష్కామంగా చేస్తే, జ్ఞానయోగ్యతా ప్రాప్తి కోసం చేస్తే, పంచమహా యజ్ఞాలు చిత్తశుద్ధి కోసం చేస్తే అవి శ్రేయోమార్గంలోకి వస్తాయి.

### మంత్రం – 3

**స త్వం ప్రియాన్ ప్రియరూపాంశ్చ కామాన్ అభిధ్యాయన్నచికేతోఽ త్యస్రాక్షీః।**
**నైతాం సృఙ్కాం విత్తమయీ మవాప్తో యస్యాం మజ్జన్తి బహవో మనుష్యాః॥**

**ప్రతిపదార్థం:** అత్యస్రాక్షీః – పరిత్యజించావు; కామాః – విషయాలు; ప్రియాన్ – ప్రియమైన వస్తువులు; ప్రియరూపాన్ చ – ఆకర్షించే వస్తువులు; నచికేతః – నచికేతా; సత్వం – నువ్వే; అభిధ్యాయన్ – బాగా ఆలోచించి తెలివిగా; నైతాం సృఙ్కాం విత్తమయీమ్ – ఖరీదైన మాల వద్దన్నావు; బహవః మనుష్యాః – అనేక మనుష్యులు; యస్యాం మజ్జన్తి – ఎందులో మునిగిపోతారో; న అవాప్తః – అది ఎన్నుకోలేదు.

**తాత్పర్యం:** నచికేతా, నువ్వే చక్కగా ఆలోచించి, సంపదలను, అందమైన స్త్రీలను వద్దనుకున్నావు. ఎందరో మనుష్యులు సంపదను లక్ష్యంగా పెట్టుకున్న మార్గాన్ని నువ్వు ఎన్నుకోలేదు.

**వివరణ:** మొదటి రెండు మంత్రాల్లో శ్రేయోమార్గం, ప్రేయో మార్గాల గురించి వస్తుంది. శ్రేయోమార్గాన్ని ఎన్నుకున్న వ్యక్తిని ధీరుడు అని, ప్రేయో మార్గాన్ని ఎన్నుకున్న వ్యక్తిని మందబుద్ధి కలవాడని అంటారు అని చూసాం. మరి నచికేతుడుని ఏమనాలి? ధీరుడు అనాలా? మందుడు అనాలా?

యమధర్మరాజు అతన్ని ధీరుడు అంటాడు. ఉత్తిపుణ్యానికి మెచ్చుకుంటే అది భట్రాజు పొగడ్త అవుతుంది. అందుకని అతనికి అర్హత ఉంది అని చెప్తాడు. అతను ఏమేమి పరిత్యజించాడు? కామాః విషయ వస్తువులు; ప్రియాన్ – ప్రియం చేకూర్చేవి అంటే భార్యా, పిల్లలు; ప్రియరూపాన్ – ఆకర్షించే వస్తువులు. ఎలా పరిత్యజించాడు? క్షణిక ప్రలోభం కూడా లేకుండా పరిత్యజించాడు, చిన్నపిల్లవాడిలాగా అజ్ఞానంతో కాదు, బాగా ఆలోచించి, స్పృహలో ఉండే వద్దనుకున్నాడు. ఇది అందని ద్రాక్షపళ్లు పుల్లన స్వభావంతో కాదు, ఇది

వివేకంతో కూడిన వైరాగ్యం. నచికేతుడే తను ఎందుకు వద్దంటున్నాడో కారణాలు చెప్పాడు అంతకు ముందు –

అపి సర్వం జీవితమల్పమేవ
తవైవ వాహా స్తవనృత్యగీతే॥ – 1.1.26

యమధర్మరాజు తనకు నేర్పిన యజ్ఞ విశేషాలు అక్షరం పొల్లుపోకుండా నచికేతుడు తిరిగి అప్పజెపితే, అతని మేధాశక్తికి మురిసిపోయి, యమధర్మరాజు మాల ఇచ్చాడు.

సృఙ్కాం చ ఇమామనేకరూపాం గృహాణా॥ – కఠ 1.1.16

అనేక వర్ణాలు కలిగిన ఈ మాలను తీసుకో అన్నాడు. కాని దాన్ని కూడా తీసుకోలేదు. ఎప్పుడో ఇవ్వబోయింది వద్దనటమే కాదు; ఇప్పుడు ఇచ్చిన మాలని కూడా తీసుకోలేదు.

'ఏతాం సృఙ్కాం న అవాప్త'. ఇటువంటి సంపద కోసం అనేక మనుష్యులు తాపత్రాయపడతారు. నచికేతునిది వివేకం నుంచి పుట్టిన వైరాగ్యం అని ఈ మంత్రం ద్వారా తెలుస్తోంది.

**మంత్రం – 4**

**దూరమేతే విపరీతే విషూచీ అవిద్యా యా చ విద్యేతి జ్ఞాతా।**
**విద్యాభీప్సినం నచికేతసం మన్యే నత్వా కామా బహవోऽలోలుపన్త॥**

**ప్రతిపదార్థం:** అవిద్యాయా విద్యా – ప్రేయోమార్గం, శ్రేయోమార్గం; ఇతిజ్ఞాతా – అని తెలియబడుతున్నాయి; ఏతే దూరమ్ – రెండూ భిన్నమైనవి; విపరీతే – పరస్పర విరుద్ధమైనవి; విషూచీ – విభిన్న మార్గాలను అనుసరించేవి; బహవః కామాః – అనేక కోరికలు; త్వా న అలోలుపన్త – నిన్ను ప్రలోభపెట్టలేవు; నచికేతసం – నచికేతుని; విద్యాం అభి ఈప్సినమ్ – భగవన్మార్గంలో ఆసక్తి గల వానిగా; మన్యే – భావిస్తాను.

**తాత్పర్యం:** శ్రేయో మార్గం, ప్రేయో మార్గం రెండూ పరస్పర విరుద్ధమైనవి. ఏ కోరికా నిన్ను ప్రలోభపెట్టలేదు. కాబట్టి నీకు భగవన్మార్గంలో ఆసక్తి ఉందని నేను భావిస్తున్నాను.

**వివరణ:** శ్రేయో మార్గం, ప్రేయో మార్గాలలో శ్రేయో మార్గం అధ్యాత్మిక చింతనను ప్రేరేపిస్తే, ప్రేయో మార్గం ప్రాపంచిక సౌఖ్యాల వెంట పరుగులు తీయిస్తుంది. ఇక్కడొక సమస్య కలుగుతుంది మనకు. రెండూ స్వయంవరంలోలా నిల్చున్నప్పుడు ఒకటే ఎందుకు ఎన్నుకోవాలి, రెండూ కోరలేమా అనుకోవచ్చు. కాని అవి రెండు భిన్నమార్గాలకి చెందినవని యమధర్మరాజు చెప్పాడు ముందు మంత్రంలో – 'తే ఉభే నానార్థే' ప్రేయోమార్గాన్ని అవిద్య అనీ, శ్రేయోమార్గాన్ని విద్య అనీ అంటారు.

ఎందుకు ప్రేయో మార్గాన్ని అవిద్య అంటారు?

1. కర్మలు అజ్ఞానజనితమైనవి. కర్మ చేయాలంటే కర్త అవాలి. కర్త అంటే శరీరంతో జత కలపాలి. అప్పుడు అనాత్మ అభిమానం కలుగుతుంది. ఇది సాంకేతిక కారణం.

2. మోక్షాన్ని సాధ్యవస్తువుగా చూస్తాము. కాని అది సిద్ధ వస్తువు. ఆ విషయం గ్రహించలేకపోవటం ఒక కారణం.

3. కర్మ ఏ లక్ష్యంతో చేస్తున్నాము? ఆనందం, శాంతి, భద్రతల కోసం. అవి బైట వస్తువుల వల్ల వస్తోంది అనే అపోహ వల్ల వాటి కోసం తాపత్రయ పడతాము.

ప్రాథమిక అపోహ – నేను అసంపూర్ణుడిని అనుకోవటం వల్ల కలుగుతోంది. మన ఆలోచనల బట్టే మన కర్మలు. మనం ఒక బంధం నుంచి ఇంకో బంధానికి, అభద్రత నుంచి మరికొంత అభద్రతకీ, బలహీనత నుంచి ఇంకొంచెం బలహీనతకీ జారుతున్నాము.

హనుమంతునికి తన శక్తి తనకి తెలియనట్టే, మన శక్తి మనకు తెలియదు. మనం బలహీనులమై ఊత కర్రను సహాయంగా తీసుకుంటున్నాము. వేదాంతం జ్ఞానమార్గంలోకి వచ్చి, ఆత్మ విచారణ చేసి, నీ ఊతకర్రని తీసివేయి, నీ కాళ్లలో బలం చేకూర్చుకో, నీ శక్తి పెంచుకో అంటోంది.

నువ్వు ఎన్ని ప్రలోభాలు పెట్టినా, శ్రేయో మార్గం నుంచి విడిపోలేదు. అంటే దారి మళ్లలేదు అని యమధర్మరాజు నచికేతుని మెచ్చుకుంటున్నాడు.

### మంత్రం – 5

**అవిద్యాయా మన్తరే వర్తమానాః స్వయం ధీరాః పణ్డితం మన్యమానాః।**
**దన్ద్రమ్యమాణాః పరియన్తి మూఢాః అన్ధేనైవ నీయమానా యథాన్ధాః॥**

**ప్రతిపదార్థం:** అవిద్యాయామన్తరే – భ్రమలో కూరుకుపోయి, వర్తమానాః – జీవించేవారు; స్వయం ధీరాః – తామే వివేకులు; పండితం మన్యమానాః – పండితులు అనుకుంటారు; దన్ద్రమ్యమాణాః – అడ్డదారిలో వెళ్లే వాళ్లు; పరియన్తి మూఢాః – ఒక శరీరంలోంచి ఇంకో శరీరంలోకి వెళ్తారు; అన్ధేనైవ నీయామానా యథాన్ధాః – గుడ్డివాడిచే దారి చూపబడే మరో గుడ్డివాడిలా.

**తాత్పర్యం:** అవిద్యలో జీవించే మందబుద్ధి గలవారు, తమను ధీరులుగా, విద్వాంసులుగా భావించి అడ్డదారిలో వెళ్తారు. గుడ్డివాడిచే దారి చూపబడే మరో గుడ్డివాడిలా జనన, మరణ వృత్తంలో పడి కొట్టుమిట్టాడుతుంటారు.

**వివరణ:** ముండకంలో ఇదే మంత్రం ఉంది, కేవలం ఒక్క పదం తేడాతో. దన్ద్రమ్య బదులు జంఘన్య ఉంది అందులో. దన్ద్రమ్య అంటే అడ్డదారిలో వెళ్లేవారు. జంఘన్య అంటే వార్ధక్యం, మరణంలో కొట్టుమిట్టాడేవారు.

**అవిద్యాయామన్తరే వర్తమానాః స్వయం ధీరాః పణ్డితం మన్యమానాః।**
**జంఘన్యమానాః పరియన్తి మూఢా అన్ధేనైవ నీయమానా యథాన్ధాః॥** – ముండక

వివేకిని స్తుతించటానికి అవివేకితో భేదం చూపిస్తున్నాడు. అవివేకి నింద ద్వారా వివేకి స్తుతి. అవివేకి అంటే నిత్యానిత్య వస్తు వివేకం లేనివాడు. భ్రమలో ఉండేవాడు. నువ్వు ఊతకర్రలు పట్టుకున్నావు. వాటిని వదిలేయమని వేదాంతి చెప్తే, ఆ వేదాంతినే వదిలేస్తాడు అవివేకి. వేదాంతం సన్యాసం బోధిస్తోందనుకుంటారు, నిజం తెలియక. ఆ ఊతకర్రలను వదిలేస్తే ఏమవుతాడు? ఇహాముత్ర ఫలభోగ విరాగః అవుతాడు. అంటే ఇహలోక, పరలోక సుఖాలను కోరడు, అవి అశాశ్వతం అని తెలుసుకుంటాడు.

నకర్మణా న ప్రజయా న ధనేన త్యాగే నైకే అమృతత్వ మానసు॥
సన్యాసి ఇంటికొచ్చినప్పుడు మెచ్చుకుంటూ చెప్పే మంత్రం ఇది.

అవిద్యాయామన్తరే వర్తమానాః – ఈ పదాలు బంధం పెంచుకున్న వాళ్లను విమర్శిస్తున్నాయి.

సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతిడుకృఞ్కరణే
మరణం సమీపించినప్పుడు ఇవేవీ వాళ్లని రక్షించవు.

యావద్విత్తోపార్జనసక్తః తావన్నిజపరివారో రక్తః।
జీవితమంతా ధనాగమన తృష్ణతోనూ పరివార రక్షణతోనూ సాగిపోయింది.

నళినీదళగత జలమతితరళం తద్వజ్జీవితమతిశయచపలమ్ – భజగోవిందమ్

తామరాకు మీద నీటిబొట్టులా ఉండాలి. అది ఎప్పుడన్నా రాలిపోవచ్చు. మన జీవితం కూడా అశాశ్వతం. ఈ విషయం వేలాది సంవత్సరాల కింద చెప్పారు. కాని మనకు తెలియదు, తెలుసుకోవటానికి ఇష్టపడము. శాస్త్రం మనకు తోడ్పడటానికి పదే పదే ముందుకు వస్తుంది. 'మే ఐ హెల్ప్ యు?' బోర్డు పట్టుకుని నిల్చుంటుంది.

స్వయం ధీరాః పండితం మన్యమానాః – వీళ్ళు తాము తెలివైన వారు అనుకుంటారు. అది తెలివితో కూడిన అహంకారం కాదు. అలాంటి వాళ్లని మూర్ఖ శిఖామణులు అంటారు. వాళ్ల పరిస్థితి ఏమిటి? వాళ్ల ప్రతి కర్మకూ ఖరీదు ఉంటుంది. దాన్నించి తప్పించుకోలేరు. భగవంతుడు మనకి విచక్షణ చూపే వివేకం ఇచ్చాడు.

అలా మనకి తగిలిన ఎదురుదెబ్బల నుంచి కర్మల వల్ల పొందిన ఫలాల వల్ల భగవంతుని పొందలేము, వైరాగ్యం చేత మాత్రమే అది సాధ్యం అని గ్రహించి వైరాగ్యం సంతరించుకోవాలి.

పరీక్ష్యలోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో
నిర్వేద మాయాత్ నాస్త్యకృతః కృతేన। – ముండక 1.2.12

కాని అడ్డదారిలో వెళ్లేవాళ్ళు ఒక బంధం నుంచి ఇంకో బంధం వైపు వెళ్తారు. ఒక గుడ్డివాడు, ఇంకో గుడ్డివాడి ఆసరా తీసుకున్నట్టు ఉంటుంది. వాళ్ళు ఒక శరీరం నుంచి ఇంకో శరీరంలోకి వెళ్తూనే ఉంటారు. అంటే జనన మరణ వృత్తంలో తిరుగుతూనే ఉంటారు. ఇక్కడే తక్కిన జ్ఞానానికీ, ఆత్మ జ్ఞానానికీ మధ్య తేడా తెలుస్తుంది.

తక్కిన జ్ఞానమంతా పదార్థ ప్రధానమైనది. వస్తువు వేరు, మనం వేరు. వాటి గురించి తెలుసుకోవటానికి 5 ప్రమాణాలున్నాయి. ప్రత్యక్షం, అనుమానం, అర్థాపత్తి, ఉపమానం, అనుపలబ్ధి. ఈ ఐదూ ప్రత్యక్షం మీద ఆధారపడిన ప్రమాణాలు. ప్రత్యక్షంగా ఇంద్రియాలతో తెలుసుకున్నదానికి తర్కం ఉపయోగించి, విశ్లేషణ చేసి కనుక్కున్నది విజ్ఞాన శాస్త్రం. ఉదాహరణకు ఆపిల్‌పండు కిందపడటం చూసాక, న్యూటన్ విశ్లేషణ చేసి, భూమ్యాకర్షణ శక్తిని కనుగొన్నాడు.

ఆత్మజ్ఞానం అపౌరుషేయ జ్ఞానం. అది ఆత్మ అంటే సాధకునికి సంబంధించిన జ్ఞానం. ప్రపంచంలోని అందాలన్నీ చూసే కన్ను తన అందాన్ని తాను చూసుకోలేదు. దానికి అద్దం కావాలి. అలాగే ప్రపంచమంతా చూసి, అర్థం చేసుకోగలిగే సాధకుడు తనను తాను అర్థం చేసుకోలేడు. దానికి శాస్త్రమనే ప్రమాణం కావాలి. దేనికే ప్రమాణం కావాలో అదే వాడాలి. ఉదాహరణకు, 'నా కంటి కన్నా నా చెవులు బాగా పనిచేస్తాయి. నేను గులాబీ అందాన్ని చెవులతో వింటాను,' అనలేము. అలాగే, బెంజ్‌కార్ ఎంత గొప్పదైనా అది నీళ్లలో వెళ్లదు. అందుకని ఆత్మజ్ఞానం పొందాలంటే దీనికి ప్రమాణం వేదాంతమే.

### మంత్రం – 6

**న సామ్పరాయః ప్రతిభాతి బాలం ప్రమాద్యన్తం విత్తమోహేన మూఢమ్।**
**అయం లోకో నాస్తి పర ఇతి మానీ పునః పునర్వశమాపద్యతే మే॥**

**ప్రతిపదార్థం:** ప్రమాద్యన్తం – అడ్డదారిలో వెళ్ళే; విత్త మోహేన మూఢమ్ – ధన ఆశ చేత తెలివి కోల్పోయిన వ్యక్తి; బాలం – మానసిక పరిపక్వత చెందని; సామ్పరాయః న ప్రతిభాతి– పరలోక నిజాలు తెలుసుకోలేరు; అయం లోకోనాస్తి పర ఇతిమానీ – ఈ లోకమే సర్వం వేరే లేదు అని భావిస్తాడు; పునః పునః – మళ్లీ మళ్లీ; మే వశమ్ ఆపద్యతే – నన్ను పొందుతాడు.

**తాత్పర్యం:** అడ్డదారిలో వెళ్లే వాళ్ళు ధనాశచే తెలివి కోల్పోయి పరలోక నిజాలు తెలుసుకోలేరు. అందువల్ల మళ్ళీ మళ్ళీ నా వశం అవుతూ ఉంటారు.

**వివరణ:** 'బాలం' అంటే వీళ్లకు వయసు పెరిగినా వివేకం లేదు, నేర్చుకోలేరు. ప్రమాద్యన్తం– జీవితం విలువ తెలియకపోవటం వల్ల కలిగే నష్టం అనంతం.

**బాలస్తావత్క్రీడాసక్తః తరుణస్తావత్తరుణీసక్తః**
**వృద్ధస్తావచ్చిన్తా సక్తః పరమే బ్రహ్మణి కోఽపి న సక్తః** – భజ గోవిందం

బాల్యంలో పరిపక్వత లేదు, వృద్ధాప్యంలో ఓపిక లేదు. మిగిలింది మధ్యలో కొన్నాళ్ళే. అప్పుడు కూడా నిర్లక్ష్యం చేస్తే నష్టం కలుగుతుంది. ఈ నిర్లక్ష్యం ఎందుకు? విత్తమోహేన మూఢమ్ – ధనాగమన తృష్ణవల్ల అర్థకామాల వెంట పరుగులు తీస్తారు. ఎందుకు పరుగులు తీస్తున్నారో ఆలోచించే తీరిక లేదు. కంప్యూటర్ల పుణ్యమాని కొత్తగా వర్క్ ఫ్రమ్ హోమ్ వచ్చింది. రోజంతా పని! పని! అందువల్ల ఏమవుతుంది?

అయం లోకో నాస్తి పర ఇతి మానీ – ఈ లోకమే సమస్తం, వేరే లేదు అనుకుంటారు. భవిష్యత్తు గురించి ఆలోచన కాని, పుణ్య పాప చింతన గానీ లేదు. ఇంక మోక్ష చింతన అసలే లేదు. ఉన్నదల్లా అర్థకామాలు మాత్రమే. నాస్తిపర – పరలోకం లేదు.

ఇది చారువాక సిద్ధాంతం

యావత్ జీవేత్, సుఖం జీవేత్
ఋణం ఘృత్వా, ఘృతం పిబేత్
భస్మీభూతస్య దేహః పునరాగమనం కుతః?

జీవితమంతా అనుభవించు, అప్పు చేసైనా నెయ్యి తిను. అంటే తిండి మీద ధారాళంగా ఖర్చు చెయ్యి, అంటే ఐహిక సుఖాల మీద. అప్పెలా తీరుస్తాం? అది ఇచ్చిన వాడి బాధ, మన బాధ కాదు. నరకం లోకి పోతామేమో అంటే, శరీరం భస్మమయ్యాక, మళ్ళీ ఎలా వస్తాము? సూక్ష్మ, కారణ శరీరాల మాటేమిటి అంటే శాస్త్రం చెప్తోంది కాని నేను నమ్మను అంటారు వీళ్లు. చారువాక అనే శిష్యుడికి గురువు బృహస్పతి బోధించాడు దీన్ని. ఇది నిజంగా మనను చేయమని కాదు, ఇది రాక్షసులను నాశనం చేయటానికి చెప్పాడు. ఈ సిద్ధాంతం ప్రకారం పుణ్యం, పాపం, ధర్మం, అధర్మం, పునరపి జననం, పునరపి మరణం నమ్మరు.

న సాంపరాయః ప్రతిభాతి – వైదిక జీవన విధానం పాటిస్తే అది కనబడే ఫలితాన్ని ఇవ్వదు. అందుకని అవివేకులకు నచ్చదు. వీళ్లు అర్థకామాలను పొందటానికి విలువలను

కూడా త్యాగం చేస్తారు. దీనికి శిక్ష ఏమిటి? వృద్ధాప్యం శాపంగా మిగులుతుంది. పునః పునః మే వశమ్ ఆపద్యతే – మళ్ళీ మళ్లీ నన్ను పొందుతారు అంటున్నాడు యమధర్మరాజు. అంటే పునరపి జననం, పునరపి మరణం పొందుతారు.

**మంత్రం – 7**

**శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః శృణ్వన్తోఽపి బహవో యం న విద్యుః।**
**ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధాఽఽశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః॥**

**ప్రతిపదార్థం:** యః – దేనిని; బహుభిః శ్రవణాయ అపి – అనేకుల చేత వినటానికి కూడా; న లభ్యః – సాధ్యపడదో; శృణ్వన్తః అపి – విన్నప్పటికీ; బహవః యం న విద్యుః – చాలా మంది దేనిని తెలియజాలరో; అస్య – దీనిని; వక్తా ఆశ్చర్యః – గురువూ ఆశ్చర్యంగా; లబ్ధా– పొందినవాడు; కుశలః – చాతుర్యం గలవాడు; కుశలానుశిష్టః – సమర్థుడైన వ్యక్తిని అనుసరించి; జ్ఞాతా – తెలుసుకున్నవాడు; ఆశ్చర్యః– అద్భుతం.

**తాత్పర్యం:** దేనిని అనేకమంది వినలేరో, విన్నప్పటికీ దేనిని అర్థం చేసుకోలేరో, ఆ ఆత్మను గురించి బోధించేవ్యక్తీ అరుదు, వినేవ్యక్తీ అరుదు. అటువంటి అరుదైన ఉపదేశాలను పొంది, దాన్ని తెలుసుకున్న వ్యక్తి కూడా అరుదే.

**వివరణ:** ఇంతవరకూ శిష్యస్తుతి అయింది. ఇప్పుడు విద్యాస్తుతి. అరుదైన వాటిలో అరుదైనది వేదాంత శ్రవణం. ఎందుకు? చాలా చాలా తక్కువమంది ఇష్టపడతారు. 80% మనుష్యులు అర్థకామాల వెంట పరుగులు తీస్తారు.

**ఇష్టాపూర్తం మన్యమానా వరిష్ఠం నాన్యచ్ఛ్రేయో వేదయన్తే ప్రమూఢాః।**

– ముండక 1.2.10

ఇష్టం అంటే యాగాలు, పూర్తం అంటే చెరువులు తవ్వించటం లాంటి సంఘసేవలు. సత్కర్మలే సమస్తం అనుకుంటారు.

తక్కిన 20% మాత్రం ధర్మం కూడా స్వర్గానికి తీసుకువెళ్తుంది కాని మోక్షం ఇవ్వదు అని గ్రహిస్తారు. 5–10% మనుష్యులే మోక్షం గురించి ప్రాకులాడతారు. అక్కడితో అవలేదు వాళ్ల సమస్య. అనేక దశలు దాటుకుంటూ రావాలి వాళ్ళు.

మొదటిదశ – మోక్షఇచ్ఛ :– మొదటి దశలో మోక్ష ఇచ్ఛ కలుగుతుంది.కాని ఏం చేయాలో తెలీక, చీకట్లో తడుముకుంటారు. ఎందరో ఎన్నో సూచిస్తారు. భక్తిమార్గం, కర్మమార్గం, కుండలినీ ధ్యానం, యోగాసనం, సంగీతమార్గం, ధ్యానం, నామజపం వగైరా. వీటిలో ఏది

సరియైనదో తేలక అక్కడే కొట్టుమిట్టాడుతుంటారు కొందరు. కొంతమంది మాత్రం రెండోదశకి చేరుకుంటారు.

రెండోదశ – జ్ఞానఇచ్ఛ – సమస్య ఏమిటో తెలిసింది. అంటే సగం నయం అయినట్టే. అనారోగ్య విషయంలో రోగకారణం పట్టుకోవటం కష్టం. అది తెలిస్తే వైద్యం తేలిక. ఇప్పుడు జ్ఞానం పొందాలని తెలిసింది. జ్ఞానం వల్ల మోక్షం కలుగుతుందని తెలిసింది. కాని సమస్య అలానే ఉంది. జ్ఞానం పొందటం ఎలా? మళ్ళీ అనేక సూచనలు –

కర్మ చేస్తూంటే జ్ఞానం కలుగుతుంది. ధ్యానంలో కలిగే నిశ్శబ్దం వల్ల జ్ఞానం కలుగుతుంది. జ్ఞానిని చూస్తే, జ్ఞానిని ముట్టుకుంటే జ్ఞానం కలుగుతుంది. ఇవన్నీ కాదు, శాస్త్ర ప్రమాణం మాత్రమే మోక్ష మార్గం అని తెలుసుకోగలగాలి.

మూడోదశ – శాస్త్ర విచార ఇచ్ఛ – శాస్త్రం అధ్యయనం చేస్తే మోక్షం కలుగుతుంది. కాని మళ్ళీ ఇంకో సమస్య. స్వయంగా శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే మరింత అయోమయంలో పడతాము. అర్థం కాకపోయినా ఫర్వాలేదు కాని, అపార్థం చేసుకుంటేనే కష్టం. మనకు అందుబాటులో ఉన్న ఐదు ప్రమాణాలు పనికిరావు. శాస్త్రం అపౌరుషేయం కాబట్టి, గురుశాస్త్ర ఉపదేశం ఉండితీరాలి.

నాలుగో దశ – గురు ఉపదేశ శ్రవణ ఇచ్ఛ – సమర్థమైన గురువు బోధ వినటానికి సిద్ధపడాలి. ఈ దశకు 2% చేరుకుంటారంతే. ఇప్పుడు ఒకసారి ఈ దశలను మళ్ళీ చూస్తే–

మోక్ష ఇచ్ఛ – జ్ఞాన ఇచ్ఛ– శాస్త్ర ఇచ్ఛ – గురు ఉపదేశ శ్రవణ ఇచ్ఛ.

మోక్ష ఇచ్ఛకి వచ్చేసరికి అది 5 శాతంకి పడిపోయి గురు ఉపదేశ శ్రవణ ఇచ్ఛకి 2 శాతం మిగిలితే గొప్ప. వాళ్ళు శ్రవణం వల్లే వేదాంతం నేర్చుకోవాలని తెలుసుకుంటారు.

**ఆత్మావాన్ అరే మైత్రేయీ దృష్టవ్యః శ్రోతవ్యః మంతవ్యః నిధిధ్యాసితవ్యః** – బృహదారణ్యకం

ఇప్పుడు బ్రహ్మనిష్ట అయిన గురువు దొరకాలి.

ఇప్పుడు ఈ మంత్రంలోకి వస్తే – శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః – వినటానికి ఎందరికో అవకాశం దొరకదు. శృణ్వన్తోహో పి బహవో యం న విద్యుః – అవకాశం ఉండి విన్నా అర్థం కాదు. అలాంటి వాళ్లను ప్రసంగం అయ్యాక ఏం చెప్పారు అంటే అబ్బో, చాలా బాగా చెప్పారు, కాని ఏం చెప్పారో నాకు తెలీదు అంటారు.

బహవం న విద్యుః – కొంతమంది అర్థం చేసుకోకుండా ఉండటానికి ప్రయత్నిస్తారు. అందుకని ఎక్కడ విద్య విజయం పొందిందో, అక్కడ ఇద్దరూ గొప్పే. అర్థం కానిది అర్థం చేసుకున్నాడు విద్యార్థి. చెప్పలేనిది బాగా చెప్పగలిగాడు గురువు.

యత్ తద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్
అచక్షుః శ్రోత్రం తదపాణి పాదమ్। – ముండక 1.1.6

ఆత్మను చూడలేము. అర్థం చేసుకోలేము, ఆత్మకు ఉత్పత్తి లేదు,రంగు లేదు, కళ్ళు, చెవులు, చేతులు, కాళ్లు లేవు. అటువంటి ఆత్మను అర్థం చేయించాలి గురువు. త్రీ-డి సినిమాకి ప్రత్యేకమైన కళ్లజోడు ఇచ్చినట్టుగా వేదశాస్త్రానికి గురువు ప్రత్యేకమైన కళ్లజోడు ఇస్తాడు.

ఇన్నాళ్ళు మనం నేర్చుకున్న పద్ధతిని డైకాటమీ అంటారు. అంటే సాధకుడు వేరూ, జ్ఞానవస్తువు వేరు. బదరీనాథ్ గురించి వింటే దాన్ని ఊహించుకుంటాము. వెళ్లి చూడాలనుకుంటాము. ఇక్కడ బదరీనాథ్ వేరు, మనం వేరు. అలాగే జగత్కారణం బ్రహ్మ సర్వజ్ఞుడు, సర్వవ్యాపి - లాంటి వర్ణన వింటే చుట్టూ చూసి. నాకు బ్రహ్మ గురించి తెలిసింది, వర్ణన విన్నాను, ముఖాముఖి కలవాలి, ధ్యానంలో కలుస్తారా అనకూడదు.

బ్రహ్మ అనుభవం అనేది వచ్చి, వెళ్లేది కాదు. అది ఒక సంఘటనో, ఒక అనుభవమో కాదు. అన్ని సంఘటనలూ, అనుభవాలూ, బ్రహ్మలోనే భాసిస్తాయి. బ్రహ్మ స్వయంప్రకాశక చైతన్యం. బ్రహ్మ అగ్రాహ్యం, అగోత్రం.

ఇది ఒప్పుకోవటానికి చాలా సూక్ష్మమైన బుద్ధి కావాలి. ఆ బుద్ధి సుబ్రహ్మణ్య స్వామి బల్లెంలా పదునుగా, విశాలంగా, లోతుగా ఉండాలి. దానితో సంసారమనే అసురుడిని నాశనం చేయాలి.

**మనసస్తు పరాబుద్ధిః బుద్ధేరాత్మా మహాన్పరః ॥** – కఠ 1.3.10

శాస్త్రజ్ఞుని మనసు కూడా పదునుగానే ఉంటుంది. అతను రెండు వస్తువులను విడదీసి చూస్తాడు. కాని అద్వైత వేదాంతం నేర్చుకునే వ్యక్తి, బాహ్యంగా వెతికే అలవాటును వీడాలి. అందుకే విద్యార్థి అరుదు అంటున్నారు. అతన్ని అలా అరుదైన వ్యక్తిగా తీర్చిదిద్దాలి గురువు. గురువు విద్యార్థికి ఈ క్రింది విషయాలు చెప్తూనే ఉండాలి.

- ఇది ఒక లీలాభూయిష్టమైన అనుభవం కాదు.
- ఇది బాహ్యంగా దొరికే అసాధారణ వస్తువు అనుకుని వెతకవద్దు.
- ధ్యానం చేసేది ఆత్మ అనుభవం పొందటానికి కాదు నేనే ఆత్మ అన్న నిష్ఠలో ఉండటానికి.
- అది సాధ్యవస్తువు కాదు, సిద్ధ వస్తువు.
- **ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్.**
  **అనుభవిస్తున్న నేనే ఎప్పటికీ అది, అనుభవించబడే వస్తువు ఎన్నటికీ కాదు.**

అందుకని యమధర్మరాజు అంటున్నాడు. – వక్తా ఆశ్చర్య – గురువు ఆశ్చర్యంగా చూస్తాడు. కుశలోస్య లబ్ధా ఆశ్చర్యః – పొందిన వ్యక్తి కూడా ఆశ్చర్యంగా చూస్తాడు. మళ్ళీ పొందిన అన్న పదం వాడినందుకు యమధర్మరాజు ఆందోళన చెందుతున్నాడు. చివర్లో ప్రసాదం పంచినట్టు ఆత్మని పంచుతాడా అని ఎదురుచూడకూడదు. ఆత్మను పొందటం అంటే ఆత్మను తెలుసుకోవడం. ఆత్మజ్ఞానేన ఏవ ఆత్మప్రాప్తిః. ఆత్మని తెలుసుకోవడం వేరు, ఆత్మని పొందటం వేరు కాదు.

తత్ త్వం అసి – నువ్వే ఆ ఆత్మవు అని గురువు చెప్తే అహం బ్రహ్మఅస్మి – నేనే ఆ ఆత్మను అని శిష్యుడు గ్రహించాలి. కుశలానుశిష్టః అంటే సమర్థుడైన గురువు దగ్గర తెలుసుకున్న శిష్యుడు ఆశ్చర్యోజ్ఞాతా – ఆశ్చర్యంగా చూస్తాడు. ఇదే భావాన్ని భగవద్గీతలో చూస్తాము.

**ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్ ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః।**
**ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్॥** – గీత 2.29

**మంత్రం – 8**

**న నరేణావరేణ ప్రోక్త ఏష సువిజ్ఞేయో బహుధా చిన్త్యమానః।**
**అనన్యప్రోక్తే గతిరత్ర నాస్తి అణీయాన్హ్యతర్క్యమణుప్రమాణాత్॥**

**ప్రతిపదార్థం:** అణు ప్రమాణాత్ అణీయాన్ – సూక్ష్మం కన్నా సూక్ష్మమైనది; అతర్క్యం – తర్కానికి అందనిది; బహుధా చిన్త్యమానః – అనేక విధాల భావించబడుతుంది; న హి సువిజ్ఞేయః – చక్కగా గ్రహింపబడదు; అవరేణ నరేణ – అల్పజ్ఞానంకల మానవుడిచే; ప్రోక్తః – బోధింపబడిన పక్షంలో; ఏషః – ఈ ఆత్మ; అనన్యప్రోక్తే– ఉత్తమ గురువు బోధిస్తే; అత్ర గతిః నాస్తి – మోక్షాన్ని పొందుతారు.

**తాత్పర్యం:** ఈ ఆత్మ అణువుకన్నా సూక్ష్మమైనది. తర్కానికి అందనిది. దీన్ని అనేక విధాలుగా అర్థం చేసుకుంటున్నారు. సమర్థవంతమైన గురువు చెప్పకపోతే చక్కగా గ్రహింపబడదు. ఈ ఆత్మ విషయాన్ని సమర్థవంతమైన గురువు బోధిస్తే మోక్షాన్ని పొందుతారు.

**వివరణ:** ఇంతకుముందు మంత్రం విద్యాస్తుతి చేస్తే ఈ మంత్రం గురు స్తుతి చేస్తోంది. ముందు విద్యాస్తుతి చేసాక గురు స్తుతి చేస్తున్నాడు. కళ్లకు కనబడనిదాన్ని కళ్లకు కట్టినట్టు వర్ణించాలి. దానికి ఆచార్యులు విశిష్టంగా ఉండాలి. ఎందుకు? సూక్ష్మం కన్నా సూక్ష్మమైనది. శాస్త్రంలో సూక్ష్మం అన్న పదం లక్షణం విషయంలో వస్తుంది. మన పంచభూతాలను గమనిస్తే వాటి లక్షణాలు ఇలా ఉంటాయి –

| పంచభూతాలు | లక్షణాల సంఖ్య | వాటి వివరాలు |
|---|---|---|
| భూమి/పృథ్వీ | 5 | శబ్ద, స్పర్శ, రస, రూప, గంధ. |
| నీరు | 4 | గంధం లేదు. |
| అగ్ని | 3 | గంధం, రసం లేవు. |
| వాయు | 2 | గంధం రసం, రూపం లేవు. |
| ఆకాశం | 1 | శబ్దం మాత్రమే ఉంది. (అవ్యక్తరూపంలో) |

ఆత్మ గురించి వేరే చెప్పాలా? ఆకాశంకన్నా సూక్ష్మం లేదా సూక్ష్మాతిసూక్ష్మం. పంచభూతాల్లో ఆకాశం అన్నిటిలోకి సూక్ష్మమైతే ఆత్మ దానికన్నా సూక్ష్మం. ఏ ప్రమాణానికీ అందదు. నిజానికి మనం ఆత్మను పదార్థంగా మాట్లాడటం లేదు. దానికి లక్షణాలు లేవు. అప్రమేయం, అతి సూక్ష్మం, అతర్క్యం. తర్కానికి అందదు. తర్కానికి ప్రత్యక్ష ప్రమాణం ద్వారా పొందిన మూల సిద్ధాంతం ఉండాలి. డాక్టర్ నేను రోగలక్షణాలు వినను, నేను ఊహించి వైద్యం చేస్తానంటే కుదురుతుందా? ఆత్మ అతర్క్యం – తర్కానికి అందదు, అందువల్ల సైన్సుకి అందనిది.

అనేక మంది అనేక విధాలుగా భావిస్తారు. అందుకని సమర్థవంతమైన ఆచార్యుడు చెప్తే తప్ప ఆత్మ చక్కగా గ్రహించబడదు. ఆత్మ కంటికి కనబడదు, అనుమానానికి అందదు, సూక్ష్మమైనది, అనేక రకాలుగా అర్థం చేసుకుంటారు కాబట్టి గురువు శ్రోత్రియ బ్రహ్మనిష్ట అయి ఉండాలి.

శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ పదం ముండక ఉపనిషత్తులో వస్తుంది. బ్రహ్మనిష్ట అంటే తనని తాను బ్రహ్మగా, ముక్త పురుషునిగా అర్థం చేసుకున్నవాడు. తను 'జీవుడు' అని పొరపడడు. శ్రోత్రియ అంటే తను నేర్చుకున్న శాస్త్రవిద్యని చక్కగా బోధించగలవాడు. చక్కగా చెప్పగలిగి బ్రహ్మనిష్ఠలో లేకుండా జగత్ – జీవ – ఈశ్వర సిద్ధాంతంలోనే ఉండిపోతే, అతన్ని కేవల శ్రోత్రియ అంటారు. దాని బదులు వేదాంతం బాగా అర్థమయినా, చక్కగా చెప్పలేకపోతే కేవల బ్రహ్మనిష్ఠ అంటారు. కేవల బ్రహ్మనిష్ఠ గురువును కనిష్ట గురువు అనీ, కేవల శ్రోత్రియ గురువును మధ్యమ గురువనీ అంటారు. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ ఉత్తమ గురువు. ఈ మంత్రంలో 'అనన్య గురుః' అని వస్తుంది.

'అనన్య'కి శంకరాచార్యులు రెండు అర్థాలు ఇస్తారు. ఒకటి బ్రహ్మను నేర్చుకునే వస్తువుగా కాక, తనే బ్రహ్మగా భావించేవాడు – అంటే ఒక అర్థం ఉత్తమ ఆచార్యుడు, ఇంకో అర్థం అద్వైత ఆత్మ. అంటే అది తప్ప ఇంకోటి లేదు.అంటే రెండూ కలిపితే అద్వైత ఆత్మను

బోధించే ఉత్తమ ఆచార్యుడు బోధించాలి. అలాంటి ఉత్తమ ఆచార్యుడు బోధిస్తే మళ్లీ గతి ఉండదు. అంటే ఒక అర్థం ఇంక అనుమానాలు ఉండవు అనీ, ఇంకో అర్థం ఒక లోకం నుంచి ఇంకో లోకంకి ప్రయాణం ఉండదు అనీ అంటే పునరపి జననం, పునరపి మరణం పొందకుండా మోక్షం పొందుతాడు.

ఆత్మను సరిగా బోధించకపోతే, ఆత్మ సాక్షాత్కారాన్ని ఒక అనుభవంగా భావిస్తారు. శృతిని నమ్మని వ్యక్తి అయితే, తర్కం ఉపయోగిస్తాడు.

తర్కం రెండు రకాలు. ఒకటి మన ప్రత్యక్ష ప్రమాణం ద్వారా సేకరించిన సమాచారాన్ని బట్టి తార్కికంగా ఆలోచించటం. కాని ఆత్మ విషయంలో ఇది వర్తించదు. ఇది కంటికి కనబడే వస్తువు కాదు కాబట్టి. కాని శాస్త్రప్రమాణం మీద ఆధారపడిన తర్కం, ఆత్మని వివరించగలరు.

బ్రహ్మసూత్రాల్లో 2.1.11లో వ్యాసాచార్యులు, శంకరాచార్యులు కూడా ఆత్మజ్ఞానం విషయంలో కేవల తర్కం పనికిరాదని నిరూపిస్తారు. న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగదర్శనాలకు చెందిన వారు శాస్త్రప్రమాణం వాడతారు కాని, వాళ్ళు తర్కాన్ని ప్రధానంగా తీసుకుని, శాస్త్రాన్ని దాన్ని సమర్థించటానికి వాడతారు. ఇది కూడా లాభం లేదు. అందుకని శాస్త్ర సమ్మతమైన తర్కం ఉపయోగించాలని బ్రహ్మసూత్రాల్లో వివరిస్తారు. ఇక్కడ శాస్త్రం ప్రధానం, దాన్ని వివరించటానికి తర్కం ఉపయోగపడుతుంది.

అందుకని సమర్థవంతమైన గురువు చెప్పకపోతే తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉంది. రెండు సిద్ధాంతాలని కలపలేము, ఎందుకంటే అవి పరస్పర విరుద్ధంగా ఉంటాయి. అందుకని స్వయంగా నేర్చుకోవటం కుదరదు. శాస్త్రాన్ని గురువు ఉపదేశించాలి, అద్దం ఎలా వాడాలో చూపినట్టుగా. అందుకని గురువు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయి ఉండాలి. ఇంతవరకూ మనకి తెలిసింది ఆబ్జెక్టిఫికేషన్ ఓరియంటేషన్ – బాహ్య వస్తువుల గురించి. దానికి స్థూలబుద్ధి చాలు. కాని ఆత్మ గురించి తెలుసుకోవటానికి సూక్ష్మబుద్ధి ఉండాలి. గురువు చెప్తుంటేనే నేను నిత్య, శుద్ధ, ముక్త, బుద్ధ, ఆనంద స్వరూపుడను, అని తెలుసుకోవాలి. ఆత్మ బాహ్య వస్తువు కాదు.

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్.**
**అనుభవిస్తున్న నేనే ఎప్పటికీ అది, అనుభవించబడే వస్తువు ఎన్నటికీ కాదు.**

చూస్తున్న నువ్వే ఆత్మవి. చూడబడే వస్తువు కాదు.

అందుకే వేదాంత బోధ స్వీయచరిత్రలాంటిది – అందుకే గురువు ఆనందిస్తాడు. బాధాకరమైన జీవితం గడుపుతున్న మనమే మన గురించి ఆనందిస్తే అద్భుతమైన ఆత్మ గురించి గురువు ఆనందించడా? అటువంటి గురువు చెపితే వద్దనుకున్నా అర్థమైపోతుంది. నచికేతుని అదృష్టం – సాక్షాత్తూ ఆ యమధర్మరాజే గురువుగా దొరికాడు.

### మంత్రం – 9

**నైషా తర్కేణ మతిరాపనేయా ప్రోక్తాన్యేనైవ సుజ్ఞానాయ ప్రేష్ఠ।**
**యాం త్వమాపః సత్యధృతిర్బతాసి త్వాదృఙ్నో భూయాన్నచికేతః ప్రష్టా॥**

**ప్రతిపదార్థం:** యాం త్వమాపః – ఏ జ్ఞానాన్ని నువ్వు గ్రహించ బోతున్నావో; ఏషా మతిః తర్కేణా – ఈ జ్ఞానం తర్కం వల్ల; న ఆపనేయా – పొందగలిగింది కాదు; అన్యేన ఏవ – తార్కికుడు కాని మరొకరి చేత; ప్రోక్తా – ఉపదేశించబడినప్పుడు; సుజ్ఞానాయ – శ్రేష్ఠమైన జ్ఞానానికి, సత్యధృతిః బత అసి – సత్యనిష్టలో ఉన్నావు; నచికేతః – నచికేతా; నః – మాకు; త్వాదృక్ ప్రష్టా – నీలాగా ప్రశ్నలు వేసే విద్యార్థి; భూయాత్ – కలుగు గాక.

**తాత్పర్యం:** ఏ జ్ఞానాన్ని నువ్వు గ్రహించ బోతున్నావో, ఆ ఆత్మవిద్య గురువు ద్వారానే నేర్చుకోవాలి. తర్కం వల్ల పొందలేవు. ప్రియశిష్యుడా, గొప్ప గురువు ఉపదేశించినప్పుడు శ్రేష్ఠమైన జ్ఞానాన్ని పొందుతావు. నువ్వు సత్యనిష్ఠలో ఉన్నావు. నీలాగా ప్రశ్నలు వేసే శిష్యులు మాకు దొరకాలి.

**వివరణ:** అదే భావం కొనసాగుతోంది మొదటి రెండు పాదాల్లో. చివరి రెండింటిలో నచికేతుని ప్రశంస వస్తుంది. శాస్త్రం కన్నా గురువెందుకు ఎక్కువ? గురువు లేకుండా శాస్త్రం నేర్చుకుంటే ప్రమాదం. గురువు ఉంటే శాస్త్రం కూడా వస్తుంది, గురువు శాస్త్రపరంగా బోధిస్తాడు కాబట్టి. టేప్‌రికార్డర్‌లో రికార్డ్ బటన్ నొక్కితే రెండు బటన్లు నొక్కబడినట్టన్నమాట.

గురువు ఎందుకు? నైషా తర్కేణ మతిరాపనేయా – శాస్త్రం తర్కానికి దొరకదు. విజ్ఞానశాస్త్రం అద్భుతాలు చూపింది నిజమే, కాని దానికి కొన్ని పరిమితులున్నాయి. అలాగే ప్రమాణాలకీ కొన్ని పరిమితులున్నాయి. ఈ పాదానికి రెండు అర్థాలు ఉన్నాయి. ఒకటి శాస్త్రం తర్కానికి అందదు; రెండోది అందుకే తర్కంతో కాదనలేం కూడా. ఉదా – ఈ గులాబీ ఎరుపు రంగులో ఉంది అని చెవులతో చెప్పగలమా? లేదు. చెవులతో కాదనగలమా? లేదు. కంటితో చూసినదాన్ని, చెవితో నెగేట్ చేయలేము. అలాగే విజ్ఞాన శాస్త్రం ఆత్మ గురించి చెప్పనూ లేదు, కాదని వాదించనూ లేదు. ఆత్మ విద్యకు గురుశాస్త్ర ఉపదేశం మాత్రమే మార్గం.

ఆత్మవిద్యను ధ్యానం ద్వారా పొందవచ్చని ఒక అపోహ ఉంది. యమధర్మరాజు స్పష్టంగా చెప్తున్నాడు గురుశాస్త్ర ఉపదేశమే మార్గమని. అందుకే గురుప్రాప్తి గొప్ప వరం.

మూడు వరాలు పొందిన వ్యక్తికి భగవంతుని దీవెనలున్నట్టు – అవి మనిషి జన్మ, మోక్ష ఇచ్ఛ, సమర్థవంతమైన గురువు.

తమాషా చూడండి. నీకు గురువున్నాడని చెప్పాలి యమధర్మరాజు, కాని నీకు జ్ఞానం కలిగిందని చెప్తున్నాడు. ఓ నచికేతా, నువ్వు బ్రహ్మవిద్యను పొందినట్టే అంటున్నాడు.

శిష్యుడు – శమదమాది షట్కసంపత్తి కలిగి ఉండాలి.
గురువు – శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయి ఉండాలి.

అందుకని ఓ నచికేతా, నీవు అరకొరగా నేర్చుకోవటం లేదు, నువ్వు బ్రహ్మవిద్యకు అర్హుడవు. నేను సమర్థుడను, అందుకని నీకు విద్య లభించినట్టే అని అర్థం. నీలాంటి శిష్యులు ఇంకా లభించాలి అని కోరుకుంటున్నాడు. ఆత్మవిద్య విద్యార్థికి శ్రవణం, గురువుకు నిధిధ్యాసనం.

## మంత్రం – 10

**జానామ్యహం శేవధిరిత్యనిత్యం న హ్యధ్రువైః ప్రాప్యతే హి ధ్రువం తత్।**
**తతో మయా నాచికేతశ్చితోఽగ్నిః అనిత్యైర్ద్రవ్యైః ప్రాప్తవానస్మి నిత్యమ్॥**

**ప్రతిపదార్థం:** శేవధిః అనిత్యమ్ – కర్మఫలాలు అశాశ్వతం; ఇతి అహం జానామి – అని నేను తెలుసుకున్నాను; అధ్రువైః – అశాశ్వతమైన వస్తువుల వల్ల, ధ్రువం తత్ – శాశ్వతమైన ఆ ఆత్మ; న ప్రాప్యతే హి – పొందబడదు; తతః – అందువల్ల; అనిత్యైః ద్రవ్యైః – అశాశ్వతమైన వస్తువుల చేత; నాచికేతః అగ్ని చితః – యజ్ఞాలు చేసాను; నిత్యం ప్రాప్తవాన్ అస్మి – యమ పదవిని పొందాను.

**తాత్పర్యం:** కర్మఫలాలు అశాశ్వతం అని నాకు తెలుసు. అశాశ్వతమైన వాటిచేత ఆత్మను పొందలేము. అందుచేత అశాశ్వతమైన నాచికేత యాగాలని చేసి యమధర్మరాజు పదవిని పొందాను.

**వివరణ:** ఇక్కడ యమధర్మరాజు నచికేతుని మెచ్చుకుంటూ, తనని అతనితో పోల్చుకుంటున్నాడు. నచికేతుడే ఎక్కువంటున్నాడు. తను మనిషిగా ఉండగా ఉత్తమ పదవి కోసం యజ్ఞం చేసాననీ, ఆ తర్వాతే ఆత్మజ్ఞానం పొందాననీ చెప్తున్నాడు. కర్మఫలం అనిత్యమైనది, నిత్యఫలం ఇవ్వలేదు. అయినా యజ్ఞాలే చేసి నిత్యపదవిని పొందాను అని ఓదార్చుకుంటున్నాడు, కాని అది సాపేక్షిక నిత్యం అని యమధర్మరాజుకు తెలుసు.

ఈ మంత్రం ద్వారా యమపదవి కూడా శాశ్వతం కాదని శాస్త్రం చెప్తోంది. స్వర్గలోకం, బ్రహ్మలోకాలను పొందటం కర్మఫలమే. జీవుడు యజ్ఞం ద్వారా హిరణ్యగర్భ పదవిని పొందవచ్చు కాని మోక్షం పొందలేడు. కేనోపనిషత్‌లో మొదట ఇంద్రుడు, ఆ తర్వాత తక్కిన దేవతలు ఆత్మవిద్య నేర్చుకున్నారని వస్తుంది.

**మంత్రం – 11**

**కామస్యాప్తిం జగతః ప్రతిష్ఠాం క్రతోరనన్త్యమభయస్య పారమ్।**
**స్తోమం మహదురుగాయం ప్రతిష్ఠాం దృష్ట్వా ధృత్యా ధీరో నచికేతోఽ త్యస్రాక్షీః॥**

**ప్రతిపదార్థం:** నచికేతః – నచికేతా; కామస్య ఆప్తిం – అత్యుత్తమ పదవి, బ్రహ్మపదవి; జగతః ప్రతిష్ఠాం – జగత్తుకు ఆధారం; క్రతోః అనంత్యం – ఉపాసన సాపేక్షికంగా అనంతం; అభయస్య పారమ్ – భయానికి అతీతమైనచోటు; స్తోమ మహత్ – మహత్వం గలది; ఉరుగాయం – విశాలమైన ప్రదేశం; ప్రతిష్ఠాం – అటువంటి గొప్ప హామీ; దృష్ట్వా – వివేకంతో గమనించి; ధీరః – వివేకీ; అత్యస్రాక్షీః – తిరస్కరించావు, ధృత్యా – దృఢ నిశ్చయంతో.

**తాత్పర్యం:** జగత్తుకు ఆధారం, యజ్ఞఫలం, అనంతం, భయానికి అతీతమైన చోటు, మహత్వం గలది, అద్భుతమైనది అయిన బ్రహ్మపదవినే వద్దన్నావు – వివేకంతో దాని దోషాలని చూసి, దృఢ నిశ్చయంతో తిరస్కరించావు.

**వివరణ:** 10, 11 మంత్రాలు మళ్లీ శిష్యస్తుతి. యమ ఉవాచ. నచికేతుని వైరాగ్యాన్ని మెచ్చుకుంటున్నాడు. 99% మనుష్యులు విషయవాంఛలని కోరుతారు. వాటిల్లో ఉత్తమమైనది హిరణ్యగర్భ పదవి. కాని దానిని అతను కాదన్నాడు. జగత్తుకు ఆధారం అది, భయానికి అతీతమైనది. మహత్వం గలది. అది కూడా సాపేక్షికంగానే శాశ్వతమని వివేకంతో ఆలోచించి, వాటిలోని లాభాలకన్నా దోషాలనే చూసాడు. దృఢనిశ్చయంతో తిరస్కరించాడు. 'ధీరుడు' అంటే వివేకీ అని అర్థం శాస్త్రంలో.

మొదటి మూడు పాదాలు స్వర్గలోకస్తుతి. మనం ఒక అగ్గిపెట్టెని కూడా పారేయం. మనవడు ఆడుకొంటాడులే అనుకుంటాం. అప్పటికి కొడుకు పెళ్ళే అయి ఉండదు. అందుకే వివేక జన్య వైరాగ్యమే అసలైన వైరాగ్యం. అది నచికేతుడు చూపాడు.

**మంత్రం – 12**

**తం దుర్దర్శం గూఢమనుప్రవిష్టం గుహాహితం గహ్వరేష్ఠం పురాణమ్।**
**అధ్యాత్మయోగాధిగమేన దేవం మత్వా ధీరో హర్షశోకౌ జహాతి॥**

**ప్రతిపదార్థం:** దుర్దర్శం – ఇంద్రియ అగోచరం; గూఢమ్ అనుప్రవిష్టం – గోప్యమైన చోట దాగి ఉంది; గుహాహితం – హృదయంలో; గహ్వరేష్ఠం – చీకటి ప్రాంతంలో ఉంది; ధీరః– వివేకి; పురాణం – సనాతనమైనది; తం దేవం – ఆ జ్యోతిర్మయమైన దానిని; అధ్యాత్మయోగాధిగమేన – అధ్యాత్మ యోగంతో; మత్వా – ధ్యానించి; హర్షశోకౌ – సుఖదుఃఖాలకు, జహాతి – అతీతుడవుతాడు.

**తాత్పర్యం:** నువ్వు అడిగిన ఆత్మ ఇంద్రియ అగోచరం. గూఢమైన చోట ఉంది. హృద్గుహలో ఉంది. సనాతమైన దాన్ని జ్ఞానయోగంతో తెలుసుకున్న ధీరుడు సుఖదుఃఖాలకు అతీతుడవుతాడు.

**వివరణ:** అన్ని స్తుతులు అయ్యాక, 12, 13లలో జ్ఞాన సాధన వస్తుంది. జ్ఞానయోగం పేరు ఇక్కడ అధ్యాత్మయోగం, దీనిని మాండూక్యలో అస్పర్శయోగం అన్నారు. దీని ద్వారా ఆత్మను తెలుసుకోవాలి.

ఆత్మ దుర్దర్శం. అది ఇంద్రియ అగోచరం. అంటే తక్కిన ప్రమాణాలకి అందదు. అవి అన్నీ ప్రత్యక్ష ప్రమాణం ఆధారంగా, తర్కం జోడించి వాడేవి. అందుకని ఆత్మను – సర్వప్రమాణ అగోచరం, అప్రమేయం అంటారు. అప్రమేయం అంటే కొలవలేనిది.

ఎక్కడుంది అది? గుహాహితం– హృదయంలో. హృదయం పిడికిలి అంత ఉంటుంది. అందులో పట్టేది అంగుష్టం (బొటనవేలు). శాస్త్రం ప్రకారం మనసు హృదయంలో ఉంది. చైతన్యం మనసులో అంగుష్టం అంత ఉంది. (ఉన్నట్టుగా ఉంది అన్న విషయం మర్చిపోకూడదు) ఆలోచనలు ఉన్న మనసును, ఆలోచనలు లేని మనసును సాక్షీభూతంగా చూస్తుంది చైతన్యం.

ఎందుకు గుహ? గుహ చీకటిగా ఉన్నట్టు, మనసు అజ్ఞానమనే చీకటిలో ఉంది. సుబ్రహ్మణ్య స్వామిని గుహన్ అని అంటారు. గుహ లో ఉండేవాడు గుహన్. చీకటి వల్ల ఆత్మ దాగి ఉంది. అంటే ఏమిటి? జాగ్రత్తగా చూడండి. ఆత్మను దాచలేము, దేనితోనూ కప్పలేము. దేన్నైనా కప్పాలంటే, దానికన్నా పెద్దది కావాలి. ఆత్మకన్నా పెద్దది లేదు. అందుకని కప్పబడి అంటే అది సూచనాత్మకం. ఆలోచనలు కప్పుతున్నాయి అంటారు. ఆలోచనలు పక్కకి లాగుతాయి. అది సూచనాత్మకం.

ఎందుకు ఆత్మ కప్పబడి (గూఢంగా) ఉందో, దానికి శంకరాచార్యులు మూడు కారణాలు చెప్తున్నారు.

1. మనసు లోపల ఉన్న ఆత్మ కప్పబడి ఉన్నట్టు ఎందుకు ఉందంటే, మనసును అనేక విషయాలు ఆకర్షిస్తాయి. బయట, బాహ్యప్రపంచం ఆకర్షిస్తే, లోపల అనేక ఆలోచనలు సుళ్ళు తిరుగుతుంటాయి. అందువల్ల ప్రపంచానికీ, ఆలోచనలకీ సాక్షీభూతమైన ఆత్మను చూడలేము.

2. ఆత్మ మనసులోపల ఉంది కాబట్టే చూడలేము. ఎందుకంటే, మనసు, దానికన్నా భిన్నంగా ఉన్న వస్తువునే చూడగలదు. అందుకని తనలోనే ఉన్న ఆత్మని చూడలేదు.

3. శరీరం పడే సుఖదుఃఖాలకి మనసు ప్రాముఖ్యతనిస్తుంది. అందువల్ల మనసులో ఉన్న ఆత్మను అది చూడదు. (దుర్దర్శం)

అలా మనం ప్రపంచానికీ, ఆలోచనలకీ సాక్షీభూతమైన ఆత్మను చూడలేము. తాడును చూచి పాము అనుకున్నట్టుగా, శరీరత్రయానికి మూడుముళ్లు వేస్తాము; స్వామి చిన్మయానంద శరీర త్రయానికి మూడుసార్లు తలాక్ చెప్పాలని హాస్యంగా చెప్తారు.

మనసు తెలుసుకోలేని, హైజాక్ చేయబడ్డ ఆత్మను మనసు ద్వారానే తెలుసుకోవాలి. ఎలా? యమధర్మరాజు మార్గం చెప్తున్నాడు. అధ్యాత్మ యోగాధిగమేన – జ్ఞానయోగంతో. అంటే గురు శాస్త్ర ఉపదేశం ద్వారా పొందటం. దేవం మత్వా అంటే స్వయం ప్రకాశక ఆత్మ. దేవ అంటే దేవత కాదు ఆత్మ. ఆ ఆత్మను నేనే అని తెలుసుకోవాలి, ఆత్మ నాలో ఉంది అనకూడదు. ధీరుడు అంటే సాధన చతుష్టయ సంపన్నుడు.

ఈ మంత్రంలో ఫలం వస్తుంది. హర్షశోకౌ జహాతి – ద్వంద్వ భావాలకి అతీతుడవుతాడు. ఆశ్రమ జీవితంలో సంసారం ఉండదు. గృహస్థ జీవితంలో సుఖదుఃఖాలు రెండూ ఉంటాయి. జ్ఞాని గృహస్థ జీవితంలో ఉంటూ, ఆత్మజ్ఞానం వల్ల రెండింటికీ అతీతుడవుతాడు. హర్ష అంటే ప్రాపంచిక ఆనందం, ఆత్మానందం కాదు. మోక్షం ప్రాప్నోతి. మోక్షం అంటే నేను మనసు కాదు, ఆత్మను అని తెలుసుకోవటం. జ్ఞానయోగం + జ్ఞానఫలం చెపుతున్నాడు.

### మంత్రం – 13

**ఏతచ్ఛ్రుత్వా సమ్పరిగృహ్య మర్త్యః ప్రవృహ్య ధర్మ్య మణుమేతమాప్య।**
**స మోదతే మోదనీయం హి లబ్ధ్వా వివృతం సద్మ నచికేతసం మన్యే॥**

**ప్రతిపదార్థం:** ధర్మ్యం ప్రవృహ్య – ధర్మ సమ్మతమైన (ఆత్మను) వివేచన చేసి; ఏతత్ శ్రుత్వా– ఆత్మతత్త్వం విన్నవాడు; సమ్పరిగృహ్య – స్పష్టంగా అర్థం చేసుకున్నవాడు; ప్రవృహ్య – వివేకం చూపి; ఏతమ్ మోదనీయం – ఈ ఆనందం నిండిన; అణుమ్ – అణువు వంటి ఆత్మను; ఆప్య – పొంది; సః మర్త్యః మోదతే – మనిషి ఆనందిస్తాడు; సద్మ – ఆ మార్గం; నచికేతసం – నచికేతుడైన నీకు; వివృతం – తెరవబడినట్టుగా; మన్యే – భావిస్తున్నాను.

**తాత్పర్యం:** ఈ సత్యాన్ని అర్హుడైన గురువునించి విని, ఆత్మ అంటే చైతన్యం అని తెలుసుకుని, శరీరం నుంచి ఆత్మను వేరు చేయాలి. అది చేసినవాడు ఆనందం పొందుతాడు. నచికేతా నీకు ఆ మార్గం తెరుచుకున్నట్టు భావిస్తున్నాను.

**వివరణ:** ఈ మంత్రం దాదాపుగా 12వ మంత్రంలో వచ్చిన భావాన్నే మళ్ళీ చెప్తోంది. అధ్యాత్మయోగం అంటే ఏమిటో వివరించి,దీనితో బ్రహ్మవిద్యాస్తుతి, ఆచార్యస్తుతి, శిష్యస్తుతి, ఫలశృతి కూడా చెప్తాడు.

ఆధ్యాత్మ యోగం అంటే ఏమిటి? తలకిందులుగా నిల్చోవాలా, కళ్లు మూసుకోవాలా? ఏదీకాదు. వేదాంత శ్రవణ, మనన, నిధిధ్యాసనలు చేయాలి.

**ఆత్మావారే మైత్రేయీ దృష్టవ్య, శ్రోతవ్య, మంత్రవ్య, నిధిధ్యాసితవ్యః**

– బృహదారణ్యకం

శ్రవణ, మనన, నిధిధ్యాసనలకు ఈ మంత్రంలో వరుసగా శృత్వా, సంపరిగృహ్యా, ప్రవృహ్యా అన్న పదాలు వచ్చాయి.

శ్రవణం – జ్ఞాన ప్రాప్తి కలుగచేస్తుంది.
మననం – సంశయ నివృత్తి చేస్తుంది.
నిధిధ్యాసనం – బ్రహ్మనిష్ఠలో ఉంచుతుంది.

మర్త్య – సాధకుడు, జ్ఞానం పొందేవరకూ తను అశాశ్వతం అనుకుంటాడు. ఏతత్ శృత్వా– ఆత్మ తత్త్వం విన్నవాడు, అంటే వేద పూర్వం కాదు, వేదాంతం విన్నవాడు, అంటే శ్రవణం చేసినవాడు – తర్వాత సంపరిగృహ్యా – స్పష్టంగా అర్థం చేసుకోవాలి.అంటే సంశయ నివృత్తి చేసుకోవాలి. దాని తర్వాత ప్రవృహ్యా – నిధిధ్యాసనంలో ఉండాలి. అంటే ధాన్యం దంచినట్టుగా శరీరం నుంచి ఆత్మను వేరు చేయాలి. నేను శరీరాన్ని కాదు. నేను ప్రాణాన్ని కాదు, నేను మనసును కాదు అలా ఒక్కొక్క పొరగా విప్పుకుంటూ నేను ఆ చైతన్యాన్ని అని తెలుసుకోవాలి.

ఉదాహరణకు కరెంటు ఉందా లేదా చూడాలంటే లైటు వేసి చూడాలి.

చైతన్యం విశేషణం కాదు, నామ వాచకం. అలా చైతన్యం నేనే అని స్వీకరించేది మనసువల్లనే.

ధర్మ్యంకు రెండు అర్థాలు ఉన్నాయి. ధారణాత్ ధర్మ – ఆచరించవలసినది ధర్మం. ఇంకోటి ధర్మేణ ప్రాప్యం ధర్మ – ధర్మం వల్ల పొందేది. అణుం – దీన్ని గౌణ ప్రయోగం అంటారు. అణువంత చిన్నదని కాదు, అణువంత సూక్ష్మమైనది అని అర్థం. ఉదాహరణకు

అతను యుద్ధంలో సింహం అయ్యాడు అంటే సింహంలా భీకరంగా పోట్లాడాడు అని. ఆత్మని అర్థం చేసుకున్నవాడు ఆనందిస్తాడు.

**యోగరతో వా భోగరతో వా, సంగరతో వా సంగవిహీనః**
**యస్య బ్రహ్మణి రమతే చిత్తం, నందతి నందతి నందత్యేవ॥** – భజగోవిందం

సన్యాసిగా ఉన్నా, గృహస్తు అయినా, నలుగురితో ఉన్నా, ఒంటరిగా ఉన్నా మొత్తం జీవితం పూర్ణత్వమే. ఎందుకు? మోదనీయం హి లబ్ధ్వా – ఆనందం ఇచ్చే దాన్ని పొందుతాడు. ఓ నచికేతా నువ్వు అతి త్వరలోనే మోక్షాన్ని పొందుతావు.

**మోక్షద్వారకవాటపాటనకరీ కాశీపురాధీశ్వరీ** – అన్నపూర్ణాష్టకమ్

తలుపు తెరిచే ఉంది, అతను లోపలికి వెళ్ళాలి అంతే. మళ్లీ అలంకారం వాడుతున్నాడు. రాజసౌధం, తలుపులు, తాళాలు లాంటివి లేవు.

## మంత్రం – 14

**అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాత్ అన్యత్రాస్మాత్కృతాకృతాత్।**
**అన్యత్ర భూతాచ్చ భవ్యాచ్చ యత్తత్పశ్యసి తద్వద॥**

**ప్రతిపదార్థం:** అన్యత్ర ధర్మాత్, అన్యత్ర అధర్మాత్ – ధర్మ; అధర్మాలకి విలక్షణంగా; అన్యత్ర అస్మాత్ కృత్ అకృతాత్ – కార్యకారణ విలక్షణంగా; అన్యత్ర భూతాశ్చ భవ్యాచ్చ – భూత, భవిష్యత్ కాలాలకు అతీతంగా; యత్ తత్– దేనిని; పశ్యసి – చూస్తామో; తద్వద – దానిని చెప్పు.

**తాత్పర్యం:** ధర్మ, అధర్మాలకి విలక్షణంగా, కార్యకారణ విలక్షణంగా, కాలానికి అతీతంగా ఉన్నదేదో దాని గురించి నాకు చెప్పు.

**వివరణ:** నచికేతుడు సహనం కోల్పోతున్నాడు. మిగతా విషయాలు ఆపి దీనికి రా అంటున్నాడు. ఇది నచికేత ఉవాచ. తను ముందు అడిగిన ప్రశ్ననే ఇప్పుడు స్పష్టంగా మళ్ళీ అడుగుతున్నాడు.

**యేయం ప్రేతే విచికిత్సా మనుష్యేఽ**స్తీత్యేకే నాయమస్తీతి చైకే। – కఠ 1.1.20

మరణానంతరం మనిషి జీవిస్తున్నాడు అని కొందరు, లేదు అని కొందరు అంటున్నారు. దాని గురించి మూడవ వరంగా చెప్పు అన్నాడు. రెండు ప్రశ్నలూ ఒకటే. ఇందులో ఆత్మకు మూడు నిర్వచనాలున్నాయి. శంకరాచార్యులు దీన్ని తరచు చెప్తారు. ఆత్మ కర్మఫలం లేదా ఉపాసన ఫలం కాదని స్పష్టం చేస్తోంది ఈ మంత్రం. నిజానికి నచికేతుడు ఇచ్చిన ఈ నిర్వచనాలు విన్నాక, అతనికే తెలిస్తే, ఇంక చెప్పేదేమిటి అనిపిస్తుంది.

మొదటి మూడు పాదాల్లో మూడు నిర్వచనాలు ఆత్మ గురించి ఉన్నాయి.

1. అన్యత్ర ధర్మాత్, అన్యత్ర అధర్మాత్ – ధర్మ,అధర్మాలకి విలక్షణంగా, మంచి చెడులకి భిన్నంగా ఉంది. దీనిలో చాలా అర్థాలున్నాయి. రెండు చూద్దాం.

ఎ) దైవాన్ని చెడుకి అతీతంగా, మంచికి స్ఫూర్తిగా భావించినట్టుగా వర్ణిస్తారు. సకల కళ్యాణ గుణ సంపన్న అంటారు శంకరాచార్యులు. మంచి, చెడులు నాణానికి రెండువైపులుగా వర్ణిస్తారు. పారమార్థిక స్వభావంలో భగవానుని చూస్తే నిర్గుణ బ్రహ్మ అవుతాడు. వ్యావహారికంలో చూస్తే గుణ సంపన్నుడవుతాడు.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।** – గీత 18.66

ముందు అధర్మాన్ని వీడి ధర్మాన్ని పాటించు. తర్వాత ధర్మాన్ని కూడా వీడు. కాలిలో ముల్లు గుచ్చుకుంటే దాన్ని ఇంకో ముల్లుతో తీస్తాము. తర్వాత? రెండో ముల్లుని కూడా పారేస్తాము. అలాగే అధర్మం, ధర్మం రెండింటికీ విలక్షణంగా ఉండాలి.

బి) ధర్మ అధర్మాలు చేస్తే కర్మఫలం కలుగుతుంది. అంటే పుణ్యం లేదా పాపం వస్తుంది. నిషిద్ధ ధర్మఫలం పాపం అవుతుంది. ఆత్మ కర్మఫలం కాదు అంటుంది ఉపనిషత్తు. ఏ కర్మ అనకూడదు మళ్ళీ. జ్ఞానం వల్లనే మోక్షం కలుగుతుంది, కర్మ వల్ల కాదు అని అర్థం.

2. అన్యత్ర అస్మాత్ కృత అకృతాత్ – కార్యకారణ విలక్షణం. ఇది చాలా ముఖ్యమైన అంశం. ఎందుకంటే అన్ని ఉపనిషత్తుల్లోనూ, మొదట బ్రహ్మను జగత్‌కారణంగా వర్ణిస్తారు. ఉపాదాన కారణమూ బ్రహ్మే. నిమిత్త కారణమూ బ్రహ్మే. మరి కార్యకారణ విలక్షణం ఎలా? మళ్ళీ వ్యావహారిక దృష్ట్యా జగత్ కార్యం, బ్రహ్మ కారణం. ఇది స్వప్నం లాంటిది. అదే పారమార్థిక దృష్ట్యా చూస్తే కార్యమూ లేదు, కారణమూ లేదు.

3. అన్యత్ర భూతాశ్చ భవ్యాచ్చ – కార్యకారణాలు కాలంలో ఉంటాయి. బ్రహ్మ కాలానికి అతీతం. భూత అంటే భూతకాలం, భవ్య అంటే భవిష్యత్ కాలం. వర్తమానం మనం కలుపుకోవాలి. మూడు కాలాల్లోనూ ఉంటుంది ఆత్మ. అటువంటి ఆత్మ సర్వ వ్యవహారానికీ అతీతంగా ఉంటుంది.

యత్తత్పశ్యసి తద్వద – అది నీకు తెలుసని నాకు తెలుసంటున్నాడు నచికేతుడు. అది చెప్పమని కోరుతున్నాడు. గురువు మీద అంత నమ్మకం.

## మంత్రం -15

**సర్వే వేదా యత్పదమామనన్తి తపాగ్ంసి సర్వాణి చ యద్వదన్తి।**
**యదిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి తత్తే పదగ్ం సఙ్గ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్॥**

**ప్రతిపదార్థం:** సర్వేవేదాః – అన్ని వేదాలు; యత్ పదమ్ ఆమనన్తి – ఏ లక్ష్యాన్ని ఉపదేశిస్తున్నాయో; సర్వాణి తపాంసి చ – అన్ని తపస్సులు కూడా; యత్ వదన్తి – దేనిని ప్రకటిస్తున్నాయో; యత్ ఇచ్ఛన్తః – దేనిని కోరిరి; బ్రహ్మచర్యం చరన్తి – బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్నారో; తత్ పదం – ఆ మాటను; సంగ్రహేణ – క్లుప్తంగా; తే బ్రవీమి – నీకు చెపుతున్నాను; ఏతత్ ఓం ఇతి – అది ఓం అవుతుంది.

**తాత్పర్యం:** అన్ని వేదాలూ ఏ లక్ష్యాన్ని ఉపదేశిస్తున్నాయో, దేనికోసం అన్ని తపస్సులూ చేయబడుతున్నాయో ఏది కోరి బ్రహ్మచర్య వ్రతాన్ని పాటిస్తున్నారో ఆ లక్ష్యాన్నే పొందాల్సిన మంత్రాన్ని క్లుప్తంగా నీకు చెపుతున్నాను. అది ఓం.

**వివరణ :** ఇక్కడ నుంచి నచికేతుని ప్రశ్నకు జవాబు మొదలవుతుంది. విద్య సూక్ష్మమైనది కాబట్టి, దానికి సూక్ష్మ బుద్ధి కావాలనుకున్నాడు యమధర్మరాజు. దానికి సిద్ధంగా లేనివారికి ఒక ఉపాసన చెప్తున్నాడు. 15–17 వరకూ ఓంకార ఉపాసన.

ఓంకారం దైవధ్యానానికి ప్రతీక. సగుణ, నిర్గుణ బ్రహ్మలకు ప్రతీక. కార్య, కారణ బ్రహ్మలకు ప్రతీక. రెండు రకాల సాధకులకు రెండు మార్గాలు ఉన్నాయి.

1. సగుణ బ్రహ్మ ఈశ్వర ఉపాసన – ఓంకారాన్ని సగుణ బ్రహ్మకు ప్రతీకగా భావించి, అంటే శివలింగాన్ని శివునిగా భావించి ఉపాసన చేయటం. ఇలా చేసే వ్యక్తిని మధ్యమ అధికారి అంటారు. అతను నిష్కామ ఉపాసన చేస్తే, బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ నిర్గుణ బ్రహ్మజ్ఞానం పొంది, క్రమముక్తి పొందుతాడు.

2. నిర్గుణ బ్రహ్మ ఈశ్వర ఉపాసన – ఓంకారాన్ని నిర్గుణ బ్రహ్మ విచారణ చేయటానికి ఉపయోగించవచ్చు. మాండూక్య ఉపనిషత్తులోనూ, తైత్తిరీయ ఉపనిషత్తులోనూ వివరంగా వస్తుంది. ఇది చేసే వ్యక్తిని ఉత్తమ అధికారి అని అంటారు. అతనికి జీవన్ముక్తి కలుగుతుంది. అంటే ఇక్కడే ఇప్పుడే మోక్షం కలుగుతుంది.

ఈ మంత్రంలో యమధర్మరాజు ఓంకారాన్ని ప్రవేశపెడుతున్నాడు. అది బ్రహ్మకు ప్రతీక. ఎటువంటి బ్రహ్మ? మొదటి మూడు పాదాలు వివరిస్తున్నాయి. వేదపూర్వభాగం అర్థకామాలకి ప్రాముఖ్యత ఇచ్చినట్టు కనబడ్డా, అందులో అంతర్లీనంగా సందేశం ఉంది. వాటి వెంట పరుగులు తీసినా వాటి పరిధులు తెలుసుకోవాలని అర్థం. పైకి విషయ ఆనందం కనబడుతుంది.

పేరు ప్రఖ్యాతులూ, బంధాలు పెరుగుతాయి. కాని అవి అశాశ్వతమని తెలుసుకోవాలి. అంతర్గతంగా వైరాగ్యం పొందాలని వాటి సందేశం. కొందరు తేలిగ్గా తెలుసుకుంటే కొందరు దెబ్బలు తిన్నాక కాని తెలుసుకోలేరు.

**పరీక్ష్యలోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో**
**నిర్వేద మాయాత్ నాస్త్యకృతః కృతేన।** – ముండక 1.2.12

తెలుసుకుంటే ఏమిటి లాభం? వైరాగ్యం పొంది, నిర్గుణ బ్రహ్మ జ్ఞానం ద్వారానే మోక్షం పొందటానికి ప్రయత్నిస్తారు.

అన్ని వేదాలూ అంటే కర్మకాండ, జ్ఞానకాండ భాగాలూ, ఒకే పదం గురించి మాట్లాడుతాయి. తపాంసి సర్వాణి చ యత్ వదన్తి – కొందరు మొదట్లో లక్ష్యాన్ని గ్రహించరు. చీకట్లో తడుముకుంటారు. ఇక్కడ తపః అంటే విలువలు, యాగాలు, సాధన చతుష్టయం. అంతకు ముందు అర్థకామాల వెంట తీసిన పరుగు ఆపి, ధర్మం, మోక్షం కోసం తపన మొదలవుతుంది. దానికి జ్ఞానం పొందాలి. శాస్త్రం అద్దంలా పనిచేస్తుంది. యద్ధిచ్ఛన్తో బ్రహ్మచర్యం చరన్తి – మళ్ళీ విద్యార్థి దశ మొదలవుతుంది. బ్రహ్మచర్యంలో కర్మకాండ నేర్చుకుంటాడు. ఇప్పుడు విద్యార్థిలా జ్ఞానకాండ నేర్చుకుంటాడు. అషామాషీగా చదివితే ఫలం కూడా ఆషామాషీగానే ఉంటుంది. ఆ బ్రహ్మ అంతిమలక్ష్యం, సంగ్రహేణ బ్రవీమి– క్లుప్తంగా చెప్తాను విను.

ఈ మంత్రంలో యమధర్మరాజు బ్రహ్మను సాధ్యవస్తువుగా కాదు, సాధకునిగా తెలుసుకోవాలని చెప్తున్నాడు. అదెలా తెలుసుకోవాలి? బ్రహ్మకు, సాధకునకు అంటే మనకు మధ్య భేదం అజ్ఞానం వల్ల మన మనసులో ఏర్పడింది. అందువల్ల మనకు, బ్రహ్మకు మధ్యనున్న దూరాన్ని మనసులో ఏర్పరచుకున్న అజ్ఞానం పోగొడితే, ఆత్మజ్ఞానం పొందినట్టే. అంటే అజ్ఞాన నివృత్తి కలగటమే జ్ఞానప్రాప్తి, మోక్షప్రాప్తి.

### మంత్రం – 16

**ఏతద్ధ్యేవాక్షరం బ్రహ్మ ఏతద్ధ్యేవాక్షరం పరమ్।**
**ఏతద్ధ్యేవాక్షరం జ్ఞాత్వా యో యదిచ్ఛతి తస్య తత్॥**

**ప్రతిపదార్థం:** ఏతత్ అక్షరం ఏవ – ఈ మంత్రమే; బ్రహ్మ – భగవంతుడు; ఏతత్ అక్షరం ఏవ– ఈ మంత్రమే; పరమ్ – ఉన్నతోన్నతమైనది; ఏతత్ అక్షరం ఏవ – ఈ మంత్రాన్ని; యః జ్ఞాత్వా – ఎవరు తెలుసుకుని; యత్ ఇచ్ఛతి – దీనిని కోరతాడో; తస్య తత్ – అతనికి అది లభిస్తుంది.

**తాత్పర్యం:** ఓం అనే ఈ మంత్రం భగవంతుడు. ఈ మంత్రం సర్వోత్తమమైనది. ఈ మంత్రాన్ని తెలుసుకున్న వ్యక్తి ఏం కోరుకుంటే అతనికి అది లభిస్తుంది.

**వివరణ:** 16, 17 మంత్రాలు ఓంకారం గొప్పతనాన్ని సూచిస్తాయి. దీన్ని ఎలా సాధన చేయాలో దీని ఫలితమేమిటో చెప్తాయి.

ఓంకారాన్ని పరంబ్రహ్మగా, కారణం బ్రహ్మగా భావిస్తే అది ఈశ్వర ధ్యానం అవుతుంది. అపరం బ్రహ్మగా, కార్యం బ్రహ్మగా భావిస్తే అది హిరణ్యగర్భ లేదా విరాట్ ఉపాసన అవుతుంది. ఏతత్ అక్షరం ఏవ బ్రహ్మ అంటే అపరం బ్రహ్మను అంటే హిరణ్యగర్భ, విరాట్‌ని సూచిస్తుంది. ఏతత్ అక్షరం పరం అంటే ఈశ్వర ఉపాసనని సూచిస్తుంది. ఏతత్ అక్షరం జ్ఞాత్వా అంటే ఇక్కడ అర్థం ధ్యానం చేసాక అని అర్థం. ఎవరు చేసిన దానికనుగుణంగా ఫలం పొందుతారు. సకామ ఉపాసన చేస్తే ప్రాపంచిక సుఖాలు – డబ్బు, ఆనందం, అష్టమహాసిద్ధులు పొందవచ్చు. దాని ఫలితంగా హిరణ్యగర్భ అవ్వచ్చు. క్రమ ముక్తి కూడా పొందవచ్చు. టూ ఇన్ వన్ అన్నమాట.

## మంత్రం – 17

**ఏతదాలమ్బనం శ్రేష్ఠమేతదాలమ్బనం పరమ్।**
**ఏతదాలమ్బనం జ్ఞాత్వా బ్రహ్మలోకే మహీయతే॥**

**ప్రతిపదార్థం:** ఏతత్ ఆలంబనం – ఈ మార్గం; శ్రేష్ఠమ్ – ఉత్తమమైనది; ఏతత్ ఆలంబనం– ఈ మార్గం; పరమ్ – సర్వోత్కృష్టమైనది; ఏతత్ ఆలంబనం – ఈ మార్గాన్ని; జ్ఞాత్వా – తెలుసుకుని, బ్రహ్మలోకే – బ్రహ్మలోకంలో; మహీయతే – మహత్వాన్ని పొందుతాడు.

**తాత్పర్యం:** ఈ మార్గం ఉత్తమమైనది. ఈ మార్గం సర్వోత్కృష్టమైనది; ఈ మార్గాన్ని తెలుసుకుని దాని ద్వారా వెళ్లినవాడు బ్రహ్మలోకంలో మహత్వాన్ని పొందుతాడు.

**వివరణ:** ఈ ఆలంబనం వల్ల అనేక ఫలాలున్నాయి. పరమాత్మను రెండు రకాలుగా పూజించవచ్చు.

1. **ప్రతిమ ధ్యానం** – ఒక ఆకారం ఊహించుకుని ధ్యానం చేయటం. ఉదా: – రామ, కృష్ణ, శివ.

2. **ప్రతీక ధ్యానం** – ఒక ప్రతీకను పరమాత్మగా ఊహించుకుని ధ్యానం చేయటం. ఉదాహరణకు – సాలిగ్రామలో శివుడు, పసుపులో వినాయకుడు. ఓంకారంలో బ్రహ్మ. ఓంకార ధ్యానం చేయటం ఒక పద్ధతి, ఓంకార విచారణ చేయటం శ్రేష్ఠమైన పద్ధతి.

ఎందుకంటే ఏతత్ ఆలంబనం పరం. మనం అపరం కూడా కలుపుకోవాలి. కార్యకారణ బ్రహ్మకు ధ్యానం చేసాక, బ్రహ్మ లోకాన్ని పొందుతాడు.

బ్రహ్మలోకాన్ని పొందుతాడు అన్నమాటకు రెండు అర్థాలు వస్తాయి. సగుణ ధ్యానం చేస్తే అసలు బ్రహ్మలోకానికి అంటే ఏడవలోకానికి వెళతాడు. నిర్గుణ బ్రహ్మను తెలుసుకుంటే బ్రహ్మ ఎక్కడ ఉన్నాడు అంటే ఎక్కడ లేదు అని తెలుసుకుంటాడు. జీవించివుండగా అమరత్వం పొందుతాడు.

**ప్రతిబోధవిదితం మతమమృతత్వం హి విన్దతే**
**ఆత్మనా విన్దతే వీర్యం విద్యయా విన్దతేఽమృతం** – కేన 2.4

**మంత్రం – 18**

**న జాయతే మ్రియతే వా విపశ్చి న్నాయం కుతశ్చిన్న బభూవ కశ్చిత్**
**అజో నిత్యః శాశ్వతోహోయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే॥**

**ప్రతిపదార్థం:** విపశ్చిత్ – ఆత్మ; న జాయతే – పుట్టదు; మ్రియతే వా – మరణించటమూ లేదు; అయం న కుతశ్చిత్ – ఇది దేని నుంచీ రూపొందింది కాదు. న బభూవ కశ్చిత్ – దేనికీ కారణం కాదు; అజః – పుట్టుక లేదు; నిత్యః – చావు లేదు; శాశ్వతః – అపక్షీయ రహితమైనది; పురాణః – వృద్ధిరహిత; శరీరే – శరీరం; హన్యమానే – నశించినప్పటికీ, న హన్యతే – నశించదు.

**తాత్పర్యం:** ఆత్మకి పుట్టుక, చావు లేదు. ఆత్మకి షడ్ వికారాలు లేవు. ఇది కార్యం కాదు, కారణం కాదు. శరీరం నశించినా, ఇది నశించదు.

**వివరణ:** భగవద్గీతలో ఇంచుమించు ఇదే శ్లోకం ఉంది. ఆఖరి రెండు పాదాలు అక్షరాలా ఒకటే. భగవద్గీత ఉపనిషత్తుల సారం. కఠోపనిషత్తులోంచి కొన్ని మంత్రాలు గ్రహింపబడ్డాయి.

**న జాయతే మ్రియతే వా కదాచిత్ నాయం భూత్వా భవితా వా న భూయః।**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే॥** – గీత 2.20

ఇంతవరకు విమానం రన్వే మీద నడిచింది. ఇప్పుడు ఒక్కసారిగా గాలిలోకి ఎగురుతోంది. ఇంతవరకూ మనని సిద్ధం చేసాడు యమధర్మరాజు. ఇంతకు ముందు 3 మంత్రాల్లో మంద, మధ్యమ, విద్యార్థికి ఓంకార ఉపాసన చెప్పాడు. నచికేతుడు నిర్గుణబ్రహ్మ గురించి అడిగితే, ఓంకారాన్ని సగుణ బ్రహ్మ ఉపాసనకి ఎందుకు చెప్పాడు అని అనుమానం రావచ్చు. మంద, మధ్యమ విద్యార్థుల కోసం చెప్పాడని శంకరాచార్యులు చెప్తారు.

ఇక్కడ్నుంచి ఆత్మ లక్షణ మంత్రాలు మొదలవుతాయి. సూక్ష్మమైన విద్య ఇది. అసలు బోధ ఇది. ఈ మంత్రంలో ఆత్మకి రెండు నిర్వచనాలు వస్తాయి.

1. విపశ్చిత్ – సర్వప్రకాశక చైతన్యం – చిద్రూపస్య ఆత్మ – అన్ని పేర్లూ ఒకటే. ఈ సర్వప్రకాశక చైతన్యానికి ఐదు అంశాలు ఉన్నాయి. అవి –

1. చైతన్యం శరీరంలో ఒక భాగం కాని, లక్షణం కాని, దాని నుంచి ఉత్పత్తి అయిన వస్తువు కాని కాదు.

2. చైతన్యం స్వతంత్ర వస్తువు. అది శరీరం అంతటా వ్యాపించి, దాన్ని ప్రకాశింపజేస్తుంది.

3. చైతన్యం శరీరం సరిహద్దులకే పరిమితమవలేదు.

4. చైతన్యం, శరీరం నాశనమయితే నాశనమవదు. శరీర పతనానంతరం కూడా చైతన్యం ఉంటుంది.

5. చైతన్యం, శరీరం లేక పోయినా ఉంటుంది కాని కనబడదు. దాన్ని ప్రతిబింబింప చేసే మాధ్యమం లేదు కాబట్టి అది కనిపించదు. అంతమాత్రాన చైతన్యం లేనట్టు కాదు.

ఆత్మకు శరీర లక్షణాలుంటే దానికి విడిగా ఉనికి ఉండదు. చైతన్యం విశేషణం కాదు, సర్వనామం. కాకపోతే కంటికి కనబడదు. రంగు, రుచి, వాసనల లాంటి లక్షణాలు లేవు. లక్షణాలు లేని శుద్ధ చైతన్యం ఆత్మస్వరూపం.

2. ఆత్మ నిర్వికార చైతన్యం – షడ్ వికార రహిత చైతన్యం ఆత్మ. శరీరానికి షడ్ వికారాలు ఉన్నాయి. అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి – తల్లి గర్భంలో ఉండి, పుట్టి, పెరిగి, మార్పులు చెంది, కృశించి, మరణిస్తుంది. ఆత్మ ఈ శరీరంతో దగ్గరగా ఉన్నా శరీరంలా మార్పు చెందదు. ఉదా: కాంతి చేతికి సర్వవ్యాపకంగా ఉంది. కాని చేయి కదిపినా, వేళ్ళు కదిపినా, చేయి ముడతలు పడినా, కాంతికి ఏమీకాదు. షడ్ వికారాలని ఈ పదాలతో వర్ణించాడు.

అజః – పుట్టుక లేదు; నిత్యః – చావులేదు; శాశ్వతః – నిత్యం ముందే ఉంది కాబట్టి అపక్షీయ రహితం అని తీసుకోవాలి అంటే కృశించదు; పురాణః – వృద్ధిరహిత; న విపరిణమతే కలుపుకోవాలి. అంటే పెరగదు. న హన్యతే – నశించదు. శరీరం నశించినా ఇది నశించదు. హన్యతే అంటే మామూలుగా మరణం అని అర్థం. కాని పై పాదంలో మ్రియతే ఉంది. దాని అర్థం మరణం – అందుకని ఇక్కడ నశించదు అన్న అర్థం తీసుకోవాలి. అందువల్ల ఆత్మ శాశ్వతం.

**మంత్రం - 19**

**హన్తా చేన్మన్యతే హన్తుం హతశ్చేన్మన్యతే హతమ్।**
**ఉభౌ తౌ న విజానీతో నాఽయం హన్తి న హన్యతే॥**

**ప్రతిపదార్థం:** హన్తా హన్తుం మన్యతే చేత్ – నేను చంపాను అనుకుంటున్న వాడికీ; హతశ్చేన్మన్యతే హతం – చంపబడ్డాను అనుకుంటున్న వాడికీ; ఉభౌ తౌ న విజానీతః – ఇద్దరికీ తెలియదు; అయం న హన్తి – ఈ ఆత్మ చనిపోయేది కాదు; న హన్యతే – చంపబడేది కాదు.

**తాత్పర్యం:** నేను చంపాను అనుకుంటున్నవాడు నేను చంపబడ్డాను అనుకుంటున్నవాడూ ఇద్దరూ సత్యాన్ని తెలుసుకోలేని వారే. ఆత్మ చావదూ, చంపబడదూ కూడా.

**వివరణ:** ఇంకో ముఖ్యమైన మంత్రం ఇది. అందుకే భగవద్గీతలో కొంత తేడాతో ఇదే భావాన్ని చూస్తాము.

**య ఏవం వేత్తి హంతారం యశ్చైవం మన్యతే హతమ్।**
**ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే॥** – గీత 2.19

భాష వేరు, భావం ఒకటే. ఇందులో ఆత్మకు ఇంకో నిర్వచనం చూస్తాం.

3. **అకర్తా, అభోక్తా** – ఆత్మ కర్త కాదు, భోక్త కాదు. అంటే కర్మ చేయదు, కర్మఫలం అనుభవించదు.

ఎందుకు? కర్త అవాలంటే ఆత్మ కర్మచేయాలి. కర్మ చేయాలంటే మార్పు చెందాలి. మార్పు రెండు రకాలు. ప్రదేశపరంగా మార్పు, కాలపరంగా మార్పు. నిద్ర కూడా కర్మే. నిద్రలో శక్తి ఖర్చయి, లేవగానే ఆకలి వేస్తుంది. మనోవాక్కాయ కర్మలలో మార్పు ఉంటుంది. శరీరపరంగా చేసే పనులు మారితే,మనసులో ఆలోచనలు మారతాయి.

18వ మంత్రంలో ఆత్మ నిర్వికార స్వరూపంగా వర్ణించబడింది. మార్పు లేకపోతే కర్మ లేదు. కర్మ లేకపోతే కర్త కాలేదు. కర్మ లేదు కాబట్టి కర్మఫలం అంటే పాప, పుణ్యాలు లేవు. అందువల్ల భోక్త కాలేదు. అందువల్ల సంచిత, ఆగామి, ప్రారబ్ద కర్మలు అంటవు. దానివల్ల పునరపి జననం, పునరపి మరణం పొందదు కాబట్టి సంసార విముక్తి కలుగుతుంది. అలా ఆత్మ నిత్య,ముక్త స్వరూపం అవుతుంది.

వ్యాకరణపరంగా వర్ణించాడు యమధర్మరాజు. ఆత్మ చేసేదీ కాదు, చేయబడేదీ కాదు. చేసే పనులన్నింటిలోకీ అత్యంత శక్తివంతమైన చర్య – చంపటం. అందుకని చంపేదీకాదు, చంపబడేదీ కాదు అన్నాడు. అలా ఏ చర్య అయినా తీసుకోవచ్చు.

తినేదీ కాదు, తినబడేదీ కాదు. అవమానించేదీ కాదు, అవమానించబడేదీ కాదు అంటే సర్వవ్యవహార అగోచర ఆత్మ అన్నమాట.

ఈ నిర్వచనం కూడా సూటిగా చెప్పలేదు. కొంతమంది నేను హంతకుడిని అనుకుంటున్నారు, కొంతమంది నేను చంపబడ్డాను అనుకుంటున్నారు కాని ఇద్దరూ సత్యాన్ని తెలుసుకోలేని వారే. ఆత్మ చంపేదీ కాదు, చంపబడేదీ కాదు అని యమధర్మరాజు చెప్తున్నాడు.

ఈ నిర్వచనాన్ని మానసిక సమస్యలకి అన్వయిస్తే, మనం పడే అన్ని బాధలు కేవలం రెండింటి వల్ల వస్తున్నాయి. బాధ, అపరాధ భావం. నాకు ఎవరో ఏదో చేసారు అన్న బాధ, లేదా నేను ఏదో పొరపాటు చేసాను అన్న అపరాధ భావమే మనని తినేస్తుంది. ఈ రెండూ కలిపితే సంసారం. ఈ రెండింటి నుంచి స్వేచ్ఛ మోక్షం. ఇది తైత్తరీయ ఉపనిషత్తులో వివరంగా వస్తుంది. వేదాంతం అర్థం అవుతోంది కాని నెమ్మదే లేదు అంటారు కొందరు. నెమ్మది కావాలంటే చైతన్యతత్త్వాన్ని అర్థం చేసుకుని కర్తృత్వ, భోక్తృత్వ భావన పోగొట్టుకోవాలి. శరీరాన్ని సబ్బుతో శుద్ధి చేసినట్లు, మనసును ఈ నిజంతో శుద్ధి చేసుకోవాలి.

## మంత్రం – 20

**అణోరణీయాన్మహతో మహీయా–నాత్మా஽స్య జన్తోర్నిహితో గుహాయామ్।**
**తమక్రతుః పశ్యతి వీతశోకో ధాతుప్రసాదాన్మహిమానమాత్మనః॥**

**ప్రతిపదార్థం:** అణోః అణీయాన్ – అణువు కన్నా అణువైనదీ; మహతః మహీయాన్ – పెద్దదానికన్నా పెద్దదీ; ఆత్మా – ఆత్మ; అస్య – ఈ; జన్తోః గుహాయామ్ – ప్రాణుల హృద్గుహలో; నిహితః – ఉంది, తమ్ – దానిని; అక్రతుః – కోర్కెలు లేనివాడు; పశ్యతి – చూడగలడు; ధాతు ప్రసాదాత్ – ఇంద్రియాలు, మనసు సహకరిస్తే; ఆత్మ నః మహిమానమ్– ఆత్మ మహత్వాన్ని; వీతశోకః – శోకాలకు అతీతమవుతాడు.

**తాత్పర్యం:** అణువుకన్నా అణువైనదీ, అత్యంత పెద్దదాని కన్నా పెద్దదీ అయిన ఈ ఆత్మ ప్రాణుల హృద్గుహలో కొలువై ఉంది. సాధన చతుష్టయ సంపన్నుడు, దీన్ని దర్శించగలడు. మానసిక స్పష్టతలో ఆత్మ మహత్వాన్ని గ్రహించిన వాడు శోకాలకి అతీతుడవుతాడు.

**వివరణ:** ఇది కూడా చాలా ముఖ్యమైన మంత్రం.

ఎ. ఆత్మ స్వరూపం ఏమిటి?
బి. ఆత్మను ఎలా గుర్తించగలము?
సి. దానికి కావాల్సిన సాధన ఏమిటి?
డి. తెలుసుకోవటం వలన కలిగే ఫలమేమిటి?

ఈ నాలుగు ప్రశ్నలకూ జవాబు చెప్పటం ద్వారా ఇది ఒక సంపూర్ణ మంత్రం అయింది. వాటికి జవాబులు వరుసగా –

ఎ. ఆత్మ స్వరూపం – సర్వ అదిష్ఠానం ఆత్మ.

బి. గుర్తించే తీరు – సర్వవ్యాపక ఆత్మ నీలోనే సాక్షి చైతన్యంగా ఉంది.

సి. సాధన – సాధన చతుష్టయ సంపన్నం – వివేకం, వైరాగ్యం, శమాది షట్కసంపన్నం, ముముక్షుత్వం.

డి. ఫలం – ఆత్యంతిక ఆనందం.

4. సర్వ అధిష్ఠానం – ఈ మంత్రంలో ఆత్మ నిర్వచనం– సర్వ అధిష్ఠానం. ఆత్మ అధిష్ఠానం అంటే అన్ని వస్తువులకూ ఆధారం ఏదో అది. ఉదాహరణకు పూలదండలో ఉన్నదారం, పూలు ఉన్నంతవరకూ దారాన్ని గమనించము, కాని పువ్వులు రాలినా దారం ఉంటుంది. శరీరాలు – పువ్వులు. అనేక రకాల పువ్వులలాగా అనేక రకాల శరీరాలు – యవ్వన శరీరం, తాజా శరీరం, అందమైన శరీరం వగైరా. కనబడని దారం – చైతన్యం. ఇప్పుడు ఈ నాలుగు ప్రశ్నలనూ వివరంగా చూద్దాము.

ఎ. ఆత్మ స్వరూపం ఏమిటి? అది సత్ రూపం – ఇంగ్లీషులో ఏదైనా వస్తువుని వర్ణిస్తున్నప్పుడు.. దేర్ ఈజ్ ఏ మ్యాన్, దేర్ ఈజ్ ఏ కార్, దేర్ ఈజ్ ఏ ప్లానెట్ అంటూ పోతాము. ఈజ్‌నెస్ ఆత్మ. అంటే సత్‌రూపం. ఉదాహరణకు బంగారం తీసుకుంటే అతి చిన్న ముక్కుపుడకలోనూ ఉంది. అతి పెద్ద హారంలోనూ ఉంది. ఉండి కూడా లేదు అనటానికి వేదాంతంలో అస్తిచేదపి నాస్తి అంటారు. ముక్కుపుడకలో ఉన్నట్టే కనపడదు, ఉన్నా కూడా. ఆత్మ ఎక్కడ దొరుకుతుంది? అర్థం లేని ప్రశ్న.

లహర్ ఢూండే పానీకో,
కపడా ఢూండే సూయీకో,
జీవ ఢూండే పరమాత్మకో.

ఆత్మ సర్వవ్యాపక ఆత్మ. అది గుహాయం – నీ మనసులో, ప్రతి జీవిలో ఉంది. సర్వవ్యాపక ఆత్మ, శరీరానికే పరిమితమవలేదు. శరీరంలో ఉంది అనకూడదు, శరీరంలో కూడా ఉంది అనాలి. కాంతిచేతి మీద ఉంది అనకూడదు, చేతిమీద కూడా ఉంది అనాలి. చేతిమీద గుర్తిస్తున్నాము. విడిగా గుర్తించటం లేదు. అంతే తేడా.

బి. ఆత్మను ఎలా గుర్తించగలము? శూన్యత ఏర్పడితే వస్తుందా? ఆలోచన వస్తే ఆత్మ పోతుందా? అల వస్తే నీటిని తోసేసిందా? అలాగే ఆలోచన వస్తే, ఆత్మను తోసివేయగలదా?

ఆలోచనలు ఉన్న మనసుకు, ఆలోచనలు లేని మనసుకు సాక్షి చైతన్యం ఆత్మ. ఆత్మను సాధ్యవస్తువుగా వెతక్కూడదు. అది సిద్ధ వస్తువుగా గ్రహించి స్వీకరించాలి.

సి. దానికి కావాల్సిన సాధన ఏమిటి?దానికి యమధర్మరాజు ఒక నియమం పెట్టున్నాడు. విశ్రాంతి చెందిన మనసు ఆత్మను పొందుతుంది. కోరికలు ఉంటే మనసు రొదపెట్తూనే ఉంటుంది. దానివల్ల ఏకాగ్రత చెదురుతుంది. లక్ష్యం మీద గురి నిలవదు. కోరికలు ఉంటే చైతన్యాన్ని పారద్రోలవు కాని ఏకాగ్రతని చెడగొడతాయి. ఉదాహరణకి మీరు తోచక స్టేషన్‌కు మరొకరితో వెళ్లారనుకోండి. అప్పుడు సాక్షీభూతంగా అక్కడ జరుగుతున్నవన్నీ చూస్తారు. అదే ఊరినుంచి వస్తున్న ఎవర్నో దింపుకోవటానికి వెళితే ఏమీ గమనించరు. మీ దృష్టి వేరే ఎటో ఉంది. అలాగే పగలంతా పనుల్లో మునిగిపోయి గడియారం చేసే చప్పుడు వినరు. రాత్రి నిశ్శబ్దంగా పడుకున్నప్పుడు టిక్ టిక్ టిక్ స్పష్టంగా వినిపిస్తుంది. అలాగే ఆలోచనల్లో మునిగి ఉన్న మనసు సాక్షి చైతన్యాన్ని గ్రహించదు. అందుకని వైరాగ్యం చెందిన మనసు ఉన్న సాధన చతుష్టయ సంపన్నుడు మాత్రమే గ్రహించగలడు. అందుకని ఇంద్రియాలు, మనసు సహకరిస్తేనే గ్రహించగలడు. అందుకే శాంతి పాఠంలో నా అంగాలన్నీ వేదాంత ఫ్రెండ్లీగా ఉండు గాక అని ప్రార్థిస్తున్నాము.

ఆత్మనః మహిమానం – ఈ ఆత్మ మామూలుది కాదు, గొప్పది, ఉత్తమమైనది. ఎలా? ఇప్పటికే కొన్ని నిర్వచనాలు చూసాము.

ఆత్మ – 1. చైతన్య స్వరూపం 2. నిర్వికార స్వరూపం 3. అకర్తా, అభోక్తా 4. సర్వ అధిష్ఠానం

మహిమానం అని యమధర్మరాజు ఎందుకు వాడాడు? శంకరాచార్యులు దాని వివరణ ఇస్తున్నారు. తక్కిన వస్తువుల విషయం తీసుకుంటే వస్తువు వేరు, వాటి మహిమ వేరు. కాని ఆత్మ విషయంలో అలా కాదు. ఆత్మ వేరు, మహిమ వేరు కాదు.

డి. తెలుసుకోవటం వల్ల కలిగే ఫలమేమిటి? నా ఉన్నత స్థితిని ఒప్పుకుంటే శోకాలు పోతాయి. వేరే మార్గం ఉంది అని ఎవరైనా అనుకుంటే ప్రయత్నించి చూడండి. ఎందుకంటే ఆత్మజ్ఞానం ఒక్కటే దుఃఖ నివృత్తికి, ఆనంద ప్రాప్తికి మార్గం అని మన శాస్త్రాలు ఘోషిస్తున్నాయి.

**మంత్రం – 21**

**ఆసీనో దూరం వ్రజతి శయానో యాతి సర్వతః।**
**కస్తం మదామదం దేవం మదన్యో జ్ఞాతుమర్హతి॥**

**ప్రతిపదార్థం:** ఆసీనః – కూర్చుని; దూరం వ్రజతి – ఆత్మ ప్రయాణిస్తుంది; శయానః – సుషుప్తిలో; సర్వతః యాతి – సర్వవ్యాపకంగా ఉంటుంది; దేవం – చైతన్యం; మదామదం–

ఆనందం ఉండి, లేక; కః తం జ్ఞాతుమ్ అర్హతి – ఆత్మను ఎవరు అర్థం చేసుకోగలరు? మదన్యః – నేను తప్ప.

**తాత్పర్యం:** ఆత్మ కూర్చునే చాలా దూరం వెళుతుంది. పడుకునే సర్వవ్యాపకంగా ఉంటుంది. చైతన్యం ఆనందమయమైనది, దుఃఖమయమైనది కూడా. ఆత్మను నేను తప్ప ఎవరు అర్థం చేసుకోగలరు?

**వివరణ:** ఇది చాలా సూక్ష్మమైన అర్థం ఉన్న మంత్రం. ముందు మంత్రంలో సాధకుడు వివేక, వైరాగ్యాలతో కూడిన సాధన చతుష్టయ సంపన్నుడై ఉండాలి అన్నాడు. ఈ మంత్రంలో ఎందుకు వివేక, వైరాగ్యాలు ఉండాలో, ఎందుకు అందరికీ అర్థం కాదో తెలుస్తుంది. శంకరాచార్యుల వారు ఇంతకుముందు మంత్రాన్ని దీనితో కలుపుతూ ఎందుకు అందరికీ అర్థం కాదో ఒక్క ముక్కలో చెప్తున్నారు. ఎందుకంటే ఆత్మ భిన్న లక్షణాలు ఉన్నట్టు కనబడుతోంది.

ఆత్మ, మనం బాహ్యంగా నేర్చుకునే వస్తువులాంటిది కాదని పదే పదే చూస్తూనే ఉన్నాము. మార్పులేని ఆత్మను, మారుతున్న మనసుతో కలిపి దాని లక్షణాలు ఆత్మకు అంటగడ్తున్నాము.

5. **నిరుపాధిక సోపాధిక చైతన్యం** – ఇక్కడ ఆత్మకు రెండు లక్షణాలను చూస్తున్నాము. ఆత్మ సర్వవ్యాపకం అని నేర్చుకున్నాము. దీన్ని సామాన్య చైతన్యం అంటారు. ఇంగ్లీషులో ఒరిజినల్ కాన్షస్‌నెస్ అంటారు. దీనికి పరిమితం లేదు.

ఈ సామాన్య చైతన్యాన్ని మనసు గ్రహించి, దాన్ని ప్రతిబింబింపచేస్తుంది. అప్పుడది ప్రతిబింబ చైతన్యం అవుతుంది. రిఫ్లెక్టెడ్ కాన్షస్‌నెస్ అంటారు. మనసు ప్రతిబింబ మాధ్యమం అవుతుంది. రిఫ్లెక్టింగ్ మీడియమ్ అంటారు. ఇప్పుడు ప్రతిబింబ చైతన్యం ఒక ప్రదేశానికి పరిమితమైందా, సర్వవ్యాపకమా? ప్రతిబింబ పదంలోనే ఉంది జవాబు. దానికి ప్రతిబింబించే మాధ్యమం ఉంటేనే అది ఉన్నట్టు తెలుస్తుంది. అందుకని ప్రతిబింబ చైతన్యాన్ని విశేష చైతన్యం అంటారు. ఇది పరిమితమైంది. దీన్ని జాగ్రదావస్థలో గ్రహించవచ్చు. తమాషా ఏమిటంటే విశేష చైతన్యం వచ్చి, సామాన్య చైతన్యాన్ని అధిగమించింది. అంతమాత్రాన సామాన్య చైతన్యం లేదని కాదు.

దీనికి ఉదాహరణ – పంచదశిలో విద్యారణ్యస్వామి చక్కగా వర్ణిస్తారు. సూర్యరశ్మి ఒక గోడమీదంతా ఉంది. అక్కడికి అద్దం తెస్తే, అద్దం ద్వారా సూర్యుని ప్రతిబింబం గోడమీద పడుతుంది. ఇప్పుడు ఆ గోడ మీద ఎన్ని కాంతులు ఉన్నాయి? రెండు. 1. గోడమీదంతా అసలు సూర్యకాంతి పడుతోంది. 2. ఒకచోట ప్రతిబింబ సూర్యకాంతి పడుతోంది. ప్రతిబింబ

కాంతి ఉంటే అసలు సూర్యకాంతి ఉందా లేదా? ఉంది కాని, విశేష సూర్యప్రకాశం వల్ల తెలియటం లేదు.ఎలా తెలుసు? అద్దం తీసేస్తే ప్రతిబింబకాంతి పోతుంది. అసలు సూర్యకాంతి మిగులుతుంది.

అలాగే శరీరంలో రెండు చైతన్యాలు ఉన్నాయి. సామాన్య చైతన్యం (బింబ చైతన్యం), విశేష చైతన్యం (ప్రతిబింబ చైతన్యం). బింబ చైతన్యాన్ని ప్రతిబింబింప చేసేది మనసు. దాన్ని ప్రతిబింబ మాధ్యమం అంటారు. ప్రతిబింబ మాధ్యమమైన మనసు,శరీరంతోపాటు జాగ్రదావస్థలో ఒక చోటి నుంచి ఇంకోచోటికి వెళ్తుంది కాబట్టి ప్రతిబింబ చైతన్యం ప్రయాణం చేస్తున్నట్టు అవుతుంది. సామాన్య చైతన్యం సర్వవ్యాపకం కాబట్టి అది కదలదు.

మనిషి మరణించినప్పుడు, మనసు ప్రయాణిస్తుంది. మనసు ప్రతిబింబించే ప్రతిబింబ చైతన్యం కూడా ప్రయాణిస్తుంది. ఆత్మ ప్రయాణం చేస్తున్నట్టు ఉంటుంది కాని అది బింబచైతన్యం కాదు, ప్రతిబింబ చైతన్యం. మనం బింబ చైతన్యం లేదా సామాన్య చైతన్యాన్ని పట్టించుకోము. అందుకే మనం ఎక్కడ ఉన్నాము అంటే మన వీధి పేరో, ఊరిపేరో చెప్తాం. అది ప్రతిబింబ చైతన్యపరంగా ఇచ్చిన జవాబు. బింబ చైతన్యపరంగా అయితే ఎక్కడ లేము అని తిరిగి ప్రశ్నించాలి.

సుషుప్తి అవస్థలో మనసు కూడా నిద్రపోతుంది కాబట్టి, ప్రతిబింబ చైతన్యం తెలియదు. నిద్ర లేచాక బాగా నిద్రపోయాను అంటాము. అప్పుడు బింబ చైతన్యం సర్వవ్యాపకంగా తెలుస్తుంది. అదే ఆత్మ అసలు స్వరూపం. ప్రతిబింబ చైతన్యం కాక, బింబ చైతన్యం గురించి తెలుసుకోవాలంటే ఏం చేయాలి? సుషుప్తిలోకి వెళ్ళాలా? అఖ్ఖరలేదు. చైతన్యాన్ని సామాన్య, విశేష అంశద్వయంగా తెలుసుకోవాలి. ఈ మంత్రంలో ఆత్మ లక్షణం నిరుపాధిక, సోపాధిక చైతన్యం.

ఇలా విభిన్న లక్షణాలు వున్నట్టుగా కనబడుతున్న ఆత్మను అర్థం చేసుకోవటానికి సంసిద్ధమైన మనసు కావాలి. ఈ సందర్భంలో శంకరాచార్యుల వారు చింతామణి ఉదాహరణ ఇస్తున్నారు. ఇది స్వర్గంలో దొరికే అమూల్యరత్నం. దీని ప్రత్యేకత ఏమిటంటే దీనికంటూ రంగూ, రూపు లేదు. ఇది స్ఫటికం లాంటిది కూడా కాదు. స్ఫటికానికి, దాని పక్కన ఏ వస్తువు పెడితే ఆ రంగు వస్తుంది. చింతామణి వస్తువు మీద ఆధారపడదు. ఎవరి దగ్గర ఉంటే ఆ వ్యక్తి మీద ఆధారపడుతుంది. అలాగే ఆత్మ కూడా. అది సగుణ బ్రహ్మ అవచ్చు, నిర్గుణబ్రహ్మ అవచ్చు. తెలివైన వ్యక్తి ముందు మంత్రంలో సూచించినట్టుగా ఆత్మ మహిమను గుర్తిస్తాడు. అంటే సగుణ, నిర్గుణ లక్షణాలూ రెండూ ఒక్క ఆత్మవే అని గుర్తిస్తాడు. స్థూల బుద్ధి ఉన్న వ్యక్తికి అర్థం కాదు. అందుకే సాధన చతుష్టయ సంపత్తి అవసరం.

ఈ వివరణతో మంత్రంలోకి వెళ్దాము. దూరం ప్రజతి – ఆత్మ ప్రయాణిస్తుంది. జాగ్రత్ అవస్థలో బింబ చైతన్యం తెలియదు. సుషుప్తిలో మనసు సమసిపోతుంది. ప్రతిబింబ మాధ్యమం అందుబాటులో లేదు. అందువల్ల పరిమితమైన ప్రతిబింబ చైతన్యం లేదు. మరి ఏం మిగిలింది? బింబచైతన్యం.

ఎక్కడ? సర్వ వ్యాపకంగా ఉంది, బల్బ్‌లో విద్యుచ్ఛక్తి ఉన్నా అది వెలిగితే కాని తెలియదు. శరీరం బల్బులాంటిది. మనసు ఫిలమెంట్, మరణం మాడిపోయిన బల్బు. బల్బు మాడింది కాని విద్యుచ్ఛక్తి పోలేదు. కాంతిని చేయి పుట్టించటం లేదు కాని కాంతి చేతిలో అనుభవం అవుతోంది.

దేవం మదామదం – చైతన్యం సుఖ దుఃఖాలను అనుభవిస్తున్నట్టు ఉంది. చైతన్యానికి సుఖదుఃఖాలు ఎలా కలుగుతాయి? జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. దీనికి చాలా సూక్ష్మ బుద్ధి కావాలి.

మనసే సుఖం, దుఃఖం అనుభవిస్తుంది. మనసు నిద్రిస్తున్నప్పుడు ఇవి లేవు. సుఖం మనసుకి చెందిన ఆలోచనలో ఉంది. ఆలోచన మారితే, సుఖం మారుతుంది. మనసు ప్రతిబింబించే ప్రతిబింబ చైతన్యం కూడా అనుభవిస్తున్నట్టు కనిపిస్తుంది. ప్రతిబింబ చైతన్యం దృష్ట్యా ఆత్మ కూడా అనుభవిస్తుంది. సామాన్య చైతన్యం దృష్ట్యా ఏ అనుభవమూ లేదు.

ఒక బల్లలో సామాన్య చైతన్యం ఉంటుంది. దానికి సుఖం ఉందా? లేదు. దుఃఖం ఉందా? లేదు. ఒక అజ్ఞాని తనను ప్రతిబింబ చైతన్యం అనుకుని నాకు సుఖం కావాలి, దుఃఖంలో ఉన్నాను అనుకుంటాడు. జ్ఞాని తనను సామాన్య చైతన్యం లేదా బింబ చైతన్యం అని తెలుసుకుని, సుఖదుఃఖాలకు అతీతంగా ఉంటాడు.

**న పుణ్యం న పాపం న సౌఖ్యం న దుఃఖం** – నిర్వాణషట్కమ్

నేను ఎవరు? ప్రతిబింబ చైతన్యం లేదా విశేష చైతన్యం నుంచి, బింబ చైతన్యం లేదా సామాన్య చైతన్యం వైపుకి దృష్టి మరల్చి చూస్తే మోక్షం. దీంతో వేదాంతం అయిపోయింది. కాని యమధర్మరాజు ఇంకా చెప్తున్నాడు, మనం కూడా చూద్దాము.

ఆత్మకు రెండు వర్ణనలు ఉన్నాయి. కదలిక ఉన్న ఆత్మ, సర్వవ్యాపకమైన ఆత్మ.

సుఖదుఃఖాలు ఉన్న ఆత్మ, సుఖదుఃఖాలకి అతీతమైన ఆత్మ. మరి ఎలా అర్థం చేసుకోవాలి? చేసుకోవాలంటే మనసుకు సూక్ష్మబుద్ధి ఉండాలి. అందుకే పదే పదే శ్రవణం చేయాలి. రాను రానూ, అంటే ముందు మంత్రాల్లోకి వెళ్ళినకొద్దీ స్పష్టత వస్తుంది.

కాని యమధర్మరాజు ప్రతికూల ఆలోచనలో ఉన్నాడు. హడలగొడ్తున్నాడు అందరినీ. ఆత్మను ఎవరు అర్థం చేసుకోగలరు? ఆత్మనః దుర్విఘ్నేయత్వం – అర్థం చేసుకోవటం కష్టం, మదన్య – నేను తప్ప అంటున్నాడు. తనను తాను మెచ్చుకుంటున్నాడు యమధర్మరాజు.

వెంటనే మనకొక సందేహం కలుగుతుంది. కష్టమైతే ఎందుకు నేర్పించటం? శంకరులవారు దీనికి వివరణ ఇస్తున్నారు. ఇది కష్టమే కాని అసాధ్యం కాదు. స్థూలబుద్ధి ఉన్న వాళ్ళు అర్థం చేసుకోలేరు కాని, యమధర్మరాజులాంటి వాళ్ళు, అంటే సూక్ష్మ బుద్ధి ఉన్నవాళ్ళు అర్థం చేసుకోగలరు. సూక్ష్మబుద్ధి ఎలా ఉండాలో ముందు మంత్రాల్లో వస్తుంది.

**మంత్రం – 22**

**అశరీరం శరీరేష్వనవస్థేష్వవస్థితమ్।**
**మహాన్తం విభుమాత్మానం మత్వా ధీరో న శోచతి॥**

**ప్రతిపదార్థం:** శరీరేషు అవస్థితమ్ – శరీరంలో ఉంది, అశరీరం – శరీరం లేనిది; అనవస్థేషు– అశాశ్వతమైన వస్తువులలో; అవస్థితమ్– ఉన్నది; మహాన్తం – పెద్దది; విభుమ్ – సర్వత్రా నిండి ఉన్నది; ఆత్మానం – ఆత్మను; మత్వా – తెలుసుకుని, ధీరః – వివేకి; న శోచతి – శోకించడు.

**తాత్పర్యం:** శాశ్వతమైన సర్వవ్యాపకమైన ఆత్మ ప్రతి అశాశ్వతమైన భౌతిక వస్తువులో ఉంది. పెద్దది. సర్వత్రా నెలకొని ఉంది. వివేకి దానిని తెలుసుకుని, శోకం నుంచి విముక్తి పొందుతాడు.

**వివరణ:** ఈ మంత్రంలో జ్ఞానఫలం వస్తుంది. ఆత్మ జ్ఞానం పొందినవాడు శోకాలకు అతీతుడవుతాడు. కాని ఈ విషయం మంత్రం చివరలో వస్తుంది. ముందు ఆత్మ లక్షణం వస్తుంది. అది అనంతం.

6. **అనంతం** – అశరీరం శరీరేషు – శరీరం లేని ఆత్మ శరీరంలో ఉంది. సర్వవ్యాపకమైన ఆత్మ ఎలా ఒక శరీరంలో ఉంటుంది? ఉందని ఈ ఉపనిషత్తులోనే ఇంకో చోట వస్తుంది.

అంగుష్ఠమాత్రా పురుషః
తం దుర్దర్శం గూఢమనుప్రవిష్టం – కఠ 1.2.12

అయితే ఎలా అర్థం చేసుకోవాలి? ఆత్మ శరీరంలో ఉంది అంటే దాని అర్థం ఆత్మ శరీరంలో కూడా ఉంది అని అర్థం చేసుకోవాలి కాని, శరీరంలో మాత్రమే అని కాదు. శాశ్వతమైన సర్వవ్యాపకమైన ఆత్మ ప్రతి అశాశ్వతమైన భౌతిక వస్తువులో ఉంది. ఆకాశం

అంతటా ఉండి, కుండలో కూడా ఉన్నట్టు. కుండ బద్దలయినా ఆకాశం ఉన్నట్టు, శరీరం పడి పోయినా ఆత్మ ఉంటుంది.

ఆత్మ ఎంత పెద్దది? విభుం మహాంతం – సర్వవ్యాపకం. చాలా పెద్దది. ఈ పెద్ద అన్నది సాపేక్షికంగా వస్తుంది. బావిలో కప్పతో సముద్రం పెద్దది అంటే ఎంత పెద్దది అని రకరకాలుగా అడుగుతుంది. ఒక చెయ్యి చాచి ఇంత పెద్దదా అనీ, బావిలో ఈ మూల నుంచి ఆ మూలకి ఈది ఇంత పెద్దదా అనీ అడుగుతుంది. దానికి అంతకన్న పెద్ద ప్రపంచం తెలియదు. కాని ఆత్మ సర్వవ్యాపకం. దాన్ని మించిన పెద్దది లేదు.

ఎలా తెలుసుకోవాలి? నాకు ఆత్మ ఉంది అని అంటే, నాకు కారు ఉంది అని చెప్పినట్టు. అలా చెప్తే ఆత్మను దూరం చేసుకుంటున్నాం. మరణించే శరీరంతో, బాధాకరమైన అంశంతో కలుపుకుంటున్నాము. నేను ఆత్మను అని తెలుసుకున్నవాడు ధీరుడు, సాధన చతుష్టయ సంపన్నుడు. ఆత్మ లక్షణాలు ఇప్పటి దాకా చెప్పినవి స్వీకరించాలి.

అవి – 1. చైతన్య స్వరూపం
2. నిర్వికార స్వరూపం
3. అకర్తా, అభోక్తా
4. సర్వ అధిష్ఠానం
5. నిరుపాధిక, సోపాధిక చైతన్యం
6. అనంతం.

నేను సామాన్య చైతన్యాన్ని; విశేష చైతన్యం వస్తుంది, పోతుంది, ప్రయాణిస్తుంది. సుఖదుఃఖాలను అనుభవిస్తుంది అని తెలుసుకున్నవాడు ధీరుడు. విశేష చైతన్యం నా విభూతి, నా మహిమ, నేను పట్టించుకోను అనుకుంటాడు.

ఫలం – ఆత్మను నేను అని తెలుసుకునే దానికన్నా అనాత్మను కాను అని తెలుసుకోవటం ఇంకా గొప్ప. అప్పుడు శోకం ఉండదు. ఇంతకుముందు మంత్రంలో కూడా కోర్కెలు లేనివాడు ఆత్మను చూడగలడు, మహిమను అర్థం చేసుకున్నవాడు శోకాలకి అతీతుడు అని అర్థం వస్తుంది.

**తమక్రతుః పశ్యతి వీతశోకో ధాతుప్రసాదాన్మహిమానమాత్మనః॥** – కఠ 1.2.20

అక్రతు – అర్థం సాధన చతుష్టయ సంపన్నుడు అని చూసాం.

## మంత్రం – 23

**నాయమాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహూనా శ్రుతేన।**
**యమేవైష వృణుతే తేన లభ్య స్తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్॥**

**ప్రతిపదార్థం:** అయమ్ ఆత్మా – ఈ ఆత్మ; ప్రవచనేన న లభ్యః – ప్రసంగాల చేత పొందబడదు; న మేధయా – పాండిత్యం చేతకాదు; న బహూనా శ్రుతేన – ఎంతో వినటం వల్ల కాదు; యమ్ ఏవ ఏష – ఎవరు దానికోసమే; వృణుతే – అంతిమ లక్ష్యంగా భావిస్తారో; తేన – అతడిచేత; లభ్యః – పొందబడుతుంది; తస్య – అతనికి; స్వామ్ – తన యొక్క; తనూం – తన స్వభావాన్ని, ఏష ఆత్మ – ఈ ఆత్మ, వివృణుతే – వెల్లడిస్తుంది.

**తాత్పర్యం:** కేవలం ప్రసంగాలు వినటం వల్లో, కేవలం పాండిత్యం వల్లో, కేవలం ఎంతో శ్రవణం చేయటం వల్లో ఆత్మ లభ్యం కాదు. ఎవరికి దానికోసం తీవ్ర ముముక్షుత్వం ఉంటుందో అటువంటి సాధకునిచేత ఆత్మ తనంతట తానే పొందబడుతుంది. అతనికి తన స్వభావాన్ని వెల్లడిస్తుంది.

**వివరణ:** 23, 24 మంత్రాలు ఆత్మని తెలుసుకునే సాధనలని సూచిస్తాయి. ఇంతకు ముందు నేను తప్ప ఎవరూ తెలుసుకోలేరు అన్నాడు యమధర్మరాజు. అంటే దీనికి కొంత ప్రత్యేక సాధన కావాలి. ఆత్మ స్వరూప వర్ణనలో కొంత పక్కకి జరిగి, సాధనలు వర్ణిస్తున్నాడు యమధర్మరాజు. ఈ మంత్రంలో తపనని నొక్కి వక్కాణిస్తున్నాడు. ముముక్షువుకు తీవ్ర జిజ్ఞాస ఉండాలి. ఏదో నేర్చుకుందాంలే అనుకుంటే దీవెన కూడా దానికి తగ్గట్టే ఉంటుంది. తీవ్ర జిజ్ఞాస ఎలా ఉండాలో శాస్త్రం ఒక ఉదాహరణ చూపిస్తుంది. ఇంటికి నిప్పంటుకుంటే, దానిమీద పొయ్యటానికి వాడే నీరు, ఏ నీరో చూడము. యమగండం, రాహుకాలం లాంటివి చూడము. యమగండంలో ఉన్నట్టే కదా. అలాగే సంసారమనే అగ్నిలో ఉన్నాము మనము. ఆదిభౌతిక, ఆధ్యాత్మిక, ఆది దైవిక తాపాల నుంచి గంగాజలం లాంటి జ్ఞానం కడతేర్చాలి మనను.

ముముక్షుత్వం అంటే ఒకటే కోరిక ఉంటుంది. అది ఆత్మ జ్ఞానం పొందాలన్న కోరిక. కాని నాకు పది రోజులుగా పనమ్మాయి లేదు, ఇప్పుడు నాకొక పనమ్మాయి కావాలి, అదే నాకు మోక్షం అనుకోకూడదు. స్వయంవరంలాగా మోక్షం కోసం తీవ్ర జిజ్ఞాసని ఆత్మవరణం అంటారు. మనకి ఎన్నో లక్ష్యాలు ఉన్నాయి. అందులోంచి మోక్షం ఎన్నుకోవాలి. ఇది తీవ్రంగా ఉంటే, అన్ని సాధనలూ ఫలిస్తాయి. లేకపోతే ముందు ఒకటి అంకె లేని సున్నాల్లా ఉంటాయి అవి. ఇక్కడ యమధర్మరాజు కొన్ని సాధనలు చెప్తున్నాడు.

ఎ. ప్రవచనం – వేద అధ్యయనం. ప్రవచనం అంటే మామూలు అర్థం ప్రసంగం. ఇక్కడ వేద పారాయణం.

స్వాధ్యాయ ప్రవచనేన – తైత్తరీయం. ఏదైనా శాస్త్రాన్ని అధ్యయనం చేయాలి.

బి. మేధా – కంఠతా పట్టటం. గ్రంథ అర్థధారణ శక్తి అంటారు. మేధాశక్తిలో రెండు విషయాలు ఉంటాయి. చెప్పింది అర్థం చేసుకోవటం, అర్థం చేసుకున్న దాన్ని గుర్తుంచుకుని అప్పచెప్పటం.

సి. శ్రవణం – పదే పదే వినటం.

ఈ సాధనలు చేయాలి కాని ఇక్కడ ముముక్షత్వాన్ని వివరిస్తున్నారు కాబట్టి కేవలం ప్రసంగాల వల్ల, కేవలం పాండిత్యం చేత, కేవలం పదే పదే వినటం వల్ల మోక్షం పొందరు అని చెప్తున్నాడు యమధర్మరాజు. యమే వైష వృణుతే తేన లభ్యః ఎవరు దాన్ని అంతిమ లక్ష్యంగా భావిస్తారో,

తస్యైష ఆత్మా వివృణుతే – అటువంటి సాధకునిచేత ఆత్మ తనంతట తానే పొందబడుతుంది. తనూం స్వామ్ – తన స్వభావాన్ని వెల్లడిస్తుంది.

మొదటి అర్థం – ఈ అర్థం వ్యాకరణపరంగా వస్తుంది. ఎవరు ఎన్నుకుంటారో వాళ్ళు ఆత్మను పొందుతారు అనేకన్నా ఆత్మ ఎవరిని ఎన్నుకుంటుందో వాళ్ళు ఆత్మను పొందుతారు అని ఒక అర్థం.

రెండో అర్థం – ఆత్మ బదులు భగవంతుడు అంటే అర్థమవుతుంది. నేను భగవంతుడిని ఎన్నుకుంటే భగవంతుడిని పొందుతాను. భగవంతుడు నన్ను ఎన్నుకుంటే భగవంతుడిని పొందుతాను. ఏది సరియైన వాక్యం? నేను ఎన్నుకోవటమా? భగవంతుడు నన్ను ఎన్నుకోవటమా? ఇంకో మాటలో చెప్పాలంటే స్వయం ప్రయత్నమా లేక ఈశ్వర అనుగ్రహమా? మనం ఈశ్వర అనుగ్రహమే సరియైనది అంటాము కాని, వేదాంతం మన ప్రయత్నానికే ప్రాముఖ్యత ఇస్తుంది. ఎందుకు?

1. భగవంతుడు మనని ఎన్నుకున్నాడంటే, భగవంతుడు పక్షపాతం చూపినట్టు అయిపోతుంది. అలాంటి పక్షపాత వైఖరి ఉన్న భగవంతుడిని ఎలా ప్రార్థిస్తాము అనచ్చు ఎవరైనా.

2. భగవంతునికి ప్రాముఖ్యత ఇవ్వలేదంటే దానికి కారణం గర్వం చూపించటమో, భక్తి లేకపోవటమో కాదు. భక్తి లేకపోతే శాంతి పాఠంతో మొదలుపెట్టము కదా! దైవకృప ఎప్పుడూ ఉంటుంది సౌరశక్తిలాగా. సూర్యునికి శక్తి ఉంది అనటం తప్పు, సూర్యుడే శక్తి.

అలాగే దేవుని కృప అనంతంగా ప్రవహిస్తుంది. మనం కృపని కించపరచటం లేదు, ప్రయత్నానికి ప్రాముఖ్యతనిస్తున్నాము. అందుకే మోక్షం కూడా పురుషార్థాలలో ఒకటిగా పేర్కొనబడింది.

మూడో అర్థం – ఆత్మ సాధకునికి లభ్యమవుతుంది అనటం లేదు ఉపనిషత్తు. ఆత్మ, ఆత్మకు లభ్యమవుతుంది అంటోంది. అంటే శంకరాచార్యులవారు, ఉపనిషత్తులోని గూఢార్థాన్ని ఇలా వివరిస్తున్నారు. సాధకుని స్థానంలో ఆత్మ పదం పెట్టటం వల్ల, సాధకుడు, సాధ్యవస్తువు రెండూ ఒకే ఆత్మ అని ఉపనిషత్తు సూచిస్తోంది. అందువల్ల ఆత్మ వేరే సాధనల వల్ల లభ్యమవదు, ఆత్మవరణం చేసిన వ్యక్తికే లభ్యమవుతుందని అర్థం. ఆత్మవరణాన్ని గొప్పగా చూపించటం కోసం తక్కిన సాధనలను కించపరచినట్టు చేసింది ఉపనిషత్తు. దీన్ని నహి నిందా న్యాయం అంటారు. తక్కిన సాధనలు కూడా ముఖ్యమే, కాని ఇక్కడ ప్రాముఖ్యత ఆత్మవరణంకి ఉంది.

## మంత్రం – 24

**నావిరతో దుశ్చరితాన్నాశాన్తో నాసమాహితః।**
**నాశాన్తమానసో వాఽపి ప్రజ్ఞానేనైనమాప్నుయాత్॥**

**ప్రతిపదార్థం:** దుశ్చరితాత్ న అవిరతః – చెడు ప్రవర్తన నుంచి వైదొలగని వాడు, న అశాన్తః మానస – ఇంద్రియ నిగ్రహం లేనివాడు; న అసమాహితః – ఏకాగ్రత లేనివాడు; వా అపి– ఉద్రిక్తత ఆపుకోలేనివాడు; ప్రజ్ఞానానేన – కేవల వేదవిజ్ఞానం వల్ల; ఏనమ్ న ఆప్నుయాత్– ఈ ఆత్మను పొందలేడు.

**తాత్పర్యం:** చెడు ప్రవర్తన నుంచి వైదొలగని వాడు, ఇంద్రియ నిగ్రహం లేనివాడు, ఏకాగ్రత లేనివాడు, ఉద్రిక్తత ఆపుకోలేని వాడు, కేవల వేదవిజ్ఞానం వల్ల ఈ ఆత్మను పొందలేడు.

**వివరణ:** మరికొన్ని సాధనలు చెప్పబడ్డాయి.

డి. ధర్మాచరణ – నైతిక జీవన విధానం
ఇ. దమః – ఇంద్రియ నిగ్రహం
ఎఫ్. సమాధానం – వ్యవసాయాత్మికా బుద్ధి లేదా ఏకాగ్ర చిత్తం
అష్టాంగయోగంలో యమ, నియమాల కింద వస్తుంది.
జి. శమః – మనో నిగ్రహం

చెడు ప్రవర్తన నుంచి వైదొలగని వాడు, ఇంద్రియ నిగ్రహం లేనివాడు, ఏకాగ్రత లేనివాడు, మనో నిగ్రహం లేనివాడు, ఈ ఆత్మను పొందలేడు. ఒకవేళ పొందినా అది

కేవలం పైపై జ్ఞానమే అవుతుంది. వీటిని ఉపనిషత్తు రెండు వ్యతిరేక పదాల ప్రయోగంతో వివరిస్తుంది. దీన్ని సానుకూల పద ప్రయోగంతో చెప్పాలంటే, ఈ నాలుగు లక్షణాలూ ఉన్న సాధకుడే జ్ఞానం ద్వారా మోక్షాన్ని పొందగలడు. అంటే అతను సాధన చతుష్టయ సంపన్నుడై ఉండాలి.

**మంత్రం – 25**

**యస్య బ్రహ్మ చ క్షత్రం చ ఉభే భవత ఓదనః।**
**మృత్యుర్యస్యోపసేచనం క ఇత్థా వేద యత్ర సః॥**

**ప్రతిపదార్థం:** యస్య – ఎవరికి; బ్రహ్మ చ క్షత్రం చ – బ్రాహ్మణుడు, క్షత్రియుడూ; ఉభే – ఇద్దరూ; భవతః ఓదనః – ఆహారం అవుతారో; యస్య – ఈ ఆత్మకు; మృత్యుః – మరణం, ఉపసేచనం – ఊరగాయగా; కః ఇత్థా వేద – ఏ సాధకుడు ఈ విధంగా తెలుసుకుంటాడు? యత్ర సః – ఆత్మ ఎక్కడ ఉందో ఎవరు చెప్పగలరు?

**తాత్పర్యం:** ఎవరికి బ్రాహ్మణుడు, క్షత్రియుడు – ఇద్దరూ – ఆహారం అవుతారో, మరణం ఎవరికి దేశకాల అతీతంగా ఊరగాయగా ఉన్నదో, ఎవరు తెలుసుకుంటారు? అది ఎక్కడ ఉందో ఎవరు చెప్పగలరు?

**వివరణ:** ఈ మంత్రంతో ఈ వల్లీ ముగింపుకొస్తుంది. యమధర్మరాజు కొంత పక్కకి వెళ్ళి మళ్ళీ ఆత్మజ్ఞానంకి వస్తున్నాడు. ఈ మంత్రం ద్వారా వచ్చే నిర్వచనం – ఆత్మ దేశకాల అతీతం.

7. **దేశకాల అతీతం** – ఆత్మ జగత్‌సృష్టి, స్థితి, లయ కారణం– ఈ మంత్రంలో లయ కారణం మీద కేంద్రీకరిస్తున్నాడు. ప్రళయంలో మొత్తం ప్రపంచం అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది. ఇదీ సారాంశం. కాలం కూడా సృష్టిలో ఒక భాగమని యమధర్మరాజు చూపిస్తున్నాడు.

సృష్టి ఆత్మ నుంచి వచ్చింది. ఆత్మలో లయమవుతోంది. ప్రపంచాన్ని ఓదన – ఆహారంగానూ, కాలతత్వాన్ని ఉపసేచనమ్ – అందులో నంజుకునే ఊరగాయగాను వర్ణించటం జరిగింది. ఆత్మ కాలాన్ని, ప్రదేశాన్ని ముంచేస్తోంది. అంటే ఆత్మ కాలానికి, ప్రదేశానికి అతీతంగా ఉంది. ఆత్మ ఎక్కడ ఉంది అంటే ప్రదేశం చెప్పాల్సి ఉంటుంది. కాని ప్రదేశమే ఆత్మలో ఉంది. ఆత్మ ఎప్పుడు వచ్చింది అంటే కాలమే ఆత్మలో ఉంది. అందుకని ఇలాంటి మామూలు ప్రశ్నలు ఆత్మకు వేయలేము.

ఈ మంత్రం ఒక మహత్తరమైన మంత్రం. సృష్టిని ఆహారంగానూ, కాలాన్ని నంజుకునే పదార్థంగానూ వర్ణించాడని చూసాము. ఆ ఆహారం ప్రపంచం అనకుండా బ్రహ్మచ క్షత్రం

చ అంటున్నాడు. బ్రహ్మ అంటే ఇక్కడ సత్యం, జ్ఞానం, అనంతం బ్రహ్మ కాదు. బ్రహ్మ అంటే బ్రాహ్మణుడు, క్షత్రం అంటే క్షత్రియుడు. ఉభే భవతః ఓదనః – వీళ్లిద్దరూ ఆహారం అవుతారు ఈ ఆత్మకు. ఎప్పుడు? ప్రళయకాలంలో. వీళ్ళనే ఎందుకు చెప్పారు? శాస్త్రం ప్రకారం వీళ్లిద్దరూ గొప్పవాళ్ళు. బ్రాహ్మణులు ధార్మిక విలువలు పాటిస్తారు, క్షత్రియులు ధార్మిక విలువలను రక్షిస్తారు. ఒకళ్ళు బోధించి సమాజాన్ని మారిస్తే, ఇంకోళ్ళు శిక్ష విధించి సమాజాన్ని కాపాడుతారు. వీళ్ళిద్దరినీ తక్కిన సృష్టికి ప్రతీకలుగా తీసుకున్నాడు.

ఆత్మ ఇలా ప్రపంచాన్ని లయం చేస్తుందని ఏ సాధకుడు తెలుసుకుంటాడు? ఆత్మ ఎక్కడ ఉందో ఎవరు చెప్పగలరు? ఈ ప్రశ్నలను ప్రశ్నలుగా తీసుకోకూడదు. వీటిలోనే జవాబు నిగూఢంగా ఉంటుంది. ఎవరూ చెప్పలేరు లేదా ఏ కొద్దిమందో చెప్పగలరు అని అర్థం. ఆత్మ ఎక్కడ ఉంది అంటే ఆత్మ ప్రదేశానికి అతీతంగా ఉంది అని అర్థం. కాని మనమెలా పొరపడుతున్నాము? అనంత పద్మనాభస్వామి ఎక్కడ ఉన్నాడు అంటే కేరళలో ఉన్నాడంటున్నాము. ఆత్మ దేశకాలాలకు అతీతంగా ఉంది అని అర్థం.

# అధ్యాయం - 1 వల్లీ - 3

ఇందులో కూడా ఆత్మ విద్యాబోధే ఉంది. ఈ విద్య సూక్ష్మమైంది కాబట్టి, మళ్ళీ మళ్ళీ వినాలి. పదే పదే అభ్యాసం చేయాలి. బండరాయి మీద కొన్నాళ్లుగా చీమ వెళితే, దాని మీద చీమ వెళ్ళే మార్గం కనబడుతుంది. అలాగే రాయి లాంటి మన మనసులోకి పదే పదే శ్రవణం చేసిన విషయాలు వెళితే, వాటి ముద్ర ఏర్పడుతుంది.

ఈ వల్లీలో ఆత్మ జ్ఞానం పొందటానికి కావాల్సిన సాధనలు వస్తాయి. ఆత్మ బోధ ఉంటుంది. ఆ ఆత్మ జ్ఞానఫలం కూడా వస్తుంది.

### మంత్రం - 1

**ఋతం పిబన్తౌ సుకృతస్య లోకే గుహాం ప్రవిష్టౌ పరమే పరార్ధే।**
**ఛాయాతపౌ బ్రహ్మవిదో వదన్తి పఞ్చాగ్నయో యే చ త్రిణాచికేతాః॥**

**ప్రతిపదార్థం:** యే – ఎవరో; సుకృతస్య – తాము చేసుకున్న; ఋతం పిబన్తౌ – కర్మఫలం అనుభవించువారై; లోకే – (ఇక్కడ) శరీరంలో; పరమే – శ్రేష్ఠమైన; పరార్ధే – సూక్ష్మమైన; గుహాం ప్రవిష్టౌ – హృద్గుహలో ప్రవేశించినవారు; ఛాయాతపౌ – నీడ, ఎండవంటి వారు; బ్రహ్మవిదః వదన్తి – జ్ఞానులు అంటారు; పఞ్చాగ్నయః – అయిదు అగ్నులను ఉపాసించినవారు; త్రిణాచికేతాః – నాచికేత వ్రతాన్ని మూడుసార్లు చేసినవారు.

**తాత్పర్యం:** జీవాత్మ పరమాత్మ ఇద్దరూ ఉన్నారు. ఇద్దరూ శరీరంలో హృద్గుహలో సూక్ష్మమైన ప్రదేశంలో ఉన్నారు. ఎండ, నీడ లాగా ఉన్నారు. ఇద్దరూ కర్మఫలాలను అనుభవిస్తున్నారు. జ్ఞానులు పరమాత్మ గురించి చెప్తే, కర్మకాండ చేసేవాళ్ళు జీవాత్మ గురించి చెప్తారు.

**వివరణ:** ఇందులో జీవాత్మ, పరమాత్మల లక్షణం చెప్తున్నాడు యమధర్మరాజు. పరమాత్మ అంటే పరమ + ఆత్మ అంటే సర్వ వ్యాపకమైన ఆత్మ. అందుకని అది ఏకం నిత్యం సర్వగతం, నిర్వికారం, అచలం. అది సామాన్య చైతన్యం లేదా బింబ చైతన్యం. అది గుహాం ప్రవిష్టౌ– మనసులో ఉంది.

మనసు జడం. మనసుని ఆలోచనల ప్రవాహంగా నిర్వచిస్తాము. కాని శాస్త్రం మనసుని ఆలోచనల ప్రవాహం ఉన్న వస్తువుగా అభివర్ణిస్తుంది. మనసులో ఆలోచనలు వస్తాయి, పోతాయి.సుషుప్తిలో మనసు శూన్యంగా ఉంటుంది. నిద్రలో కూడా మనసు ఉందని ఎలా తెలుసు? మర్నాడు పొద్దున్నే నిద్ర లేవగానే అది పనిచేస్తుంది కాబట్టి. మనసు ప్రత్యేకత ఏమిటి? అది బింబ చైతన్యాన్ని ప్రతిబింబింపచేస్తుంది. అందువల్ల దానికి జీవం వస్తుంది. మనసు ప్రతిబింబించిన దాన్ని ప్రతిబింబ చైతన్యం అంటారు. బింబ చైతన్యాన్ని సామాన్య చైతన్యం అనీ, చిత్ అనీ కూడా అంటారు. అలాగే ప్రతిబింబ చైతన్యాన్ని విశేష చైతన్యం అనీ, చిదాభాస అనీ కూడ అంటారు. ప్రతిబింబించే మనసుని ప్రతిబింబ మాధ్యమం అంటారు. ప్రతిబింబ చైతన్యం వల్ల మనసు చేతన అంతఃకరణ అవుతుంది.

| **ప్రతిబింబ చైతన్యం** | **బింబ చైతన్యం** |
|---|---|
| 1. ప్రతిబింబించే మాధ్యమం వరకే పరిమితమవుతుంది. | 1. సర్వ వ్యాపకం |
| 2. మార్పు చెందుతుంది. – సవికారం | 2. నిర్వికారం |
| 3. పరిచ్ఛిన్నం అవుతుంది. | 3. అపరిచ్ఛిన్నం |
| 4. అనేకం. పది అద్దాలుంటే 10 సూర్యబింబాలు కనిపిస్తాయి | 4. ఏకం |
| 5. ప్రయాణం చేస్తుంది. | 5. నిర్గతి |
| 6. మనసు, శరీరాలతో మమేకమయి కర్త, భోక్తా అవుతుంది. | 6. అకర్తా, అభోక్తా |
| 7. మరణం తర్వాత సూక్ష్మ శరీరం (మనసు)తో వెళ్ళిపోతుంది. | 7. సర్వవ్యాపకం కాబట్టి ప్రయాణం లేదు. |

**మరణం నిర్వచనం** – చిదాభాస (ప్రతిబింబ చైతన్యం) లేని భౌతిక శరీరం. శవంలో చిత్ (బింబ చైతన్యం) ఉంది కాని చిదాభాస లేదు కాబట్టి ప్రకటితమవటం లేదు. మనసు లేదు కాబట్టి చిదాభాస లేదు.

ప్రాణమున్న జీవిలో చిత్ + చిదాభాస ఉంటాయి. శవంలో చిత్ మాత్రమే ఉంటుంది. చిదాభాసను జీవాత్మ అనీ, చిత్‌ని పరమాత్మ అనీ శాస్త్రాలు చెప్తున్నాయి. చిత్ సర్వవ్యాపకం అయితే, చిదాభాస మనిషి ఉన్నంత మేరకే ఉంటుంది. ఈ రెండూ అందరిలో ఉన్నాయి. చిత్ సర్వవ్యాపకం కాబట్టి సహజంగా మనిషిలోనూ ఉంటుంది. మనసు ప్రతిబింబింప చేయటంవల్ల చిధాభాస కూడా ఉంటుంది. చిత్, చిదాభాస రెండూ సూర్యునికాంతి, ప్రతిబింబంలా కలిసి ఉన్నాయి. కాంతి, ప్రతిబింబం ఎలా విభిన్నమో అలా చిత్, చిదాభాసల విభిన్న లక్షణాలు చూసాము. ఇంకో అర్థం కాంతి లేనిదే నీడ లేదు. చిత్ లేనిదే చిదాభాస లేదు. ఒకటి సత్యం, ఒకటి మిథ్య.

ఈ రెండూ ఎక్కడ ఉన్నాయి? లోకే – ఇక్కడ అర్థం శరీరంలో ఉన్నాయి. శరీరంలో ఎక్కడ? గుహాం ప్రవిష్టౌ – మనసులో ఉన్నాయి. శరీరాన్ని ఆలయంగా తీసుకుంటే గర్భగృహంలో ఉన్నాయి. మనసులో ఎక్కడ ఉన్నాయి? పరమే పరార్ధే – పరమ పవిత్రమైన, అంతర్భాగంలో ఉన్నాయి. పర అంటే పరమాత్మ, అర్ధ అంటే ప్రదేశం. అంటే బ్రహ్మస్థానం లేదా పరమాత్మ వాసస్థానంలో ఉన్నాయి. ఆ ప్రదేశానికి పవిత్రత దేనివల్ల వచ్చింది? గర్భగుడిలో పవిత్రత భగవంతుని వల్ల వచ్చిందా, భక్తుల వల్ల వచ్చిందా? భగవంతుని వల్లే! అలాగే దానికి పవిత్రత జీవాత్మ వల్ల కాదు, పరమాత్మ వల్ల వచ్చింది.

జీవాత్మ, పరమాత్మలు ఏం చేస్తున్నారు?

ఋతం పిబన్తౌ – కర్మ ఫలం అనుభవిస్తున్నారు. కర్మఫలం సత్యంలాగా ఖచ్చితం, తప్పించుకోలేనిది. జరిగితీరుతుంది. మన కర్మఫలం వేరే ఎవరికీ వెళ్ళదు. అందువల్ల ఖచ్చితం. మార్చటానికి వీలులేనిది. మరి తండ్రి ఆస్తి కొడుకు అనుభవిస్తున్నాడు కదా అనుకుంటే, అది తప్పు. తండ్రి ఆస్తి అనుభవించే సుకృతం ఉండబట్టే అలాంటి తండ్రికి కొడుకవుతాడు. కర్మఫలాన్ని ఎక్కడికి వెళ్లినా తప్పించుకోలేము, అనుభవించి తీరాలి. అలాగే కానున్నది కాకమానదు అన్నట్టుగా మన పాపమో, పుణ్యమో పండి తీరుతుంది.

ఈ మంత్రంలో పదాలకు ఇక్కడ అర్థం మారుతుంది. ఋతం – మామూలుగా సత్యం, ఇక్కడ కర్మఫలం; పిబన్తౌ – మామూలుగా తాగటం,ఇక్కడ పుణ్యపాప కర్మఫలం అనుభవించటం; సుకృతం – మామూలుగా పుణ్యం, ఇక్కడ కర్మఫలం; లోకే – మామూలుగా ప్రపంచం; ఇక్కడ శరీరం.

పిబన్తౌ అంటే ఇద్దరూ అనుభవిస్తున్నారని అర్థం. జీవాత్మ, పరమాత్మలు ఇద్దరూ కర్మఫలం అనుభవిస్తున్నారు. ముండక ఉపనిషత్తులో జీవాత్మ, పరమాత్మలను రెండు పక్షులతో పోలుస్తారు. ఒక పక్షి తింటోంది, ఇంకో పక్షి చూస్తోంది అని వస్తుంది. కాని ఇక్కడ ఇద్దరూ అనుభవిస్తున్నట్టు వస్తోంది. పరస్పర భిన్న భావాలులాగా లేదా? పరమాత్మ కూడా కర్త, భోక్తా అవడా?

శంకరాచార్యుల వారు మన సందేహాలకు జవాబు చెపుతున్నారు. ఇద్దరూ అనుభవిస్తున్నట్టుగా కనిపిస్తున్నా, జీవాత్మ అనుభవం ప్రత్యక్షం, పరమాత్మ అనుభవం పరోక్షం. దీనికి రెండు కారణాలున్నాయి.

1. ఛత్రీన్యాయం – వాన కురుస్తున్నప్పుడు కొంతమంది గొడుగులు వేసుకుని తిరుగుతారు. వాళ్ళ మధ్యలో గొడుగులు లేకుండా తిరుగుతున్న వాళ్ళు కొందరు ఉంటారు. కాని అందరూ గొడుగులు వేసుకుని తిరుగుతున్నారు అంటాము. దీన్ని ఛత్రీన్యాయం అంటారు. అలాగే జీవాత్మ, పరమాత్మలు పక్కపక్కన ఉండటం వల్ల పరమాత్మ కూడా కర్మఫలం అనుభవిస్తున్నట్టుగా తోస్తుంది కాని అది నిజం కాదు. పరమాత్మది పరోక్ష అనుభవం.

2. దీవెన – పరమాత్మ దగ్గరగా ఉండి, కేవలం తన ఉనికి వల్లే జీవాత్మను కర్మ చేయటానికి ప్రేరేపిస్తున్నాడు.

ఈ జీవాత్మ, పరమాత్మల గురించి కర్మకాండ చేసేవాళ్ళు, జ్ఞానకాండకి వచ్చిన వాళ్ళు – ఇద్దరూ మాట్లాడుతారు. జ్ఞానకాండ వాళ్ళు అకర్తా, అభోక్తా అయిన పరమాత్మ గురించి చెప్తే, కర్మకాండ చేసే వాళ్ళు. కర్తా, భోక్తా అయిన జీవాత్మ గురించి చెప్తారు. కర్మకాండకు సాంకేతిక పదం – పఞ్చాగ్నయః త్రినాచికేతాః. గృహస్థులు ఐదు అగ్నులని ఉపాసించాలని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. వాటి పేర్లు – గార్హాపత్యం, ఆహవనీయం, దక్షిణాగ్ని, సభ్య, అవసధ్య. త్రినాచికేత కర్మకాండ చేసేవాళ్లు 3 సార్లు నాచికేత యజ్ఞం చేస్తారు. వాళ్లు కూడా ఆత్మ గురించి చెప్తారు కాని వాళ్ళు చెప్పేది జీవాత్మ గురించి.

### మంత్రం – 2

**యః సేతురీజానానామక్షరం బ్రహ్మయత్పరమ్।**
**అభయం తితీర్షతాం పారం నాచికేతం శకేమహి॥**

**ప్రతిపదార్థం:** యః – ఈ యజ్ఞం; సేతుః – మార్గం; ఈజానానాం – అనుసరించేవారికి; నాచికేతం – ఆ నాచికేత విద్యను; శకేమహి – చేయగల సమర్థులు అవుతారు; అభయం– భయం లేని; పారం – తీరాన్ని; తితీర్షతాం – పొందగోరే వారికి; యత్ అక్షరం బ్రహ్మ – ఆ బ్రహ్మజ్ఞానం; పరం – శరణాగతుడో, తత్ – ఆ బ్రహ్మను (తెలుసుకుంటాడు).

**తాత్పర్యం:** కర్మకాండ చేసేవారు నాచికేత యజ్ఞం చేయటం ద్వారా స్వర్గలోకం చేరుకోవచ్చు. సంసార సాగరానికి అవతలి ఒడ్డుకు చేరాలనుకునేవారు, అభయాన్ని ప్రసాదించే బ్రహ్మజ్ఞానాన్ని పొందవచ్చు.

**వివరణ:** ఇక్కడ ఉపనిషత్తు, జీవాత్మకు రెండు మార్గాలున్నాయని సూచిస్తోంది. సగుణ బ్రహ్మ ఉపాసన చేసి, దానితో పాటు నాచికేత యజ్ఞం చేస్తే స్వర్గలోక ప్రాప్తి పొందవచ్చు. ఈ రెండింటినీ ప్రేయోమార్గం అంటారు.

ఇంకో మార్గం, ఇంకా శ్రేష్ఠమైన మార్గం శ్రేయోమార్గం. ఇందులో, నిర్గుణ బ్రహ్మజ్ఞానాన్ని జ్ఞానకాండ ద్వారా పొంది సంసార సాగరాన్ని దాటవచ్చు. దీన్ని సద్యోముక్తి అంటారు.

ముందు మంత్రంలో జీవాత్మను కర్తా, భోక్తా అన్నాము. జంతువులు కర్తలు కావు, అవి భోక్తలు మాత్రమే మనిషికే పురుషార్థాలు ఉన్నాయి. చాలా మంది ప్రేయో మార్గం కోరుతారు. వాళ్ళది మందబుద్ధి. ధీరుడు శ్రేయోమార్గాన్ని కోరుతాడు.

**మంత్రం – 3**

**ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు।**
**బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ॥**

ఉపోద్ఘాతం అయింది. జీవాత్మ ప్రయాణం వస్తుంది. ఈ మంత్రంలో –

జీవాత్మకు రెండు గమ్యాలు – శ్రేయస్సు, ప్రేయస్సు

రెండు మార్గాలు – జ్ఞానం, కర్మ.

ఉపనిషత్తు కర్మమార్గం చెప్పదు. ఏ విజయానికైనా ముఖ్యమైనది సరియైన వాహనం. అట్లాంటిక్ సముద్రం మీద ఎగిరేటప్పుడు విమానంలో దానికి సరిపడా ఇంధనం ఉండాలి. ఇక్కడ జీవాత్మ ప్రయాణాన్ని రథ కల్పనతో పోల్చారు. 3–9 మంత్రాలు ఇదే వర్ణిస్తాయి. దృష్టాంతం రథం – ద్రాష్టాంతం – శరీరం.

| రథంలో భాగాలు | పోలిక | చేసే పని |
|---|---|---|
| 1. రథం | శరీరం | ప్రయాణం చేస్తుంది |
| 2. అశ్వాలు | పంచేంద్రియాలు | ఉదా: చెవులు ప్రసంగం వినాలంటే ఇంద్రియాలు అక్కడికి తీసుకువస్తాయి. |
| 3. పగ్గాలు | మనసు | ఇంద్రియాలను అదుపులో పెడుతుంది. |
| 4. రథ సారథి | బుద్ధి | మనసును అదుపులో పెడుతుంది. |
| 5. యజమాని | జీవాత్మ | చిదాభాస |
| 6. మార్గం | విషయ వస్తువులు | ఐదు విషయ వస్తువులు – శబ్దం, స్పర్శ, రసం, రూపం, గంధం |

ఒక్కొక్క పోలికని వివరంగా చూద్దాము.

1. శరీరం – సాధకుడు శరీరాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. దాని గురించి అతిగా పోషణ చేయకూడదు. అతిగా నిర్లక్ష్యం చేయకూడదు. రెండూ తప్పే. శరీరం ఒక మాధ్యమం కాబట్టి సరియైన జాగ్రత్త తీసుకోవాలి. అందుకే అష్టాంగయోగం చెప్తుంది శాస్త్రం. శంకరాచార్యులు సన్యాసి కూడా శరీరం గురించి జాగ్రత్త తీసుకోవాలని చెప్తారు. శాంతి పాఠంలో ఈ విషయం వస్తుంది.

2. పంచేంద్రియాలు – భద్రం కర్ణేభిః శృణుయామదేవా–
భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః

చెవులు మంచిని వినాలి, కళ్ళు మంచిని చూడాలి. ఇంద్రియ నిగ్రహం అలవరచుకోవాలి.

3. మనసు – ఆరోగ్యకరంగా ఉండాలి. భావాలు ఉండకూడదని కాదు, కాని ఉన్నా సమభావం ఉండాలి. ఇంద్రియాల వెనుక మనసు లేకపోతే ఇంద్రియాలు కోరినా వాటిని అనుభవించలేము. చెవుల వెనుక మనసు లేకపోతే, ప్రసంగం శబ్దం వినిపిస్తుంది కాని అది లోపలకి వెళ్ళదు. మనసు చాలా శక్తివంతమైనది. ఇటు ఇంద్రియాలని అదుపులో పెడుతుంది. అటు బుద్ధిని హైజాక్ చేసి బుద్ధి పనిచేయకుండా చేస్తుంది. నిజానికి మనోమయం కన్నా శక్తివంతమైనది విజ్ఞానమయకోశం. కాని మనోమయం దాని మీద పెత్తనం చేస్తుంది. మనసుని బుద్ధి అదుపులో పెట్టటం కష్టం కాని అసాధ్యం మాత్రం కాదు. సమయం పడుతుంది అంతే.

4. బుద్ధి – బుద్ధి పదునుగా ఉండాలి. జ్ఞానం మీద శ్రద్ధ ఉండాలి. బుద్ధి సన్న మెడ ఉన్న సీసాలాంటిది. అందులో ఏదైనా పొయ్యాలంటే గరాటు మాత్రమే వాడగలము. బుద్ధికి గరాటు తర్కం. చాలా మంది భక్తులు తర్కం ఉపయోగించకుండా భక్తి చూపుతారు. కాస్త సమస్య వస్తే చాలా బెదిరిపోతారు. వేదాంతం నమ్మకం కాదు. బుద్ధికి నచ్చచెప్పాలి. వేదాంతంలో బుద్ధికి పదును పెట్టటానికి మూడు నేర్పిస్తారు.

ఎ. తర్కశాస్త్రం

బి. మీమాంస – భాషా ప్రయోగం. జ్ఞానం పదాల ద్వారా వస్తుంది. ఈ పదాలు మన స్వరూపాన్ని పరిచయం చేసేవి. విద్యార్థులు పదాలను జ్ఞానంలోకి మలచుకుంటారు.

సి. వ్యాకరణం – జ్ఞానం ఉన్నచోట సందేహాలు వస్తాయి. వాటిని తర్కం ద్వారానే తీర్చాలి.

5. జీవాత్మ – ఒకప్పుడు విజయం ఐ.క్యు. (ఇంటిలిజెంట్ కోషెంట్) మీద ఆధారపడి ఉండేది. అంటే మేధాశక్తి మీద. ఇప్పుడు ఇ.క్యు. (ఎమోషనల్ కోషెంట్) మీద ఆధారపడి

ఉంది. అంటే సమత్వం ఉండాలి. విలువలకి విలువనివ్వాలి. భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు ఆసురీ సంపత్తి, దైవీ సంపత్తి గురించి వివరంగా చెప్తాడు. శమాది షట్కసంపత్తి ధర్మం మీద ఆధారపడి ఉండాలి. శంకరాచార్యుల వారు సాధకునికి ఆరోగ్యం, దమ, శమ, వివేకం, మేధాశక్తి ఉండాలని చెప్తారు.

ఇవి అన్నీ కలిసి పనిచేయాలి. సంగీత కచేరీలో అన్ని వాయిద్యాలూ ఒక శృతిలో ఉన్నట్టుగా మనసా, వాచా, కర్మణా చేయాలి ఏం చేసినా. అలా మనసా, వాచా, కర్మణా కలసి ఉండని వ్యక్తి మంచి వ్యక్తి కాదు.

వాఙ్మే మనసి ప్రతిష్ఠితా
మనో మే వాచి ప్రతిష్ఠితం – శాంతిపాఠం

ఓ దేవా! నా మాటలు నా ఆలోచనలతో కలిసి ఉండుగాక, నా ఆలోచన నా మాటలతో కలిసి ఉండుగాక.

సూక్ష్మ శరీరంలోని అన్ని అంగాలూ ఏక తాటి మీద పనిచేయాలని అర్థం.

6. విషయవస్తువులు – పాట పాడేముందు తంబూరాని శృతి చేసినట్టు, మన మనసుని కొంత శృతి చేయాలి. మరు జన్మలో ఎలా ఉంటామో తెలియదు. అందుకని చూసే విషయవస్తువులు, మంచివి చూడాలి.ముందు చెప్పిన ఐదు అంశాలూ అంటే ఆరోగ్యం, దమ, శమ, వివేకం, మేధాశక్తి ఉండాలి. ఈ విషయాలే 3వ మంత్రంలో చెప్పబడ్డాయి. 3వ మంత్రం మళ్లీ ఒకసారి చూద్దాము.

**మంత్రం – 3**

**ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు।**
**బుద్ధింతు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ॥**

**ప్రతిపదార్థం:** ఆత్మానం – జీవాత్మ, రథినం – రథారూఢుడైన వానిగా; విద్ధి – తెలుసుకో; శరీరం రథమ్ ఏవ తు – శరీరం రథం; బుద్ధిం తు సారథిం – బుద్ధి రథసారథి; మనః ప్రగ్రహం ఏవ చ – మనసు పగ్గాలు.

**తాత్పర్యం:** రథకల్పనలో ఆత్మ – రథికుడు, శరీరం – రథం, బుద్ధి – సారథి, మనస్సు – పగ్గాలు.

**వివరణ:** మంత్రం 3 నుంచి 9 దాకా రథకల్పన సాగుతుంది. జీవాత్మ అంటే ప్రతిబింబ చైతన్యం ప్రయాణీకుడు. దాన్ని ప్రతిబింబించే మాధ్యమం, శరీరంతో పాటు అది ఎటు వెళితే అటు వెళ్తుంది. పరమాత్మ సర్వవ్యాపకుడు కాబట్టి, అతనికి ప్రయాణం లేదు.

శరీరం – రథం. శరీరం అంటే నశించేది అని అర్థం. అందుకే శరీరం బాగున్నప్పుడే ప్రయాణం చేయాలని భర్తృహరి అంటాడు. బుద్ధి రథసారధి. రథసారధి అంటే వాహనం నడిపేవాడు. అతనికి దోవ బాగా తెలియాలి. తెలియకపోతే 'యానికాని చ పాపాని' అంటూ అదే చోట ప్రదక్షిణం చేస్తూ కూర్చోవాలి. అతనికి తెలియకపోతే ఎవరినైనా అడగాలి. సరియైన సమయంలో సహాయం కోరటం బుద్ధి. అర్జునుడు అలాగే అడిగాడు. బుద్ధి సహాయం కోరాల్సింది శాస్త్రాన్ని. నేను తెలుసుకుంటాను అనుకోకూడదు.

మనసు – పగ్గాలు. ఇంద్రియం వెనుక మనసు  ఉంటేనే ఆ ఇంద్రియం పనిచేస్తుంది. ఉదాహరణకు చక్కటి దృశ్యం కళ్ళ ఎదురుగా ఉన్నా, దానిమీద మనసు పెట్టకపోతే దాని అందాన్ని ఆస్వాదించలేము. అందుకని ముందు మనసుని అదుపులో పెట్టుకోవాలి. మనసు చంచలంగా ఉంటే, అది ఇంద్రియాలను అదుపులో పెట్టలేదు. మనసు అన్నిటికన్నా శక్తివంతమైనది. స్థూల, సూక్ష్మ శరీరాలను అదుపులో పెడుతుంది. కాబట్టి అసంకల్పిత చర్యలను తప్ప తక్కిన చర్యలను మనసే నియంత్రిస్తుంది.

**మంత్రం – 4**

**ఇన్ద్రియాణి హయానాహుర్విషయాంస్తేషు గోచరాన్।**
**ఆత్మేన్ద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః॥**

**ప్రతిపదార్థం:** ఇన్ద్రియాణి – ఇంద్రియాలు; హయాన్ – గుర్రాలు; తేషు – వాటికి; విషయాన్– విషయ వస్తువులు; గోచరాన్ – మార్గాలు; ఆహుః – చెపుతారు; ఆత్మా+ఇన్ద్రియ+మనోయుక్తం– శరీరం, ఇంద్రియాలు, మనస్సుతో కూడిన జీవుడు; భోక్తా – అనుభవించేవాడు; మనీషిణః ఆహుః – మహాత్ములు చెప్తారు.

**తాత్పర్యం:** ఇంద్రియాలు గుర్రాలు. విషయ వస్తువులు ఆ గుర్రాలు వెళ్ళే మార్గాలు; శరీరం, ఇంద్రియాలు, మనస్సుతో కూడిన జీవుడు భోక్త అని మహాత్ములు చెప్తారు.

**వివరణ:** రథకల్పన కొనసాగుతోంది. ఇంద్రియాలు – గుర్రాలు. గుర్రాలు రథాన్ని లాగుతాయి. ఇంద్రియాలు అవి కోరిన వాటిని చూడటానికి, వినటానికి శరీరాన్ని తీసుకువెళ్తాయి. విషయ వస్తువులు మార్గాలు – శాస్త్రం బాహ్యప్రపంచంలోని వస్తువులన్నింటినీ ఐదు విషయ వస్తువులుగా నిర్వచించింది. అవి శబ్దం, స్పర్శ, రసం, రూపం, గంధం వస్తువులు. వాటిని విషయాన్ అని ఒక్క ముక్కలో చెప్తుంది. ఇప్పటి  టీవీని విషయవస్తువుగా మనం వర్ణించవచ్చు.

జీవుడు భోక్త. భోక్త అవాలంటే కర్త అవుతాడు. ఈ జీవుడు ఎవరు? ప్రతిబింబ చైతన్యం లేదా చిదాభాస లేదా విశేష చైతన్యం. భోక్తలో శరీరం, ఇంద్రియాలు, మనసు ఉన్నాయి. ఆత్మేంద్రియ మనోయుక్తం అంటే ఇక్కడ ఆత్మకు అర్థం శరీరం అని తీసుకోవాలి. యుక్తం

అంటే వీటితో కలిసిన భోక్త. ప్రతిబింబ చైతన్యాన్ని కలుపుకోవాలి. శరీరం, ఇంద్రియాలు, మనసు అనే ఈ మూడింటితో కలిసిన ప్రతిబింబ చైతన్యం భోక్త జీవాత్మ అవుతుంది. అంటే కర్త అవుతుంది.

ఈ మంత్రం రెండో భాగంలో జీవాత్మ – శరీరం, ఇంద్రియాలు, మనసుతో కలిస్తేనే దానికి కర్తృత్వ భోక్తృత్వాలు ఆపాదించబడుతాయని స్పష్టం చేస్తోంది ఉపనిషత్తు. మనసు ఆలోచిస్తే ఆత్మ ఆలోచిస్తున్నట్టు, ఇంద్రియాలు కదిలితే ఆత్మ కదులుతున్నట్టు అనిపిస్తుంది కాని, ఇది ప్రతిబింబ చైతన్యం మాత్రమే. బింబ చైతన్యం సాక్షీభూతంగా చూస్తుంది అన్నది గ్రహించాలి అని చెప్పటానికే ఈ రథకల్పన వాడింది ఉపనిషత్తు. ఈ విషయం ఋషులు చెప్పారు అంటోంది. ఉపనిషత్తు ఎప్పటికాలందో చెప్పలేము. అందులో పూర్వం ఋషులు చెప్పారు అంటే ఇది అనాదిగా వస్తోంది అని అర్థం.

### మంత్రం – 5

**యస్త్వ విజ్ఞానవాన్భవత్యయుక్తేన మనసా సదా।**
**తస్యేన్ద్రియాణ్యవశ్యాని దుష్టాశ్వా ఇవ సారథేః॥**

**ప్రతిపదార్థం:** యః తు – ఎవరు; అవిజ్ఞానవాన్ – జాగృతం చెందనివాడు; సదా అయుక్తేన మనసా – ఎప్పుడూ అదుపు తప్పిన మనసుతో; భవతి – ఉంటాడో; సారథేః – సారథికి; దుష్టాశ్వా ఇవ – వశం కాని గుర్రాలలాగా; తస్య ఇంద్రియాణి అవశ్యాని – అతని ఇంద్రియాలు అదుపు తప్పుతాయి.

**తాత్పర్యం:** ఎవరు జాగృతి చెందనివాడో, అదుపు తప్పిన మనసు గలవాడో, అతని ఇంద్రియాలు, రథసారథికి అదుపులో లేని గుర్రాలలాగా అదుపు తప్పుతాయి.

**వివరణ:** వాహనం మనకి స్నేహితుడా? శత్రువా?శాస్త్రం అది వాహనం మీద ఆధారపడి ఉంటుందంటోంది. వాహనం బాగుంటే స్నేహితుడు, బాగుండకపోతే శత్రువు. ఇదే భావాన్ని శ్రీకృష్ణభగవానుడు 6వ అధ్యాయంలో చెప్తాడు. ఆరోగ్యకరమైన శరీరం స్నేహితుడు, ఆనందకరం. అనారోగ్యం శత్రువు. దుఃఖహేతువు. మనుష్యులని వదులుకోవచ్చు గానీ, మనసుని వదులుకోలేం. మనసు అదుపులో లేకపోతే, ఎన్ని ఏళ్ళు వచ్చినా సరియైన లక్ష్యం ఉండదు.

మనసన్నాక అప్పుడప్పుడూ అదుపు తప్పే అవకాశం ఉంది. కాని ఎప్పుడూ అదుపు తప్పకూడదు. సదా అయుక్తేన అంటే ఎప్పుడూ అదుపు తప్పటం. రథసారథి పగ్గాలను సరిగ్గా పట్టుకోకపోతే గుర్రాలు ఏమవుతాయి? తస్య ఇంద్రియాణి అవశ్యాని – ఇంద్రియాలు వశం తప్పుతాయి. అలాంటి వ్యక్తి మూడు తప్పులు చేస్తూనే ఉంటాడు.

కామచారః – ఏం చేయాలనిపిస్తే అది చేస్తాడు.
కామవాదః – నోటికేది వస్తే అది మాట్లాడుతాడు.
కామభక్ష్యః – ఏది కనిపిస్తే అది తింటాడు.

సాధకుడు నేర్చుకోవాల్సిన మొదటి పాఠం – జీవితాన్ని అదుపులో పెట్టుకోవాలి. ఎలా? బుద్ధిని ఉపయోగించి. దేవుడు, గురువు, శాస్త్రం సహాయం అందివ్వగలరు అంతే. ప్రయత్నం మనమే చేయాలి. బుద్ధిని పదునుపెట్టాలి.

ముందు రెండు మంత్రాల్లో రథకల్పన ఉంటే, ఈ మంత్రంలో రథకల్పన ఆధారంగా కొన్ని విలువలు సూచించబడ్డాయి. రథం కాని జీవుడు కాని ప్రయాణం విజయవంతంగా చేయాలంటే, దానికి సంబంధించిన అన్ని అంశాలూ కలిసికట్టుగా పనిచేయాలి. ఒకదానితో ఒకటి లంగరు కుదరకపోతే, ప్రయాణం సాఫీగా సాగదు.

అందుకని బుద్ధి చాలా ముఖ్యం. మనసుని శాస్త్రప్రమాణం ద్వారానే అదుపులో పెట్టగలము. జ్ఞానం పొందందే కర్మయోగం అసంపూర్ణం. కర్మయోగం చేయందే జ్ఞానయోగం అసాధ్యం. ఈ ఎఱుకనే వివేకం అంటారు. లేకపోతే మనసు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తుంది.

అందుకని ఈ మంత్రంలో రథసారథికి మార్గం తెలిసినట్టుగా బుద్ధికి శాస్త్రజ్ఞానం ఉండాలి. పగ్గాలు అతని చేతిలో ఉన్నట్టుగా, మనసుని అతను అదుపులో పెట్టుకోవాలి. అతనికి దోవ తెలిసి, పగ్గాలు అతని చేతిలో ఉంటే, గుర్రాలు వాటంతటఅవే అతని మాట వింటాయి. అలాగే శాస్త్రం తెలిసి, తన మనసుని అదుపులో పెట్టుకున్న వ్యక్తికి ఇంద్రియాలు దాసోహం అంటాయి. ఇక్కడ ప్రతికూలంగా ఈ విషయం చెప్పబడింది. వివేకం లేని వ్యక్తికి మనసు అదుపు తప్పుతుంది. మనసు అదుపుతప్పిన వ్యక్తికి ఇంద్రియ నిగ్రహం ఉండదు. శమదమాలు ఉండవు.

### మంత్రం – 6

**యస్తు విజ్ఞానవాన్భవతి యుక్తేన మనసా సదా।**
**తస్యేన్ద్రియాణి వశ్యాని సదశ్వా ఇవ సారథేః॥**

**ప్రతిపదార్థం:** యః తు – ఎవరు; విజ్ఞానవాన్ – జాగృతి చెందిన వాడో; సదాయుక్తేన మనసా – ఎప్పుడూ నిగ్రహవంతమైన మనసుతో; భవతి – ఉంటాడో; సారథేః – రథసారథికి; సదశ్వా ఇవ – అదుపులో ఉన్న గుర్రాలలాగా; తస్య ఇంద్రియాణి వశ్యాని – అతని ఇంద్రియాలు వశంలో ఉంటాయి.

**తాత్పర్యం:** ఎవరు జాగృతి చెందిన వాడో, నిగ్రహవంతమైన మనసు కలవాడో, అతని ఇంద్రియాలు, రథసారధికి అదుపులో ఉన్న గుర్రాలలాగా, వశంలో ఉంటాయి.

**వివరణ:** ఇంతకుముందు మంత్రంలో చెప్పిన భావాన్నే ఇక్కడా చెప్తోంది ఉపనిషత్తు. అక్కడ ప్రతికూల వాక్యంలో చెపితే ఇక్కడ సానుకూల వాక్యంలో చెప్తోంది. దీన్ని అన్వయ వ్యతిరేక పద్ధతి అంటారు. అంతకు ముందు వివేకం లేని వ్యక్తికి, మనసు అదుపు తప్పుతుంది. మనసు అదుపు తప్పిన వ్యక్తికి ఇంద్రియ నిగ్రహం ఉండదు అంది. ఇప్పుడు అదే విషయం సానుకూలంగా అంటే వివేకం వున్న వ్యక్తికి, మనసు అదుపులో ఉంటుంది, మనసు అదుపులో ఉన్న వ్యక్తికి ఇంద్రియ నిగ్రహం ఉంటుంది, అంటే శమదమాలు ఉంటాయి.

విజ్ఞానవాన్ భవతి – బుద్ధికి స్పష్టంగా తెలుసు. తక్షణ లక్ష్యం తెలుసు, అంతిమలక్ష్యం కూడా తెలుసు. ఉదాహరణకు ఢిల్లీ వెళ్లటం అంతిమ లక్ష్యం అయితే, దానికి తగ్గ ఏర్పాట్లు చేసుకోవటం తక్షణ లక్ష్యం. చదువు, ఉద్యోగం, పెళ్లి, పిల్లలు అంటూ లక్ష్యాలు పెట్టుకున్నా తన అంతిమ లక్ష్యం సాధన చతుష్టయ సంపన్నుడవటం అని తెలుసు. విజ్ఞానవాన్ భవతి అంటే జ్ఞానయోగ్యతా ప్రాప్తి, దాని తర్వాత జ్ఞానప్రాప్తి పొంది, దాని తర్వాత జ్ఞాననిష్ఠా ప్రాప్తి పొందే వ్యక్తి.

యుక్తేన మనసా సదా – అతని మనసు సమభావంతో ఉంటుంది. రాగద్వేషాలు మనిషిని తప్పుదారి పట్టిస్తాయి. శాస్త్రం రాగద్వేషాలు ఉండవద్దనటం లేదు. కాని సమత్వం ఉండాలంటోంది.

తస్య ఇంద్రియాణి వశ్యాని – అతని ఇంద్రియాలు వశంలో ఉంటాయి. బుద్ధి మనసుని, మనసు ఇంద్రియాలని అదుపులో పెట్తాయి. విలువలు మార్చుకోవటం వల్ల జీవితం మారుతుంది. ఇంద్రియాలు ఎలా అదుపులో ఉంటాయి? సదశ్వా ఇవ సారథే – పగ్గాలు తన అదుపులో ఉన్న రథసారథికి గుర్రాలు లొంగినట్టుగా ఉంటాయి. అన్నీ సవ్యంగా ఉండాలంటే ఏం చేయాలి? ప్రయత్నం చేయాలి. కళ్ళు మూసుకున్నా మనసు ఊరుకోదే! మనసు చంచలం కృష్ణా అని అర్జునుడే అన్నాడు.

**చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్।** – గీత 6.34

కృష్ణభగవానుడు ఏమన్నాడు? కష్టమే కాని ప్రయత్నం చేయి అన్నాడు.

**అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే॥** – గీత 6.35

ఇంకా ఓడిపోతే? దైవ సహాయం కోరాలి.

**స్థిరైరంగై స్తుష్టువాగ్ం సస్తనూభిః ।**
**వ్యశేమ దేవహితం యదాయుః।** – శాంతి మంత్రం

ప్రయత్నం, దైవ సహాయం, ఇవి తప్ప వేరే మార్గం లేదు. అంతిమ లక్ష్యం ఏదుండాలి? బుద్ధిని అదుపులో పెట్టుకోవాలి. మనసుని కాదు. ఇంద్రియాలని కాదు, శరీరాన్ని కాదు. శాస్త్ర అధ్యయనం ద్వారా బుద్ధిని నియంత్రించుకోవాలి. దాని ద్వారా మనసు, తద్వారా ఇంద్రియాలు, ఆ తర్వాత శరీరం ఇదీ మార్గం. శాస్త్రం చదవకుండా సాధన కుదరదు. అష్టాంగయోగంలో కూడా ముందే ధ్యానం ఎలా చేయాలో చెప్పరు. ఒక వస్తువు కొంటే దాని గురించిన సమాచారం చదవాలి ముందు. ఆధ్యాత్మ ప్రయాణంలో, మధ్యలో వచ్చే స్టేషన్లు తెలియాలి. జప, ధ్యానం, కుండలిని, భజన ఏం చేసినా ఆత్మజ్ఞానం రాదు.

**మంత్రం – 7**

**యస్త్వ విజ్ఞానవాన్భవత్యమనస్కః సదాஉశుచిః।**
**న స తత్పదమాప్నోతి సంసారం చాధిగచ్ఛతి॥**

**ప్రతిపదార్థం:** యః తు – ఎవరు; అవిజ్ఞానవాన్ – జాగృతం చెందడో, అమనస్కః – మనసుని అదుపులో పెట్టలేడో; సదా అశుచిః – ఎప్పుడూ పావనరహితుడిగా; భవతి – ఉంటాడో, సః – అతడు; తత్పదమ్ – ఆ బ్రాహ్మీ స్థితిని, న ఆప్నోతి – పొందదు; సంసారం చ అధిగచ్ఛతి – ఇంకా కిందకి పడిపోతాడు.

**తాత్పర్యం:** ఎవరు జాగృతం చెందడో, అతడు మనసుని అదుపులో పెట్టలేడు, అతను బ్రాహ్మీస్థితిని పొందలేడు సరికదా, ఇంకా కిందకి పడిపోతాడు కూడా.

**వివరణ:** ఇంతకు ముందు రెండు మంత్రాల్లో అన్వయ వ్యతిరేక పద్ధతి ద్వారా రథకల్పన సాగింది. బుద్ధి అదుపులో లేని సారథి గురించి, బుద్ధి అదుపులో ఉన్న రథసారథి గురించి వివరణ చూసాము. ఈ మంత్రంలోనూ, వచ్చే మంత్రంలోనూ వీళ్లిద్దరి గమ్యం ఎలా ఉంటుందో చూస్తాము. ఇదే సూత్రాన్ని జీవాత్మకి అన్వయించుకోవాలి.

ఈ మంత్రంలో 5వ మంత్రంలోని రథసారథి పరిస్థితి ఏమిటన్నది తెలుస్తుంది. అంటే వివేకం, శమ, దమాలులేని సారథి అంటే జీవాత్మ మోక్షపథం పొందదు సరికదా, ఇంకా కిందకి పడిపోతాడు. యస్తు అవిజ్ఞానవాన్ భవతి – బుద్ధి సరిగా లేకపోతే, మనసుని సరిగ్గా అదుపులో పెట్టలేడు. అమనస్కం అంటే మామూలుగా మనసులేని అని అర్థం. మనసు అదుపులో లేకపోతే లేనట్టే అంటున్నాడు యమధర్మరాజు. పనివాడు మాట వినకపోతే ఏమిటి లాభం?

ఫలితం ఏమిటి? సదా అశుచిః – శుచి ఉండదు. ఇక్కడ ఇంద్రియాలకి శుచి ఉండదంటే అధర్మం, అనారోగ్యం రాజ్యమేలుతాయి. మనసు బాగుండకపోతే, చూడకూడనిది చూస్తుంది. ఇప్పుడు టీవీ పుణ్యమా అని చూడకూడనివి బాహాటంగా చూస్తున్నాము. ఆలోచనలు

మాటలుగాను, మాటలు కర్మగానూ, కర్మ అలవాటుగానూ, అలవాటు స్వభావంగానూ రూపుదిద్దుకుని మన స్వభావం మన గమ్యాన్ని నిర్దేశిస్తుంది. అంటే చివరినుంచి వెనక్కి వెళితే మన గమ్యం మన స్వభావం మీదా, మన స్వభావం మన అలవాట్ల మీదా, మన అలవాట్లు మన కర్మల మీదా, మన కర్మలు, మన మాటల మీదా, మన మాటలు మన ఆలోచనల మీదా ఆధారపడి ఉంటాయి. అందువల్ల మన బుద్ధిని సరిగా వినియోగించి మన ఆలోచనలు, అంటే మన మనసుని నియంత్రించాలి.

మనసుని నియంత్రించకపోతే ఏమవుతుంది? సః తత్పదం న అప్నోతి – అటువంటి వ్యక్తి మోక్షపథం పొందదు. పొందకపోయినా, ఫర్వాలేదు. కాని తెలియకుండా కిందపడవచ్చు. సంసారం చాధిగచ్ఛతి యమధర్మరాజు అంటున్నాడు. ఇంకా క్రిందకి పడిపోయి, ప్రవాహంలో కొట్టుకుపోతాడు.

దీనికి మూలం ఏమిటి? యస్తు అవిజ్ఞానవాన్ భవతి – జ్ఞానం లేనివాడు, ఇంద్రియ నిగ్రహం ఎలా చేయాలో సరిగ్గా అర్థం చేసుకోకపోతే అది ఇంద్రియాలని నిగ్రహించటం అవదు. ఇంద్రియాలని అణగద్రొక్కటం అవుతుంది. వివేకంతో కూడిన వైరాగ్యం ఇంద్రియాలని అదుపులో పెడుతుంది. దానికి శాస్త్రజ్ఞానం ఒక్కటే మార్గం.

**మంత్రం – 8**

**యస్తు విజ్ఞానవాన్భవతి సమనస్కః సదా శుచిః।**
**స తు తత్పదమాప్నోతి యస్మాద్భూయో న జాయతే॥**

**ప్రతిపదార్థం:** యః తు – ఎవరు; విజ్ఞానవాన్ – జాగృతం చెందినవాడో; సమనస్కః – మనసుని అదుపులో పెట్టగలడో; సదా శుచిః – ఎప్పుడూ పావనుడిగా; భవతి – ఉంటాడో, సః తు – అతడు; తత్పదమ్ ఆప్నోతి – మోక్షాన్ని పొందుతాడు; యస్మాత్ – ఎక్కణ్ణుంచి; భూయః న జాయతే – మళ్ళీ జన్మల్లో పడడు.

**తాత్పర్యం:** ఎవరు జాగృతం చెందినవాడో, మనసుని అదుపులో పెట్టగలడో, అతను మళ్ళీ జన్మల్లో పడడు, మోక్షాన్ని పొందుతాడు.

**వివరణ:** అన్వయ వ్యతిరేక పద్ధతిలో, వివేకం ఉన్న రథసారథి అంతిమ గమ్యం ఏమిటో ఈ మంత్రం వివరిస్తుంది. వివేకం ఉండి, శమదమాలు ఉన్న వ్యక్తి తన అంతిమ గమ్యం చేరతాడు. అందువల్ల మళ్ళీ జన్మల్లో పడడు. 6వ మంత్రంలో వచ్చిన రథసారథి పరిస్థితి ఇక్కడ వస్తుంది. అంటే మళ్ళీ వివేకం ఉన్న వ్యక్తికీ, లేని వ్యక్తికీ మధ్య తేడా చూపుతోంది ఉపనిషత్తు.

సరియైన అవగాహన ఉన్న వ్యక్తికి ప్రతి అవస్థలోనూ, ఇప్పుడు గృహస్థావస్థలో, ఏం చేయాలో తెలుసు.

1. ప్రాపంచిక  పనులు చేస్తాడు – ధర్మానికి తగ్గట్టుగా అర్థ,కామాలని సాధిస్తాడు.

2. ముందే ధ్యానానికి పోడు. నిత్య నైమిత్తిక కర్మలు చేసి చిత్తశుద్ధి పొందుతాడు.

3. నెమ్మదిగా మోక్షం వైపు మొగ్గు చూపుతాడు. అంటే దశలవారీగా వస్తాడు. కర్మయోగం చేసి, ఉపాసన చేసి, వేదాంత శ్రవణ, మనన, నిధి ధ్యాసనలు చేస్తాడు. అయోమయం లేదు, అణగద్రొక్కటం లేదు. బానిస కాడు. అన్నీ హద్దుల్లోనే ఉంటాయి. వ్యావహారికం నుంచి ఆధ్యాత్మికంగా ఎదుగుతాడు.

అతను స మనస్కః – అంటే మనసు ఉన్నవాడు. మనసు లోటుపాట్లు తెలుసు, బలం తెలుసు. సదా శుచిః – మనసు అదుపులో ఉంటే, ఇంద్రియాలు కూడా అదుపులో ఉంటాయి. ఇంద్రియాలు కదిలితే, కుదరదు అని చెప్పగలగాలి. అవి తనకు లొంగి ఉండేటట్టు చేసుకోవాలి. రాగద్వేషాలను అదుపులో పెట్టుకోవాలి.

సహ – తన పనులను అదుపులో పెట్టే అటువంటి వ్యక్తి. తత్పదం ఆప్నోతి – మోక్షాన్ని 100% పొందుతాడు. ఏమిటి గొప్పదనం? యస్మాత్ భూయః న జాయతే – మళ్ళీ జన్మల్లో పడదు.

కాని ఒక విషయం గుర్తుంచుకోవాలి. వివేకం, శమ దమాలు ముఖ్య సాధనలు కావు, సహాయకారీ సాధనలు. వేదాంత శ్రవణ, మనన, నిధి ధ్యాసనలు అనే సాక్షాత్ సాధనలు చేసిన వ్యక్తే పునరపి జననం, పునరపి మరణం వృత్తం నుంచి బయటపడతాడు.

ఇక్కడ ఒక సందేహం కలగవచ్చు. మోక్షం ఎవరికి? రథసారథియైన బుద్ధికా, రథంలో కూర్చున్న యజమాని అంటే జీవికా? శంకరాచార్యులు తన భాష్యంలో ఈ సందేహాన్ని తీరుస్తారు. ఇక్కడ అజహల్లక్షణం వాడాలి. అంటే ఒక వాక్యం యొక్క ప్రత్యక్ష అర్థం పూర్తిగా కొట్టిపారేయలేము కాని, సూచనప్రాయంగా ఇంకో దానితో అనుబంధం ఉంటుంది.

ఉదాహరణకు 'ఎట్టది పరుగెడుతోంది' అంటే అసలు అర్థం, ఎట్టగుర్రం పరుగెడుతోందని. అలాగే వివేకం ఉన్న రథసారథి అంటే, 'వివేకం  ఉన్న రథసారథి కలిగిన యజమాని' అని.

### మంత్రం – 9

**విజ్ఞానసారథిర్యస్తు మనః ప్రగ్రహవాన్నరః।**
**సోఽధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్॥**

**ప్రతిపదార్థం:** యః నర – ఏ మనిషి; విజ్ఞాన సారథిః – బుద్ధి ఉన్న రథసారధి; మనః ప్రగ్రాహవాన్ – మనసు అదుపులో ఉంటుందో; సః తు – అటువంటి వ్యక్తే – అధ్వనః పారమ్ – సంసార సాగరం యొక్క ఆవలి ఒడ్డు; ఆప్నోతి – చేరుకుంటాడు; తద్ విష్ణో పరమం పదమ్ – అది సర్వవ్యాప్తమైన భగవంతుని పరమ ధామం.

**తాత్పర్యం:** ఏ మనిషికి, బుద్ధి ఉన్న సారథి ఉన్నాడో, మనసు అదుపులో ఉంటుందో, అటువంటి వ్యక్తి సంసార సాగరం యొక్క ఆవలి ఒడ్డు చేరుకుంటాడు.

**వివరణ:** రథకల్పన ముగిస్తున్నాడు యమధర్మరాజు. అంతకుముందు మంత్రంలో, గమ్యం ఏమిటో స్పష్టంగా చెప్పలేదు.

**స తు తత్పదమాప్నోతి యస్మాద్భూయో న జాయతే**

తిరిగి వెనక్కి రాని పథం పొందుతాడు అన్నాడు. ఏమిటా పథం? దానికి జవాబు ఈ మంత్రంలో రెండవ భాగంలో వస్తుంది. మళ్ళీ ముందు చెప్పిన లక్షణాలను వర్ణిస్తున్నాడు. సారధి ఎలా ఉండాలి? విజ్ఞానసారథిలా ఉండాలి. తన లక్ష్యం ఏమిటో తెలిసి ఉండాలి. అలా తెలిస్తే ఏమవుతుంది? మనః ప్రగ్రవాన్ – మనసు అదుపులో ఉంటుంది, మనసు అంటే ఇంద్రియాలని కూడా కలుపుకోవాలి. అంటే అతను సాధన చతుష్టయ సంపన్నుడై ఉంటాడు. అటువంటి వ్యక్తికి, తన మార్గం, తన గమ్యం తెలుసు.

ఏమిటా గమ్యం? మరణం కాదు. కోరికలు తీరకపోతే, పునరపి జననం, పునరపి మరణం అవుతుంది. ఒక అంతులేని కథగా సాగిపోతుంది. అందుకే యమధర్మరాజు, ఆ గమ్యం తద్ విష్ణోః పరమం పదమ్ అన్నాడు. ఆ గమ్యం విష్ణుపదం చేరుకోవటం.

శంకరాచార్యుల వారు తన భాష్యంలో విష్ణుపదం, ఆప్నోతి స్పష్టం చేసారు. అది చూస్తే మళ్ళీ ఏ సందేహమూ రాదు. విష్ణు అన్న పదం – సర్వం వేవేష్టి ఇతి విష్ణు. అంటే సర్వవ్యాపకుడు. అన్ని నామరూపాలకు అధిష్టానం. అలాగే ఈ సందర్భంలో పదం అంటే గమ్యం కాదు. స్వప్రకాశక చైతన్యం. అలా విష్ణుపదం అంటే విష్ణు స్వరూపం, అంటే నిర్గుణం బ్రహ్మ.

పదం అంటే గమ్యం అన్న అర్థం ఎందుకు తీసుకోకూడదు? విష్ణుమూర్తి లోకం, వైకుంఠం అవచ్చు కదా, లక్ష్యార్థం అయిన విష్ణు స్వరూపం అని ఎందుకు తీసుకోవాలి? శంకరాచార్యులు దానికి ఇలా జవాబు చెప్తున్నారు. ఎవరైనా ఏదైనా లోకానికి ప్రయాణం చేసి జేరితే, అక్కడ అతను శాశ్వతంగా ఉండలేడు. ఎందుకంటే కాలపరిమితిలో, కర్మ ద్వారా పొందినదేదైనా

కర్మఫలం అవుతుంది. దానికి ఎప్పుడో అప్పుడు ముగింపు కలుగుతుంది. అందువల్ల కర్మఫలం ద్వారానూ, ప్రయాణం ద్వారానూ పొందిన వైకుంఠపదం శాశ్వతం కాదు. కాని, ఎక్కడ్నుంచి మళ్ళీ తిరిగిరాడో, ఆ విష్ణుపదం అని ఉపనిషత్తు అంటే, అది ఖచ్చితంగా ఒక లోకం అవటానికి వీలులేదు. ఈ తర్కం వల్ల మనం వాచ్యార్థం వదిలేసి, లక్ష్యార్థం తీసుకోవాలి అంటున్నారు శంకరాచార్యులు.

అందుకని మనం కొలిచే సగుణ బ్రహ్మ నుంచి నిర్గుణ బ్రహ్మ స్థానానికి ఎదగాలి. శంఖచక్ర గదాపాణీ అని వర్ణిస్తే సగుణ బ్రహ్మ. సర్వవ్యాపకమైన భగవానునికి రూపం ఉండదు. కఠోపనిషత్తులోనే ముందు మంత్రాల్లో చూస్తాము.

**అశబ్దమస్పర్శమరూపమవ్యయం**
**తథాఽ రసం నిత్యమగన్ధవచ్చయత్**
**అనాద్యనన్తం మహతః పరం ధ్రువం**
**నిచాయ్య తన్మృత్యుముఖాత్ప్రముచ్యతే** – కఠ 1.3.15

రూపం లేదు, ఆది లేదు, అంతం లేదు. ఈ పరమ పదం చేరుకోవటానికి ఎంత దూరం ప్రయాణించాలి? ప్రయాణం లేదు. విష్ణుపదం చేరటమంటే అర్థం చేసుకోవటం. దూరమన్న భావనని వదలటమే చేరటం.

స్వప్నం నుంచి లేస్తేనే జాగృదావస్థలోకి వచ్చినట్టు. విష్ణుదేవాలయాలు ఉన్నవి సగుణ బ్రహ్మ నుంచి నిర్గుణ బ్రహ్మ స్థాయికి ఎదగటానికి. ఏకరూప భక్తి నుంచి, అనేక రూప భక్తికి ఎదిగి అరూప భక్తికి ఎదగాలి. కారులో ఒక ప్రసంగానికి వెళితే, కారు నన్నిక్కడ దాకా తీసుకువచ్చింది కదా అని కారులోనే కూర్చోము కదా! దాన్ని వదిలేసి లోపలికి వెళ్తాము. అలా సగుణ బ్రహ్మనుంచి నిర్గుణ బ్రహ్మకి వెళ్ళాలి.

ఇక్కడితో రథకల్పన అయిపోయింది. దీని ద్వారా 5 శిక్షణలు బోధిస్తోంది.

1. మంచి శరీరం – ఆరోగ్యం
2. అదుపులో ఉన్న ఇంద్రియాలు – దమం
3. అదుపులో ఉన్న మనసు – శమం
4. జ్ఞానం పొందిన బుద్ధి – వివేకం
5. కలిసికట్టుదనం – ఆర్జవం

ఇవేకాక శ్రవణ, మనన, నిధిధ్యాసనలు చేయాలని కూడా గ్రహించాలి.

### మంత్రం – 10

**ఇన్ద్రియేభ్యః పరా హ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః।**
**మనసస్తు పరా బుద్ధిః బుద్ధేరాత్మా మహాన్పరః॥**

**ప్రతిపదార్థం:** ఇంద్రియేభ్యః ఇంద్రియాల కన్నా; అర్థా – విషయ వస్తువులు; పరాః – శక్తివంతమైనవి; అర్థేభ్యః చ – ఈ వస్తువులకన్నా; మనః – మనసు; పరం – శక్తివంతమైనది; మనసః తు – మనసుకన్నా; బుద్ధిః – బుద్ధి; పరాః – శక్తివంతమైనది; మహాన్ ఆత్మ – మహత్వం గల ఆత్మ(సమష్టి బుద్ధి); బుద్ధే – బుద్ధికన్నా; పరః – శక్తివంతమైనది.

**తాత్పర్యం:** ఇంద్రియాలకన్నా విషయ వస్తువులు శక్తివంతమైనవి; విషయవస్తువుల కన్నా మనసు శక్తివంతమైనది; మనసుకన్నా బుద్ధి శక్తివంతమైనది; బుద్ధికన్నా మహత్వం గల ఆత్మ (సమష్టి బుద్ధి) శక్తివంతమైనది.

**వివరణ:** ఇంతవరకూ గమ్యాన్ని అక్షరం బ్రహ్మగా చూపించి, 9వ మంత్రంలో విష్ణుపదంగా పేర్కొన్నాడు యమధర్మరాజు. కాని బ్రహ్మగానీ, విష్ణుపదం కానీ ఏమిటో చెప్పలేదు. అందుకని ఈ రెండు మంత్రాల్లో ఆధ్యాత్మిక ప్రయాణంలో చేరుకునే ఆ బ్రహ్మ ఏమిటో వర్ణిస్తాడు. ముందుగా తెలుసుకోవాల్సింది, ఈ ప్రయాణం బాహ్యంగా చేసే ప్రయాణం కాదు, అంతర్ముఖ ప్రయాణం. బాహ్య ప్రయాణానికి కర్మ కావాల్సివస్తే, ఈ ప్రయాణానికి జ్ఞానం కావాలి. ఈ ప్రయాణం ఆత్మ, అనాత్మల వివేకం చూపిస్తుంది . అంటే ఆత్మ స్వరూపం అర్థం చేసుకుని అనాత్మ భావనను పోగొట్టుకోవటం.

ఎలా ఈ ప్రయాణం చేయాలి? ఉపనిషత్తు దశలవారీగా చెప్తోంది. ముందే హఠాత్తుగా చెప్పదు. ఎందుకంటే ఆత్మ– అశబ్దం, అస్పర్శం, అరూపం, అవ్యయం, అరసం, అగంధం. ఒక్కసారిగా లక్షణాలు లేని వస్తువుని మనం గ్రహించలేము. ఎంతసేపూ మనం వేరూ, మనం చూసే వస్తువు వేరూ అన్న పద్ధతికి అలవాటు పడ్డాము. అందుకని మన దృష్టి –

సగుణం నుంచి నిర్గుణంకు, అనాత్మ నుంచి ఆత్మకు, దేహం నుంచి దేహీకి, శరీరం నుంచి శరీరికి మారాలి. దీన్ని పంచకోశ వివేకం అంటారు. ఈ పద్ధతి తైత్తరీయ ఉపనిషత్తులో వివరంగా ఇవ్వబడింది.

**యతోవా ఇమాని భూతాని జాయన్తే। యేన జాతాని జీవన్తి। యత్ప్రయన్త్యభిసంవిశన్తి। తద్విజిజ్ఞాసస్వ। తద్బ్రహ్మేతి। స తపోహోతప్యత స తపస్తప్త్వా॥** – తైత్తిరీయం 3.1.2

దేని నుంచీ సృష్టి ఆరంభమవుతుందో, ఏది స్థితి కారకమవుతుందో, దేనిలో సృష్టి లయమవుతుందో ఆ బ్రహ్మని విచారించి తెలుసుకోమని భృగుమహర్షికి తండ్రి వరుణుడు

చెప్పాడు. అతను పంచకోశ వివేకం ద్వారా తెలుసుకున్నాడు. ఇక్కడ అంత వివరంగా ఇవ్వబడలేదు. ఇక్కడ ఇచ్చిన పదాలని ఈ విధంగా అన్వయం చేసుకోవాలని శంకరాచార్యుల వారు చెప్తున్నారు.

ఇంద్రియాలు – అన్నమయ కోశం.
విషయవస్తువులు – ప్రాణమయ కోశం.
మనసు – మనోమయ కోశం.
వ్యష్టిబుద్ధి – విజ్ఞానమయ కోశం.
సమష్టిబుద్ధి – హిరణ్యగర్భ లేదా ఆనందమయకోశం.

మన బుద్ధి స్థూలబుద్ధి కాబట్టి, అది బాహ్యవస్తువులనే చూడటానికి అలవాటు పడింది కాబట్టి సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మను తేలిగ్గా అర్థం చేసుకోలేదు. అందుకని దశలవారీగా, ఒక్కొక్క కోశాన్ని విడదీస్తూ రావాలి. అలా ఒక్కొక్క కోశాన్నీ అనాత్మగా అర్థం చేసుకుంటే, అవి మిథ్యగా తెలిసి, చివరికి ఆత్మ దగ్గరకి వెళ్తాము. ఇలా ఒక్కొక్క అడుగూ వేసుకుంటూ జ్ఞానం పొందే పద్ధతిని రెండు పేర్లతో చెప్తారు.

1. శాఖాచంద్ర న్యాయం – ఈ పద్ధతిని చాలా చిన్న ఆకారంలో కనబడే నెలవంకని చూపించటానికి ప్రయోగిస్తారు. ముందు ఒక పెద్ద చెట్టును చూపించి, దాని తర్వాత దాని చిటారుకొమ్మలనుచూడమని, ఆ చిటారు కొమ్మల మధ్య నెలవంక ఆకారంలో ఉన్న చంద్రుని చూపిస్తారు. అలా స్థూల వస్తువు నుంచి, సూక్ష్మ వస్తువుకి ప్రయాణిస్తామన్నమాట.

2. అరుంధతీ దర్శన న్యాయం – కొత్తగా పెళ్లయిన జంటకి అరుంధతీ నక్షత్రాన్ని చూపిస్తారు. దానికి కూడా ఇదే పద్ధతి. ముందు ఆకాశంలోని నక్షత్రాలను చూడమనీ, అక్కడ ఒక గడిలా ఉన్న నాలుగు నక్షత్రాలనూ, దానికి తోకలా ఉన్న మూడు నక్షత్రాలనూ చూడమంటారు. ఆ తోకలోని రెండో నక్షత్రం పక్కన, దానికన్నా చిన్న ఆకారంలో, మెరుస్తూ ఉన్నదే అరుంధతీ నక్షత్రం.

రెండు పద్ధతుల్లోనూ సమానంగా ఉన్నది, స్థూల వస్తువు నుంచి ఒక్కొక్క అడుగూ దానికన్నా సూక్ష్మ వస్తువు వైపు వేస్తూ వెళ్లటం. అలాగే ఒక్కొక్క స్థూలకోశం నుంచి దానికన్నా సూక్ష్మమైనదీ దానికన్నా మరింత దగ్గరైనదీ, దానికన్నా మరింత విశాలమైనదీ తెలుసుకుంటూ వస్తాము, సర్వవ్యాపకమైన, సూక్ష్మాతి సూక్ష్మమైన ప్రత్యగాత్మ గురించి తెలుసుకునేదాకా.

ఉదాహరణకు ప్రాణం విషయానికొచ్చేసరికి, శరీరం పరాక్ (బాహ్య వస్తువు), ప్రాణం ప్రత్యక్ (అంతర్‌వస్తువు) అవుతుంది. అలాగే మనసు దగ్గరికొచ్చేసరికి, అదే ప్రాణం పరాక్ అవుతుంది. మనసు ప్రత్యక్ అవుతుంది. చివరికి ఆత్మ ప్రత్యగాత్మ అవుతుంది. అది దేనికీ

పరాక్ అవదు. ఇదే అంతర్గత ప్రయాణం. ఇది జ్ఞానం వల్లనే సాధ్యం. ఇక్కడ తెలుసుకోవటమే బ్రహ్మని చేరటం. ఎందుకంటే ఇది బాహ్య ప్రయాణం కాదు. అంతర్గత ప్రయాణం. ఇప్పుడు ఈ మంత్రంలోకి వెళ్దాం.

ఇంద్రియేభ్యః పరాః అర్థా – ఇంద్రియాల కన్నా శక్తివంతమైనవి ప్రాపంచిక వస్తువులు. ఉపనిషత్తు శరీరం గురించి చెప్పలేదు. మనం చెప్పుకోవాలి. శరీరం కన్నా శక్తివంతమైనవి ఇంద్రియాలు. వాటికి శరీరం మీద అధికారం ఉంటుంది. గుర్రాలు రథాన్ని లాగినట్టు, ఇంద్రియాలు శరీరాన్ని వాటికి కావాల్సిన చోటుకి తీసుకువెళ్తాయి. ఉదాహరణకు కళ్ళు సినిమాకి, చెవులు ప్రవచనానికి తీసుకువెళ్తాయి.

ఇంద్రియాల కన్నా శక్తివంతమైనవి ప్రాపంచిక వస్తువులు. ఈ వాక్యం కొంత అయోమయంలో పడేస్తుంది. ఎందుకంటే సాధారణంగా మనం విషయవస్తువులను, ఇంద్రియాలకన్నా స్థూల వస్తువులుగా భావిస్తాము. 'అర్థ' అంటే అసలు అర్థం ప్రపంచంలోని వస్తువులు. కాకపోతే, వాటిని మనం చూసేటప్పుడు, వాటిని పూర్తి వస్తువులుగా చూడటం లేదు, మన ఇంద్రియాల పరంగా చూస్తాము. అంటే ప్రపంచంలోని వస్తువులన్నింటినీ ఐదు అంశాలుగా విభజించవచ్చు. శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం – అంటే ఒక వస్తువు రూపాన్నో, అది చేసే శబ్దాన్నో, దాని రుచినో చూస్తాము. ఇంద్రియాలు సూక్ష్మ భూతాలనుంచి ఉత్పన్నమయితే, అర్థం సూక్ష్మభూతాలు అని శంకరులు చెప్తున్నారు. విషయ వస్తువులని గుర్తించటానికే ఇంద్రియాలని సూక్ష్మభూతాలు సృష్టించాయి. అందువల్ల అర్థాలు ఇంద్రియాలకన్నా సూక్ష్మమై ఉండాలి. ఎందుకంటే అర్థాలు కారణం అయితే ఇంద్రియాలు కార్యం, కారణం, కార్యం కన్నా ఎప్పుడూ సూక్ష్మమైనదై ఉంటుంది.

ఇంకో విధంగా చూసినా కూడా విషయ వస్తువులు, ఇంద్రియాలను ప్రలోభపెడ్తాయి. ఒక వస్తువు చూస్తే బాగుంది అనుకుంటాము. అక్కడితో ఆగక అది నా దగ్గర ఉండి తీరాలి. అది కావాలి, అది లేకపోతే ఉండలేను అన్న పరిస్థితికి వస్తాము. అందువల్ల అశాశ్వత వస్తువులకు బానిస అవుతాము. విషయ వస్తువుల కన్నా మనసు శక్తివంతమైనది.

అర్థేభ్యశ్చ పరం మనః – చూసిన వస్తువు ఆలోచన రూపంలో మనసులో ఉంటుంది. యమధర్మరాజు ఆలోచనల కన్నా మనసు శక్తివంతమైనది అంటున్నాడు. ప్రతి ఆలోచన వచ్చి పోతుంటుంది. ఆలోచన అల అయితే, మనసు సరోవరం. మనం ఒక్కొక్కటీ వదులుకుంటూ రావాలి – దేహ అభిమానం, ఆలోచన అభిమానం.

మనసస్తు పరా బుద్ధిః – మనసుకన్నా సూక్ష్మమైనది బుద్ధి. మనసు, బుద్ధి వేర్వేరు అంశాలు కావు. వేర్వేరు పేర్లు అంతే. అంతఃకరణ ఒకటే, వాటి పనివేరు. సంకల్ప

వికల్పాత్మకమైనది మనస్సు – మనసులో ఆలోచనలు రేగుతాయి. సంశయాలు కలుగుతాయి. నిశ్చయాత్మక అంతఃకరణ బుద్ధి. సంశయాలను అధిగమించి ఒక నిశ్చయం చేస్తుంది బుద్ధి. అందువల్ల మనోమయ కోశం కన్నా శ్రేష్టమైనది విజ్ఞానమయ కోశం. బుద్ధి మనసుని జయిస్తుంది. బుద్ధి జ్ఞానాన్ని కలగజేసి, దుఃఖాన్ని పోగొట్టుతుంది.

బుద్ధే రాత్మ మహాన్పరః – బుద్ధి కన్నా శక్తివంతమైనది సమష్టి బుద్ధి. వ్యష్టి బుద్ధి కన్నా సమష్టి బుద్ధి గొప్పది. అల వ్యష్టి అయితే, సముద్రం సమష్టి. అల దృష్టి నుంచి సముద్రం దృష్టి అలవర్చుకోవాలి. మనసు లోతుగా, విశాలంగా, సూక్ష్మంగా ఆలోచించేటట్టు ఉండాలి. సుబ్రహ్మణ్యస్వామి అసురులని బల్లెంతో చంపినట్టుగా సంసార రాక్షసుడిని, అజ్ఞానాన్ని, బుద్ధి అనే బల్లెంతో సంహరించాలి. మహాన్ ఆత్మ అంటే ఇక్కడ సచ్చిదానంద ఆత్మకాదు, సమష్టి బుద్ధి లేదా హిరణ్యగర్భ. ఇక్కడ అంతర్గత ప్రయాణం ఐదు దశల్లో సాగింది. అవి వరుసగా ఇంద్రియాలు, విషయవస్తువులు, మనసు, బుద్ధి, సమష్టి బుద్ధి వైపుకి. ఇక్కడితో ప్రయాణం అయిందా? లేదు. 11 వ మంత్రం చూడండి.

**మంత్రం – 11**

**మహతః పరమవ్యక్తమవ్యక్తాత్పురుషః పరః।**
**పురుషాన్న పరం కించిత్ సా కాష్ఠా సా పరా గతిః॥**

**ప్రతిపదార్థం:** మహతః – మహత్వం గల సమష్టి బుద్ధికన్నా; పరం – శ్రేష్ఠం, అవ్యక్తమ్ – అవ్యక్తం; అవ్యక్తాత్ – అవ్యక్తం కన్నా, పురుషః పరః – చైతన్యం శ్రేష్ఠం, పురుషాన్న పరం కించిత్ – చైతన్యం కన్నా శక్తివంతమైనది ఏదీ లేదు; సా కాష్ఠా – అదే అంతిమ గమ్యం; సా పరా గతి ః – అదే పరమ గమ్యం.

**తాత్పర్యం:** మహత్వం గలదైన సమష్టి బుద్ధి అవ్యక్తం శక్తివంతమైనది. అవ్యక్తం కన్నా చైతన్యం శక్తివంతమైనది. చైతన్యం కన్నా శక్తివంతమైనది ఏదీ లేదు. అదే పరమవస్తువు. అదే అంతిమ గమ్యం.

**వివరణ:** అంతర్గత ప్రయాణం ఇంకా కొనసాగుతోంది. మహతః పరం అవ్యక్తమ్. సమష్టిబుద్ధి కన్నా శ్రేష్ఠం అవ్యక్తం అంటే సమష్టి సూక్ష్మ ప్రపంచం కన్నా సమష్టి కారణ ప్రపంచం శ్రేష్ఠం. అవ్యక్తం అంటే ప్రళయ అవస్థ. అంతా అవ్యక్తం అయితే ఎలా ఉంటుంది? రోజూ మనలో జరిగేదే అది. సుషుప్తిలో మనజ్ఞానం, భావాలూ అన్నీ ఉన్నాయి కాని, సూక్ష్మాతి సూక్ష్మంగా, భిన్నత్వం లేకుండా ఉన్నాయి. ఉదాహరణ మర్రిచెట్టు విత్తనం. ఆ విత్తనంలో, చెట్టుని, కొమ్మలని, వేర్లని విడివిడిగా చూడలేము. అది అవ్యక్తరూపంలో ఉంది.

ఇదా ఆత్మ? కాదు. అవ్యక్తం కన్నా శ్రేష్ఠం పురుషః. అవ్యక్తాత్ పురుషః పరః – అవ్యక్తం అంటే శూన్యం కాదు. సూక్ష్మాతిసూక్ష్మం. సుషుప్తిలో సూక్ష్మరూపంలో ఉన్నవి అన్నీ జాగ్రదావస్థలో మళ్ళీ వస్తాయి కదా. అవ్యక్తాన్ని కారణ ప్రపంచం అనీ, జగత్‌బీజం అనీ, మాయా ప్రకృతి అని కూడా అనవచ్చు. ఆ అవ్యక్తం కన్నా శ్రేష్ఠం – పురుషః అంటే చైతన్యం.

అవ్యక్తస్థితి తెలుసని ఎలా తెలుసు? నేను మొద్దులా నిద్రపోయాను, నాకేమీ తెలియలేదు అని అంటాము, సుషుప్తి నుంచి లేచాక. ఏమీ తెలియలేదు అంటే అర్థం తక్కిన అనుభవాలు లేవన్న అనుభవం పొందాము. ఆ అవ్యక్తస్థితిని సాక్షిగా చూసేది చైతన్యం. ఆ సాక్షి చైతన్యాన్ని నేను. సుషుప్తిలో ఉన్న అవ్యక్తస్థితి జాగృతిలో పోతుంది.

నేను ఉన్నాను. ఆలోచనలు ఉన్నాయి అని సాక్షిగా చూస్తున్నాను.
ఆలోచనలు లేవు అని సాక్షిగా చూస్తున్నాను.

అంటే ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుని సాక్షీభూతంగా చూస్తున్నాను. నా దృష్టిని ఇలా సాక్షిగా చూసే చైతన్యం వైపు మరల్చాలి. ఉదాహరణకు హాలు నిండుగా ఉంది, ఇప్పుడు ఖాళీ అని ఎలా తెలుస్తోంది? మనుష్యులు ఉన్నప్పుడు చూపిన కాంతే, లేనప్పుడు కూడా చూపిస్తోంది.

అందుకని శరీరాన్ని, ఇంద్రియాలని, మనసుని, బుద్ధిని అన్నీ నియంత్రిస్తూ శూన్యం చేసాక ఏం చేయాలి? ఆ శూన్యం మీద దృష్టి పెట్టకుండా, శూన్యాన్ని చూస్తున్న చైతన్యం మీద పెట్టాలి. మనుష్యులు ఉన్నా కాంతి ఉంది, మనుష్యులు లేకపోయినా కాంతి ఉంది. ఆలోచనలు ఉన్నా తెలుస్తోంది, లేకపోయినా తెలుస్తోంది. చైతన్యం లేకపోతే, శూన్యం ఉన్నట్టు తెలియదు. అదే నిదర్శనం. అందుకని చైతన్యం వైపుకి తిరగాలి.

చైతన్యం వైపుకి ఎలా తిరగాలి? నేనే చైతన్యాన్ని అని గుర్తించటం ద్వారా, తిరగటం అంటే గుర్తించటం. నేను చైతన్యాన్ని. అది నా స్వరూపం అని తెలుసుకోవాలి.

పురుషః అంటే మగవాడు కాదు, చైతన్యం, పురుషః పదంకు రెండు అర్థాలు ఉన్నాయి.

1. పురేషేతే ఇతి పురుషః – శరీరంలో జీవించేవాడు.

2. పూరయతి సర్వం ఇతి పురుషః – సర్వవ్యాపకమైంది – కాంతిలాగా – అందుకని పురుషః అంటే లోపల + బయట.

అంతః బహిశ్చసర్వం – చైతన్యం అంతటా వుంది దానికి ప్రయాణం లేదు.

పురుషాన్నపరం కించిత్ – ఒక కోశం నుంచి ఇంకో కోశానికి వస్తూ ఆత్మచైతన్యం దగ్గరకి వచ్చాక ఇంక ప్రయాణం లేదు. ఆత్మకన్నా సూక్ష్మమైనది లేదు. సా కాష్ఠా సా పరాగతిః – లోపల, అంతటా ఉన్నది ఆత్మే. లోపల ప్రయాణం ఆత్మతో ముగియాలి.

చైతన్యమే అంతిమ వస్తువు, అంతిమ గమ్యం. ఆత్మే అంతిమ గమ్యం. తక్కినవన్నీ మధ్యలోనే ఆగిపోతాయి. అంతకుముందు మంత్రంలో చూసిన విష్ణుపదం ఏమిటో ఇక్కడ తెలుస్తుంది. ఆత్మ శరీరంకాదు అని తెలుసుకోవటానికే ఏళ్ళు గడిచిపోతాయి. ఉద్రేకాల నుంచి బయటపడటానికి ఇంకా ఎక్కువ సమయం పడుతుంది.

బ్రహ్మతో మన ప్రయాణం ముగుస్తుంది. బ్రహ్మ సూక్ష్మాతిసూక్ష్మం సర్వ వ్యాపకం, ప్రత్యగాత్మ, అధిష్ఠానం. ఈ గమ్యాన్ని చేరుకోవాలి మన ఆధ్యాత్మిక ప్రయాణంలో.

వ్యష్టి బుద్ధి నుంచి సమష్టి బుద్ధికి ఎందుకు ప్రయాణించింది ఉపనిషత్తు? అలా చేయకపోతే ఒక చిన్న ప్రమాదం ఉంది. పంచకోశ వివేకం చేసి పంచకోశాలకతీతమైనది ఆత్మ అని ఆగితే, ఆత్మలు అనేకం ఉన్నాయి అనుకుంటారు సాంఖ్య శాస్త్రజ్ఞులులాగా.

## మంత్రం – 12

**ఏష సర్వేషు భూతేషు గూఢోఽఽత్మా న ప్రకాశతే।**
**దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః॥**

**ప్రతిపదార్థం:** ఏషః ఆత్మా – ఈ ఆత్మ; సర్వేషు భూతేషు – అన్ని జీవులలోనూ; గూఢః – దాగి ఉంది; న ప్రకాశతే – ప్రకటితం కాదు; తు – కాని; అగ్ర్యయా – ఏకాగ్రత చెందిన; సూక్ష్మయా బుద్ధ్యా – సూక్ష్మమైన బుద్ధితో; సూక్ష్మదర్శిభిః – మహాత్ములచే; దృశ్యతే – దర్శింపబడుతుంది.

**తాత్పర్యం:** ఈ ఆత్మ – అన్ని జీవులలోనూ దాగి ఉంది, ప్రకటితం కాదు; కాని ఏకాగ్రత చెందిన, సూక్ష్మమైన బుద్ధిచే మహాత్ములు ఈ ఆత్మను దర్శించగలుగుతున్నారు.

**వివరణ:** ఇక్కడ పంచకోశ వివేకం చేయటానికి కావాల్సిన అర్హత చాలా సూక్ష్మమైన మనసు. కంటి ఆపరేషన్‌కు గొడ్డలి వాడగలమా? సూక్ష్మాతి సూక్ష్మమైనది ఆత్మ. మనసుని కూడా సూక్ష్మంగా సిద్ధం చేయాలి. తంబూరశ్రుతి చేయటానికే చాలా సమయం తీసుకుంటారు. అలా మనసుని శ్రుతి చేయకపోతే, ఆత్మ తెలియదు. ఈ ఆత్మ అన్నింటిలో ఉంది, వెతకనక్కరలేదు. అయితే సమస్య ఏమిటి? దాగి ఉంది. గూఢః అంటే అసలు అర్థం దాగి ఉందని. కాని సర్వవ్యాపకమైన ఆత్మను ఏదీ కప్పలేదు. ఒక వస్తువుని ఏదైనా కప్పాలంటే

ఆ కప్పే వస్తువు దానికన్నా పెద్దదై ఉండాలి. అన్నిటికన్నా పెద్ద వస్తువు ఆత్మ. ఆత్మను వేరే ఏది కప్పగలదు? పంచకోశ అనాత్మ మీద దృష్టిపెడతాము కాని ఆత్మ మీద పెట్టము.

ఉదాహరణకు ఈ గదిలో ఏం ఉంది అని ఎవరినైనా అడిగితే, ఇక్కడ ఉన్నవన్నీ చెప్తారు, ఒక్క కాంతిని తప్ప. ఎందుకు? కాంతి సూక్ష్మమైనది, దానికి ఆకారం లేదు. కాంతిలో చెయ్యి పెడితే కాంతి కనబడదు, చెయ్యే కనబడుతుంది. చేతిని కాకుండా, దాన్ని ప్రకాశింపజేస్తున్న కాంతిని చూడగలగటం లాంటిదే ఆత్మ దర్శనం.

కొంతమంది ధ్యానంలో మనసుని శూన్యం చేస్తే ఆత్మ సాక్షాత్కారం కలుగుతుందనుకుంటారు. మనసు శూన్యంగా ఉంటే ఆత్మ వస్తే, ఆలోచన వస్తే ఆత్మ వెళ్లిపోతుందా? అది కాదు చేయాల్సింది. ఏదో వస్తుందని చూడకుండా – ఈ శూన్యాన్ని చూసే నేను చైతన్యాన్ని – సాక్షి చైతన్యాన్ని. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుకి సాక్షి చైతన్యాన్ని, రాకపోకలకి సాక్షిని. నేను చైతన్య ఆత్మను. ఆత్మకి రాకపోకలు లేవు.

నేను ఆత్మను అని స్వీకరించటానికి మనసు ప్రమాణంగా వాడాలి, కాని స్వీకరించాక, మనసు కలవదు అందులో. ఉదాహరణకు, మనం కళ్లజోడుతో వ్యవహారం నడుపుతాము. కాని కళ్ళజోడు మన శరీరంలో ఒక భాగం కాదు, నా మనసు సహాయంతో అసలు నేనుని నేను స్వీకరిస్తాను. ఈ నేనుని చేరుకోవటమే అంతిమ గమ్యం – సా పరాగతిః ఇంతకుముందు మంత్రంలో వచ్చింది ఈ విషయం.

ఇక్కడ శంకరాచార్యులు గతిని వివరిస్తున్నారు. గతి అంటే అసలు అర్థం, ప్రయాణం చేసాక చేరే గమ్యం. అంటే ఆత్మను జ్ఞానం ద్వారా చేరితే, ఆత్మ కూడా స్వర్గలోకం లేదా బ్రహ్మలోకం లాగా శాశ్వతం కాదా అని అడగవచ్చు ఎవరైనా! నేను ఆత్మను అని స్వీకరించటమే తప్ప ప్రయాణం లేదు. అజ్ఞానాన్ని తొలగించుకోవటమే, ఆత్మజ్ఞానం.

మరి 'గతిః' ఎందుకు వాడింది ఉపనిషత్తు? శంకరాచార్యుల వారు, దాన్ని వ్యాకరణపరంగా వివరిస్తున్నారు. గతిః పదంకు ఇంకో అర్థం కూడా ఉంది – అది తెలుసుకోవటం. మోక్షం అన్నది పూర్తిగా బుద్ధికి సంబంధించింది. బుద్ధితోనే పొరపాటుగా అర్థం చేసుకుంటాము కాబట్టి, ఆ అజ్ఞానాన్ని తొలగించటం కూడా బుద్ధికి చెందిన పనే. అందుకని జీవాత్మ ఎక్కడికో ప్రయాణించి పరమాత్మలో కలవటం లేదు.

ఆత్మ ఎక్కడుంది? ఏష సర్వేషు భూతేషు – సకల జీవరాసుల్లోనూ ఉంది. అన్ని అవస్థల్లోనూ ఆత్మ ఉంది. ఆత్మ వల్లే అన్నీ తెలుస్తున్నాయి.

**ప్రతిబోధవిదితం మతమమృతత్వం హి విన్దతే**
**ఆత్మనా విన్దతే వీర్యం విద్యయా విన్దతేఽ మృతం** – కేన 2.4

కాని ఈ స్వయం ప్రకాశక ఆత్మ కప్పబడినట్టుగా ఉంది. ఆలోచనలు, చైతన్యం కలిసి ఉన్నా, మాయ యొక్క ఆవరణ శక్తి (కప్పే శక్తి) వల్ల, మన ఆలోచనలు, బాహ్య ప్రపంచం మన దృష్టిని మరల్చి, ఆత్మ దర్శనం కాకుండా చేస్తున్నాయి. దాంతో ఆత్మను పట్టించుకోవటం లేదు. ఉదాహరణకు ఒక తెర మీద సినిమా చూస్తున్నా కూడా, సినిమాలో లీనమై తెరని పట్టించుకోవడం లేదు.

ఆత్మను ఎలా తెలుసుకోవాలి? ఆత్మను పిలవనక్ఖరలేదు. చేతిని చూడటానికి కాంతిని పిలవనక్ఖరలేదు. కాంతినీ, చేతినీ విడదీసి చూడగలగాలి. చైతన్యానికి 5 లక్షణాలు ఉన్నాయి. (ముందు వివరించినవి)

ఆత్మ చైతన్యం ముందే ఉన్న సిద్ధ వస్తువు. అనంతం, అవిచ్ఛిన్నం, స్వస్వరూపం.

యమధర్మరాజు స్థూల బుద్ధి నుంచి, సూక్ష్మ బుద్ధి పెంచుకోవాలని చెప్తున్నాడు. శరీరం, మనసు నుంచి చైతన్యం వైపుకి దృష్టి మరల్చుకోవాలి.నేను ఆలోచనని కాను అన్న ఎరుక రావాలి. దృశ్యతే – అహం చైతన్యమస్మి అని స్వీకరించాలి. చిదానంద రూపః శివోఽ హం

ఎలా చేయాలి? అగ్రయా బుద్ధ్యా – సూక్ష్మ బుద్ధి కావాలి దానికి. లేజర్ అంత సూక్ష్మంగా ఉండాలి. ఎందుకు? ప్రకాశించే వస్తువుని తెలుసుకోవటం తేలిక. ప్రకాశింపజేసే ఆత్మను తెలుసుకోవటం కష్టం. ఆత్మ చూసే వస్తువు కాదు. చూసే మనము. ఇన్నాళ్ళు నేర్చుకున్న విధానం వేరు. ఆత్మని తెలుసుకునే విధానం వేరు.

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్.**
**అనుభవిస్తున్న నేనే ఎప్పటికీ అది, అనుభవించబడే వస్తువు ఎన్నటికీ కాదు.**

**మంత్రం – 13**

**యచ్ఛేద్వాఙ్మనసీ ప్రాజ్ఞస్తద్యచ్ఛేత్ జ్ఞాన ఆత్మని।**
**జ్ఞానమాత్మని మహతి నియచ్ఛేత్తద్యచ్ఛేచ్ఛాన్త ఆత్మని॥**

**ప్రతిపదార్థం:** ప్రాజ్ఞ – శ్రవణం చేసిన జ్ఞాని; వాక్ – వాక్కుని; మనసీ – మనసులో; యచ్ఛేద్ – లీనం చేయాలి; తత్ జ్ఞాన ఆత్మని – జాగృతి చెందిన ఆ మనసుని బుద్ధిలో; యచ్ఛేత్ – లీనం చేయాలి; జ్ఞానమ్ – బుద్ధిని; మహతి ఆత్మని – సమష్టి బుద్ధితో; యచ్ఛేత్– లయింపచేయాలి; తత్ – ఆ సమష్టి బుద్ధిని; శాంత ఆత్మని – శాంతికి నిలయమైన భగవంతునిలో; యచ్ఛేత్ – లీనం చేయాలి.

**తాత్పర్యం:** శ్రవణం చేసిన జ్ఞాని, వాక్కుని మనసులో లీనం చేయాలి. జాగృతి చెందిన ఆ మనసుని బుద్ధిలో లీనం చేయాలి; బుద్ధిని సమష్టి బుద్ధిలో లీనం చేయాలి; ఆ సమష్టి బుద్ధిని, శాంతికి నిలయమైన చైతన్యంలో లీనం చేయాలి.

**వివరణ:** ఇంతకు ముందు మంత్రంలో 'సూక్ష్మ అగ్ర్యయా బుద్ధి' వచ్చింది. పదునైన, సూక్ష్మబుద్ధి కావాలి. ఆత్మజ్ఞానం పొందటానికి మనసు కావాలి. మనసుని సమాధి స్థితిలోకి తీసుకెళ్ళకూడదు. కాని ఇది చూడండి.

**న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నోమనః** – కేనోపనిషత్తు 1.3

**యన్మనసా న మనుతే యేనాహుర్మనో మతమ్।** – కేనోపనిషత్తు 1.6

మనసుతో తెలుసుకోలేము. మరి ఏది కరెక్ట్? శంకరాచార్యుల వారు అనేక జవాబులు ఇస్తారు.

తేలికైన జవాబు – మనసు తెలుసుకోలేదు అంటే అర్థం – స్థూల మనసు తెలుసుకోలేదు. సిద్ధంకాని మనసు తెలుసుకోలేదు.

మనసా ఏవ అనుద్రష్టవ్యం – మనసే చూస్తుంది. కాకపోతే అంత త్వరగా నమ్మము. తాడుని చూసి పాముని భ్రమించామని నమ్ముతాము. కాని అనాత్మను ఆత్మ అనుకుంటున్నామని నమ్మము. మరి నమ్మేదెలా? అనేక మార్గాలు ఉన్నాయి. గురువుద్వారా, ధ్యానం ద్వారా తెలుసుకోవచ్చు.

గమనిక – ధ్యానం అన్నమాటని సరిగ్గా అర్థం చేసుకోవాలి. ధ్యానం వల్ల ఆత్మను తెలుసుకోలేము. ధ్యానంలో రెండు రకాలు ఉన్నాయి. వేదాంత శ్రవణం చేసేముందు చేసే ధ్యానం, చిత్తశుద్ధి ఏర్పడటానికి తోడ్పడుతుంది. అది సగుణ ఈశ్వర ధ్యానం అవుతుంది. వేదాంత శ్రవణ, మననాలు చేసాక, నేర్చుకున్నది ఆకళింపు చేసుకోవటానికి చేసే ధ్యానాన్ని నిధి ధ్యాసనం అంటారు. ఆవు తను తిన్నది నెమరువేసుకున్నట్టుగా అన్నమాట.

వాక్కుని మనసులోకి తేవాలి – యచ్ఛేత్ వాక్ మనసీ ప్రాజ్ఞః. ప్రాజ్ఞః అంటే శ్రవణం చేసిన జ్ఞాని. కాని జ్ఞాన నిష్ఠ కాదు. అతను వాక్కుని మనసులో ఉపసంహారం చేయాలి. వాక్కు అంటే వాక్కు ఒక్కటే కాదు. ఇంద్రియాలు కూడా పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలూ – అన్నింటికీ వర్తిస్తుంది. దీన్ని ఉపలక్షణం అంటారు. ప్రాణమయ పనులని మనోమయంలోకి తేవాలి.

మనసుని బుద్ధిలోకి తేవాలి – తద్ యచ్ఛేద్ జ్ఞాన ఆత్మని – ఇక్కడ ఆత్మ అంటే బుద్ధి. మనోమయం నుంచి విజ్ఞానమయ కోశంలోకి లయం చేయాలి.

బుద్ధిని హిరణ్యగర్భలో లయం చేయాలి – జ్ఞాన ఆత్మని మహతి నియచ్ఛేత్ – వ్యష్టిబుద్ధిని ఆ మహతి ఆత్మని అంటే సమష్టి బుద్ధి లేదా హిరణ్యగర్భలో లయం చేయాలి. ఇది విశాల దృక్పథం అలవరుస్తుంది. అంటే వ్యష్టి సమష్టికి భిన్నంగా లేదు. హైదరాబాద్‌ను భారతదేశంలో ఒక భాగం అనుకుంటే, ఆసియాలో ఒక భాగం అనుకుంటే అంతకంతకూ విశాల దృక్పథం అలవడుతుంది. ప్రదేశం ఒక్కటే, దృష్టిలో మార్పు.

హిరణ్యగర్భనుంచి చైతన్యంలో లయం చేయాలి – తత్ యచ్ఛేత్ శాంత ఆత్మని – శాంతికి నిలయమైన చైతన్యంలో లయం చేయాలి. బుద్ధి ఆలోచనల నుంచి చైతన్యానికి మారాలి, చూసే చేతిని కాదు దాన్ని చూపించే కాంతి వైపు దృష్టిని మరల్చినట్టుగా.

చైతన్యమే నా స్వరూపం అనీ, అన్ని బుద్ధుల వెనుక ఉన్నది చైతన్యమేననీ తెలుసుకోవాలి. అంటే చూసే వస్తువు నుంచి, వాటిని చూసే నా వైపుకి దృష్టి మరల్చటమే నిధిధ్యాసనం.

నేను పరిచ్ఛిన్నం కాదు, పరిమితం కాదు. నేను అన్నమయ కోశమో, ప్రాణమయ కోశమో కాదు. నేను చైతన్యాన్ని అని తెలుసుకోవటానికి ఎంతసేపు పడుతుంది? అది తెలిసినా, తెలియకపోయినా నేను చైతన్యాన్నే. కాకపోతే తెలుసుకోవటం మన మీద ఆధారపడి ఉంది. బహిర్ముఖం నుంచి అంతర్ముఖం చేయాలి. సరియైన ఉపాసన ఉంటే శ్రవణం చాలు. అది ఎలా తెలుస్తుంది. దృక్పథం మారితే తెలుస్తుంది. సూక్ష్మబుద్ధి ఉంటే తెలుస్తుంది.

నిధిధ్యాసనం అంటే మనం ముందే శ్రవణ, మననాల ద్వారా నేర్చుకున్న దాన్ని ఆకళింపు చేసుకోవటం. ఆత్మ కారణమని, **అనాత్మ** కార్యం అనీ గుర్తుంచుకోవాలి. అనాత్మ **కార్యం** అయితే, దానికి **నామరూపాలు** ఉంటాయి తప్ప, స్వయంగా ఉనికి లేదు. ఆత్మ లేనిదే అనాత్మ లేదన్నప్పుడు అనాత్మ **మిథ్య** అవుతుంది, అంటే ఉండీ లేనట్టే. అప్పుడు అనాత్మ సత్తులో – ఆత్మలో, లీనమైపోతుంది. ఇలా తెలుసుకోవటాన్ని **ప్రవిలాపనం** అంటారు. నిధిధ్యాసనంలో ఐదు దశలని గుర్తుంచుకోవాలి – అనాత్మ, కార్యం, నామరూపం, మిథ్య, ప్రవిలాపనం.

### మంత్రం – 14

**ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్నిబోధత।**
**క్షురస్య ధారా నిశితా దురత్యయా దుర్గం పథస్తత్కవయో వదన్తి॥**

**ప్రతిపదార్థం:** ఉత్తిష్ఠత – నీ సమస్యకి మేలుకో, జాగ్రత – జ్ఞానయోగసాధన చేయి; వరాన్– అర్హుడైన గురువును; ప్రాప్యః – ఆశ్రయించి; నిబోధత – బ్రహ్మ విద్య కోరు; క్షురస్య నిశితా ధారా – కత్తియొక్క పదును అంచు; దురత్యయా – నడవటం చాలా కష్టం; తత్ పథః – ఆ జ్ఞానమార్గం; దుర్గం – చాలా కష్టం; కవయః వదన్తి – ఆచార్యులు అంటున్నారు.

**తాత్పర్యం:** నీ సమస్యకి మేలుకో; జ్ఞానయోగ సాధన చేయి– అర్హుడైన గురువు దగ్గరకు వెళ్లి బ్రహ్మవిద్య కోరు. ఆ జ్ఞానమార్గం కత్తి యొక్క పదును అంచు మీద నడవటంలా చాలా కష్టం. అది కఠినమైనది అని ఆచార్యులు అంటున్నారు.

**వివరణ:** పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో
నిర్వేద మాయాత్ నాస్త్యకృతః కృతేన।
తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్
సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥ – ముండక 1.2.12

లోకానుభవాలను పొంది, వాటిని విచారించి, భగవంతుడిని కర్మల చేత పొందలేము, వైరాగ్యం చేతనే పొందుతాము అని గుర్తించి, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన గురువు దగ్గరకు ఆ విజ్ఞానం పొందటానికి సమిధలు తీసుకువెళ్తారు అని అర్థం. ఇంచుమించు అదే భావన ఇక్కడ కూడా. ఇంకో అద్భుతమైన మంత్రం.

సమస్య ఏమిటి? మన అజ్ఞానమే సమస్య. మనం మన సమస్యలకు అనేక మార్గాలు ప్రయత్నించి, అన్నింటినీ నిందిస్తాము, దేవుడు, నవగ్రహాలు, చేతిరాతలు, న్యూమరాలజీ అన్నింటినీ ఒక ప్రయత్నం చేస్తాము. కొందరు వీటిలో ఏమీ లేదని గ్రహించి, ఆత్మశుద్ధి పొంది, సూక్ష్మబుద్ధి పెంచుకుంటారు.

ఉత్తిష్ఠత, జాగ్రత – నీ సమస్యకి మేలుకో. జ్ఞానయోగ సాధన కోరు. నీ అజ్ఞానమే నీ సమస్యకి కారణం అని తెలుసుకుని, నిత్య, ముక్త, శుద్ధ, చైతన్యానికి మేలుకో. ఈ మంత్రంలో కర్మయోగానికీ, జ్ఞానయోగానికీ మధ్య తేడా చూపిస్తోంది ఉపనిషత్తు. కర్మయోగంలో సమస్య తెలుస్తుంది అంతే. జ్ఞానయోగంలో స్వభావం తెలుస్తుంది. జ్ఞానయోగంలో తెలుసుకుంటేనే, సమస్య పరిష్కారం.

ప్రాప్య వరాన్నిబోధత – స్వభావం తెలుసుకోవటమెలా? కర్మయోగం కొనసాగిస్తే జ్ఞానం కలుగుతుందా? అలా కలగదు అంటున్నాడు యమధర్మరాజు. వృద్ధాప్యం, ఆకలి, మరణం లాంటివి వాటంతట అవే జరుగుతాయి. మనమేమీ ప్రయత్నం చేయనక్కరలేదు. జ్ఞానం అలా కాదు. అయితే ఏం చేయాలి? సరియైన గురువు దగ్గరకి వెళ్లాలి.

వరః అంటే వరుడు కాదు, గురువు. వరం అసలు అర్థం – శ్రేష్ఠ పురుషుడు. ఇక్కడ జ్ఞానం పొందిన వాడు. గురువుని శ్రోత్రియ బ్రహ్మనిష్ఠగా వర్ణించింది, ముండక ఉపనిషత్తు. ఇందులో యమధర్మరాజు కూడా గురుస్తుతి చేస్తాడు. అటువంటి గురువు దగ్గరకు నువ్వు వెళ్ళు. అతన్ని పిలవకు అంటుంది శాస్త్రం. బ్రహ్మవిద్య కోరు. గురు ఉపదేశమనే సాంప్రదాయం

ద్వారా ఆ విద్యను పొందాలి. గురువు ముట్టుకుంటేనే జ్ఞానం పొందేటట్టయితే, శ్రీకృష్ణభగవానుడు ఆ పనే చేసి ఉండేవాడు.

బ్రహ్మవిద్యని శ్రవణ, మనన, నిధి ధ్యాసనల ద్వారా పొందాలి అని ముందు మంత్రంలో తెలుసుకున్నాము. మనం చూసే అనాత్మ ప్రపంచానికి ఉనికి లేదనీ, చైతన్యమైన నేనే దానికి ఉనికినిచ్చాననీ తెలుసుకోవటమే ఆత్మజ్ఞానం. అదే మోక్షం.

అనాత్మ ప్రపంచం మిథ్య అని చూపించటానికి శంకరాచార్యులు మూడు దృష్టాంతాలు ఇచ్చారు. మిథ్య అంటే దానంతట దానికి ఉనికి లేదు. ఆ ఉదాహరణలు – రజ్జుసర్ప భ్రాంతి, ఎండమావి, ఆకాశంలో కాలుష్యం. తాడుని చూసి పాముని పొరపడతాము. అలాగే అనాత్మ లక్షణాలను ఆత్మకు ఆపాదిస్తాము.

పథస్త దుర్గం వదన్తి – ఈ పథం అంటే జ్ఞానమార్గం చాలా కష్టమని ఆచార్యులు అంటున్నారు. సూక్ష్మాతి సూక్ష్మమైన ఆత్మస్వరూపం తెలుసుకోవటానికి బుద్ధి కూడా చాలా సూక్ష్మంగా ఉండాలి.

క్షురస్య ధారా నిశితా – క్షురకుడు అంటే క్షౌరం చేసే వ్యక్తి. ఆ క్షురకుడు వాడే క్షురకత్తి అంచు చాలా పదునుగా ఉంటుంది.

ఈ పథంలో నడవటమంటే అలాంటి పదునైన అంచున్న కత్తి మీద నడవటం (దాటటం కాదు) లాంటిది.

దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా
సూక్ష్మయా సూక్ష్మ దర్శిభిః॥ – కఠ 1.3.12

ఏకాగ్రత చెందిన మనసు, సూక్ష్మ బుద్ధి ఉండాలని చెప్పాడు యమధర్మరాజు. ఇలాంటి నడక చాలా కష్టం. అలాగే జ్ఞానమార్గం కూడా చాలా కష్టం. కాని తప్పించుకోలేము.

జ్ఞానాత్ ఏవ కైవల్యం॥
నాన్యః పంథా అయనాయ విద్యతే॥

అని ఘోషిస్తున్నాయి శాస్త్రాలు. అయితే ఏం చేయాలి? జ్ఞానమార్గం తేలిక చేసుకోవాలి. ఎలా? మనసుని సంసిద్ధం చేయాలి. సంసిద్ధం కాని వాళ్లకి కష్టం, సంసిద్ధం అయిన వాళ్లకి తేలిక – అన్న విషయం మర్చిపోకూడదు. వెయ్యి మైళ్ళ దూర ప్రయాణం ఒక్క అడుగుతో మొదలవుతుందని గుర్తుంచుకోండి. అంటే సిద్ధం అయితే ఏమాత్రం కష్టం కాదు.

ఎలా సిద్ధమవాలి? సాధన చతుష్టయ సంపన్నుడవాలి. అదెలా అవాలి? కర్మయోగం చేసి, ఉపాసనా యోగం చేసి జ్ఞానమార్గానికి రావాలి. ఉపనిషత్తు తల్లిలాగా బుజ్జగించి చెప్తోంది, ప్రేయో మార్గాన్ని విడిచి శ్రేయో మార్గానికి రమ్మని. కర్మ + ఉపాసన చేసి సిద్ధం అయితే జ్ఞానయోగం తేలిక. జ్ఞానం పొందితే మోక్షం లభిస్తుంది.

### మంత్రం – 15

**అశబ్దమస్పర్శ మరూపమవ్యయం తథాఽ రసం నిత్యమగన్ధవచ్చయత్।**
**అనాద్యనన్తం మహతః పరం ధ్రువం నిచాయ్య తన్మృత్యుముఖాత్ప్రముచ్యతే॥**

**ప్రతిపదార్థం:** యత్ – ఏది, అశబ్దమ్ – శబ్దానికి అతీతమైనదో; అస్పర్శమ్ – స్పర్శ భావనకి అతీతమైనదో; అరూపమ్ – దృశ్యానికి అతీతమైందో;అరసం – రుచికి అతీతమైందో; అగన్ధవత్ చ – వాసనకు అతీతమైందో; తథా – అలాగే; అవ్యయం – నాశనం లేనిది; నిత్యమ్ – నిత్యమైనది; అనాది – ఆది లేనిది, అనన్తం – అంతం లేనిది; మహతః – బుద్ధికన్నా; పరం–శ్రేష్టమైనది; ధ్రువమ్ – స్థిరమైనది; తత్ – దానిని; నిచాయ్య – అనుభూతిలో గ్రహించినవాడు; మృత్యుముఖాత్ ప్రముచ్యతే – యమధర్మరాజు నుంచి విముక్తి పొందుతాడు.

**తాత్పర్యం:** ఇంద్రియాలు గ్రహించగల శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలకు ఏది అతీతమైందో దేనికి నాశనం లేదో, ఏది నిత్యమో, దేనికి ఆది అంతాలు లేవో; ఏది బుద్ధికన్నా శ్రేష్ఠమైనదో, దాన్ని అనుభూతిలో గ్రహించినవాడు యమధర్మరాజు నుంచి విముక్తి పొందుతాడు.

**వివరణ:** ఒక మహావాక్య మంత్రం. తరచు వినిపించే మంత్రం బ్రహ్మ నిర్వచనం. బ్రహ్మ ఇంద్రియ అగోచరం, నిత్యం, శ్రేష్ఠం, అనాద్యనన్తం. ముందు మంత్రంలో బ్రహ్మజ్ఞానం చాలా కష్టమనీ, పదునైన క్షురకత్తి మీద నడకలాంటిదనీ చూసాము. ఎందుకు కష్టం అన్న ప్రశ్న వెంటనే వస్తుంది.

ఈ మంత్రం దానికి జవాబు. టూకీగా చెప్పాలంటే, బ్రహ్మ ఇంద్రియ అగోచరం. అందువల్ల మనకి తెలిసిన ఐదు ప్రమాణాలకి కూడా దొరకదు. బ్రహ్మను వస్తువులా ఎలా చూడలేమో, బ్రహ్మ ఎలా అనుభవంలోకి రాదో చూపుతుంది.

బ్రహ్మ – అశబ్దం, అస్పర్శం, అరూపం, అరసం, అగంధవతు – శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలకి అతీతం. బాహ్యప్రపంచాన్ని ఈ ఐదు లక్షణాలతో చూస్తాము మనం. కాని బ్రహ్మ ఈ 5 లక్షణాలకి అతీతం. అంటే ఇంద్రియ అగోచరం.

అంతేకాదు అనాది, అనంతం, అవ్యయం – అనాది అంటే మామూలుగా పుట్టుక లేదు. అనంతం అంటే మరణం లేదు. కాని ఇక్కడ కారణం కాదు. కార్యం కాదు అని అర్థం.

పారమార్థిక అర్థం తీసుకోవాలి. అంటే అవ్యయం, నాశనం లేదు. శరీరానికి షడ్వికారాలు ఉన్నాయని చూసాము. ఆత్మకు అవిలేవు. అందువల్ల ఆత్మ ధ్రువం – దేశకాల అతీతం. నిత్యం – ఎప్పుడూ ఉంటుంది. అటువంటి బ్రహ్మను తెలుసుకోవాలి.

పంచభూతాల విషయానికొస్తే ఒక్కొక్కటీ, ఒకదాన్ని మించి ఒకటి సూక్ష్మమైనదని చూసాము.

| పంచభూతాలు | లక్షణాల సంఖ్య | వాటి వివరాలు |
|---|---|---|
| భూమి/పృథ్వి | 5 | శబ్దం, స్పర్శ, రసం, రూపం, గంధం |
| నీరు | 4 | గంధం లేదు |
| అగ్ని | 3 | గంధం, రసం లేవు |
| వాయు | 2 | గంధం, రసం, రూపం లేవు |
| ఆకాశం | 1 | శబ్దం మాత్రమే ఉంది (అవ్యక్తరూపంలో) |

ఆత్మ గురించి వేరే చెప్పాలా! ఆకాశాదపి సూక్ష్మం.

అందుకని అంతర్ముఖంగా చూడాలి. అంటే దైవానుభూతి, జ్యోతిని చూడటం, సిద్ధులు లాంటివి వస్తాయా? ఇవన్నీ వచ్చిపోతాయి, బ్రహ్మ వచ్చి పోయేది కాదు. అయితే బయటా కాదూ, లోపలా కాదు అంటే బ్రహ్మ అనేది లేదా?

గురువు వెంటనే చెప్తాడు. బ్రహ్మ ఉంది. బయటా కాదు, లోపల కాదు, అది నువ్వే. ఈ క్రింద వాక్యం మనసులో హత్తుకుపోవాలి.

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్.**
**అనుభవిస్తున్న నేనే ఎప్పటికీ అది, అనుభవించబడే వస్తువు ఎన్నటికీ కాదు.**

మృత్యుముఖాత్ ప్రముచ్యతే – కాల తత్వం నుంచి విముక్తి పొందుతాడు. యమధర్మరాజే స్వయంగా చెప్తున్నాడు. నువ్వు ఆత్మజ్ఞానం పొందితే, నేను నిన్నేమీ చేయలేనని. ఇది ఫలశృతి.

అద్వైతం అంటే మృత్యువు నుంచి విముక్తి కాదు, నేను అశాశ్వతుడిని అన్న భావన నుంచి ముక్తి. దీన్నే జీవన్ముక్తి అంటారు.

### మంత్రం – 16

**నాచికేతముపాఖ్యానం మృత్యుప్రోక్తగ్ం సనాతనమ్।**
**ఉక్త్వా శ్రుత్వా చ మేధావీ బ్రహ్మలోకే మహీయతే॥**

**ప్రతిపదార్థం:** నాచికేతమ్ – నచికేతుడు విన్న; మృత్యుపోక్తం – యమధర్మరాజు చెప్పిన; సనాతనమ్ – ప్రాచీనమైన; ఉపాఖ్యానం – విషయాన్ని; ఉక్త్వా – చెప్పిన; శ్రుత్వాచ – విన్న; మేధావీ – వివేకి; బ్రహ్మలోకే మహీయతే – ఉన్నత లోకాలలో ప్రశంసలు పొందుతాడు.

**తాత్పర్యం:** నచికేతునికి యమధర్మరాజు చెప్పిన ప్రాచీనమైన విషయాన్ని చెప్పిన, విన్న వివేకి ఉన్నత లోకాలలో ప్రశంసలు పొందుతాడు.

**వివరణ:** ఈ వల్లీ ముగింపుకి వస్తోంది. యమధర్మరాజు, నచికేతుడు గ్రీన్ రూమ్‌కి వెళ్ళినట్టు ఊహించుకోండి. ఈ బ్రహ్మవిద్యాఫలం చెప్తోంది ఉపనిషత్తు. ఉపాఖ్యానం అంటే కథ. ఇక్కడ సంభాషణ. ఈ విద్యను యమధర్మరాజు నచికేతునికి చెప్పాడు. దీని గొప్పతనం ఏమిటి? సనాతనమ్. వేల వేల సంవత్సరాల ముందు నుంచీ ఉన్నది. ఇప్పటికీ విలువైనది. ఇది వేదాలకి చెందింది కాబట్టి శాశ్వతం. ప్రళయంలో కూడ నాశనం చెందదు, నిద్రలో జ్ఞానం నిక్షిప్తమై ఉన్నట్టుగా ఉంటోంది.

బ్రహ్మలోకే మహీయతే – గురు, శిష్యులిద్దరికీ బ్రహ్మలోక ప్రాప్తి. అది విన్న శిష్యుడు గురువు మీద కృతజ్ఞత కొద్దీ ఇంకొకరికి చెప్తాడు. అప్పుడది నిధి ధ్యాసనం అవుతుంది శిష్యునికి. ఇక్కడ ఫలం గురించి తెలుస్తోంది.

బ్రహ్మలోకే మహీయతే అంటే రెండు అర్థాలు తీసుకోవచ్చు.

1. సంభాషణ విజయవంతమైతే – జ్ఞానం పొంది, జీవన్ముక్తుడు అవుతాడు. అంటే పరబ్రహ్మలో రమిస్తాడు.

2. పూర్తిగా అర్థం కాకపోతే – బ్రహ్మలోకం వెళ్తాడు. అక్కడ జ్ఞానం పొంది, క్రమముక్తి పొందుతాడు. అంటే మోక్షం తప్పనిసరి.

### మంత్రం – 17

**య ఇమం పరమం గుహ్యం శ్రావయేద్ బ్రహ్మసంసది।**
**ప్రయతః శ్రాద్ధకాలే వా తదానన్త్యాయ కల్పతే। తదానన్త్యాయ కల్పత ఇతి॥**

**ప్రతిపదార్థం:** యః – సాధకుడు; పరమం గుహ్యం – రహస్య విద్య; ఇమం – దీనిని; బ్రహ్మసంసది – ప్రాజ్ఞుల సభలోనో; శ్రాద్ధకాలే వా – శ్రాద్ధ సమయంలోనో, శ్రావయేత్– పైకి చదివితే; తత్ – అది; ఆనన్త్యాయ – అనంతమైన ఫలాన్ని; కల్పతే – కలిగిస్తుంది.

**తాత్పర్యం:** అత్యంత గోప్యమైన ఈ ఉపనిషత్తును ప్రాజ్ఞుల సభలోనో, శ్రాద్ధ సమయంలోనో, వేదానికి విలువనిచ్చేవారు గట్టిగా చదివితేనో, అది అనంతమైన ఫలాన్ని కలుగచేస్తుంది.

**వివరణ:** ఫలశృతి కొనసాగుతోంది. యమధర్మరాజూ, నచికేతుడూ ఇద్దరూ లేరు. ఈ అధ్యాయాన్ని, అర్థం తెలియకపోయినా, కేవలం పారాయణ చేస్తేనే అనంతమైన ఫలం కలుగుతుంది. బ్రహ్మ సంసది అంటే వేదానికి విలువనిచ్చేవారు. వేద పారాయణం పైకి

వినపించేలా చేస్తేనే లాభం. ఆ బ్రాహ్మణుడు ఎలా ఉండాలి? శారీరక, మానసిక శౌచం ఉండాలి.

కేవలం చదివితేనే మోక్ష ఫలం కలిగితే, కష్టపడి నేర్చుకోవటం ఎందుకు? మోక్షం ప్రత్యక్షంగా కలగదు. మనసుని శుద్ధి చేస్తుంది, చదవగా చదవగా శ్రద్ధ ఏర్పడుతుంది. శ్రద్ధ ఏర్పడితే అర్థం చేసుకోవాలి అనిపిస్తుంది. తర్వాత మళ్ళీ మళ్ళీ ఎప్పుడు కావాలంటే అప్పుడు చదువుతాము.

అంతకు ముందు మంత్రంలో ఉపనిషత్తు విద్య యొక్క ఫలశృతి ఉంటే, ఇక్కడ కేవలం ఉపనిషత్తు చదివితేనే ఫలం కలుగుతుంది అంటోంది. ముందు మంత్రంలో జ్ఞానఫలం గొప్పగా ఉన్నా, అది నేర్చుకోవటానికి సాధన చతుష్టయ సంపన్నుడై ఉండాలనీ, శ్రవణ, మనన, నిధి ధ్యాసనలు చేయాలనీ, సూక్ష్మబుద్ధి ఉండాలనీ విన్నాక ఎవరికైనా ఇది అసాధ్యం అనిపించవచ్చు. అందుకని ఈ మంత్రంలో భరోసా ఇస్తోంది.

ఈ విద్యని 'పరమం గుహ్యం' అంటోంది ఉపనిషత్తు. ఎందుకు? ఎందుకంటే ఈ విద్య పరమ సత్యాన్ని బోధిస్తుంది. సాధ్యవస్తువుని వెతికే సాధకుడే ఆ బ్రహ్మ అన్న సత్యాన్ని బోధిస్తుంది.

# అధ్యాయం - 2 వల్లీ - 1

రెండవ అధ్యాయంలో ఆత్మస్వరూప విశ్లేషణ మరింత లోతుగా సాగుతుంది. మొదటి అధ్యాయం రెండవ వల్లీలోనూ, మూడవ వల్లీలోనూ ఆత్మ స్వరూప వర్ణన ఉంది. జీవాత్మ, పరమాత్మ ఐక్యం ఉంది. కొన్ని సాధనలు ఉన్నాయి. కేవలం ఆత్మజ్ఞానం వల్లే మోక్షం పొందవచ్చు. ఎందుకంటే మోక్షానికి అడ్డుగా నిలుస్తున్నది అజ్ఞానం.

సగుణ అనాత్మలో మునిగిన దాన్నుంచి బయటకి వచ్చి నిర్గుణ ఆత్మని కనుగొనాలి. మనసు బాహ్యంగా పరుగుతీస్తుంది. ఇంద్రియాలు బాహ్యంగా ఉన్నాయి కాబట్టి, అనాత్మ ప్రపంచంవైపు మొగ్గుచూపటం ఒక కారణం. యమధర్మరాజు చెప్తున్నాడు వేదాంతం అంటే బాహ్యముఖం నుంచి అంతర్ముఖం అవటం అని. ఇది కొండెక్కటంలాంటిది. కిందకి జారటం తేలిక, కాని ఎక్కటం కష్టం.

అంతర్ముఖం అవటం ఎలా? దీనికి ఒకటే పద్ధతి ఉంది. అది వివేకం చూపించటం. దేవుడు మనకు మన సహజ గుణంతో పాటు వివేకం కూడా ఇచ్చాడు.

ఈ వివేకాన్ని ఎలా వాడాలి? బాహ్యవస్తువులను లోతుగా పరిశీలించి అవి భద్రతనివ్వవు, అశాశ్వతం అని తెలుసుకోవాలి. కొంతమందికి ఈ వైరాగ్యం తేలిగ్గా వస్తే, కొంతమందికి ఎదురు దెబ్బలు తిన్నాక వస్తుంది. ఈ హేతుబద్ధమైన హెచ్చరికని లెఖ్ఖ చేయకపోతే నాశనమయ్యేవాటితో మనం కూడా నాశనమవుతాము.

ఎవరు చేస్తారు నాశనం? యమధర్మరాజు. ఆత్మ కానిది నాశనం చేస్తాడు. వివేక జన్య వైరాగ్యంతో బహిర్ముఖత్వం నుంచి అంతర్ముఖత్వానికి సాధన చేయాలి. ఈ నేపథ్యంతో రెండవ అధ్యాయంలోకి  అడుగుపెడదాము.

### మంత్రం – 1

**పరాంచి ఖాని వ్యతృణత్స్వయంభూః తస్మాత్పరాఙ్పశ్యతి నాన్తరాత్మన్।**
**కశ్చిద్ధీరః ప్రత్యగాత్మనమైక్ష దావృత్తచక్షురమృతత్వమిచ్ఛన్॥**

**ప్రతిపదార్థం:** ఖాని – ఇంద్రియాలను; పరాంచి – బహిర్ముఖం చేసి; స్వయంభూః – భగవంతుడు; వ్యతృణత్ – ఏర్పరచాడు, తస్మాత్ – అందువల్ల; పరాక్ – బాహ్యప్రపంచాన్ని; పశ్యతి – చూస్తున్నాయి; న అంతరాత్మన్ – ఎవరూ ఆత్మవైపు తిరగటం లేదు; కశ్చిత్ ధీరః– ఎవరో వివేకవంతుడు మాత్రం; ఆ వృత్త చక్షుః – అంతర్ముఖం చేసి; అమృతత్త్వం ఇచ్ఛన్ – అమరత్వాన్ని కోరే; ప్రత్యగాత్మానమ్ – ఆత్మను; ఐక్షత – చూస్తాడు.

**తాత్పర్యం:** ఇంద్రియాలను భగవంతుడు బహిర్ముఖం చేయటం వల్ల అందరూ బాహ్యప్రపంచాన్ని చూస్తున్నారు. ఎవరూ ఆత్మవైపు తిరగటం లేదు. అమృతత్వాన్ని కోరే ఎవరో వివేకవంతుడు మాత్రమే ఆత్మను చూస్తాడు.

**వివరణ:** ఇది సర్వజనీన, సహజమైన సమస్య. సృష్టికర్త మనసును, ఇంద్రియాలను నాశనం చేసాడు. ఎలా? పరాంచి – బహిర్ముఖం చేసి. అందువల్ల, మాయాప్రభావంలో పడి ఎప్పుడూ ఊపిరాడకుండా పరుగులు తీస్తుంటాం.

బాలస్తావత్ క్రీడాసక్తః।
తరుణస్తావత్ తరుణీసక్తః।
వృద్ధస్తావత్ చింతాసక్తః।
పరమే బ్రహ్మణి కోపిన సక్తః॥ – భజ గోవిందం

ఈ విషయం గ్రహించేసరికి ఓపిక ఉండదు. తస్మాత్– అందువల్ల, అంటే ఇంద్రియాలు బహిర్ముఖంగా ఉండటం వల్ల ఎప్పుడూ బాహ్యప్రపంచాన్ని చూస్తున్నాము కాని న అంతరాత్మన్– ఎవరూ ఆత్మవైపు తిరగటం లేదు.

ఆత్మ అంటే ఏమిటి? ఆత్మకు నాలుగు అర్థాలున్నాయి. 1. సర్వవ్యాపకమైనది. 2. అన్నింటినీ ఉపసంహరించేది. 3. అన్నిటినీ అనుభవించేది. 4. నిత్య వస్తువు. ప్రత్యగాత్మ అంటే లోపల. ఇక్కడ జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. హృదయం లోపలా, మొత్తం నామరూప ప్రపంచం అంతటా ఉంది.

ఆ సర్వవ్యాపకమైన ఆత్మ నేనే అని గుర్తిస్తే బాహ్య వస్తువులు ఇంక ఆకర్షించవు. మనసు బహిర్ముఖంగా ఉండటం వల్ల, మన సమస్యకు మనను తప్ప అందరినీ నిందిస్తాము. అందుకని దయానంద సరస్వతి స్వామీజీ నువ్వే సమస్యవి, నువ్వే పరిష్కారానివి, ఎవరూ నీ సమస్యను పరిష్కరించలేరు అంటారు.

సమస్య తెలిస్తే పరిష్కారం తేలిక. ఆత్మను మనం ఎందుకు గుర్తించటం లేదో తెలుపటానికి ఈ వల్లీ మొదలయింది. ఈ గుర్తించటానికి ప్రతిబంధకం ఏమిటో తెలిస్తే, దాన్ని తొలగించే ప్రయత్నం చేయవచ్చు. దానికి సూక్ష్మబుద్ధి కావాలి. ధీరుడు మాత్రమే గ్రహించగలడు. ధీరుడు అంటే ధైర్యవంతుడు అని కాదు. సాధన చతుష్టయ సంపన్నుడు. వివేకం వల్ల వైరాగ్యం పెంచుకున్నవాడు.

ధీరుడు బాహ్య ప్రపంచంలోని వస్తువులకి మూడు దోషాలున్నాయని గ్రహిస్తాడు. అవి– దుఃఖమిశ్రితత్వం, అతృప్తికరత్వం, బంధకత్వం, అంటే బాహ్యవస్తువులు అశాశ్వతం కాబట్టి దుఃఖాన్ని, అసంతృప్తిని కలగజేస్తాయి. మనని వాటికి బందీలుగా కట్టిపడేస్తాయి. ఈ విషయం గ్రహిస్తే ప్రత్యగాత్మానమ్ ఐక్షత్ – సాక్షి చైతన్యాన్ని తెలుసుకుంటాడు.

**ఎవర్ ది ఎక్స్‌పీరియన్సర్, నెవర్ ది ఎక్స్‌పీరియన్స్‌డ్.**
**అనుభవిస్తున్న నేనే ఎప్పటికీ అది, అనుభవించబడే వస్తువు ఎన్నటికీ కాదు.**

ఎలా తెలుసుకుంటాడు? ఆ వృత్త చక్షుః – కళ్లను బాహ్యవస్తువుల నుంచి అంతర్ముఖం చేయాలి. ఇది ప్రత్యక్ష ప్రమాణానికీ, అనుమాన ప్రమాణాలకీ అందదు. గురు శాస్త్ర ఉపదేశం ద్వారా పొందాలి.

### మంత్రం – 2

**పరాచః కామాననుయన్తి బాలాస్తే మృత్యోర్యన్తి వితతస్య పాశమ్।**
**అథ ధీరా అమృతత్వం విదిత్వా ధ్రువమధ్రువేష్విహ న ప్రార్థయన్తే॥**

**ప్రతిపదార్థం:** బాలాః – వయసు పెరిగినా, పరిపక్వత లేనివారు; పరాచః కామాన్ అనుయన్తి– ఒక వస్తువు నుంచి ఇంకో వస్తువుకి పరుగులు తీస్తారో; తే – వాళ్లు; వితతస్య – అంతటా ఉన్న; మృత్యోః పాశమ్ యన్తి – మృత్యుపాశంలో చిక్కుకుంటారు; అథ ధీరాః – కనుక

వివేకవంతులు; అధ్రువేషు – అనిత్య విషయాలలో; అమృతత్వం – అమరత్వం, ధ్రువమ్ – నిత్యమైన, విదిత్వా – తెలుసుకుని; ఇహ న ప్రార్థయన్తే – ఇక్కడ అశాశ్వతత్వాన్ని కోరడు.

**తాత్పర్యం:** వయసు పెరిగినా పరిపక్వత లేనివారు ఒక వస్తువు నుంచి ఇంకోవైపుకి పరుగులు తీస్తారు. అంతటా ఉన్న మృత్యుపాశంలో చిక్కుకుంటారు. కాని వివేకవంతులు అనిత్య ప్రపంచంలో నిత్య వస్తువును తెలుసుకుంటారు. వాళ్లు అశాశ్వతత్వాన్ని కోరరు.

**వివరణ:** అదే భావం కొనసాగుతోంది. మొదటి భాగం ప్రేయోమార్గం పాటించేవాళ్ళ గురించి, రెండో భాగం శ్రేయోమార్గం పాటించే వాళ్ల గురించి చెప్తోంది.

ప్రేయోమార్గం అనుసరించేవాళ్లు బాలాః అంటే వయసు పెరిగినా, పరిపక్వత లేకుండా ఉన్నారు. వాళ్లు ఏం చేస్తున్నారు? పరాచః కామాన్ అనుయన్తి – ఒక వస్తువు నుంచి ఇంకో వస్తువుకి పరుగులు తీస్తున్నారు. ఒక వస్తువు పోయినా గుణపాఠం నేర్చుకోరు. పొగత్రాగటం మాని, నశ్యం పీల్చటం మొదలెట్టినట్టు చేస్తారు.

కామాన్ అంటే ఇక్కడ విషయ వస్తువులు. వాటిని మూడుగా వర్ణించవచ్చు. జడపదార్థం, మనిషి, పరిస్థితి. ఇవి ఆత్మా అనాత్మా? అనాత్మ కాబట్టే,వాటి గురించి ఆలోచిస్తున్నాడు కాబట్టే అర్జునునికి గీతాబోధ చేయాల్సి వచ్చింది. ఇటువంటి వాళ్ల పరిస్థితి ఏమిటి? యమగండం! యమధర్మరాజుతో యుద్ధం చేయటమంటే చీకటిలో మనకు కనబడని మనిషితో యుద్ధం చేయటం లాంటిది. అతను మనని చూడగలడు. మృత్యుపాశం ఎక్కడ ఉంది? వితతస్య – 14 లోకాల్లోనూ ఉంది, బ్రహ్మలోకంతో సహా.

కాని శ్రేయోమార్గం ఎన్నుకున్న కొందరు, కర్మలు చేసినా కూడా నిత్య నైమిత్తిక కర్మలు చేస్తారే కాని నిషిద్ధ కర్మలు చేయరు. ఇహ న ప్రార్థయన్తే – వాళ్ళు అశాశ్వతత్వాన్ని కోరరు. మంచినీటి సరస్సు ఉంటే బోర్‌వెల్ నీళ్లకి వెళ్తామా? కామ్య ప్రార్థన చేస్తే అనాత్మ మిథ్య, ఆత్మ సత్యం అన్న భావనని బలహీనపరుస్తుంది.

ఐదు టెస్ట్ మాచెస్‌లో మొదటి మూడూ ఇండియా గెలిచేసిందనుకోండి. 4,5 ఆడతారు కాని, గెలిచేసామన్న తృప్తితో ఆడతారు. అలాంటి ఆనందం పొందుతాడు ధీరుడు. ప్రాపంచిక గెలుపు ఓటములు అతని పూర్ణత్వాన్ని చలింపజేయలేవు. అశాశ్వతత్వాన్ని కోరడు.

బాహ్యాముఖంగా ఉండటానికి ఇంకో కారణం – విషయ వస్తువుల మీద కోరిక. దానికి కారణం అజ్ఞానం (అవిద్య). ఆత్మ జ్ఞానం పొందటానికి అవిద్య, కోరిక అనే ఈ రెండూ అడ్డుపడుతున్నాయి.

## మంత్రం – 3

**యేన రూపం రసం గన్ధం శబ్దాన్‌స్పర్శాగ్ంశ్చ మైథునాన్‌।**
**ఏతేనైవ విజానాతి కిమత్ర పరిశిష్యతే ఏతద్వై తత్‌॥**

**ప్రతిపదార్థం:** రూపం – ఆకృతి; రసం – రుచి; గన్ధం – వాసన; శబ్దాన్‌ – శబ్దం; స్పర్శాన్‌– స్పర్శ; మైథునాన్‌ చ – (ఇక్కడ) వ్యవహారం; యేన – దేని వలన; విజానాతి – గ్రహిస్తున్నాడో; ఏతేన – దేనివలన; అత్ర – వీటితో; కిమ్‌ – ఏది; పరిశిష్యతే – మిగిలిఉన్నది; ఏవ – ఎప్పుడు; ఏతద్‌ వై తత్‌ – అదే నువ్వు అడిగినది.

**తాత్పర్యం:** రూపం, రుచి, వాసన, శబ్దం, స్పర్శ, వ్యవహారం మొదలైన వాటిని దేనితో మనిషి గ్రహిస్తున్నాడో, ఈ అనుభవాలలో ఏం మిగిలి ఉంటుంది అన్నదానిని దేనితో తెలుసుకుంటున్నాడో అదే నువ్వు అడిగినది.

**వివరణ:** మొదటి రెండు మంత్రాలూ ఉపోద్ఘాత మంత్రాలు. బహిర్ముఖత్వం నుంచి అంతర్ముఖత్వం చెందాలని సూచిస్తాయి. అంటే రోడ్డు మీద కళ్లు మూసుకుని నడవమని కాదు. వ్యవహారం కోసం తెరచి ఉంచాలి. కాని అందులో లీనమవకూడదు. ఇక్కడ నుంచి ఆత్మజ్ఞానం మొదలవుతుంది. అందుకని రాబోయే మంత్రాలన్నీ ముఖ్యమైనవే. ఈ మంత్రంలో ఆత్మస్వరూపం తెలుస్తుంది. ఆత్మ చైతన్య స్వరూపం. ఆత్మకు ఐదు లక్షణాలు ఉన్నాయని అంతకు ముందు చూశాము.

1. **చైతన్య స్వరూపం** – ఈ చైతన్య స్వరూపం వల్లే తక్కిన అన్ని అనుభవాలూ తెలుస్తున్నాయి. చైతన్యం లేకపోతే దేహేంద్రియ మనోబుద్ధులు ఈ జగత్తులాగా జడం అన్న విషయాన్ని ఆలోచనాశక్తి ఉన్న ఎవరైనా తెలుసుకోగలరని శంకరాచార్యులు చెప్తున్నారు. దానికి ఐదు కారణాలు –

- అవి అన్నీ అనుభవంలోకి వచ్చే వస్తువులు.
- పంచభూతాలతో చేయబడ్డాయి.
- శబ్ద, స్పర్శ వగైరా లక్షణాలు ఉన్నాయి. కాబట్టి ఇంద్రియ గోచరం.
- అందువల్ల అవి నిరంతరం మార్పు చెందుతాయి.
- అవి అన్నీ జాగృదావస్థలో ఉంటాయి, అన్నీ సుషుప్తిలో మాయమవుతాయి.

దేహేంద్రియ మనోబుద్ధులకి ఆత్మ చైతన్యాన్ని కలగజేస్తోంది కదా. అది నిరూపించటానికి శంకరాచార్యులు వాదన కోసం ఈ చైతన్యం లేదనుకుందాం, దేహేంద్రియ మనోబుద్ధులకే చైతన్యం ఉందనుకుందాం అంటారు. అలా అనుకుంటే ఒక శిల్పం కూడా చైతన్యం కలిగి

ఉండాలి కదా! అలా లేదు కాబట్టి, దేహేంద్రియ మనోబుద్ధులకి భిన్నంగా ఏదో ఉంది. అదే ఆత్మ. అదే చైతన్యం అని నిరూపిస్తున్నారు శంకరాచార్యులు.

ఇదే ఈ మంత్రం యొక్క సారాంశం. ఇంకో మాటలో చెప్పాలంటే జీవాత్మ, పరమాత్మల ఐక్యం గురించి చెప్తోంది. మనకి బ్రహ్మ అనుభవం లేకపోలేదు. కాని ఈ చైతన్యంకి పరిమితులు ఉన్నాయి అనుకుంటున్నాము. ఇది ఎందుకంటే, చైతన్యంతో బాటు మనం శరీరాన్ని కూడా అనుభవిస్తున్నాము. అందువల్ల శరీరానికున్న పరిమితులన్నీ తీసుకెళ్ళి, పరిమితులు లేని ఆత్మకి ఆపాదిస్తున్నాము. ఆరునెలలు సావాసం చేస్తే వారు వీరవుతారంటారు. అలా మనం వారిని వీరు చేస్తున్నాము. అంటే ఆత్మను శరీరం చేస్తున్నాము. ఉపనిషత్తు ఈ పొరపాటుని ఎత్తిచూపుతోంది.

శాస్త్రం ఈ చైతన్యం నీ అసలు స్వభావం, అంటే నువ్వు తత్ త్వం అసి అని చెప్తోంది.

అవ్యక్త రూపేణ సర్వత్ర వ్యక్త రూపేణ శరీరే చ చైతన్యం వర్ధతే॥

నేను ఆ చైతన్యం అని ఎలా స్వీకరించాలి? దృక్‌దృశ్య వివేకం ద్వారా – చూసే నేను వేరు, చూడబడే వస్తువు వేరు. నేను అనుభవిస్తున్నదంతా నాకు భిన్నం అని తెలుసుకోవాలి. అనాత్మను మూడు దశల్లో వేరు చేస్తాము.

**మొదటి దశ** – ప్రపంచాన్ని ఐదు భాగాలుగా విభజించింది శాస్త్రం. రూపం, రసం, గంధం, శబ్దం, స్పర్శ కోవలో ఏదో ఒకదానికి చెందుతాయి చూసే వస్తువులు. నేతి, నేతి అంటే ఇది కాదు, ఇది కాదు, అంటే ప్రపంచం వేరు, నేను వేరు అని జగత్, జీవిని విడదీసి చూడటం మొదటి దశ.

**రెండవ దశ** – శరీరం నేను కాదు, జగత్తును చూడటానికి శరీరం ఒక మాధ్యమం. కళ్ళజోడు కూడా మాధ్యమమే. కాని అది దగ్గరగా ఉండటం వల్ల మనం దాన్ని వేరే వస్తువుగా భావించము. ఎలా తెలుసు? నువ్వు చూసే వస్తువులు చెప్పు అంటే కళ్లజోడు చెప్పము. స్వప్నావస్థలోనూ, సుషుప్తిలోనూ శరీరం ఉన్నట్టు తెలియదు. కాబట్టి శరీరం వేరు, నేను వేరు.

**మూడవ దశ** – ఇంకా అంతర్గత ప్రయాణం చేస్తాము. మనసు నేను కాదు అని తెలుసుకుంటాము. జాగ్రదావస్థలో శరీరం, ఇంద్రియాలు, మనసూ మూడూ పనిచేస్తాయి. స్వప్నావస్థకొచ్చేసరికి శరీరం, ఇంద్రియాలు పనిచేయవు. మనసు తనలోంచి స్వప్న ప్రపంచాన్ని సృష్టిస్తుంది. కాని సుషుప్తికి వచ్చేసరికి మనసు కూడా పనిచేయదు. లేచాక – అబ్బా గాఢనిద్ర పోయాను. నాకేం తెలియలేదు అంటాము. అంటే మనసుని బాహ్యవస్తువుగా చూడాలి.

జగత్తుని, శరీరాన్ని, మనసుని కూడా వస్తువుగా తీసేసాక, ఇంక మిగిలిందేమిటి? నేను! అది ఎలా అనుభవించాలి; అది చెపితే వెళ్లిపోతాను అనకూడదు. అనుభవం అన్న పదం వాడితే చాలు అది బాహ్యవస్తువు అయిపోతుంది.

దృగేవ న తు దృశ్యతే - కళ్ళు అన్నింటినీ చూస్తాయి. వాటిని చూసుకోలేవు. కళ్ళు ఉన్నాయని ఏమిటి నమ్మకం? ఇది అర్థం లేని ప్రశ్న. చూడబడుతున్న ప్రతి వస్తువూ చూసే కంటిని చూపిస్తుంది. అనుభవించబడే ప్రతీదీ, అనుభవించే నన్ను చూపిస్తుంది. అనుభవాలు మారతాయి, చూసేవి మారతాయి, కాని చూసే వ్యక్తి మారడు. వేరే వేరే అనుభవాలకి వేరే వేరే కళ్లు ఉండవు.

**ప్రతిబోధవిదితం మతమమృతత్వం హి విన్దతే**
**ఆత్మనా విన్దతే వీర్యం విద్యయా విన్దతేఽ మృతం** - కేన 2.4

జగత్, శరీరం, మనసులని అనుభవించే నేను, వీటిలో ఉన్నాను. కాని వీటికి భిన్నంగా ఉన్నాను. చూడబడే వస్తువు నుంచి చూసే వ్యక్తికి దృష్టి మరల్చమంటోంది వేదాంతం.

జాగ్రదావస్థలో మనసు పనిచేస్తుంది. ఆలోచనలు ఉన్నాయి.
సుషుప్తిలో మనసు పనిచేయటం లేదు. ఆలోచనలు లేవు.

ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుని సాక్షీభూతంగా చూస్తున్నదే ఆత్మ చైతన్యం.

నాకు తెలుసు, నాకు తెలుసని - జాగ్రదావస్థలో
నాకు తెలుసు, నాకు తెలియదని - సుషుప్తి తర్వాత
మూడు అవస్థల్లోనూ ఉన్నదే ఆత్మ.

చైతన్యమనే సాక్షి, సబ్జెక్ట్ నేనుగా శరీరంలో ప్రతిభాగంలో సన్నిహితంగా ఉన్న వ్యక్తి అనుభవిస్తున్నాడు. దేన్ని? రూపం, రసం, గంధం, శబ్ద స్పర్శలతో కూడిన జగత్తును. అది ఇంద్రియ గోచరంగా వర్ణించబడింది. మైథునాన్ అంటే అసలు జంట అని అర్థం. ఉదా- భార్యాభర్తలు, గురుశిష్యులు. ఇక్కడ చైతన్యం ద్వారా వ్యవహారం నడుస్తోంది అని అర్థం.

కిమత్ర పరిశిష్యతే - చైతన్యం కానిది ఏం ఉంది? ఇది ప్రశ్నకాదు. ఏదో ఉంది అని జవాబు కాదు. అంటే అంతా చైతన్యంలోనే ఉంది. ఎలా తెలుసు? చైతన్యం దాటి ఉంటే మనకు తెలియదు. తెలియకపోతే దాని ఉనికి గురించి ఎలా మాట్లాడుతాము? అంటే ఇది సర్వవ్యాపకం అని అర్థం.

ఏతద్ వై తత్ – నువ్వు అడిగిన ఆత్మతత్త్వం ఇదే. నచికేతుడు మూడవ వరంగా ఆత్మ గురించి అడిగాడు. కొంతమంది మరణం తర్వాత ఏదో ఉంది అంటారు. కొంతమంది లేదంటారు.

**అస్తీత్యేకే నాయమస్తీతి చైకే** – కఠ 1.1.20

మళ్ళీ తనే కొన్ని లక్షణాలు చెప్పి – ధర్మాధర్మ విలక్షం, కార్యకారణ వ్యతిరిక్తం, కాలాతీతమైన ఆత్మ గురించి వివరంగా చెప్పు అన్నాడు.

**యత్ తత్ పశ్యతి తద్ వద** – కఠ 1.2.14

యమధర్మరాజు ఈ ప్రశ్నలని గుర్తుచేస్తున్నాడు నచికేతునికి. ముందు రాబోయే మంత్రాల్లో కూడా గుర్తుచేస్తూనే ఉంటాడు.

**మంత్రం – 4**

**స్వప్నాన్తం జాగరితాన్తం చోభౌ యేనానుపశ్యతి।**
**మహాన్తం విభూమాత్మానం మత్వా ధీరో న శోచతి॥**

**ప్రతిపదార్థం:** స్వప్నాన్తం – స్వప్న స్థితి; జాగరితాన్తం చ – జాగృత్ స్థితి, ఉభౌ – రెండింటినీ; యేన అనుపశ్యతి – దేనితో చూస్తాడో; మహంతం – చాలా పెద్దది; విభుమ్ – సర్వత్ర వ్యాపించిన; ఆత్మానం – ఆత్మను; మత్వా – తెలుసుకున్న; ధీరః – వివేకి; న శోచతి – దుఃఖించదు.

**తాత్పర్యం:** స్వప్న, జాగ్రత్ అవస్థలు రెండింటిలోనూ, దేనితో అన్నీ గ్రహిస్తున్నాడో అదే ఆత్మ. అది చాలా పెద్దది. సర్వత్రా వ్యాపించినది. అది గ్రహించిన వివేకి శోకం నుంచి విడివడతాడు.

**వివరణ:** ఇంతకు ముందు మంత్రంలో ఆత్మను దృక్ దృశ్య వివేకం ద్వారా సూచిస్తే, ఇప్పుడు అవస్థాత్రయ సాక్షిగా వర్ణిస్తున్నాడు.

2. **అవస్థా త్రయ సాక్షి చైతన్యం** – అవస్థా త్రయ సాక్షి చైతన్యంగా ఆత్మను వర్ణిస్తే, రెండు విషయాలు గ్రహించవచ్చు.

– ఆత్మ చైతన్య స్వరూపం. ఎందుకంటే ఆత్మ జడం అయితే, దేన్నీ సాక్షీభూతంగా చూడలేదు.

– ఆత్మ తను చూసే మూడు అవస్థలకీ భిన్నం. ఎందుకంటే చూడబడే వస్తువు వేరు, చూసే వ్యక్తి వేరు. అంతే కాదు, శరీరం ఈ మూడు అవస్థలలోకే వస్తుంది అని కూడా గ్రహించాలి.

జాగ్రదావస్థలో మనసు ద్వారా బాహ్య ప్రపంచాన్ని అనుభవిస్తాము. స్వప్నావస్థలో మనసు సృష్టించిన అంతర్గత ప్రపంచాన్ని అనుభవిస్తాము. రెండింటిలోనూ మనసు చూస్తుంది.

మొదటి అవస్థలో బాహ్య ప్రపంచాన్నీ, రెండో అవస్థలో తను సృష్టించిన అంతః ప్రపంచాన్నీ. క్రికెట్‌ని రెండుసార్లు చూసినట్టన్నమాట. మొదటిసారి లైవ్‌గానూ, రెండోసారి రికార్డెడ్‌గాను.

అలాగే జాగ్రదావస్థలో భౌతిక వస్తువులను చూస్తే, స్వప్నావస్థలో వాసనామయ వస్తువులను చూస్తుంది మనసు. జాగ్రదావస్థలో దేశకాలాలు వేరు. స్వప్నావస్థలో దేశ కాలాలు వేరు. స్వప్నంలో పెళ్లయి పిల్లలు, పిల్లలకి పిల్లలు కూడా పుట్టేయవచ్చు. జాగ్రదావస్థలో ఉన్న శరీరం, స్వప్న, సుషుప్తి అవస్థలలో తెలియదు. స్వప్నావస్థలో ఉన్న శరీరం దాన్నించి బయటకు రాగానే మాయమవుతుంది. కాబట్టి శరీరం మారుతుంది కాని, చైతన్యం మారదు.

స్వప్నావస్థలో జాగ్రత్‌కాలం పోతుంది. సుషుప్తి అవస్తలో జాగ్రత్‌కాలం, స్వప్నకాలం రెండూ పోతాయి. పడుకున్నాను అని తెలుస్తుంది. కాని ఎంతసేపు పడుకున్నానో తెలియదు.

అందుకని జాగ్రద్, స్వప్న, సుషుప్తి అవస్థలన్నింటిలోనూ సమానంగా ఉన్నది ఏమిటి? వీటిని చూస్తున్న చైతన్యం. అదెవరు? నేను! ఏం తెలుస్తోంది? కాలం వస్తుంది, పోతుంది, దేశం వస్తుంది, పోతుంది. నేను దేశకాల అతీత చైతన్యాన్ని, అవస్థాత్రయ సాక్షి చైతన్యాన్ని.

ఏన – ఈ సాక్షి చైతన్యం వల్లే, అనుపశ్యతి – చూస్తాడు, స్వప్నాంతం – స్వప్నదేశ కాల వస్తువులు; జాగరితాన్తం చ – జాగ్రదావస్థలో దేశ కాల వస్తువులు, ఉభౌ – రెండూ చూస్తాడు. సుషుప్తిలో ఈ రెండూ లేకపోవటం చూస్తాడు అని మనం కలుపుకోవాలి. సుషుప్తిలో ఆలోచనలు శూన్యం. మనసు ఖాళీగా లేదు. చైతన్యం ఉంది. హాలులో వస్తువులు ఉన్నా, లేకపోయినా కాంతి ఉన్నట్టుగానన్నమాట.

ఈ చైతన్యం ఆకారం ఎంత? మహాంతం – చాలా పెద్దది. విభుమ్ అంటే సర్వత్రా వ్యాపించింది అని – దాదాపుగా కాదు. పూర్తిగా! అటువంటి ఆత్మని తెలుసుకోవాలి. ఎలా? అబ్జెక్ట్‌గా కాదు, సబ్జెక్ట్‌గా. బహ్యావస్తువుగా కాదు, నేనుగా.

బయటా కాదు, లోపలా కాదు. నేనే. మన సమస్య ఏమిటి? మనం బయటచూస్తాం లేదా లోపల చూస్తాం. కాని లోపల తెలిసే అంశాలు కాదు, లేదా రాగద్వేషాలు, కామక్రోధాలు ఉన్న మనసు కాదు. మనం ధీరుడిలాగా వ్యవహరించాలి. అంటే వివేకం, సూక్ష్మబుద్ధి గలవాడు అని అర్థం. ఆత్మ సాక్షాత్కారం ఎప్పుడో అవుతుంది అనుకోకూడదు. ఆత్మ అనుభవం కోసం ఎదురుచూడకూడదు. అనుభవించే నేనే ఆత్మను. ఇది అనుకోవటమే నిధి ధ్యాసనం. దీన్ని వేదాంతిక్ మెడిటేషన్ అని కూడా అంటారు.

అహం అవస్థాత్రయ సాక్షి చైతన్యరూపేణ, దేశ కాల అతీత చైతన్య రూపేణ, అహం సర్వదా భవామి.

ఇది ఆత్మ జ్ఞానం. దీని ఫలం ఏమిటి? – మత్వా ధీరో న శోచతి.

ఈ వాక్యం కూడా ఈ ఉపనిషత్తులో పదే పదే వస్తుంది.

ఇది తెలుసుకున్న ధీరుడు దుఃఖించడు. అంతకుముందు అధ్యాయంలో ఉన్నట్లే మళ్ళీ చెప్పాడు.

**మహాన్తం విభుమాత్మానాం మత్వా ధీరో న శోచతి** – కఠ 1.2.22

ఈ మంత్రం ఒక మహావాక్య మంత్రం.

స్వప్నాన్తం జాగరితాన్తం చ – త్వం పదార్థం – జీవ
మహాంతం విభుం ఆత్మానాం – తత్ పదార్థం – ఈశ్వర
మత్వా – ఐక్యం
ధీరో న శోచతి – ఫలం

జీవ ఈశ్వర ఐక్యం సూచిస్తుంది. దానితో పాటు ఫలం కూడా సూచిస్తుంది.

ఈ జ్ఞానం సాధ్యవస్తువు గురించి కాదు. సాధకుని గురించే కాబట్టి చాలా సూక్ష్మమైనది. ఈ ఆత్మజ్ఞానం చాలా సూక్ష్మమైంది కాబట్టి, దేవతలకు కూడా కష్టమైనది కాబట్టి, దీన్ని దృష్టిలో పెట్టుకుని, ఈ బోధని మళ్లీ మళ్ళీ చేస్తున్నాడు.

**మంత్రం – 5**

**య ఇమం మధ్వదం వేద ఆత్మానం జీవమన్తికాత్।**
**ఈశానం భూతభవ్యస్య న తతో విజుగుప్సతే ఏతద్వై తత్॥**

**ప్రతిపదార్థం:** యః – ఎవరు; మధ్వదం – కర్మఫలాలను అనుభవిస్తున్న; జీవమ్ – ప్రాణానికి ఆధారమైన; ఇమం ఆత్మానం – ఈ ఆత్మని; అన్తికాత్ – దగ్గరగా ఉన్నట్టుగా; భూతభవ్యస్య– భూత భవిష్యత్ కాలాలకు; ఈశానం – నేతగా; వేద – తెలుసుకుంటాడో; తతః – తరువాత; న విజుగుప్సతే – ద్వేషించడు – ఏతద్ వై తత్ – అదే నువ్వు అడిగినది.

**తాత్పర్యం:** ఎవరు కర్మఫలాలను అనుభవిస్తున్న, ప్రాణానికి ఆధారమైన ఈ ఆత్మను దగ్గరగా ఉన్నట్టూ, భూత భవిష్యత్తు కాలాలకు నేతగా ఉన్నట్టూ తెలుసుకుంటాడో, అతను ఎవరినీ ద్వేషించడు. అదే నువ్వు అడిగినది.

**వివరణ:** ఈ వల్లీలో ఒక్కొక్క మంత్రం ఒక మహావాక్యమంత్రం. ఇందులో ఏకాత్మ లేదా సర్వాత్మ భావన గురించి వస్తుంది.

3. **సర్వాత్మ భావన –**

జీవమ్ – త్వం పదార్థం – జీవ
ఈశానం – తత్ పదార్థం – పరమాత్మ
వేద – ఐక్యం గురించిన జ్ఞానం
న విజుగుప్సతే – ఫలం

ఈ ఏకాత్మకు గుణాలని బట్టి పేర్లు ఉన్నాయి.
తమస్సు ప్రధానమైనది – జగత్తు
రజస్సు ప్రధానమైనది – జీవుడు
సత్త్వ ప్రధానమైనది – ఈశ్వరుడు

ఈ మూడు గుణాలూ నిర్గుణ ఏకాత్మను సగుణ జీవ–జగత్–ఈశ్వరుడుగా చేస్తాయి.

ఆత్మ చైతన్యమైనా, సర్వవ్యాపకమైనా వస్తువు ద్వారానే ప్రకటితమవుతుంది. చైతన్యాన్ని బింబచైతన్యం అని కూడా అంటాము. దాన్ని ప్రతిబింబించే దాన్ని ప్రతిబింబ మాధ్యమం అనీ, ప్రతిబింబింపబడిన చైతన్యాన్ని ప్రతిబింబ చైతన్యం అనీ అంటామని చూశాము. ప్రతిబింబ చైతన్యం అన్నా, చిదాభాస అన్నా ఒకటే. ఎన్ని ప్రతి బింబమాధ్యమాలు ఉంటే అన్ని ప్రతిబింబ చైతన్యాలు ఉంటాయి. అంతేకాదు, ప్రతిబింబ మాధ్యమం లక్షణం బట్టి ప్రతిబింబ చైతన్యం లక్షణాలు ఉంటాయి. ఆరు ప్రతిబింబచైతన్యాలు ఉన్నాయని తత్త్వబోధలో చూస్తాము. (అద్వైత వేదాంత పరిచయంలో వివరంగా ఉంది).

| **వ్యష్టి** | **ప్రతిబింబ చైతన్యం** | **సంఖ్య** | **సమష్టి** | **ప్రతిబింబ చైతన్యం** | **సంఖ్య** |
|---|---|---|---|---|---|
| స్థూల శరీరం | విశ్వ | 1 | స్థూల ప్రపంచం | విరాట్/వైశ్వానర | 4 |
| సూక్ష్మశరీరం | తైజస | 2 | సూక్ష్మ ప్రపంచం | హిరణ్యగర్భ | 5 |
| కారణ శరీరం | ప్రాజ్ఞ | 3 | కారణ ప్రపంచం | ఈశ్వర/అంతర్యామి | 6 |

ఆత్మ చైతన్యమే ఇటు విశ్వరూపంలోనూ, అటు విరాట్ రూపంలోనూ ఉంది. టూకీగా చెప్పాలంటే చైతన్యం సర్వాత్మకం. దీన్ని సర్వాత్మభావం అంటారు. ఈ సర్వాత్మభావాన్ని ఒక్కొక్క జంటనీ వ్యతిరేక క్రమంలో తీసుకుని 5–10 మంత్రాల్లో వివరిస్తాడు యమధర్మరాజు.

| మంత్రం | జంట |
|---|---|
| 5 | ప్రాజ్ఞ, ఈశ్వర |
| 6, 7, 9 | తైజస, హిరణ్యగర్భ |
| 8 | విశ్వ, విరాట్ |
| 10 | సర్వాత్మ భావం లేదా సారాంశం |

వ్యష్టిలోనూ, సమష్టిలోనూ ఉన్నది ఒకటే. అలలోనూ, సముద్రంలోనూ ఉన్నది నీరు ఒకటే. ఇప్పుడు మంత్రం చూద్దాం.

అహమేవ ఇదగ్గం సర్వం – జీవరూపంలోనూ, ఈశ్వర రూపంలోనూ ఉన్నది నేనే.

యః ఆత్మానాం అంతికాత్ వేద – ఈ మంత్రంలో సూక్ష్మాతి సూక్ష్మమైన జంట వివరణ– బింబ చైతన్యం సన్నిహితంగా తనే అని తెలుసుకున్నవాడు భద్రత కోరడు. అంతికాత్ అంటే భేదం లేదు అని. ఆత్మ బయట వస్తువు కాదు, తనే అని తెలుసుకోవాలి. వ్యష్టిలో ప్రాజ్ఞగా ఉన్న చైతన్యమే, సమష్టిలో ఈశ్వరుడు లేదా అంతర్యామిగా ఉన్నాడు. ఈ తేడా ప్రతిబింబించే మాధ్యమంలో ఉంది. పడకగదిలోని చిన్న బెడ్‌లైట్‌లోనూ, పెద్ద ట్యూబ్‌లైటులోనూ ఉన్నది ఒకటే విద్యుచ్ఛక్తి. దాన్ని ప్రసరించే మాధ్యమంలో తేడా వల్ల వెలుగులో తేడా వస్తుంది.

భూత భవ్యస్యః గతానికీ, భవిష్యత్తుకీ దేవుడు. మధ్యలో వర్తమానం కలుపుకోవాలి.

ప్రాజ్ఞజీవుడు ప్రతిబింబ మాధ్యమం వల్ల కర్మఫల భోక్తా సంసారి అవుతున్నాడు. మధు అంటే కర్మఫలం. అధః అంటే అనుభవించేవాడు.

ధీరుడు ఈ రెండూ ఒక్క ఆత్మ ప్రతిబింబాలే అని గ్రహిస్తాడు. తథ – దాని తర్వాత, న విజుగుప్సతే – భద్రత కోరడు. అద్వైతంలో రక్షించేవాడు, రక్షణ కోరేవాడు, అభద్రతా భావం అంటూ ఉండవు. మోక్షం అంటే అభద్రతా భావం నుంచి స్వేచ్ఛ పొందటమే.

ఏతత్ వై తత్ – ఈ జంట – నువ్వు అడిగిన ఆత్మ కాక వేరే కాదు. ఒకటే ఆత్మ – సృష్టి కర్త – సృష్టించబడిన రెండింటి వెనకా ఉన్నది.

### మంత్రం – 6

**యః పూర్వం తపసో జాతమద్భ్యః పూర్వమజాయత।**
**గుహాం ప్రవిశ్య తిష్ఠన్తం యో భూతే భిర్వ్యపశ్యత। ఏతద్వై తత్॥**

**ప్రతిపదార్థం:** యః – ఎవరు; పూర్వం – ముందు; తపసః జాతం – సంకల్పం వల్ల పుట్టారో; అద్భ్యః – నీరు మొదలైన పంచ స్థూల భూతాల కన్నా; పూర్వం అజాయత – విరాట్ ముందు పుట్టారో (హిరణ్యగర్భ); యః – ఎవరు; గుహాం ప్రవిశ్య తిష్ఠన్తం – సూక్ష్మవ్యష్టిలో హృద్గుహలో ఉంటారో; భూతేభిః – స్థూల శరీరంతో చుట్టూతా ఉన్నదని; వ్యపశ్యత – తెలివైనవాడు తెలుసుకుంటాడు; ఏతద్ వై తత్ – అదే నువ్వు అడిగినది.

**తాత్పర్యం:** ఎవరు నీరు మొదలైన పంచభూతాలకన్నా ముందు తపస్సుచే ఉద్భవించారో, ఎవరు విరాట్ కన్నా ముందు పుట్టారో, ఆయనే (హిరణ్యగర్భ) సూక్ష్మ వ్యష్టిలో హృద్గుహలో ఉన్నారన్న సర్వాత్మభావనని తెలివైన వాడు పొందుతాడు. అదే నువ్వు అడిగిన తత్త్వం.

**వివరణ:** సర్వాత్మ భావన కొనసాగుతోంది. ఇప్పుడు మధ్య జంట వర్ణన. ప్రతిబింబ చైతన్యం వ్యష్టి యొక్క సూక్ష్మ శరీరంలో తైజస రూపంలో ఉంటే, సమష్టి సూక్ష్మ ప్రపంచంలో హిరణ్య గర్భరూపంలో ఉంది. సూక్ష్మ ప్రపంచం కారణ ప్రపంచం నుంచి పుట్టింది. కారణ ప్రపంచం ఎలా పుట్టింది? ఇది ఎప్పుడూ పుట్టదు. 'అనాద్యనన్తం' అని ముందు మంత్రాల్లో వచ్చింది. ఇది ప్రళయంలో కూడా అవ్యక్తరూపంలో ఉంటుంది. సృష్టికి ముందు దశ, కారణ ప్రపంచం ఉంటే దాని ప్రతిబింబం ఏది? అది ఈశ్వర లేదా అంతర్యామి. తర్వాత అనువైన సమయం చూసి కారణ ప్రపంచం కొంచెంగా రూపు దిద్దుకుని సూక్ష్మ ప్రపంచం అవుతుంది. కారణ ప్రపంచం సూక్ష్మాతిసూక్ష్మం, సూక్ష్మప్రపంచం స్థూలప్రపంచం కన్నా సూక్ష్మం, కారణప్రపంచం కన్నా కొంచెం స్థూలం.

కారణ ప్రపంచం నుంచి ఉద్భవించిన సూక్ష్మప్రపంచానికి ప్రతిబింబ చైతన్యం హిరణ్యగర్భ. రెండు వర్ణనలున్నాయి ఇందులో. రెండింటికీ పూర్వం పదం వచ్చింది. మొదటి పూర్వం – పూర్వమే. ఈశ్వర నుంచి హిరణ్యగర్భ పుట్టాడు. రెండవ పూర్వం – విరాట్ పుట్టకముందు అని అర్థం. హిరణ్యగర్భ ప్రథమజ – సృష్టిలో ప్రథముడు – పంచభూతాలకన్నా ముందు పుట్టాడు. అద్భ్యః అంటే నీరు. నీరు ఒక్కటే తీసుకోకూడదు, పంచభూతాలన్నింటికీ ముందు అని అర్థం.

గుహాం ప్రవిశ్య తిష్ఠంతం – అదే ప్రతిబింబ చైతన్యం వ్యష్టి విషయానికి వచ్చేసరికి, వ్యష్టి సూక్ష్మ శరీరంలో తైజస పేరుతో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నది భారతదేశంలో కూడా ఉన్నట్టు, సూక్ష్మశరీరంలో ఉన్న ఈ ప్రతిబింబం చుట్టూ స్థూల శరీరం ఉంది. ఈ తైజస, ఈ హిరణ్యగర్భ ఒకటే అనే సర్వాత్మ భావనని తెలివైన వాడు పెంచుకుంటాడు. అదే నువ్వు అడిగిన తత్త్వం.

### మంత్రం – 7

**యా ప్రాణేన సంభవత్యదితిర్దేవతామయీ।**
**గుహాం ప్రవిశ్య తిష్ఠన్తీం యా భూతేభిర్వ్యజాయత। ఏతద్వై తత్।।**

**ప్రతిపదార్థం:** ప్రాణేన సంభవతి – ప్రాణ రూపమైనదీ, యా దేవతామయీ – సమస్త దేవతల రూపమైనదీ; భూతేభి వ్యజాయత – పంచభూతాలలో ఉద్భవించినదీ; యా అదితి– ఏ దేవి; గుహాం – హృద్గుహలో; ప్రవిశ్య – ప్రవేశించి, తిష్ఠన్తీం – నివసిస్తున్నదో; ఏ తద్ వైతత్ – అదే నువ్వు అడిగిన తత్త్వం.

**తాత్పర్యం:** ప్రాణరూపమైనదీ, దేవతామయి అయినదీ, పంచభూతాలతో ఉద్భవించినదీ, హృద్గుహలో ప్రవేశించి నివసిస్తున్నదీ ఒకటే అని తెలుసుకో. అదే నువ్వు అడిగినది.

**వివరణ:** సూక్ష్మ శరీరంలోని తైజస, సూక్ష్మ ప్రపంచంలోని హిరణ్యగర్భ ఒకటే అన్న వర్ణనే కొనసాగుతోంది ఇందులో కూడా. రెండవ పాదం ఇంచుమించుగా ముందు మంత్రంలో లాగానే వచ్చింది. ఇక్కడ హిరణ్యగర్భకు రెండు వర్ణనలు వస్తాయి. సమష్టి ప్రాణం, దేవతామయి.

ప్రాణేన సంభవతి – సమష్టి ప్రాణం – వ్యష్టిలో సూక్ష్మశరీరంలో 19 అంగాలు ఉన్నాయి. పంచజ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, పంచ ప్రాణాలు, చత్వారీ అంతఃకరణలు, (మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం). వీటన్నింటిలోకి ప్రాణం ముఖ్యం. ప్రాణం ఎందుకు ముఖ్యమో ఒక కథ వస్తుంది ప్రశ్నోపనిషత్తులో. ఈ అంగాలన్నింటిలోకి ఏది ముఖ్యమైనది అన్న వాదన వచ్చింది ఒకసారి. తక్కిన అంగాలు విడిచివెళ్లటానికి ప్రయత్నించినా ఏమీ తేడా రాలేదు కాని, ప్రాణం బయలుదేరితేనే, అవి కూడా బయలు దేరాల్సి వచ్చింది. అప్పుడు ప్రాణమే గొప్పదని తెలుసుకుంటాయి.

తార్కికంగా చూసినా కూడా అంతే. అలజడి చేసే మనసు, అహంకారం కూడా ప్రశాంతంగా నిద్రపోతాయి సుషుప్తిలో ప్రాణం తప్ప. ఏమిటి నిదర్శనం? మనం నిద్రపోయినప్పుడు ప్రాణం పోయిందని తీసిపారేయటం లేదు. ఇది వ్యష్టిపరంగా ముఖ్యమైతే, సమష్టిపరంగా ఇంకా ముఖ్యం కాబట్టి, ఇక్కడ హిరణ్యగర్భని 'ప్రాణేన సంభవతి' అన్నారు.

దేవతామయి – సూక్ష్మ శరీరంలో ఉన్న 19 అంగాలకీ, సూక్ష్మ ప్రపంచంలో 19 అధిష్ఠాన దేవతలు ఉంటారు. ఉదాహరణకి సూక్ష్మ శరీరంలోని కళ్ళకు అధిష్ఠాన దేవత సూర్యదేవత, చెవులకు దిగ్దేవత. ఈ అధిష్ఠాన దేవతలకి అధిపతి హిరణ్యగర్భ, అందుకని దేవతామయి.

అదితిః సమష్టి సూక్ష్మ ప్రపంచానికి చెందిన హిరణ్యగర్భ, వ్యష్టి సూక్ష్మశరీరంలో హృద్గుహలో తైజస రూపంలో ఉన్నాడు. తైజసకు ఇంకో పేరు అదితి. అదితిః అతః భక్షణే – ఇంద్రియాల ద్వారా అనుభవించే వ్యక్తి. అంటే భోక్త. అటువంటి హిరణ్యగర్భే బ్రహ్మ అదే నువ్వు అడిగిన ఆత్మ వస్తువు.

## మంత్రం – 8

**అరణ్యోర్నిహితో జాతవేదా గర్భ ఇవ సుభృతో గర్భిణీభిః।**
**దివే దివ ఈడ్యో జాగృవద్భిర్హవిష్మద్భిర్మనుష్యేభిరగ్నిః। ఏతద్వై తత్॥**

**ప్రతిపదార్థం:** అరణ్యోః నిహితః – అరణి(యజ్ఞంలో అగ్నిని పుట్టించడానికి వాడే) చెక్కలలో ఉన్నటువంటి; జాతవేదాః – అగ్ని; గర్భిణీభీః – గర్భవతుల చేత; గర్భ ఇవ – గర్భంలాగా; సుభృతః – కాపాడబడుతుంది; దివే దివ ఈడ్యో అగ్నిః – ఈ అగ్నిని రోజూ; హవిష్మద్భిః

మనుష్యేభిః – యజ్ఞాలు చేసే మనుష్యులు; జాగృవద్భిః – ఉపాసకులు కొలుస్తారు; ఏతద్ వై తత్ – అదే నువ్వు అడిగిన తత్త్వం.

**తాత్పర్యం:** గర్భవతుల గర్భం జాగ్రత్తగా కాపాడబడినట్లు, అరణి చెక్కలలో ఉన్నటువంటి అగ్ని కాపాడబడుతుంది. యజ్ఞాలు చేసే మనుష్యులు, ఉపాసకులు ఈ అగ్నిని కొలుస్తారు. ఆ ఆత్మాగ్నే నువ్వు అడిగిన తత్త్వం.

**వివరణ:** ఈ మంత్రంలో మూడవ జంట అయిన విశ్వ–విరాట్ గురించిన వివరణ. ఈ రెండూ ఒకటే చైతన్యానికి చెందిన రెండు భిన్న ప్రతిబింబాలు. స్థూలప్రపంచానికి చెందిన ప్రతిబింబం విరాట్. దాన్ని అగ్నితత్త్వంగా చూపిస్తున్నాడు యమధర్మరాజు. మొదటి అధ్యాయంలో అగ్నికి మూడు అర్థాలు చూసాము. అవి – అగ్ని, యజ్ఞం, విరాట్ దేవత లేదా విశ్వరూప ఈశ్వర. విరాట్ దేవతను అగ్నితత్త్వంతో ఎందుకు వర్ణిస్తున్నాడు? పంచభూతాల్లో అగ్నికి విశిష్టత ఉంది. మొదటివైన ఆకాశం, వాయువులకు రూపం లేదు. స్థూల ప్రపంచంలో కనబడేది అగ్ని.

ఈ మంత్రంలో విరాట్‌ని అగ్నితత్త్వంగా వర్ణిస్తున్నారు. దీనికి ఇంకో కారణం ఉంది. అగ్నిని క్రతువులు చేసేవారూ ఆరాధిస్తారు. ధ్యానం చేసేవారూ ఆరాధిస్తారు. క్రతువులు చేసేవారు యజ్ఞంలో ఆజ్యం పోయటం ద్వారా ఆరాధిస్తారు. ధ్యానం చేసేవారు అప్రమత్తులై, హృదయంలో ధ్యానం చేస్తారు.

మన లోపల అగ్ని, వైశ్వానర అగ్ని. మనం తిన్న ఆహారాన్ని లోపల మళ్ళీ వండుతుంది ఈ అగ్ని. అందుకే దీన్ని సమాన అగ్ని లేదా జఠరాగ్ని అని కూడా అంటారు. స్థూల శరీరంలో ఉన్న అగ్నిని విశ్వ అంటారు.

ఈ యాగాగ్ని అరణిలో నిక్షిప్తమై ఉంది. అందుకని విరాట్ అరణిలో నిక్షిప్తమై ఉన్నట్టు ఉంటుంది. అరణి అంటే రెండు చెక్కముక్కలు ఉంటాయి. కింది చెక్కభాగం అశ్వత్థవృక్షం నుంచి చేయబడింది. అది కదలకుండా ఉంటుంది. పై భాగం శమీవృక్షం నుంచి చేయబడింది. పై చెక్కని కింద చెక్క లోపల ఉన్న గుంటలో చిలికితే, వాటి రాపిడికి అగ్ని పుడుతుంది. అరణిలో అగ్ని దాగి ఉండి, చిలికినప్పుడు పైకి వస్తుంది కాబట్టే, దాన్ని గర్భిణీ స్త్రీతో పోల్చారు. గర్భిణీ స్త్రీ గర్భాన్ని కాపాడినంత జాగ్రత్తగా కాపాడతారు, క్రతువులు చేసేవారు. ఆ అగ్నే నువ్వు అడిగినది.

### మంత్రం – 9

**యతశ్చోదేతి సూర్యోఽస్తం యత్ర చ గచ్ఛతి।**
**తం దేవాస్సర్వేఽర్పితాస్తదు నాత్యేతి కశ్చన। ఏతద్వై తత్॥**

**ప్రతిపదార్థం:** సూర్యః – సూర్యుడు; యతః – హిరణ్యగర్భ నుంచి; ఉదేతి – ఉదయిస్తాడు; అస్తం గచ్ఛతి చ – అస్తమిస్తాడు (ప్రళయంలోకి లీనమై పోతాడు) సర్వేదేవాః – అందరు దేవతలూ అంతే; తం అర్పితాః – అందరూ హిరణ్యగర్భలో ఇమిడిపోతారు; కశ్చన తత్ న అత్యేతి – ఎవరూ హిరణ్యగర్భని మీరి వ్యవహరించలేరు; ఏతద్వై తత్ – అదే నువ్వు అడిగిన తత్త్వం.

**తాత్పర్యం:** సూర్యుడు హిరణ్యగర్భ నుంచి ఉదయిస్తాడు. ప్రళయంలో అస్తమిస్తాడు. అందరు దేవతలూ అంతే. అందరూ హిరణ్యగర్భలో ఇమిడిపోతారు. ఎవరూ హిరణ్యగర్భని మీరి వ్యవహరించలేరు. అదే నువ్వు అడిగిన తత్త్వం.

**వివరణ:** ఈ 9వ మంత్రంలో కూడా హిరణ్యగర్భ – తైజస వర్ణనే కొనసాగుతోంది. ప్రతి దేవత హిరణ్యగర్భ మీద ఆధారపడాలి. అల సముద్రంలో పుట్టి, అందులో ఉండి, అందులో కరిగిపోయినట్టుగా, సూర్యుడు హిరణ్యగర్భ నుంచి పుట్టి, హిరణ్యగర్భలో అస్తమిస్తాడు. అలాగే అందరు దేవతలూ హిరణ్యగర్భలో ఇమిడిపోతారు, అన్ని అలలూ సముద్రంలో ఇమిడిపోయినట్టుగా. అందుకని హిరణ్యగర్భకి ఇంకోపేరు సూత్రాత్మ.

సృష్టిని ఈశ్వరుడు సృష్టించినా కొన్ని ఉపనిషత్తులలో హిరణ్యగర్భ నుంచి ఉద్భవించినట్టుగా వస్తుంది. అందుకని హిరణ్యగర్భని సృష్టి, స్థితి, లయ కారకుడని కూడా అంటారు.

అదే నువ్వు అడిగినది. నచికేతుడు మర్చిపోతాడేమో గాని, యమధర్మరాజు మర్చిపోలేదు. 3–9 మంత్రాల్లో ఏతద్ వై తత్ చెప్తూనే ఉన్నాడు.

దీనితో మూడు జంటల వివరణా అయింది. సర్వం చైతన్యమయం అని తెలిసింది. 10వ మంత్రంలో వీటి సారాంశం వస్తుంది.

### మంత్రం – 10

**యదేవేహ తదముత్ర యదముత్ర తదన్విహ।**
**మృత్యోః స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి॥**

**ప్రతిపదార్థం:** ఇహ – వ్యష్టి ఉపాధిలో, యత ఏవ – ఏ చైతన్యం ఉందో; తత్ అముత్ర – సమష్టి ఉపాధిలో ఉంది; యత్ అముత్ర – సమష్టి ఉపాధిలో ఏది ఉందో; తత్ అను ఇహ– అదే వ్యష్టిలో ఉంది; యః – ఎవరు; నానా ఇవ – విభిన్నంగా ఉన్నట్టు; పశ్యతి – చూస్తాడో; సః – అతను; మృత్యోః సః – మరణం నుంచి; మృత్యుమ్ – మరణాన్ని; అప్నోతి – పొందుతాడు.

**తాత్పర్యం:** వ్యష్టి ఉపాధిలో ఏ చైతన్యం ఉందో; సమష్టి ఉపాధిలో అదే చైతన్యం ఉంది. సమష్టి ఉపాధిలో ఏం ఉందో, వ్యష్టి ఉపాధిలో అదే ఉంది. ఇక్కడ విభిన్నంగా ఎవరు చూస్తారో, అతను మరణం నుంచి మరణాన్ని పొందుతాడు.

**వివరణ:** ఇంతవరకూ ఉపనిషత్తు సర్వాత్మభావన గురించి మాట్లాడింది. ఈ మంత్రంలో జీవాత్మ-పరమాత్మ ఐక్యం గురించి మాట్లాడుతోంది. అందువల్ల ఇది ఒక మహావాక్య మంత్రం. అందులోనూ శక్తివంతమైన మహావాక్యం. జీవ, ఈశ్వరులు ఇద్దరూ నిర్గుణ బ్రహ్మ లేదా బింబ చైతన్యం యొక్క ప్రతిబింబాలే అని చెప్తోంది. అది తెలియని వారు మృత్యువు నుంచి మృత్యువుకి ప్రయాణిస్తారు అంటే పునరపి జననం, పునరపి మరణం కలుగుతూనే ఉంటుంది.

ఈ మంత్రం గుర్తుంటే సాంకేతిక పదాలు గుర్తుండనక్కరలేదు. యదేవేహ తదముత్ర (ఏదైనా) వ్యష్టి ఉపాధిలో ఏ చైతన్యం ఉందో, సమష్టి ఉపాధిలో (అదే) అదే చైతన్యం ఉంది. చూడటానికి ఒకదాంట్లో పేలవంగా, ఒకదాంట్లో ప్రకాశవంతంగా ఉంటుంది. దానికి కారణం ప్రతిబింబించే మాధ్యమంలో తేడా. మనీషా పంచకంలో బ్రహ్మాది పిపీలికం అన్నిటిలో ఒక్కటే ఆత్మ అని వస్తుంది. చైతన్యంలో ఉత్తమ అధమ చైతన్యం అన్న తేడా లేదు. జ్ఞానికి ఉత్తమ చైతన్యం లేదు. అతని మనసు ఉన్నతంగా ఉంటుంది. సాధన చతుష్టయ సంపన్నుడవటం వల్ల అతనికి సత్యప్రధానమైన అంతఃకరణ ఉంటుంది.

యదముత్ర తదన్విహః – అక్కడ ఏది ఉందో ఇక్కడ అదే ఉంది. జీవుల్లోని ఆత్మల్లో తేడా లేదు. బల్బ్ స్థూల శరీరం, ఫిలమెంటు సూక్ష్మ శరీరం, ఫ్యూజ్ పోయినా, విద్యుచ్ఛక్తి ఉంటుంది.

శాశ్వత చైతన్యం అశాశ్వత శరీరం నుంచి వ్యవహారం నడుపుతోందన్న సత్యం తెలిస్తే అభద్రత ఉండదు. అదే అశాశ్వత శరీరంగా చూస్తే రాగద్వేషాలూ, కామక్రోధాలూ కలుగుతాయి.

నేను నన్నెలా చూస్తే, ప్రపంచాన్నలా చూస్తాను.
నన్ను శరీరంగా చూస్తే, వాళ్ల ఒడ్డూ పొడుగూ చూస్తాను.
నన్ను ఆలోచనాపరునిగా చూస్తే, వాళ్ల ఆలోచనలు చూడటానికి ప్రయత్నిస్తాను.
నన్ను చైతన్యంగా చూస్తే, వాళ్లు నాకు భిన్నంగా లేరంటాను.

అద్వైత దర్శనంలో ఏకత్వం ఉంటుంది. బహుత్వం ఉంది కాని నేను పట్టించుకోవటం లేదు. అందువల్ల బహుత్వం చూస్తే అభద్రత. ఏకత్వం చూస్తే భద్రత.

ఉపనిషత్తు గొప్ప సత్యాన్ని వెల్లడిస్తోంది. భేద దర్శనం కావాలా, అభేద దర్శనం కావాలా? భద్రతకు కావాల్సింది బ్యాంకులో డబ్బులు, పదవి, హోదా కాదు, నీ దృక్పథం మార్చు అంటోంది. ఉదాహరణ అల. అల తనను అలగా భావిస్తే అది తాత్కాలికం అయి అభద్రత ఏర్పడుతుంది. తనని నీరుగా భావిస్తే శాశ్వతత్వం కలిగి, భద్రత ఏర్పడుతుంది.

మృత్యోః సమృత్యుమాప్నోతి – భేదభావం చూసే వ్యక్తి మృత్యువు నుంచి మృత్యువుకి వెళ్తాడు, రెండు విధాలుగా

1. పిరికివాడు రోజూ చస్తూ బ్రతుకుతాడు. ధైర్యవంతుడు ఒక్కసారే చస్తాడు.

2. పునరపి జననం, పునరపి మరణం పొందుతాడు. సంసార చక్రంలో కొట్టుమిట్టాడుతుంటాడు.

ఏమిటి దీనికి పరిష్కారం? ఈ మంత్రంలోనే ఉంది జవాబు. నానాత్వం చూడకు. కళ్ళు తెరిస్తే నానాత్వం కనిపిస్తోంది కదా అంటే కాటరాక్టుని ఆహ్వానించాలా? నానాత్వాన్నే అంతిమ సత్యంగా చూడకూడదు.

ఆ తేడా పైపైన తేడా మాత్రమే. ఉన్నది ఏకత్వమే.

మనిషి, మనిషికీ ఒక తేడా ఉంది. ఆ తేడాలో ఒక పోలిక ఉంది.

పోలిక మాత్రమే కాదు, ఏకత్వం ఉంది. అన్ని ఆభరణాల్లోనూ బంగారం ఉందని చూసినట్టుగా. సర్వ ఆభరణాల్లోనూ స్వర్ణదర్శనం చేస్తే అవి ఏకం అన్న భావన ఎలా కలుగుతుందో, అలాగే మేధావులకి సర్వాత్మభావన ఉంటుంది.

**మంత్రం – 11**

**మనసైవేదమాప్తవ్యం నేహ నానాఽస్తి కిన్చన।**
**మృత్యోః స మృత్యుం గచ్ఛతి య ఇహ నానేవ పశ్యతి॥**

**ప్రతిపదార్థం:** ఇదం – ఈ సత్యం; మనసా – మనసు చేతనే; ఆప్తవ్యమ్ – పొందబడుతుంది; నేహనానాస్తి కించన – ఇక్కడ బహుత్వం లేదు; యః – ఎవరు; ఇహ నానా ఇవ – ఇక్కడ వైవిధ్యం ఉన్నట్టుగా చూస్తాడో; సః – అతను; మత్యోః మృత్యుం – మృత్యువు నుంచి మృత్యువుకి; గచ్ఛతి – పోతాడు.

**తాత్పర్యం:** ఈ సత్యం మనసు చేతనే పొందబడుతుంది; ఈ లోకంలో భిన్నత్వం లేదు. ఇక్కడ భిన్నత్వం ఉన్నట్టుగా ఎవరు చూస్తారో, అతను మృత్యువు నుంచి మృత్యువుకి పోతాడు.

**వివరణ:** ఇది కూడా ఒక మహావాక్య మంత్రం. శంకరాచార్య దీన్ని తరచు వాడతారు. ఇందులో రెండో పాదం, ముందు మంత్రంలో రెండోపాదం ఇంచుమించు ఒకటే. ఇక్కడ గచ్ఛతి ఉంటే, అక్కడ ఆప్నోతి ఉంది, రెండింటి అర్థం ఒకటే.

**మృత్యోః స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి** – కఠ 2.1.10

బహుత్వం చూస్తే మరణం నుంచి మరణానికి ప్రయాణిస్తాడు. సంసార చక్రంలో కొట్టుమిట్టాడుతుంటాడు.

నేహ నానాస్తి కించన – ఇది ఉపనిషత్తు సారాంశం. ఇక్కడ బహుత్వం లేదు. నామ, రూపాలు అనేకం ఉన్నా, చైతన్యం ఒక్కటే. బంగారు ఆభరణాలు అనేకం ఉన్నా, వాటన్నింటిలోనూ ఉన్నది బంగారం ఒక్కటే. అలా జగత్తు మొత్తం, ఏక చైతన్యం. నేహ నానాస్తిలో అస్తి అంటే వర్తమానం. ఉన్నదొకటే అద్వైతం. మూడు కాలాల్లోనూ అదే ఉంది. అద్వైతంకి చేరమంటే ఎలా చేరాలి? ద్వైతం ఉందని అజ్ఞానం వల్ల అనుకుంటున్నాము. ఆ భావనను వదలాలి. అది వదిలితే చేరతామా? చేరము! ఎందుకంటే అద్వైతం గతంలో ఉంది, ఇప్పుడూ ఉంది. ముందు కూడా ఉంటుంది. అది తెలుసుకోవటమే జ్ఞానం. అల అలలాగే ఉంటుంది. దానిలో మార్పు ఉండదు. కాని తాను అల కాదని, సముద్రంలోని నీరని తెలుసుకుంటే, దృక్పథంలో మార్పు వస్తుంది.

మనసై వేద ఇదం ఆప్తవ్యం – ద్వైతం నుంచి అద్వైతానికి మారటానికి జ్ఞానమే మార్గం అయితే, ఎలా పొందాలి? సూపర్‌బజార్‌లో దొరుకుతుందా? ఉపనిషత్తు మనసు వల్లనే దొరుకుతుంది అంటుంది. మనసుని వదలవద్దు. మనసు పనిచేయకుండా ఆపవద్దు. మనసుని నిర్వికల్ప సమాధిలోకి తీసుకువెళ్లే ధ్యానం చేయవద్దు. మనసుతో అర్థం కానిది, మనసు లేకుండా ఎలా అర్థమవుతుంది? కళ్ళతో చూడలేను కాబట్టి, కళ్ళు తీసేసాను అన్నట్టు ఉంది ఇది. కళ్ళతో చూడలేనిది చూడటానికి కళ్ళను మెరుగుపరచుకోవాలి. మనసు అఖ్ఖరలేకపోతే, చిత్తశుద్ధి ఉండాలని, వివేక, వైరాగ్య, శమదమాదులు ఉండాలని ఎందుకు అంటుంది ఉపనిషత్తు?

అంతకుముందు కూడా చూసాము. మనసు వల్లనే తెలుస్తుంది అని. ఇక్కడ వచ్చింది

**ఏషోఽణు రాత్మా చేతసా వేదితవ్యో** – ముండక 3.1.9

కాని వేరే సందర్భాల్లో మనసు వల్ల తెలియదు అని వస్తుంది.

**న వాగ్గచ్ఛతి నో మనః** – కేన 1.3

ఇలా పరస్పర విరుద్ధంగా ఎందుకు చెప్తోంది శాస్త్రం? దీన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలి. సంసిద్ధం కాని మనసు వల్ల తెలియదు. గురుశాస్త్ర ఉపదేశం పొందిన మనసే విచారణ చేసి తెలుసుకోగలదు బ్రహ్మను అని అర్థం.

ఇంకో అర్థం కూడా ఉంది. మామూలుగా మనసు జ్ఞానప్రాప్తి స్థానం, కన్నులాంటి ఇంద్రియాలు జ్ఞాన సముపార్జన సాధనాలు. ఇంద్రియాలకి గోచరమైనవి మనసుకి చేరవేస్తాయి. అక్కడ మనసు 'లోకస్'గా అంటే జ్ఞానప్రాప్తి స్థానంగా పనిచేస్తోంది.

కాని మనసుకు ఇంకో లక్షణం కూడా ఉంది. మనసు ఒక పరికరంగా కూడా పనిచేస్తుంది. అంటే మనసుకు రెండు పనులు ఉన్నాయి. జ్ఞానప్రాప్తి స్థానం, పరికరం.

**నైషా తర్కేణ మతిరాపనేయా** – కఠ 1.2.9

మనసుని పరికరంగా వాడటం లేదు. అంటే తర్కం ఉపయోగించనక్ఖరలేదు. గురుశాస్త్ర ఉపదేశం మీద శ్రద్ధ ఉంటే చాలు. కాని జ్ఞానప్రాప్తి స్థానంగా మనసు కావాలి. శబ్ద ప్రమాణమైన శాస్త్రం చెప్పేది స్వీకరించే అనువైన పాత్రగా మనసు కావాలి. అంటే మనసు జ్ఞానప్రాప్తి స్థానంగా కావాలి, పరికరంగా అవసరం లేదు. జ్ఞానం పొందితే దృక్పథంలో మార్పు వస్తుంది. 'ప్రయాణం' సంసారం నుంచి మోక్షానికి అవుతోంది.

ఉన్నదంతా ఆత్మే అయితే మరి అనాత్మ మాటేమిటి? అనాత్మకు స్వతహాగా ఉనికి లేదు. అది నామరూపాలు ఉన్న వస్తువు మాత్రమే. ఆభరణాలకి స్వయంగా విలువ ఉండదు కాని వ్యవహారం కోసం, గాజు, గొలుసు అంటాము. అనేక నామరూపాలు వాడటంలో తప్పులేదు. వ్యవహారానికి కావాలి.

అనేక నామరూపాలు ఉన్నా, ఆత్మ ఒకటే. ఈ జ్ఞానం పొందితీరాలి. సర్వాత్మ భావన లేకపోతే, పూర్ణత్వం లేదు; శాంతి, భద్రతలు లేవు. పునరపి జననం, పునరపి మరణం పొందుతాము.

### మంత్రం – 12

**అఙ్గుష్ఠమాత్రః పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి।**
**ఈశానో భూతభవ్యస్య న తతో విజుగుప్సతే। ఏతద్వై తత్॥**

**ప్రతిపదార్థం:** అఙ్గుష్ఠమాత్రః – బొటనవేలి పరిమాణంలో; పురుషః పరమాత్మ; ఆత్మని – శరీరం; మధ్యే – మధ్యలో; తిష్ఠతి – ఉన్నాడు; భూతభవ్యస్య – భూత భవిష్యత్తులకు; ఈశానః – ప్రభువు; తతః – ఈ జ్ఞానంతో, న విజుగుప్సతే – ద్వేషించదు; ఏతద్ వై తత్ – అదే నువ్వు అడిగిన తత్త్వం.

**తాత్పర్యం:** బొటనవేలి పరిమాణంలో శరీరం మధ్య హృద్గుహలో కొలువై ఉన్నాడు. భూత భవిష్యత్తులకు అతీతుడు. ఈ విషయం తెలుసుకున్నవాడు దేన్నీ ద్వేషించడు. అదే నువ్వు అడిగిన తత్త్వం.

**వివరణ:** ఇది కూడా ఒక మహావాక్య మంత్రం. జీవాత్మ, పరమాత్మల ఐక్యం సూచిస్తుంది.

అంగుష్ఠమాత్రః పురుషః – జీవాత్మ
ఈశానోభూతభవ్యస్య – పరమాత్మ
న తతో విజుగుప్సతే – ఫలం

4. **దేశకాల అతీతం** – నిజానికి చైతన్యం ఒకచోట పరిమితమవదు. కాని పరిమితమైనట్టుగా చూపిస్తోంది. ఆలోచలనకి సాక్షి చైతన్యంగా ఉంది. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుని సాక్షి చైతన్యంగా చూసే ఆత్మను ఇక్కడ పురుషః అన్నారు. పురుషః పదంకి రెండు అర్థాలు ఉన్నాయి.

1. పురేషేతే ఇతి పురుషః – శరీరంలో జీవించేవాడు.
2. పూరయతి సర్వం ఇతి పురుషః – సర్వవ్యాపకమైంది – కాంతిలాగా.

ఇక్కడ శరీరంలో జీవించేవాడు అని అర్థం.

మధ్యే ఆత్మని తిష్ఠతి – సాక్షి చైతన్యమైన ఆత్మ ఎక్కడ ఉంది? హృదయంలో ఉన్నట్టుగా ఉంది. ఇక్కడ ఆత్మ అంటే శరీరం. హృదయం ఆత్మకు ముఖ్యభాగం, మధ్యభాగం. శాస్త్రం ప్రకారం మనసు హృదయంలో ఉంది. విజ్ఞానశాస్త్ర ప్రకారం మనసు మెదడులో ఉంది అనుకుంటాం. అప్పుడు మనసు శరీరంపైన ఉంటుంది. స్థూల శరీరంలో హృదయం ఉంది. హృదయంలో మనసు ఉంది. మనసులో చైతన్యం ఉంది. శరీరం ఆలయం అయితే, హృదయం గర్భగృహం. అందులో చైతన్యం అంగుష్ఠం అంత ఉన్నట్టుగా ఉంది అన్నది మర్చిపోకూడదు. హృదయం మన పిడికిలి అంత ఆకారంలో ఉంటుంది. అందులో పట్టేది అంగుష్ఠం. తర్కం తెలుస్తోందా? మనసులో ఉండబట్టే అంగుష్ఠం అంత ఆకారం. మాత్రః అంటే ఆకారం.

అంగుష్ఠంతో ఎందుకు పోల్చారన్నదానికి దయానంద సరస్వతి స్వామి ఇంకో ఉదాహరణ ఇస్తున్నారు. అంగుష్ఠం ఆకారం ఉపాసకుని దృష్ట్యా వచ్చింది. అదే వేదాంతి దృష్ట్యా తీసుకుంటే, బొటనవేలు చేతికి ఎంత ముఖ్యమో, అది లేకపోతే ఎలా చేతికి ఉనికి లేనట్టే అవుతుందో, అలాగే సాక్షి చైతన్యం అంత ముఖ్యం. అది అన్నింటికీ అధిష్ఠానం. అది లేకపోతే, ప్రపంచానికి ఉనికి లేదు.

ఈశానో భూత భవ్యస్యః – పరమాత్మ స్వరూపం ఏమిటి? కాలాతీత పరమాత్మ. గతంలోనూ, భవిష్యత్తులోనూ ఉన్నాడు. రెండు కాలాలకి మధ్యకాలమైన వర్తమానం మనం కలుపుకోవాలి. పరమాత్మ సర్వవ్యాపకుడు. ఉదాహరణ – ఘటాకాశం, మఠాకాశం, కుండలో ఆకాశం కొంచెమే ఉన్నట్టుగా అనిపిస్తోంది. ఇంకా విశ్లేషిస్తే, ఆకాశం బయటా లోపలా అంతటా ఉంది. ఇంకా చెప్పాలంటే కుండలన్నీ ఆకాశంలో ఉన్నాయి. అలాగే చైతన్యం హృదయంలో ఉంది అంటే చైతన్యం అపరిమితమై అంతటా ఉంది. అంటే బయటా, లోపలా అంతటా ఉంది. ఉన్నదొకటే చైతన్యం, అందులోనే అన్నీ ఉన్నాయి. కాబట్టి జీవాత్మే పరమాత్మ. ఉన్నదొకటే పరమాత్మ.

న విజుగుప్సతే ఈ జీవాత్మ పరమాత్మ ఐక్యం తెలిసిన వ్యక్తి భద్రత కోరడు. ఇదే పాదం 5వ మంత్రంలో కూడా వస్తుంది.

ఈశానం భూతభవ్యస్య న తతో విజుగుప్సతే ఏతద్ వై తత్.

న విజుగుప్సతే – ఒక అర్థం భద్రత కోరడు. కాని ఈశావాస్య ఉపనిషత్తులో కూడా ఈ పదం వచ్చినప్పుడు, శంకరాచార్యులు వేరే అర్థం ఇచ్చారు.

జుగుప్స ఉండదు అని. అంటే జ్ఞానం పొందాక జ్ఞానికి దేనిమీదా ద్వేషం ఉండదు. మామూలుగా మోక్షం అంటే ప్రపంచం నుంచి విముక్తి కావాలనుకుంటారు. ప్రపంచం మీదా, పునర్జన్మ మీదా, జీవితం మీదా జుగుప్స ఉండి, వాళ్ళు తిరిగి రాకూడదనుకుంటారు.

కాని నిజానికి మోక్షం అంటే ఈ జుగుప్స నుంచి, అభద్రత, అశాంతిల నుంచి విముక్తి. జీవితం మోయలేని భారం కాదు. అనంతమైన ఆనందం.

### మంత్రం – 13

**అఙ్గుష్ఠ మాత్రః పురుషో జ్యోతిరివాధూమకః।**
**ఈశానో భూతభవ్యస్య స ఏవాద్య స ఉ శ్వః। ఏతద్వై తత్ ॥**

**ప్రతిపదార్థం:** అధూమకః – పొగలేని; జ్యోతిః ఇవ – కాంతి లాగా; అంగుష్ఠమాత్రః – బొటనవేలి ప్రమాణంలో; పురుషః – పరమాత్మ; భూతభవ్యస్య – భూతభవిష్యత్తులో; ఈశానః– ప్రభువు; స ఏవ – ఆయనే; అద్య – ఇప్పుడు; స ఉ – ఆయనే; శ్వః – తర్వాత – ఏతద్ వై తత్ – అదే నువ్వు అడిగిన తత్త్వం.

**తాత్పర్యం:** భూత భవిష్యత్ కాలాలకు ప్రభువు అయిన పరమాత్మ పొగలేని కాంతిలాగా బొటనవేలి ప్రమాణంలో ఉన్నాడు. ఇప్పుడు ఉన్నదీ ఆయనే, ఎప్పటికీ శాశ్వతంగా ఉండేదీ ఆయనే. ఆయనే నువ్వు అడిగిన తత్త్వం.

**వివరణ:** ఇది కూడా ఒక మహావాక్య మంత్రం. రెండో పాదం ఇంచుమించుగా పూర్వ మంత్రంలోనిదే. ఇది కూడా జీవాత్మ, పరమాత్మల ఐక్యం సూచిస్తుంది.

పురుషః అంగుష్ఠమాత్రః – చూడటానికి శరీరంలో పరిమితమైనట్టుగా కనిపిస్తుంది జీవాత్మ. ఇది సహజమైన అపోహ. చైతన్యం శరీరం అంతటా ఉంది, గోరు వరకూ. గోరుకు చిన్న దెబ్బ తగిలినా విలవిల్లాడిపోతాము. చైతన్యం శరీరం మేరకే ఉందా? సర్వవ్యాపకంగా ఉంది. దాని స్వరూపమేమిటి?

5. **ప్రకాశకం లేదా జ్యోతిషాం జ్యోతిః** – అధూమకః అగ్నితో పోల్చాడు ఇక్కడ. అధూమకం అంటే పొగలేని అగ్ని. అంతటినీ ప్రకాశింపచేసే శక్తి గలది. ఉపాధిని పొగతో పోలిస్తే పొగలేని అగ్ని అంటే నిరాకార శుద్ధ చైతన్యం. అది స్వయం ప్రకాశకం. శాస్త్రంలో కాంతిని సాంకేతికంగా వాడతారు. దాని సమక్షంలో వస్తువులన్నీ కనబడతాయని నిర్వచిస్తారు.

శాస్త్రం ప్రకారం ప్రతి ఇంద్రియమూ ఒక కాంతే. కన్ను రంగు, రూపులని తెలియజేస్తోంది. కన్ను ఒక కాంతి. అలా చూసుకుంటూపోతే మనసు ఉంటేనే కన్ను చూసినది తెలుస్తుంది. లేకపోతే లేదు. కాబట్టి మనసు కూడా కాంతి. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుని చూసే అంతిమ కాంతి చైతన్యం. చైతన్యం లేకపోతే ఇంద్రియాలు, మనసు చూడలేవు. అందుకే చైతన్యాన్ని జ్యోతిషాం జ్యోతిః అన్నారు. అందుకని అగ్నితో పోలిక. నిజంగా జ్యోతి కనబడుతుందని కాదు.

ఈశానః భూతభవ్యస్యః – పరమాత్మ అన్నిటినీ అదుపులో పెడతాడు. నానాత్వం ఉన్నట్టు కనిపిస్తుంది కాని నిజానికి లేదు. ఉదా: లైట్‌హౌస్. లైట్‌హౌస్ నుంచి వచ్చే కాంతికి బహుత్వం ఉన్నట్టూ, చలనం ఉన్నట్టూ కనిపిస్తుంది. కాని లోపలికి వెళ్ళి చూస్తే, అక్కడ ఉన్నది ఒకటే కాంతి. దానికి చలనం కూడా లేదు. అలాగే ఆత్మకు బహుత్వం, చలనం ఆపాదిస్తున్నాము పొరపాటుగా. ఆత్మ ఎన్నాళ్ళు ఉంటుంది? ఇంకో అపోహ. మనం పొరపాట్లలో సిద్ధహస్తులం. శరీరం పోతే చైతన్యం పోదు. కాని దాన్ని ప్రతిబింబించే మాధ్యమం లేదు కాబట్టి ప్రకటితమవదు, బల్బు వెలగందే విద్యుచ్ఛక్తి ఉన్నట్టు తెలియనట్టుగా.

**యేయం ప్రేతే విచికిత్సా మనుష్యేఽస్తీత్యేకే నాయ మస్తీతి చైకే** – కఠ 1.1.20

నచికేతుడు అడిగిన ఈ ప్రశ్ననుంచి వచ్చింది కఠోపనిషత్తంతా. మరణం తర్వాత ఆత్మ ఉందా, లేదా? ఈ మంత్రం జీవాత్మ మరణం తర్వాత కూడా ఉందని చెప్తోంది. శంకరాచార్యుల వారు, తర్కపరంగా చూసినా జీవాత్మ మరణం తర్వాత ఉందని తెలుస్తుందంటారు. స్వామీజీ దాన్ని వివరిస్తారు.

జీవికి పునర్జన్మ ఉందని ఒప్పుకోకపోతే మూడు దోషాలు కనిపిస్తాయి.

1. వైషమ్య నైర్ఘుణ్యః దోషః – అప్పుడే పుట్టిన చిన్న పిల్లలు అవస్థపడుతూ ఉంటారు. వాళ్ళు పాపాలు చేసి, కర్మఫలం పొందేటంత కాలం అవలేదు. అంటే ముందు జన్మలో చేసిన పాపాలను అనుభవిస్తున్నారన్నమాట. అలా అనుకోకపోతే దేవునికి పక్షపాతం ఉన్నట్టు అవుతుంది.

2. అకర్తాభ్యాగమః – పుట్టిన ప్రతి వ్యక్తీ కర్మఫలం పొందాలి. అది పొందకుండా మరణించి, పునర్జన్మ లేదనుకుంటే, కర్మఫలం అనుభవించాలన్న ప్రకృతి నియమం అధిగమించినట్టు అవుతుంది.

3. కర్తవిప్రణాశః – పునర్జన్మ లేకపోతే, జీవి చేసిన ఎన్నో మంచి కర్మలు ఫలం పొందకుండానే నాశనం అవుతాయి.

అందుకని మన శాస్త్రంలో పునర్జన్మ ఉందని చెప్పిందనటానికి ఈ మంత్రం ఋజువు. మరణం అప్పుడు స్థూల శరీరం పడిపోతుంది. సూక్ష్మశరీరంలో ఉన్న మనసు+కారణ శరీరం కలిసి, కర్మఫలాలను అనుభవించటానికి వేరే శరీరం వెతుక్కుంటాయి. మనసు ప్రతిబింబింపచేసిన ప్రతిబింబ చైతన్యం కూడా దానితోపాటు లోకాలకు వెళ్తుంది. సామాన్య చైతన్యం సర్వవ్యాపకం కాబట్టి, ఎక్కడికీ వెళ్ళదు. కాకపోతే మాధ్యమం లేదు కాబట్టి ఉన్నట్టు తెలియదు. అదే నువ్వు తెలుసుకోవాలనుకున్నది.

### మంత్రం – 14

**యథోదకం దుర్గే వృష్టం పర్వతేషు విధావతి।**
**ఏవం ధర్మాన్ పృథక్ పశ్యన్ తానే వాను విధావతి॥**

**ప్రతిపదార్థం:** పర్వతేషు – పర్వతాలలో; దుర్గే – ఉన్నత శిఖరంపై; వృష్టం ఉదకం – కురిసిన వాన నీరు; యథావిధావతి – ఎలా అనేక స్థాయిలలో ప్రవహిస్తూ పోతుందో; ఏవం – అలాగే; ధర్మాన్ – జీవజాలాన్ని; పృథక్ – వివిధాలుగా; పశ్యన్ – చూసేవాడు; తాన్ ఏవ అనువిధావతి – అదే బహుత్వ ప్రపంచంలో పుడతాడు.

**తాత్పర్యం:** పర్వత శిఖరాల మీద కురిసిన వాన నీరు ఏ విధంగా కింద ప్రాంతాలకు, అనేక స్థాయిలలో ప్రవహిస్తుందో, అదే విధంగా జీవజాలాన్ని వివిధాలుగా చూసేవాడు మళ్ళీ అదే బహుత్వ ప్రపంచంలో పుడతాడు.

**వివరణ:** దీనికి యమధర్మరాజు ఒక దృష్టాంతం ఇస్తున్నాడు.

యథా దుర్గే వృష్టం పర్వతేషు విధావతి – పర్వతాల ఉన్నత శిఖరంపై కురిసిన వాన అనేక కాలువలుగా చీలి, విడిపోయి, మాయమవుతుంది. మళ్ళీ ఆ కాలువలే కలిసి పెద్ద నది అవుతుంది. జీవజాలాన్ని విభిన్నంగా చూసిన వ్యక్తి నాశనం అవుతాడు. ఇంకో ఉదాహరణ అల, సముద్రం. అలని అలలుగా చూస్తే ద్వైతం. నీరుగా చూస్తే అద్వైతం. అందుకని అలగా చూడకుండా, నీరుగా చూడాలి.

**మంత్రం – 15**

**యథోదకం శుద్ధే శుద్ధమాసిక్తం తాదృగేవ భవతి।**
**ఏవం మునేర్విజానత ఆత్మాభవతి గౌతమ॥**

**ప్రతిపదార్థం:** గౌతమ – నచికేతా; శుద్ధే – పరిశుద్ధమైన నీటిలో; అస్తికం – వదిలిన; శుద్ధమ్ ఉదకం – పరిశుభ్రమైన నీరు; యథా – ఎలాగైతే; తాదృక్ ఏవ – అటువంటిదే; భవతి – అవుతుందో; ఏవం – ఆ విధంగా; విజానతః – సత్యాన్ని గ్రహించిన; మునేః – తెలివైన వ్యక్తికి, ఆత్మా భవతి – ఆత్మ ఒక్కటే అవుతుంది.

**తాత్పర్యం:** ఓ నచికేతా! పరిశుద్ధమైన నీటిలో విడిచిన పరిశుద్ధమైన నీరు ఎలాగైతే అటువంటిదే అవుతుందో, అలాగే సత్యాన్ని గ్రహించిన తెలివైన వ్యక్తికి ఆత్మ ఒక్కటే అవుతుంది.

**వివరణ:** ఇంకో ఉదాహరణ ద్వారా ఇందులో అద్వైత భావన చూపిస్తున్నాడు యమధర్మరాజు. ఇది కూడా జీవాత్మ పరమాత్మ ఐక్యం చూపుతుంది. దీనితో ఈ వల్లీ ముగుస్తుంది.

శుద్ధమ్ ఉదకమ్ – గ్లాసు నీరు (జీవ) శుద్ధే – సముద్రం (పరమాత్మ) రెండూ నీరే. రెంటికీ సమాన లక్షణం ఏమిటి? తెలివైన వ్యక్తికి ఆత్మ ఒక్కటే అవుతుంది. వేదాంత సాధన ద్వారా జీవాత్మ నీరు, పరమాత్మ నీరులో పోసినట్టుగా అనిపిస్తుంది. జీవ, పరమ పదాలు ఒకే ఆత్మకు విశేషణాలు. ఇలా ఎవరికి అనిపిస్తుంది? మునికి. ముని అంటే శ్రవణ, మనన, నిధిధ్యాసనం చేసిన వ్యక్తి. ముని అంటే గడ్డం ఉన్న వ్యక్తి అని కాదు. మననాత్ ఇతి మునిః – వేదాంత విచారణ చేసిన వ్యక్తి.

**కొన్ని సూచనలు –**

1. శుద్ధం జలం – శుద్ధమైన జలంలో పోస్తే అన్నమాట తీసుకుంటే రెండూ శుద్ధంగా ఉండాలి. పరమాత్మను శుద్ధం చేయనక్ఖరలేదు. జీవాత్మను శుద్ధం చేయాలి.

2. సరిగ్గా అర్థం చేసుకోకపోతే – అయోమయంగా ఉంటుంది. ఒక గ్లాసులో నీరు ఇంకోదానిలో పోస్తే అది సంఘటన అవుతుంది. కాలంలో జరిగింది. అలా ఇక్కడ ఉన్న జీవాత్మ, ఎక్కడో వైకుంఠంలో ఉన్న పరమాత్మలో ఐక్యం చెందుతుంది అనకూడదు. ప్రయాణం

రెండూ దూరంగా ఉన్నప్పుడు వస్తుంది. పరమాత్మ సర్వవ్యాపకం, జీవిలో కూడా ఉన్నాడు. రెండు విభిన్నంగా లేవు అన్న భావనే ఐక్యం. విభిన్న భావనని వదులుకోవాలి. ఇదంతా బుద్ధికి చెందింది. సంఘటనకు చెందినది కాదు.

అపోహ వదలటం ఎలా? సరియైన అవగాహన బుద్ధిలో కలగాలి. జీవాత్మ వెళ్ళి పరమాత్మలో కలవాలి అంటే అర్థం కానట్టు. నేను అంతకుముందు, ఇప్పుడు, ఇక ముందు కూడా పరమాత్మనే అనగలిగితే కలవాలన్న ప్రశ్న ఉదయించదు. భేద భావం తొలగటమే ఐక్యం కలగటం.

అజ్ఞానికి ఉందా ఐక్యం? ఐక్యం సత్యం. అజ్ఞానం వల్ల అతని భావనలో పొరపాటు జరుగుతోంది. అహం నిత్య, శుద్ధ, ముక్త, బుద్ధ స్వరూపుడను అనుకుని తెలివిగా మారాలి. కర్మయోగం మాటేమిటి?

**కర్మయోగం పూర్తికాకుండా జ్ఞానయోగం అసాధ్యం.**
**జ్ఞానయోగం లేకుండా కర్మయోగం అసంపూర్ణం.**

కర్మయోగం అంతఃకరణశుద్ధికి మార్గం.
అద్వైత దర్శనం ముక్తికి, ద్వైత దర్శనం సంసారానికి దారితీస్తుంది.

# అధ్యాయం - 2 వల్లీ - 2

బ్రహ్మ అంటే సాక్షి చైతన్యం, ఎన్నటికీ బాహ్యంలో చూసే వస్తువు కాదు అన్న విషయం ఉపనిషత్తు మళ్ళీ మళ్ళీ చెప్తోంది. ఈసారి ఇంకో పద్ధతి ఉపయోగిస్తోంది. ఇన్నిసార్లు ఎందుకు చెప్పాలి? బ్రహ్మ చాలా సూక్ష్మమైనది. అందుకని అర్థం చేసుకోవటం అంత తేలిక కాదు. అదీకాక మనం ఇన్నాళ్ళు నేర్చుకున్న విద్యావిధానం వేరు. అది బ్రహ్మ జ్ఞానానికి పనికిరాదు. అది ఏమిటంటే మనం నేర్చుకున్న వస్తువును బాహ్య వస్తువుగా చూడటం. నేను వేరూ, నేను నేర్చుకున్న వస్తువు వేరూ. అందువల్ల దేని గురించైనా నేర్చుకుంటే దాన్ని అనుభవించాలి. కాశీ గురించి నేర్చుకుంటే, అక్కడికి వెళ్ళి ఆ ప్రదేశాన్ని చూడాలి. అలాగే ఇక్కడ కూడా చేయాలనుకుంటాము. బ్రహ్మ గురించి ఉపనిషత్తులో నేర్చుకుంటే చాలదు. దాన్ని ధ్యానం ద్వారానో, వేరే ఏదైనా మార్గంలోనో అనుభవించాలని చూస్తాము. అందుకని బ్రహ్మవిద్యా బోధలో గురువు చాలా శ్రమపడాలి. బాహ్య వస్తువుల కోసం వెతకటం మానేసి, ఆ బ్రహ్మని నేనే అని అర్థం చేసుకునేలా చేయాలి.

బ్రహ్మ 'సత్' రూపంలో అంతటా ఉన్నా, చిత్ రూపంలో లేదా చైతన్యరూపంలో కేవలం ప్రాణం ఉన్న జీవుల్లోనే ఉంది. మనకి అత్యంత సమీపంలో ఉన్న ప్రాణి, మనమే. మొదటి మంత్రంలో మొదటి భాగంలో బ్రహ్మ సాక్షి చైతన్యం రూపంలో మన శరీరంలో ఉందని చెప్తుంది. రెండో భాగంలో అనుష్ఠానం ద్వారా బ్రహ్మని పొందాలి అంటుంది ఉపనిషత్తు. అనుష్ఠానం అంటే శ్రవణ, మనన, నిధి ధ్యాసనం. ఈ సాధనలు బాగా చేస్తే, అహం బ్రహ్మాస్మి అని చెప్పగలుగుతాము. అలాంటి జ్ఞాని ఇప్పుడు జీవన్ముక్తి, మరణం తర్వాత విదేహ ముక్తి పొందుతాడు.

శంకరాచార్యులు తన భాష్యంలో సాధనల్లో నిధిధ్యాసనంకి పెద్ద పీట వేస్తారు. నిధి ధ్యాసనం శ్రవణ, మననాల తర్వాత వస్తుంది. అందువల్ల నిధిధ్యాసనం చేసేది జ్ఞానం పొందటానికో, మోక్షం పొందటానికో కాదు. విపరీత భావనలను మార్చటానికి. ఉదాహరణకు మోక్షం సాధ్య వస్తువు కాదు, సిద్ధ వస్తువు అని తెలుసుకోవటానికి.

**మంత్రం – 1**

**పురమేకాదశద్వారమజస్యావక్రచేతసః।**
**అనుష్ఠాయ న శోచతి విముక్తశ్చ విముచ్యతే। ఏతద్వై తత్॥**

**ప్రతిపదార్థం:** ఏకాదశ ద్వారమ్ – పదకొండు ద్వారాలుగల; పురం – దేహం; అజస్య – జన్మరహితునికి; అవక్ర చేతసః – మార్పులేని చైతన్యం; అనుష్ఠాయ – శ్రవణ, మనన, నిధిధ్యాసనలు చేసినవాడు; నశోచతి – దుఃఖించడు; విముక్తః – జీవన్ముక్తి; విముచ్యతే – పునర్జన్మ నుంచి విముక్తి; ఏతద్ వై తత్ – అదే నువ్వు అడిగినది.

**తాత్పర్యం:** పదకొండు ద్వారాలు గల దేహం, మార్పులేని చైతన్యముదే. ఈ విషయాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనల ద్వారా తెలుసుకున్న వ్యక్తి దుఃఖించడు. అతనికి ఇప్పుడే జీవన్ముక్తి, మరణం తర్వాత విదేహ ముక్తి కలుగుతుంది. అదే నువ్వు అడిగినది.

**వివరణ:** జీవాత్మ స్వరూపం, వ్యక్తి స్వరూపం. శరీరం ఒక పురం (రాజ్యం) ఎందుకు? అది పురస్వామికి (రాజుకి) ఇల్లు. హృదయం – రాజధాని, అంగాలు – పురజనులు. శివమానస పూజలో ఓ దేవా శరీరం నీ రాజ్యం, ఇంద్రియాలు నీ పురజనులు అని వస్తుంది. రక్తనాళాలు– రహదారులు, చిన్న రక్తనాళాలు – సందులు, చర్మం – పురహద్దులు, (చర్మం – ప్రత్యేకమైన, అద్భుతమైన వస్త్రం), జ్ఞానేంద్రియాలు లోపలికి ద్వారాలు, కర్మేంద్రియాలు వెలుపలికి ద్వారాలు, నోరు రెండింటికీ ద్వారం.

పురం ఏకాదశ ద్వారం – ఏకాదశ అంటే 11. అవి తలలో 7 – రెండు కళ్లు, రెండు చెవులు, రెండు ముక్కు రంధ్రాలు, ఒక నోరు, మూడు క్రింది భాగంలో – రెండు చెత్త విసర్జనకి,

ఒకటి నాభి, పదకొండవది బ్రహ్మరంధ్రం. ఈ బ్రహ్మరంధ్రం తలపైన మధ్యలో ఉంటుంది. ఉత్తర ద్వారం కేవలం వైకుంఠ ఏకాదశి రోజు తెరచినట్టుగా, కేవలం ఉపాసకుడు మరణించినప్పుడు బ్రహ్మలోకానికి వెళ్ళటానికి బ్రహ్మరంధ్రం తెరుచు కుంటుంది.

**నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్ న కారయన్** – గీత 5.13

శ్రీకృష్ణ భగవానుడు గీతలో తొమ్మిది ద్వారాలే పేర్కొన్నాడు. నాభి, బ్రహ్మరంధ్రం వదిలేసాడు, అవి నిత్యం ఉపయోగించేవి కావు కాబట్టి.

అవక్ర చేతసః ఈ పురం ఎవరిది? పురస్వామిది. ఎవరతను? అవక్ర చేతసః అంటే మార్పులేని చైతన్యానిది. ప్రత్యేకించి ఈ విశేషణం ఎందుకు అంటే శరీరానికి మార్పు ఉంది కాబట్టి. శరీరానికి ఆరు వికారాలున్నాయి. అస్తీ జాయతే వర్ధతే విపరిణమతే అపక్షీయతే వినశ్యతి. అందువల్ల పురంలా కాకుండా చైతన్యం శాశ్వతం.

అనుష్ఠాయ – మనమేం చేయాలి? శరీరం నేను అనకుండా, నేను పురస్వామిని అనుకోవాలి. నేను పురం కాదు పురస్వామిని, దేహం కాదు దేహిని. శరీరం కాదు శరీరిని అనే నిశ్చయ జ్ఞానం కలగాలి. శరీరం పోతుంది, ఆత్మనైన నేను పోను. ఆత్మను, అనాత్మను విడదీసి చూడాలి. ఈ జ్ఞాననిష్ఠ అనుష్ఠానం చేయాలి. అంటే శ్రవణ, మనన, నిధిధ్యాసనలు చేయాలి. యమధర్మరాజు అభిమానంగా చెప్తున్నాడు. అనుష్ఠానం చేయి, వేదాంత విచారణ చేయి, ఆత్మ అనాత్మ వివేకం చూపు అంటున్నాడు. నిధి ధ్యాసనంలో నేర్చుకున్న జ్ఞానాన్ని జీర్ణించుకోవాలి. ఉదాహరణకు మనం చేతిని చూస్తాము కాని, చేతిని ప్రకాశింపచేస్తున్న కాంతిని చూడము. చేతినీ, కాంతినీ విడదీసి చూడగలగటమే జ్ఞానం. ఇది తేలిగ్గా అవదు. కాని సాధన చేయి. న శోచతి – ఫలం, విచారం లేదు.

గతాసూన్ అగతాసూంశ్చ నాను శోచంతి పండితాః శోకించదగని వారికై శోకిస్తున్నావు అర్జునా. పండితులు ప్రాణాల గురించి శోకించరు అంటున్నాడు శ్రీకృష్ణభగవానుడు.

జీవన్ముక్తి పొందటానికి, జ్ఞానమార్గమొక్కటే మార్గం. యమధర్మరాజు జ్ఞానికి ఇక్కడే, ఇప్పుడే ముక్తి అని మాట ఇస్తున్నాడు. మరణం తర్వాత విదేహముక్తి కలుగుతుంది అతనికి. అంటే ఇంక పునర్జన్మ ఉండదు. ఇదే నువ్వు అడిగినది. 'ఏతద్ వై తత్' వదలటం లేదు యమధర్మరాజు.

**మంత్రం – 2**

**హగ్ంసః శుచిషద్వసురన్తరిక్షసద్ధోతా వేదిషదతిథిర్దురోణసత్।**
**నృషద్వరసదృతసద్వ్యోమసదబ్జా గోజా ఋతజా అద్రిజా ఋతం బృహత్॥**

**ప్రతిపదార్థం:** హంసః – (ఇక్కడ) సూర్యుడు, శుచిషత్ – ఆత్మ ఆకాశంలో సూర్యునిగా ఉంది; వసుః అంతరిక్షసత్ – వాయువుగా ఆకాశంలో ఉంది; హోతావేదిషత్ – అగ్నిగా భూమి మీద ఉంది; అతిథిర్దురోణసత్ – ఇంట్లో అతిథి రూపంలో ఉంది; నృషద్ – ప్రతి మనిషిలో; వరసత్ – దేవతలలో ఉంది; ఋతసత్ – (ఇక్కడ) యజ్ఞాల్లో ఉంది; వ్యోమసత్– ఆకాశంలో ఉంది; అబ్జా – నీటిలో పుట్టినవి; గోజా – భూమ్మీద పుట్టినది; ఋతజా – యజ్ఞానికి వాడే వాటిల్లో పుట్టింది; అద్రిజా – పర్వతంలో పుట్టింది; – ఋతం – సత్యం; బృహత్ – పరమాత్మ.

**తాత్పర్యం:** ఆత్మ ఆకాశంలో సూర్యునిగా ఉంది; అంతరిక్షంలో వాయువుగా ఉంది. భూమి మీద అగ్నిగా ఉంది. ఇంట్లో అతిథి రూపంలో ఉంది, ప్రతి మనిషిలోనూ, దేవతలోనూ ఉంది; యజ్ఞాల్లో ఉంది, ఆకాశంలోని తక్కిన వస్తువుల్లో ఉంది. నీటిలో పుట్టిన వాటిల్లో భూమిమీద పుట్టిన వాటిల్లో, యజ్ఞానికి వాడే వాటిల్లో , పర్వతంలో పుట్టిన వాటిల్లో ఉంది. అది సత్యం. అది పరమాత్మ.

**వివరణ:** ఈ మంత్రంలో ఒక్కటే ఆత్మ అనేకరూపాల్లో ప్రకటితమవుతోందని చెప్తోంది ఉపనిషత్తు.

6. **సర్వ వ్యాపకం** – అందువల్ల అన్ని నామరూపాల్లో ఉంది ఆత్మ. ప్రాణం ఉన్న జీవుల్లో సత్, చిత్, రూపాల్లో ఉంటే, జడవస్తువుల్లో కేవలం సత్ రూపంలో ఉంటుంది. ఆ విధంగా ఆత్మ అంతటా ఉంది. అంతటా ఉండటమే కాదు, ఇంకా ముఖ్యమైన విషయం, జగత్‌రూపంలోనే ఉంది. అంటే అది ప్రపంచంలోనూ ఉంది, అదే ప్రపంచం. అది నిరూపించటానికి, ఉపనిషత్తు కొన్ని వస్తువులని పేర్కొంది. వాటిల్లో కొన్నింటికి, ఈ మంత్రంలో ప్రత్యేక అర్థం ఉంది.

| **పదం** | **అసలు అర్థం** | **ఇక్కడ అర్థం** |
|---|---|---|
| హన్‌ధాతువు | చంపటం | కదలటం |
| హంస | హంస | సూర్యుడు |
| శుచి | నిర్మలం | ఆకాశం |
| ఋత | అగ్ని | యజ్ఞం |
| హోతా | ఋగ్వేద బ్రాహ్మణుడు | అగ్ని |

వేద్యమే వేది హోమ గుండం దగ్గర భూమి భూమి భూమి ఉండే పవిత్ర ప్రదేశం గోవు ఆవు భూమి

నా శరీరంలో యజమానిగా ఉన్న జీవాత్మ అన్ని శరీరాల్లో ఉంది. అంటే హృదయం, కాలేయం లాంటివి ఏ మనిషికా మనిషికి ప్రత్యేకంగా ఉన్నట్టు ఆత్మ కూడా ప్రత్యేకంగా ఉందా? ఎన్ని శరీరాలు ఉంటే అన్ని ఆత్మలు ఉన్నాయా? ఈ వాదన ఆత్మకు వర్తించదు.

అది సర్వవ్యాపకమైన ఆత్మ, అన్నిట్లోనూ ఉంది. ఆత్మనః దేహ వ్యతిరిక్తం. అందుకని ఆత్మ ఏకం నిత్యం సారం సత్యం.

**ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే।**
**ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః॥** – గీత 13.1

ఆత్మ బహుత్వవాదన చేస్తారు కొందరు దార్శనికులు. ఆత్మ ఏకం అది నిరూపించటానికి అనేక వస్తువులను ఈ మంత్రంలో పేర్కొంటుంది ఉపనిషత్తు.

ఆత్మ ఆకాశంలో సూర్యునిగా ఉంది. హన్ అంటే నాశనం చేసేది. జ్ఞానిని కూడా హంసతో పోలుస్తారు. అంతః – అజ్ఞానాన్ని నాశనం చేస్తాడు జ్ఞాని. అంతరిక్షంలో వాయువు రూపంలో ఉంది. అగ్నిలో ఉంది, భూమి మీద ఉంది, ఇంట్లో అతిథి రూపంలో ఉంది. అంటే గౌరవించ తగ్గ అన్ని పవిత్రమైన వాటిల్లోనూ ఉంది. అంతటా ఉంది. అది చెప్పటానికి 'సత్' పదం పదేపదే వచ్చింది. నృషద్, వరసత్, ఋతసత్ వగైరా. మనిషిలో, దేవతల్లో, యాగాల్లో ఉంది. ఋతసత్ – ఇక్కడ యాగాలు, అగ్ని ముందే వచ్చింది కాబట్టి. అలాగే వ్యోమసత్ అంటే ఆకాశంలో ఉన్నది. వాయువు, సూర్యుడు ముందే వచ్చాయి కాబట్టి అవికాక తక్కినవి. శాస్త్రం ఒకటే అర్థాన్ని పదే పదే వాడదు.

శంకరాచార్యులు అతిథికి రెండు అర్థాలు ఇస్తున్నారు. అతిథి అంటే సోమరసం అని ఒక అర్థం వస్తుంది. అంటే సోమరసం ఒక పాత్రలో ఉన్నట్టుగా, ఆత్మ అనే సోమరసం, శరీరమనే పాత్రలో ఉంది. ఇంకో అర్థం బ్రాహ్మణ అతిథి. ద్రోణః అంటే ఇల్లు. అంటే ఇల్లనే శరీరంలో ఆత్మ బ్రాహ్మణ అతిథిగా ఉందని తీసుకోవచ్చు.

అలాగే 'గో'కి చాలా అర్థాలు ఉన్నాయి. గో అంటే మామూలుగా ఆవు – కొన్నిసార్లు ఇంద్రియాలు అని కూడా వస్తుంది. ముఖ్యంగా వాగింద్రియం, లక్ష్యార్థం వేదం అని కూడా వస్తుంది. కాని ఇక్కడ భూమి అని అర్థం వస్తుంది.

ఇంకొన్ని వస్తువులు కూడా పేర్కొనబడ్డాయి. కొన్నిటిలో ఆత్మ వాటి రూపంలో ఉందనీ, కొన్నిటిలో అవే ఆత్మ అని చెప్తుంది. అంటే, ఆత్మ ప్రపంచంలోని ప్రతి ఒక్కవస్తువులో ఉందని కొన్నిచోట్ల చెపితే, ఆత్మ ప్రపంచం అని మరికొన్ని చోట్ల చెప్తోంది ఉపనిషత్తు. అంటే యజ్ఞమూ ఆత్మే, యజ్ఞానికి వాడే వాటిల్లోనూ, ఆత్మే ఉందని చెప్తోంది. అలలో నీరు ఉందని

చెప్పి, నీరే అల అని చెప్పినట్టన్నమాట. దీనికి కారణం బ్రహ్మ పరిణామ కారణం కాదు. వివర్త కారణం. పరిణామ కారణంలో కార్యాన్ని తయారుచేయటంలో కారణం నశించిపోతుంది. ఉదాహరణకు పాలు, పెరుగుగా మారినప్పుడు పాలు మిగలవు. వివర్త కారణంలో కారణం మార్పు చెందదు. ఉదాహరణకు స్వప్నం, మనం స్వప్నం సృష్టించినప్పుడు మనం అలాగే ఉంటాము.

ఆత్మ ఏమిటి? సత్యం. అంతటా ఉండటం వల్ల మహాన్. కార్యం అంతటా కారణం ఉంటుంది. అందువల్ల బృహత్ బ్రహ్మ. ఆ విధంగా ఆత్మ వ్యావహారిక ప్రపంచంగా కనబడినా, అంటే మిథ్యా ప్రపంచంగా కనబడినా, దాని పారమార్థిక సత్యత్వాన్ని కోల్పోవటం లేదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆత్మ సర్వవ్యాపకత్వాన్ని సూచిస్తోంది. ఇది కూడా ఒక మహావాక్యం. ఈ రెండు మంత్రాలనీ కలిపితే జీవాత్మే సర్వవ్యాపకమైన పరమాత్మ.

## మంత్రం – 3

**ఊర్ధ్వం ప్రాణమున్నయత్యపానం ప్రత్యగస్యతి।**
**మధ్యే వామనమాసీనం విశ్వే దేవా ఉపాసతే॥**

**ప్రతిపదార్థం:** ఊర్ధ్వమ్‌ప్రాణమున్నయతి – ప్రాణం ప్రాణవాయువును పైకి తీసుకు వెళుతుంది; అపానం ప్రత్యగస్యతి – అపానం ప్రాణవాయువును క్రిందకి తోసేస్తుంది.; మధ్యే – దేహం మధ్యలో; ఆసీనం – ఉన్న, వామనమ్ – జీవుడికి, విశ్వేదేవా: అన్ని ఇంద్రియాలు; ఉపాసతే– నైవేద్యం పెడుతున్నాయి.

**తాత్పర్యం:** శ్వాస పీల్చుకుని, శ్వాస వదులుతున్న జీవుడు దేహం మధ్యలో ఉన్నాడు, అన్ని ఇంద్రియాలూ, దేవతలలాగా, నైవేద్యం పెడుతున్నాయి.

**వివరణ:** ఈ మంత్రంలో శరీరం, మనసులకి భిన్నంగా ఆత్మ ఉందని, దాని స్వరూపం కూడా వీటికి భిన్నంగా ఉందని నిరూపిస్తోంది ఉపనిషత్తు. తర్కం కూడా తోడుగా తీసుకుంది. నైయాయిక, సాంఖ్య దర్శకులు, శాస్త్ర ప్రమాణం లేకుండానే తార్కికంగా ఆత్మ గురించి నిరూపించవచ్చని అంటారు. కాని వేదాంతి అంగీకరించదు దానికి. ఎందుకంటే తార్కికంగా నిరూపించేది ఇంద్రియ గోచరమై ఉండాలి. కాని ఆత్మ ఇంద్రియ అగోచరం, కాని శృతి ప్రమాణాన్ని ఆధారంగా తీసుకుని, తర్కం ఉపయోగించవచ్చు. ఈ మంత్రం ఈ విధంగా చెప్తోంది.

దేహేంద్రియ మనోబుద్ధుల లక్షణాలు ప్రపంచ లక్షణాలతో సరిపోతాయి. దృశ్యం, పాంచభూత సహితం, సగుణం, సవికారం, ఆగమాపాయి (వచ్చిపోయేది) కాబట్టి ప్రపంచంలో దేహేంద్రియ మనోబుద్ధులు కూడా ప్రపంచంలాగా జడం అయి ఉండాలి. కాని మన

అనుభవం అవి జడం కాదని చెప్తోంది. అంటే ఏమిటి అర్థం? ఈ దేహేంద్రియ మనో బుద్ధులని చేతనం చేసేది ఇంకేదో ఉందని తెలుస్తోంది. దాని పేరే ఆత్మ. ఆత్మ ఏం చేస్తుంది? చిదాభాస అనే ప్రతిబింబం ద్వారా సూక్ష్మ శరీరాన్ని కాంతివంతం చేస్తుంది.

ఉదాహరణకు అద్దాన్ని సూర్యుడు ప్రకాశవంతం చేస్తాడు. దానివల్ల అద్దానికి కొత్త హోదా వస్తుంది. సూర్యుని ప్రతిబింబం వల్ల స్వతహాగా కాంతి లేని అద్దం, కాంతి పొంది, చీకటి గదిని ప్రతిబింబింప చేస్తుంది. ఆత్మ అనే సూర్యుడు చిదాభాస అనే ప్రతిబింబాన్ని సూక్ష్మ శరీరం అనే అద్దానికి ఇస్తుంది. అద్దంలాగా సూక్ష్మ శరీరం చైతన్యం పొంది, అరువు తెచ్చుకున్న కాంతితో స్థూల శరీరాన్ని ప్రకాశింపజేస్తుంది. అందువల్ల స్థూల శరీరం రెండవ చిదాభాసని అనుభవిస్తుంది. సూక్ష్మ శరీరం ప్రాథమిక చిదాభాస వల్ల ప్రకాశిస్తుంది. రెండూ ఆత్మ వల్లే ప్రకాశిస్తున్నాయి. కాకపోతే ఒకటి ప్రత్యక్షంగా కాంతి పొందితే, ఇంకోటి పరోక్షంగా పొందుతుంది.

చనిపోయినప్పుడు ఏమవుతుంది? దానికి జవాబుగా అద్దం దగ్గరకి వెళ్దాము. అద్దం తీసేస్తే ఏమవుతుంది? సూర్యుడు పైన ఉన్నాడు కాని చీకటి గదిని ప్రకాశింపజేయలేదు. ఎందుకు? మధ్యస్థాయి మాధ్యమం లేదు. అందువల్ల సూర్యుడు, చీకటి గదికి కాంతిని 'ఆపేసాడు', మాధ్యమం పోయింది కాబట్టి. అలాగే మరణం అప్పుడు స్థూల శరీరాన్ని వదిలి సూక్ష్మశరీరం వెళ్లిపోతుంది. అప్పుడు ఆత్మ వెళ్లినట్టుగా అనిపిస్తుంది. ఎందుకు? స్థూలశరీరానికి చిదాభాసని తీసుకుని, మళ్లీ కాంతిని ఇచ్చే సూక్ష్మ శరీరం లేదు కాబట్టి. మొదటి చిదాభాస సూక్ష్మశరీరంలో ఏర్పడుతుంది. అది లేదు కదా.

ముందు ఆత్మ ఉందని గ్రహించాక, ఆత్మ స్వరూపం కూడా తెలుసుకోవచ్చు. దీని స్వరూపం ఇందాక చూసిన దేహేంద్రియ మనోబుద్ధుల స్వరూపానికి భిన్నంగా ఉంది. అది అదృశ్యం, పాంచభూత రహితం, నిర్గుణం, నిర్వికారం, శాశ్వత చైతన్యం. అందువల్ల దేహేంద్రియ మనోబుద్ధులు చైతన్యం కోసం ఆత్మ మీద ఆధారపడి ఉన్నాయి కాని, ఆత్మ వాటి మీద ఆధారపడి లేదు. ఆత్మ స్వయం ప్రకాశకం అంటే శరీరం వేరు, చైతన్యం వేరు. ఇది మొదటి దశ.

అలా ఆత్మ యొక్క సత్‌రూపాన్ని శాస్త్రం ద్వారా నిరూపించాక, ఆత్మ స్వరూపాన్ని తర్కం ద్వారా ఎలా తెలుసుకోవాలి? దాన్ని లింగ నిర్దేశం అంటారు. ఆ లింగ నిర్దేశం దేహేంద్రియ మనోబుద్ధులు పనిచేసే తీరుతెన్నులు చూస్తే జరుగుతుంది. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు అనే అంగాల్లో, మూడు గుణాలు ఉన్నాయి. కాని ఉపనిషత్తు రెండు ముఖ్యమైన అంగాలని తీసుకుంది. ప్రాణం, అపానం, మామూలుగా వాటిని శ్వాసక్రియ, విసర్జన క్రియలకి

వాడతారు. కాని ఇక్కడ ప్రాణాన్ని శ్వాస వదలటానికి, అపానాన్ని శ్వాస పీల్చటానికి వాడింది. ఇన్ని అంగాల్లో ఈ రెండే ఎందుకు? ఎందుకంటే ఈ రెండు క్రియలు నిర్విరామంగా కొనసాగుతాయి మనలో, మనం గాఢనిద్రలో ఉన్నా కూడా. పురరాజు కోసం సేవకులు నిరంతరం శ్రమిస్తున్నట్టుగా శరీరంలో పురరాజు అయిన ఆత్మ కోసం ఈ ప్రాణ, అపానలు నిరంతరం శ్రమిస్తూ ఉంటాయి.

ఈ మంత్రంలో ఇంకో ముఖ్యమైన విషయం ఉంది. శరీరమనే ఆలయంలో, గర్భగుడిలో ఉన్న ఆత్మ అనే దేవుడికి పంచేంద్రియాలు అనే ఐదుగురు దేవతలు నైవేద్యం సమర్పిస్తారు. ఆ నైవేద్యం శబ్ద, స్పర్శ, రస, రూప, గంధాలు. ఉదాహరణకు – నాకు శబ్దం తెలుస్తోంది. అంటే శబ్దాన్ని చైతన్యమైన నాకు నైవేద్యంగా పెడుతోంది. అంటే నేను చైతన్యాన్ని శరీరాన్ని కాను. ఇది రెండో దశ.

ఈ మంత్రంలో ఆత్మ అంటే ప్రతిబింబ ఆత్మ. అందుకే అయోమయం అవకుండా ప్రతిబింబ ఆత్మను జీవాత్మ అనీ, బింబ చైతన్యాన్ని పరమాత్మ అనీ పేర్కొనవచ్చు. ప్రయాణం చేసేది ప్రతిబింబ ఆత్మ లేదా జీవాత్మ. మనసు, సూక్ష్మ శరీరం, ప్రతిబింబ చైతన్యం కలసి శరీరం (స్థూలశరీరం) నుంచి విడివడటాన్ని మరణం అంటారు. సూక్ష్మశరీర వియోగమే మరణం.

బింబచైతన్యం ఉందా లేదా? బింబచైతన్యం, పరమాత్మ లేని ప్రదేశమే లేదు. అందుకని అది ఉంటుంది. కాకపోతే దాన్ని ప్రతిబింబింపచేసే మాధ్యమమైన మనసు లేదు కాబట్టి తెలియదు.

## వేదాంత విశ్లేషణ

మొత్తం వేదాంతాన్ని 4 దశల్లో చెప్పవచ్చు.

1. ఆత్మ – అనాత్మ వివేకం – మనని రెండు భాగాలుగా విడదీసి చూడటం నేర్చుకోవాలి. పాంచభౌతిక సహిత అనాత్మ జడం. పాంచభౌతిక రహిత ఆత్మ నిత్య చైతన్యం.

ఉదాహరణకు చేయీ, కాంతీ చాలా దగ్గరగా ఉన్నా రెండూ విభిన్నమైనవి. చేతినీ, కాంతినీ విడదీసి చూడటం నేర్చుకోవాలి. అలాగే అచేతన శరీరాన్నీ, చైతన్యాన్నీ విడదీసి చూడటం నేర్చుకోవాలి. చైతన్యానికి ఉన్న ఐదు లక్షణాలను గుర్తుంచుకోవాలి.

2. నేను దేహాన్ని, నేను బుద్ధిని అనే ఆలోచనలను మాని నేను శుద్ధ చైతన్యాన్ని అనుకోగలగాలి.

3. చైతన్యం నాలోనే లేదు, అందరిలోనూ ఉంది. నేను సర్వవ్యాపక చైతన్యాన్ని అని తెలుసుకోవాలి.

4. నాలో చైతన్యం ఉంది అన్న స్థాయి నుంచి చైతన్యంలోనే అన్ని శరీరాలు ఉన్నాయి అన్న స్థాయికి ఎదగాలి.

3వ మంత్రం – మొదటి రెండు దశలను సూచిస్తుంది.

1వ దశ – శరీరం వేరు, చైతన్యం వేరు.
2వ దశ – నేను చైతన్యాన్ని, శరీరాన్ని కాను.

4వ మంత్రం – చివరి రెండు దశలను సూచిస్తుంది.

3వ దశ – నేను సర్వవ్యాపకమైన చైతన్యాన్ని.
4వ దశ – నాలో అన్ని శరీరాలు ఉన్నాయి.

## మంత్రం – 4

**అస్య విస్రంసమానస్య శరీరస్థస్య దేహినః।**
**దేహాద్విముచ్యమానస్య కిమత్ర పరిశిష్యతే। ఏతద్వై తత్ ॥**

**ప్రతిపదార్థం:** శరీరస్థస్య – శరీరంలో ఉన్నటువంటి; అస్య దేహినః – ఈ ఆత్మ ప్రతిబింబ చైతన్యం, విస్రంసమానస్య – ఈ శరీరాన్ని వదిలితే; దేహాద్విముచ్యమానస్య – విశ్రంసమానస్య అర్థమే అంటే ప్రతిబింబ చైతన్యం వదిలితే, కిం అత్ర పరిశిష్యతే – శరీరంలో ఏం మిగులుతుంది? ఏతద్ వైతత్ – అదే నువ్వు అడిగినది.

**తాత్పర్యం:** శరీరంలో ఉన్నటువంటి ఈ ప్రతిబింబ చైతన్యం, అంటే జీవాత్మ ఈ శరీరాన్ని వదిలితే, ఈ శరీరంలో ఏం మిగులుతుంది? అదే నువ్వు అడిగినది.

**వివరణ:** ఆత్మే జీవం ఇస్తోంది శరీరానికి అని చెప్తోంది ఈ మంత్రంలో. దీనికి అన్వయ వ్యతిరేక పద్ధతి ఉపయోగిస్తోంది. ముందు మంత్రంలో అన్వయం వాడింది. అంటే ఆత్మ సమక్షంలోనే జడమైన దేహేంద్రియ మనోబుద్ధులు చైతన్యం పొందుతాయి అని ఉంది. ఇప్పుడు వ్యతిరేక పద్ధతి. ఆత్మ లేకపోతే, జడమైన దేహేంద్రియ మనోబుద్ధులు చైతన్యాన్ని కోల్పోతాయి. అందువల్ల ఆత్మే వీటికి ఆధారం.

అన్వయ వ్యతిరేక పద్ధతి అంటే ఏమిటి? ఉదాహరణకు ఎలర్జీ విషయం తీసుకోండి. తరచు ఎలర్జీ వస్తుంటే, దేనివల్ల వస్తోందో తెలుసుకోవటానికి ఒక్కొక్కటీ తిని చూడాలి. ఫలానా వస్తువు తింటే వచ్చిందని తేలితే అది అన్వయ పద్ధతి. రెండో దశలో – ఆ ఫలానా వస్తువును తినటం ఆపి చూడాలి. అది తినకపోతే ఎలర్జీ పోతే, వ్యతిరేక పద్ధతి.

ఆత్మ ఉంటే శరీరం ఉంది, ఆత్మ లేకపోతే శరీరం మరణించింది. అందువల్ల ఆత్మ శరీర చైతన్యానికి కారణం.

ఈ మంత్రంలో వ్యతిరేక పద్ధతిలో చెపుతోంది. ఆత్మ శరీరంలో చిదాభాసగా వ్యక్తమౌతోంది. మరణం అప్పుడు అతను పోయాడు అంటాము. పోయేది ఎవరు? స్థూల శరీరం పడిపోతుంది, బింబచైతన్యం సర్వవ్యాపకం. కాబట్టి ఈ రెండూ కదలవు. సూక్ష్మ శరీరం + కారణ శరీరం, ఒక లోకం నుంచి ఇంకో లోకానికి వెళ్తాయి. వాటితోపాటు ప్రతిబింబ చైతన్యం, లేదా చిదాభాస వెళుతుంది. ప్రతిబింబ మాధ్యమంతో పాటు ప్రతిబింబ చైతన్యం వెళ్ళిపోతుంది.

ఈ రెండూ వెళ్లిపోతే, శరీరంలో ఏం మిగులుతుంది? ఇది ప్రశ్న కాదు, ఏమీ మిగలదు అన్న జవాబు ఇమిడి ఉంది. దీన్ని ఇంగ్లీషులో రిటారికల్ క్వశ్చన్ అంటారు. చావుబతుకుల్లో ఉన్న వ్యక్తిని నన్ను గుర్తుపట్టారా అంటే ప్రాణం పోతే లోపల జవాబు చెప్పే వ్యక్తి పోయాడన్నమాట. పరోక్షంగా నీకు చైతన్యం ఇచ్చిన ఆత్మనే నువ్వు తెలుసుకుందామనుకుంటున్నావు అని యమధర్మరాజు చెప్తాడు.

**మంత్రం – 5**

**న ప్రాణేన నాపానేన మర్త్యో జీవతి కశ్చన।**
**ఇతరేణ తు జీవన్తి యస్మిన్నేతావుపాశ్రితౌ॥**

**ప్రతిపదార్థం:** కశ్చన – ఏ; మర్త్యః – మనిషీ; ప్రాణేన – ప్రాణం చేతనే; అపానేన – అపానం చేతనే; న జీవతి – జీవించదు; ఏతౌ – ఈ రెండూ, యస్మిన్ – ఏ ఆత్మ మీద; ఉపాశ్రితౌ– ఆధారపడి ఉన్నవో; ఇతరేణ తు – అన్నీ; జీవన్తి – జీవిస్తాయి.

**తాత్పర్యం:** ఏ మనిషీ ప్రాణం చేత, అపానం చేత జీవించదు. ఏ ఆత్మ మీద ఆధారపడి ఈ ప్రాణ అపానాలు పనిచేస్తున్నాయో, దానిని ఆధారం చేసుకునే అన్నీ జీవిస్తాయి.

**వివరణ:** ముందు రెండు మంత్రాలను బట్టి ఇక్కడ ఒక అనుమానం రేకెత్తే అవకాశం ఉంది. అన్వయ వ్యతిరేకం ప్రకారం వాటిల్లో – ఆత్మ ఉంటేనే శరీరం చైతన్యవంతంగా ఉంటుందనీ, ఆత్మ లేకపోతే, శరీరం మరణిస్తుందనీ చూసాము.

పూర్వపక్షి వాదన వేరేగా ఉంది. దేహేంద్రియ మనోబుద్ధులని జడం లేదా చైతన్యం చేసేది ఆత్మ కాదు, ప్రాణం అని అతని వాదన. శంకరాచార్యులు ఆ వాదనని ఖండిస్తున్నారు. ప్రాణం కూడా జడమే. అది శరీరమనే భవనంలో ఒక అంగం మాత్రమే. అలాంటప్పుడు అది ఎలా చైతన్యాన్ని ఇవ్వగలదు? ఒక భవనంలోని భాగాలకు చైతన్యం ఉంటుందా?

వాటికి స్వతహాగా ఉనికి ఉండదు. ఉదాహరణకు ఆ భవనంలోని కిటికీని తీసుకుంటే, దానికి విడిగా ఉనికి లేదు, ఇంటికి చైతన్యాన్ని ఇవ్వలేదు. దాన్ని ఆ ఇంటి యజమానే వాడగలడు.

ఇంతకుముందు చెప్పిన అద్దం, సూర్యుడు ఉదాహరణను మళ్లీ చూద్దాము. సూర్యకాంతిని గదిలో ప్రతిబింబింప చేయటానికి రెండు కావాలి. అద్దం, ప్రతిబింబిత సూర్యకాంతి.

అద్దం ఉంటే ఆ గది కాంతివంతంగా ఉంది. అద్దం లేకపోతే గదిలో కాంతి లేదు. అంటే అద్దం ముఖ్యం అనచ్చా? ఇక్కడ అన్వయ వ్యతిరేక పద్ధతి పనిచేయదు. ఎందుకు? అద్దానికి కాంతి స్వతహాగా లేదు. అది ముఖ్యమైన పాత్ర వహిస్తుంది నిజమే కాని ఎరువు తెచ్చుకున్న కాంతితో ప్రకాశింపజేస్తోంది. అసలు ప్రభావం సూర్యుడిదే.

ఇప్పుడు అద్దం స్థానంలో ప్రాణంని చూస్తే అర్థమవుతుంది. ప్రాణం కూడా అద్దంలా జడమే. దాని పాత్ర ఏమిటి? ఆత్మ నుంచి చైతన్యాన్ని ఎఱువు తీసుకుని, శరీరానికి చైతన్యం ఇస్తోంది. ఆత్మ లేకపోతే దాని ప్రభావం లేదు.

ఆత్మమీదే శరీరం ఆధారపడింది కాని ప్రాణం మీద, అపానం మీద కాదు.

### మంత్రం – 6

**హన్త త ఇదం ప్రవక్ష్యామి గుహ్యం బ్రహ్మ సనాతనమ్।**
**యథా చ మరణం ప్రాప్య ఆత్మా భవతి గౌతమ॥**

**ప్రతిపదార్థం:** గౌతమ – నచికేతా; హన్త – సరే; గుహ్యం – రహస్యమైనది, సనాతనం – నాశనం లేనిది, బ్రహ్మ – ఆత్మ గురించి; యథా భవతి – ఏం జరుగుతుంది? మరణం ప్రాప్య – మరణం తర్వాత; ఆత్మ – అజ్ఞాని జీవాత్మకి; ఇదం తే – దీనిని నీకు; ప్రవక్ష్యామి– చెపుతాను.

**తాత్పర్యం:** హే నచికేతా, నేను రహస్యమైన ఆత్మ స్వరూపం లేదా నాశనం లేని ఆత్మ గురించి ఇంకాస్త చెప్తాను. అలాగే మరణం తర్వాత, అజ్ఞాని ఆత్మ ప్రయాణం గురించి కూడా చెప్తాను.

**వివరణ:** ఇక్కడ ఆత్మ పదం రెండు అర్థాల్లో వాడబడింది. నేను ఆత్మ స్వరూపం గురించి చెప్తాను అన్నప్పుడు సామాన్య చైతన్యం, బింబ చైతన్యం లేదా సర్వవ్యాపకమైన బ్రహ్మ గురించి చెప్తున్నాడు. శరీరం నశించాక ఆత్మ ప్రయాణం గురించి చెప్తానన్నప్పుడు చైతన్యం గురించే కాని మనసు ప్రతిబింబించే విశేష చైతన్యం లేదా ప్రతిబింబ చైతన్యం గురించి మాట్లాడుతున్నాడు. ఈ మంత్రం ద్వారా నచికేతుడు అడిగిన ప్రశ్నకు జవాబు దొరుకుతుంది.

**యేయం ప్రేతే విచికిత్సా మనుష్యే**
**ఉ_స్తీత్యేకే నాయమస్తీతి చైకే** – కఠ 1.1.20

ఆత్మ గురించి ఇంత చెప్పాక ఇంకా గుహ్యం అని ఎందుకు అంటున్నాడు యమధర్మరాజు? అది చాలా సూక్ష్మమైనది కాబట్టి, బోధ అయ్యాక కూడా రహస్యంగా మిగులుతుంది.

మరణం తర్వాత అజ్ఞాని ఆత్మ ప్రయాణం గురించే ఎందుకు? జ్ఞాని ఆత్మ సంగతేమిటి? జ్ఞానికి ప్రయాణం లేదు. అతని జ్ఞానం వల్ల ఆ జ్ఞానాగ్నిలో సంచిత కర్మలు దగ్ధమైపోతాయి. అకర్తా, అభోక్తాగా కర్మలు చేస్తాడు కాబట్టి ఆగామి కర్మలు అంటవు. ప్రారబ్ధ కర్మ ముగియగానే ఈ శరీరం రాలిపోతుంది. కాబట్టి పునర్జన్మ ఉండదు, పునర్జన్మ కోసం ప్రయాణం ఉండదు. అతని స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు, స్థూల, సూక్ష్మ, కారణ ప్రపంచాల్లో ఐక్యం అయిపోతాయి. అతను జ్ఞానం పొందగానే జీవన్ముక్తి పొంది, మరణం తర్వాత విదేహ ముక్తి పొందుతాడు.

## మంత్రం – 7

**యోనిమన్యే ప్రపద్యన్తే శరీరత్వాయ దేహినః।**
**స్థాణుమన్యేఽ_నుసంయన్తి యథాకర్మ యథాశ్రుతమ్॥**

**ప్రతిపదార్థం:** అన్యే దేహినః – కొందరు జీవులు; శరీరత్వాయ – సరియైన జీవనం పొందటం కోసం, యోనిమ్ – యోనిని; ప్రపద్యన్తే – ఆశ్రయిస్తారు; స్థాణుమ్ అన్యే – మరికొంతమంది అజ్ఞానులు చెట్లలా, అను సంయన్తి – పుడతారు, యథా కర్మ – కర్మ ప్రకారం; యథా శ్రుతమ్ – పూర్వజన్మ సంస్కారం మేరకు.

**తాత్పర్యం:** తర్వాత కొందరు జీవులు సరియైన శరీరాన్ని పొందటానికి యోనిని ఆశ్రయిస్తారు. మరికొంతమంది అజ్ఞానులు చెట్లలా పుడ్తారు. వారి కర్మ ప్రకారం, వారి పూర్వజన్మ సంస్కారం ప్రకారం పునర్జన్మ పొందుతారు.

**వివరణ:** యమధర్మరాజు, తాను చెప్తానన్న రెండు విషయాల్లో, రెండోది ముందు చెప్తున్నాడు, దీని గురించి టూకీగా చెప్తాడు కాబట్టి. మనకి కావాల్సింది జ్ఞాని గురించి కాని, అజ్ఞాని గురించి కాదు.

ఈ మంత్రం చాలా ముఖ్యమైన మంత్రం. ఎందుకంటే ఈ మంత్రం పునర్జన్మకు ప్రమాణం. పునర్జన్మ గురించి నిరూపించే ఆధారం లేదు. ఇది అపౌరుషేయ విషయం కాబట్టి విజ్ఞానశాస్త్రానికి అందుబాటులో లేదు. విజ్ఞాన శాస్త్రం ఆత్మను అంగీకరించాలంటే ఏదో శరీరాన్ని వదులుతోందని నిరూపించాలి. ప్రయోగాత్మకంగా నిరూపించలేము. కాకపోతే శాస్త్రం చెపితే, దానికి దోహదం చేస్తూ చెప్పవచ్చు. దీన్ని సంభావనాయుక్తి అంటారు.

'నాలుగేళ్లకే సంగీత స్వరాలు గుర్తుపట్టే చిన్న పాప!' లాంటి వార్తలు చదివితే పునర్జన్మ నమ్మాల్సి ఉంటుంది.

జ్ఞాని శరీరానికి ప్రయాణం లేదని ఇంతకుముందే చూసాము. అజ్ఞాని మరణం తర్వాత సూక్ష్మ, కారణ శరీరాలు, ప్రతిబింబ చైతన్యం లేదా చిదాభాస చైతన్యంతో కలిసి ప్రయాణం చేస్తాయి. ఎక్కడికి? ఇంకో శరీరం వైపుకి. అది దేవతలది అవచ్చు, పశువులది అవచ్చు. చెట్లది కూడా అవవచ్చు.

దేనివల్ల ఈ శరీరం? ఒక వ్యక్తి మరణించాక, దేవుడు ఆ ప్రతిబింబ చైతన్యాన్ని తీసుకుని, అటూ ఇటూ చూసి, తనకి తోచిన దాంట్లో వేస్తాడా? అలా చేస్తే దేవుడు పక్షపాతి అవుతాడు. మరి ఎలా పుడుతాడు? మన పుణ్య, పాప కర్మ ఫలాలను (ఇప్పుడు, ముందు జన్మలో చేసినవి) అనుభవించటానికి దానికి తగ్గ శరీరం పొందుతాము.

**ఉర్ధ్వం గచ్ఛంతి సత్వస్థాః మధ్యే తిష్ఠంతి రాజసాః ।**
**జఘన్యగుణవృత్తిస్థాః అధో గచ్ఛంతి తామసాః ॥** – గీత 14.18

గీతలో ఈ శ్లోకం, ఈ మంత్రాన్నుంచే వచ్చింది. ఒక శరీరం వదిలాక, ఇంకో శరీరం పొందితే గానీ అనుభవించలేము. స్వర్గలోక ఫలాలను అనుభవించటానికి స్వర్గలోక శరీరం, స్వప్నంలో అనుభవించటానికి స్వప్నలోక శరీరం పొందాలి. స్థూల శరీరం ద్వారానే వ్యవహారం నడపగలము. కొంతమంది స్థాణువుల్లా పుట్టారు. స్థాణువు అంటే స్థావరం కాదు. స్థావరం అంటే రాయి. అది సుఖదుఃఖాలను అనుభవించలేదు.

మరణించిన ఎన్నాళ్లకు పొందుతారు? కర్మఫలం ఎప్పుడు పండుతుందో చెప్పలేము. పైగా శరీరం రాలగానే కాల సిద్ధాంతం మారుతుంది. ఉదాహరణకు స్వప్నంలోనే పిల్లలు, మనవలు పుట్టారు. దేశాలు తిరిగి వస్తాము. అందుకని ఎప్పుడంటే మరుక్షణమే పుట్టవచ్చు. మరో మిలీనియం తర్వాత పుట్టవచ్చు.

అనుకోకుండానా, నియమమా? పుట్టుక అనుకోకుండా జరగదు అంటున్నాడు యమధర్మరాజు. ఒక కుటుంబంలో పుడితే, ఆ కుటుంబంలోని వారందరూ అలా పుట్టాలని రాసి ఉంటుంది.

**మత్తః స్మృతిర్ జ్ఞానమపోహనం చ ।** – గీత 15.15

మతిమరుపు, జ్ఞాపకశక్తీ రెండూ ఇస్తాడు దేవుడు. ఏది గుర్తుంచుకోవాలి, ఏది మర్చిపోవాలి? అది తెలుసుకోవటమే జ్ఞానం. భగవానునికి మన కర్మలు తెలుసు. అతను సర్వజ్ఞుడు. మనకి తగ్గట్టుగా ఇస్తాడు. యథా కర్మ, యథాశ్రుతం – మన కర్మకు తగ్గట్టు, మన ఉపాసనకు

తగ్గట్టు, శ్రుతం అంటే మామూలుగా ఉపాసన. కాని శంకరాచార్యులు దీనికి అర్థం పూర్వజన్మ సంస్కారం అని చెప్తారు. ఎందుకంటే ఉపాసన కర్మకన్నా ఎక్కువ. అజ్ఞాని ఉపాసన చేయలేడు. సంస్కారం అంటే పదే పదే తలచుకోవటం. మరణం అప్పుడు దేన్ని తలచుకుంటూ మరణిస్తే దానికి తగ్గ జన్మ పొందుతాడు తర్వాత.

**యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః** – గీత 8.6

ఈశ్వర చింత చేస్తే ఈశ్వర ఐక్యం కలుగుతుంది. దీంతో యమధర్మరాజు చెప్తానన్న రెండో విషయం ముగుస్తుంది. ఇప్పుడు మొదటిది.

**మంత్రం – 8**

**య ఏష సుప్తేషు జాగర్తి కామం కామం పురుషో నిర్మిమాణః।**
**తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే।**
**తస్మింల్లోకాః శ్రితాః సర్వే తదు నాత్యేతి కశ్చన। ఏతద్వై తత్ ॥**

**ప్రతిపదార్థం:** య ఏష – ఇవి; పురుషః – సాక్షి చైతన్యం ఆత్మ; సుప్తేషు – తక్కినవి పడుకున్నప్పుడు; జాగర్తి – మేలుకుని ఉంటుందో; కామం కామం – తనకు నచ్చినట్టుగా; నిర్మిమాణః – ఇంకో ప్రపంచాన్ని సృష్టిస్తారో; తదేవ శుక్రం – అదే శుద్ధం; తత్ బ్రహ్మ – అదే ఆత్మ; తదేవ అమృతముచ్యతే – దీన్ని అమరం అంటారు; సర్వే లోకాః – అన్ని లోకాలు, జగత్; తస్మిన్ శ్రితాః – అందులోనే ఉన్నాయి; కశ్చన తత్ ఉ న అత్యేతి – దాన్ని దాటి ఏదీ లేదు; ఏతద్ వై తత్ – అదే నువ్వు అడిగిన తత్త్వం.

**తాత్పర్యం:** ఏది అన్నీ పడుకున్నప్పుడు మేలుకుని ఉంటుందో, ఏది స్వప్నంలో తనకు నచ్చినట్టుగా ప్రపంచాన్ని సృష్టిస్తుందో, అది సాక్షి చైతన్యం ఆత్మ. అన్ని లోకాలూ దానిలోనే ఉన్నాయి. దాన్ని దాటి ఏదీ లేదు. అదే నువ్వు అడిగిన తత్త్వం.

**వివరణ:** ఇది మరో మహావాక్యం మంత్రం. అందుకని చాలా ముఖ్యమైన మంత్రం. ముందు మంత్రంలో అజ్ఞాని ఆత్మ ప్రయాణం గురించి చెప్పాక, మళ్ళీ ఆత్మ స్వరూపానికి వస్తున్నాడు యమధర్మరాజు.

7. **ఏకాత్మ** – బ్రహ్మ ఏమిటి? అందరిలో ఉండే చైతన్యం. అది ఏం చేస్తుంది? ఎప్పుడూ మేలుకుని ఉంటుంది. ఇంద్రియాలలాగా కాదు. అవి సుషుప్తిలో పనిచేయవు. చెవులు తెరిచి ఉన్నా వినబడదు. శరీరం మీద దోమ కుద్తున్నా తెలియదు. మనసు కూడా సుషుప్తిలో పనిచేయదు. కాని చైతన్యం ఎప్పుడూ ప్రకాశిస్తుంటుంది. మనసుకి ఏం తెలియనప్పుడు

నాకు ఏమీ తెలియలేదు అంటాం. ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుని సాక్షీభూతంగా చూసేది ఆత్మ.

వేదాంత సూత్రం ఏమిటంటే, మనకు దగ్గరగా ఉన్న వస్తువును మనం సబ్జెక్ట్‌గా అంటే 'నేను'గా పొరపాటుపడ్తాము. ఉదాహరణకు నీ ముందు ఏమున్నాయి అంటే అన్నీ చెప్తాము కళ్ళజోడు గురించి తప్ప. 'నేను' లో కళ్ళజోడుని కలిపేసుకుంటాము. అలాగే మనసును నేనుతో కలిపేసుకుంటాము. మనసుతో కలిసిన నేను ప్రమాతా (తెలుసుకునే వ్యక్తి) అవుతుంది. అది ప్రమాణం ఉపయోగించి ప్రమేయం గురించి తెలుసుకుంటుంది. కాని నేను ప్రమాత–ప్రమేయం – ప్రమాణం ఈ మూడింటికి అతీతంగా ఉన్న సాక్షి చైతన్యాన్ని అంటే నేనులో మనసు కూడా లేదన్నమాట.

నేను స్వప్నంలో, ఇంకో ప్రపంచాన్ని సృష్టిస్తాను, నాకు నచ్చినట్టుగా. దేహేంద్రియ మనోబుద్ధులు శుద్ధం కాకపోవచ్చు కాని నేను నిత్య, శుద్ధ చైతన్యాన్ని. ఈ వాక్యం మహావాక్యం.

ఆత్మ గురించి నాలుగు దశల్లో తెలుసుకుంటాము.

1. ఆత్మ శరీరంలో ఉంది.
2. ఆత్మ శరీరం బయటా ఉంది.
3. ఆత్మ శరీరం లోపలా, బయటా అంతటా ఉంది. అది నువ్వే.
4. అన్ని శరీరాలూ ఆత్మలోనే ఉన్నాయి.

తదేవ అమృతత్వముచ్యతే. దీన్నే అమృతత్వం అంటారు.
న హన్యతే హన్యమానే శరీరే – శరీరం ఉన్నా పోయినా చైతన్యం పోదు.

సర్వేలోకః తస్మిన్ శ్రితా – అన్ని శరీరాలూ ఆత్మలో ఉన్నాయి.

ఎలా మొదలుపెట్టాం? చైతన్యం శరీరంలో ఉంది అన్నాం. ఎలా ముగించాం? అంతటా చైతన్యం అన్నాం. శరీరం చైతన్యంలో ఉంది. ఈ శరీరంలోనే కాదు అన్ని శరీరాల్లోనూ ఉంది. దాన్ని దాటి ఏదీ లేదు. ఆ చైతన్యమే బ్రహ్మ. అది నాలో ఉన్న ఆత్మ. ఆ ఆత్మే నేను. ప్రపంచం, నాలో పుట్టి, నాలో ఉండి, నాలో లీనమైపోతుంది అంటాడు జ్ఞాని. స్వప్నం దీనికి ఉదాహరణ.

నేనొక అల్పజీవిని ఈ ప్రపంచంలో – సంసారం
ఈ ప్రపంచం నాలో ఉంది. – మోక్షం

చిన్న మార్పు దృక్పథంలో అంతే. అదే నువ్వు తెలుసుకోవాలనుకున్నది. ఇది మాత్రం మర్చిపోవటం లేదు యమధర్మరాజు. నిరంతర ప్రయాణం – సంసారం. సంసారం అంటే

నిరంతర కదలిక. సాఫీగా సాగేది కాదు. ఒడిదుడుకులతో కూడినది. జీవాత్మ, పరమాత్మ ఐక్యం చూపే ఒక మహా వాక్యం ఇది. జీవ–జగత్–ఈశ్వర అనే ముక్కోణాన్ని ఒక్క ఆత్మలో కలిపి చూపించే వేదాంత బోధ అంతా ఈ ఒక్క మంత్రంలో చూపించింది ఉపనిషత్తు. ముందు జీవాత్మ, పరమాత్మ ఐక్యం చూపింది. తర్వాత జగత్తును మిథ్య అనాత్మగా, చూపించటం వల్ల జగత్, జీవ, పరమాత్మ మూడు కలిసి ఏకాత్మ లేదా బ్రహ్మగా నిరూపించబడ్డాయి. శంకరాచార్య దీన్ని **ఏకాత్మ విజ్ఞానం** అంటారు. ఇది జీవాత్మ, పరమాత్మ ఐక్యం చూపటమే కాక జగత్తును మిథ్యగా చూపుతోంది.

## మంత్రం – 9

**అగ్నిర్యథైకో భువనం ప్రవిష్టో రూపం రూపం ప్రతిరూపో బభూవ।**
**ఏకస్తథా సర్వభూతాన్తరాత్మా రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ॥**

**ప్రతిపదార్థం:** యథా – ఎలా; ఏకః అగ్నిః – ఒకటే అగ్ని; భువనం ప్రవిష్టః – జగత్ అంతటా ఉంది. రూపం రూపం – అనేక వస్తువుల్లో; ప్రతిరూపః – ఆయా రూపాలలో, బభూవ – విలసిల్లుతుందో; తథా – ఆ విధంగానే; సర్వభూతాన్తరాత్మా – అన్ని జీవుల్లో ఉన్న ఆత్మ; ఏకః – ఒకటే అయినప్పటికీ; రూపం రూపం – వివిధ జీవరాశుల్లో; ప్రతిరూపః – ఆయా రూపాల్లో (ప్రతిబింబిస్తోంది); బహిశ్చ – బయట కూడా.

**తాత్పర్యం:** ఒకే అగ్ని ప్రపంచంలోని అనేక రకాల వస్తువులలో ఆయా రూపాల్లో ఎలా విరాజిల్లుతుందో, అలాగే సమస్త జీవుల్లోనూ ఉన్న ఆత్మ ఒకటే అయినప్పటికీ అనేక ప్రాణుల్లో అనేక రూపాల్లో విరాజిల్లుతోంది. అలాగే ఆ రూపాలకు బయట కూడా ఉంది.

**వివరణ:** ఇక్కడ్నుంచీ అన్ని మంత్రాలూ బ్రహ్మ నిర్వచనాలే. బ్రహ్మను చైతన్యంగా నిర్వచించాక, పదే పదే చెప్పటం ఎందుకు అనిపించవచ్చు. అన్నిసార్లు ఎందుకు చెప్పాలో శ్రీ శంకరాచార్యులు తన భాష్యంలో వివరిస్తారు. బ్రహ్మ మీద ఉన్న అపోహలు ఎన్నో.

8. **అభిన్నం** – నేను వ్యష్టి జీవాత్మని అని అనుకునే బదులు, నేను అధిష్ఠానం బ్రహ్మ, నాలో జగత్తు లయమవుతుంది అని తెలుసుకోవాలి.

ఏకం – బ్రహ్మ సృష్టిలో అన్నింటినీ ప్రకాశింపజేస్తోంది. అది రూపం ఉన్న శరీరంలో ఉంది. కాని దానికి రూపం లేదు. ఒక ఉదాహరణ కాంతి. కాంతి ఈ గదిలో అణువు అణువునా ఉంది. నాలో ఉంది. పుస్తకంలో ఉంది. అందుకని ఒకచోట పరిమితమవలేదు. శరీరం–పరిమితం (రూపంలో, ఒక ప్రదేశంలో) కాంతి–అపరిమితం (సర్వవ్యాపకం). అపరిమితమైన కాంతి రూపం ఉన్న వస్తువుని ప్రకాశింపచేస్తుంది.

కాంతి చేతి మీద ఉందని ఎలా తెలుసు? కాంతి లేకపోతే చూడలేము. కాంతిని చేయిదాటి గుర్తించలేకపోవటం వల్ల, చేతికే పరిమితం చేస్తున్నాము. కాంతిని విభజిస్తున్నాము. శరీరానికీ, శరీరానికీ మధ్య కాంతి లేదు అంటున్నాము. అద్వైతాన్ని ద్వైతంగా, అపరిచ్ఛిన్నాన్ని పరిచ్ఛిన్నంగా చూస్తున్నాము. ఇదే చైతన్యానికి జరిగింది అంటున్నాడు యమధర్మరాజు.

చైతన్యం సర్వవ్యాపకం, నిరాకారం, అఖండం, అద్వైతం. కాని ఎన్ని శరీరాలుంటే అన్ని ఆత్మలున్నాయని, శరీరానికీ, శరీరానికీ మధ్య ఆత్మ లేదని పొరపాటు పడుతున్నాము. ఆత్మకు బహుత్వం, ఒక స్థానం, ఒక పరిమితి ఆపాదిస్తున్నాము. ఆత్మకు ఈ మూడు లక్షణాలు లేవనటానికి యమధర్మరాజు మూడు ఉదాహరణలు తీసుకున్నాడు – అగ్ని, వాయు, సూర్యుడు. ఈ మంత్రంలో అగ్నితత్త్వం తీసుకున్నాడు.

అగ్నికి కూడా రూపం లేదు. సర్వవ్యాపకం. వాతావరణం వేడిగా ఉంది. చెమట పోస్తోంది అంటాం. అది అగ్నితత్త్వం. దానికి రూపం లేదు. కాని ఇటువంటి అగ్ని కర్రను కాలుస్తుంటే అందులో కనబడుతుంది. అగ్ని కర్రతో సన్నిహితంగా ఉండటంలో దాని లక్షణాలను అగ్నికి ఆపాదిస్తున్నాము. అగ్ని కర్రలోనే ఉంది అనుకుంటాము. అగ్ని కర్ర బయట కూడా ఉంది. దానికి పది అడుగుల దూరంలో ఉన్నా వేడి తెలుస్తుంది. అజ్ఞాని అగ్ని కర్రలో ఉంది అంటాడు, ఆత్మ శరీరంలో ఉంది అన్నట్టుగా. జ్ఞాని, అగ్ని అంతటా ఉంది అంటాడు, అంతటా ఉన్న ఆత్మ శరీరంలో ప్రకటితమయినట్టుగా ఉందన్నమాట.

ఏకః అగ్నిః – ఒకటే అగ్ని, దానికి రూపం లేదు, ప్రదేశం లేదు. అందుకే సర్వవ్యాపకం. జగత్తు అంతా ఉంది. ఏ రూపంలో ఉంటే ఆ రూపంగా కనిపిస్తుంది. అలా సర్వగత ఆత్మ అనేకంగా, పరిభిన్నంగా, బహుత్వంగా కనిపిస్తుంది. కాని అగ్ని ఎలా ఏకమో ఆత్మ కూడా ఏకం.

## మంత్రం – 10

**వాయుర్యథైకో భువనం ప్రవిష్టో రూపం రూపం ప్రతిరూపో బభూవ।**
**ఏకస్తథా సర్వభూతాన్తరాత్మా రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ॥**

**ప్రతిపదార్థం:** యథా – ఎలా; ఏకః వాయుః – ఒకటే వాయువు; భువనం ప్రవిష్టః జగత్తు అంతా ఉంది; రూపంరూపం – అనేక వస్తువుల్లో; ప్రతిరూపః – ఆయారూపాల్లో; బభూవ– విలసిల్లుతుందో; తథా – ఆ విధంగానే; సర్వభూతాంతరాత్మా – అన్ని జీవుల్లో ఉన్న ఆత్మ; ఏకః – ఒకటే అయినప్పటికీ; రూపం రూపం – వివిధ జీవరాసుల్లో; ప్రతిరూపః – ఆయా రూపాల్లో; బహిశ్చ – బయట కూడా.

**తాత్పర్యం:** ఒకే వాయువు ప్రపంచంలోని అనేక రకాల వస్తువులలో ఆయా రూపాల్లో ఎలా విరాజిల్లుతుందో, అలాగే సమస్త జీవుల్లోనూ ఉన్న ఆత్మ ఒక్కటే అయినప్పటికీ, అనేక ప్రాణుల్లో అనేక రూపాల్లో విరాజిల్లుతోంది. అలాగే ఆ రూపాలకు బయట కూడా ఉంది.

**వివరణ:** అంతా ముందు మంత్రంలో ఉన్న పదాలే. అక్కడ అగ్ని ఉంటే, ఇక్కడ వాయువుంది. అంతే తేడా. ఆత్మకి బహుత్వం ఉందన్న అపోహని పోగొడుతుంది ఉపనిషత్తు ఈ మంత్రాల్లో.

సర్వగతం – వాయుతత్త్వం ఒకటే అయినా అది విభిన్న అన్నమయ కోశాలలోకి ప్రవేశించినప్పుడు, సర్వవ్యాపకమైన వాయుతత్త్వం, ప్రాణమయ కోశంగా ఉంటుంది. అంటే వాయువుకు ఆకారం, ప్రదేశం లేకపోయినా, శరీరంలోకి వెళ్ళేసరికి అన్నమయ కోశం ఆకారం పొందుతుంది. ఒక ప్రాంతానికి పరిమితమవుతుంది. అలాగే ఒక జీవి మరణించినప్పుడు సూక్ష్మ శరీరంలో భాగాలయిన ప్రాణమయ కోశం ప్రయాణం చేస్తుంది.

ఒక్కముక్కలో చెప్పాలంటే, అగ్నికి రూపం లేకపోయినా, ఏ రూపంలో ఉన్న వస్తువులో ఉంటే ఆ రూపం దాల్చినట్టుగా, వాయువు కూడా రూపం లేకపోయినా ఆ వస్తువు రూపంలో ఉన్నట్టు తోస్తుంది. కాని ఆ వస్తువుల బయట కూడా ఉంది. వాయువు కూడా ఏకం, అభిన్నం, సర్వవ్యాపకం.

## మంత్రం – 11

**సూర్యో యథా సర్వలోకస్య చక్షుః న లిప్యతే చాక్షుషైర్బాహ్యదోషైః।**
**ఏకస్తథా సర్వభూతాన్తరాత్మా న లిప్యతే లోకదుఃఖేన బాహ్యః॥**

**ప్రతిపదార్థం:** యథా – ఎలా; సూర్యః – సూర్యుడు; సర్వలోకస్య – అందరియొక్క; చక్షుః – దృశ్యానికి ఆధారమైనవాడు; చాక్షుషైః – చూపుకు సంబంధించిన; బాహ్య దోషైః – బాహ్యమైన దోషాలచేత; నలిప్యతే – బోధింపబడదో; తథా – అలాగే; ఏకః – ఒకే; సర్వభూతాంతరాత్మా– సకల జీవులలోని ఆత్మలోక దుఃఖేన – ప్రపంచపు దుఃఖాలచేత; న లిప్యతే – భాధింపబడదు; బాహ్యః – అసంగం, అతీతం.

**తాత్పర్యం:** అందరి దృశ్యవీక్షణకు ఆధారంగా ఉన్నవాడు సూర్యుడు. కాని చూపు దోషాలు, బాహ్యమైన లోటుపాట్లు సూర్యుణ్ణి బాధించవు. అదే విధంగా ఒకటే అయిన ఆత్మ అందరిలోనూ కొలువై ఉన్నప్పటికీ ప్రపంచపు దుఃఖాల చేత బాధింపబడదు. కాలుష్యం అంటదు. ఆత్మ అసంగం.

**వివరణ:** ముందు రెండు ఉదాహరణలూ ఆత్మ ఏకం సర్వగతం అని నిర్వచించాయి. ఇది సూర్య ప్రకాశ దృష్టాంతం. ఈ ఉదాహరణ ద్వారా, సర్వగత ఆత్మను సృష్టిలో ఏదీ కలుషితం చేయలేదని నిరూపిస్తున్నాడు యమధర్మరాజు. సూర్యుని అసంగత్వ లక్షణం వివరిస్తున్నాడు.

9. **అసంగత్వం** – అసంగం – ఆత్మకు అనాత్మ అశౌచం అంటితే అది ఎప్పటికీ సంసారి అవుతుంది, శరీర త్రయాన్ని ఎన్నటికీ శుద్ధి చేయలేదు. ఆత్మ పారమార్థిక సత్యంకి చెందినదైతే, అనాత్మ వ్యవహారిక లేదా ప్రాతిభాసిక సత్యానికి చెందినది. అందుకని వ్యావహారిక లేదా ప్రాతిభాసిక సత్యంలో ఏ అశుద్ధం ఉన్నా కూడా అది పారమార్థిక సత్యాన్ని, ఎంత సమీపంలో ఉన్నా, అంటదు. ఆత్మ ఎప్పటికీ శుద్ధం, అనాత్మ ఎప్పటికీ అశుద్ధం. అందుకని మహాత్మ, దురాత్మ, దుష్ట ఆత్మలంటూ విడివిడిగా ఏమీ లేవు.

అందుకని ఆత్మ అసంగమైనది. అది అనాత్మతో కలిసి ఉన్నట్టుగా ఉంటుంది కాని నిజంగా కాదు. సూర్యకాంతి గంగాజలం మీద, మురికి నీళ్లమీదా ఒక్కలాగే ప్రకాశిస్తుంది. కాంతి పుస్తకం మీద మట్టిని పొందదు. సూత్రం – ప్రకాశ్యగుణః ప్రకాశకం న లిప్యతి – ప్రకాశింపబడే వస్తువుల గుణాన్ని, ప్రకాశింపచేసేది పొందదు. కాంతి నీరు మీద పడ్డా, తడి అవదు. అగ్ని మీద పడ్డా వేడి అవదు. చైతన్యం కాలుష్యం ఉన్న శరీరంలో, రాగద్వేష కామక్రోధాలున్న మనసులో ఉంది.

**న మే ద్వేష రాగౌ న మే లోభ మోహౌ**
**మదో నైవ మే నైవ మాత్సర్యభావః।**
**న ధర్మో న చార్థో న కామో న మోక్షః**
**చిదానందరూపః శివోహం శివోహం॥** – నిర్వాణ షట్కమ్

సూర్యకాంతి ప్రతి వస్తువుని ప్రకాశింపజేస్తుంది అంటే కనబడేలాగా చేస్తుంది.

**యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః।**
**క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత॥** – గీత 13.33

సూర్యుడు ప్రపంచం అంతా వ్యాపించినా కాలుష్యం పొందదు. కాలుష్యం రెండు రకాలు. 1. లోపలి దోషం – అది కంటికి కనబడదు. 2. బాహ్య దోషం – దుమ్ము, దుర్గంధం వగైరా. కొన్ని చూడకూడదని శాస్త్రం చెపుతుంది. నిషిద్ధమైనవి చూడటం వల్ల పాపం వస్తుంది. కాని సర్వభూత అంతరాత్మ సన్నిహితంగా ఉన్నా, కాలుష్యం తీసుకోదు. రాగద్వేషాలు, అశుద్ధి కూడా దానిని పాడుచేయవు. సినిమా తెర సినిమాను చూపిస్తుంది. సినిమాలో అగ్ని ఉన్నా కాలదు, నీరు ఉన్నా తడవదు.

బాహ్యః అన్న పదం ఆత్మకి విశేషణంగా వాడబడింది. 'బాహ్య' అసలు అర్థం బయట. అంటే బయట ఉన్న ఆత్మకు ప్రపంచంలోని సుఖదుఃఖాలు అంటవు అని అర్థం వస్తుంది. బాహ్యంగా ఉన్న ఆత్మ అంటే అసలు ఏమిటి అర్థం? శంకరాచార్యులు తన భాష్యంలో

ఈ పదాన్ని వివరిస్తూ, ఇది హేతుగర్భ విశేషణం అన్నారు. అంటే తర్కం చూపించే పదం. దీని అర్థం అక్షరాలా తీసుకుంటే, బాహ్యంగా ఉన్న ఆత్మకు ప్రపంచంలోని సుఖదుఃఖాలు అంటవు. ఎందుకంటే ఇది బాహ్యంగా ఉంది కాబట్టి అనిపిస్తుంది. అలా అయితే ఇది శృతికి, తర్కానికి, అనుభవానికి భిన్నంగా ఉంటుంది.

శృతి – ఆత్మ అన్ని జీవాల్లోనూ ఉంది – సర్వభూత అంతరాత్మ.
తర్కం – ఆత్మ సర్వవ్యాపకం. లోపల లేకుండా బయట ఎలా ఉంటుంది?
అనుభవం – ఆత్మ బాహ్యంగా ఉంటే, జడమైన శరీరాన్ని ఎలా ప్రకాశింపజేస్తుంది?

అందుకని బాహ్యం అంటే దాని స్థాయి వేరని. సినిమా తెర సినిమా అంతటా ఉన్నా, దాని స్థాయి వేరు. అందువల్ల శంకరాచార్యులు, ఆత్మ పారమార్థిక సత్యం అనీ జగత్తు వ్యావహారిక సత్యమనీ చెప్తున్నారు. ఇది చాలా ముఖ్యం. ఎందుకంటే, వేదాంతం ప్రకారం, ఉన్నత సత్యాన్ని తెలుసుకుంటేనే, దు:ఖం తొలగించుకోగలము. అదే స్థాయిలో ఉంటే మోక్షం పొందలేము.

వ్యావహారిక సత్యానికీ, పారమార్థిక సత్యానికీ మధ్య బేధం ఉన్నట్టు చూపటానికి శంకరాచార్యుల వారు నాలుగు ఉదాహరణలు ఇస్తారు. రజ్జుసర్ప భ్రాంతి, నత్తగుల్ల, ఎండమావి, ఆకాశం. ఉదాహరణకు త్రాడు మీద పాముని ఆపాదించినా, త్రాడుకేమీ పాము లక్షణాలు అంటవు. అందువల్ల వీటి మధ్య సంబంధం ఉన్నట్టుగా తోస్తుంది కాని, నిజంగా లేదు.

అలాగే నాకూ, దుఃఖానికీ ఏం సంబంధం లేదు. నేను పారమార్థిక సత్యానికి చెందిన వాడిని. దుఃఖం వ్యావహారిక సత్యానికి చెందినది. అందుకని ఎవరైనా నేను విచారంగా ఉన్నాను అంటే అతనికి సత్యం అర్థమవలేదు.

### మంత్రం – 12

**ఏకో వశీ సర్వభూతాన్తరాత్మా ఏకం రూపం బహుధా యః కరోతి।**
**తమాత్మస్థం యేఽనుపశ్యన్తి ధీరాస్తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్॥**

**ప్రతిపదార్థం:** ఏకః – ఒక్కటే; వశీ – స్వతంత్ర; సర్వభూతాంతరాత్మా– సకలజీవులలో ఉన్నది; ఏకం రూపం – ఒకటే అయిన వస్తువు; బహుధా యః కరోతి – అనేకంగా కనిపిస్తుంది; ఆత్మస్థం – హృదయంలో నివసిస్తున్న; తమ్ – ఆ ఆత్మను; యే – ఏ; ధీరాః– వివేకవంతుదు; అనుపశ్యన్తి – అనుభూతిలో గ్రహిస్తారో; తేషాం – వారికే; శాశ్వతం – శాశ్వతమైన; సుఖం – ఆనందం; న ఇతరేషామ్ – ఇతరులకు లేదు.

**తాత్పర్యం:** ఒక్కటే అయినదీ, స్వతంత్రమైనదీ, సకల జీవులలోనూ ఉన్నది, ఒక్కటే అయినప్పటికీ అనేకంగా కనిపించేదీ, హృదయంలో వసిస్తున్నదీ అయిన ఆత్మను ఏ వివేకి అనుభూతిలో గ్రహిస్తాడో, అతనికే శాశ్వతమైన ఆనందం కలుగుతుంది, ఇతరులకు లేదు.

**వివరణ:** ఇది ఇంకో ముఖ్యమైన మంత్రం. పరిపూర్ణ మంత్రం కూడా. ఎందుకంటే ఇక్కడ పరమాత్మ స్వరూపం, జీవాత్మ పరమాత్మ ఐక్యం, ఐక్య జ్ఞానఫలం కూడా వచ్చింది. నిజానికి, వేదాంత సారమంతా ఈ ఒక్క మంత్రంలోనే వచ్చేస్తుంది. అందుకే ఇది ఒక మహావాక్య మంత్రం.

జగత్ కారణం – ఈ ఐక్యం చూపించటానికి వేదాంతం రెండు పద్ధతులు ఉపయోగిస్తుంది. ఒక్కోసారి జీవాత్మతో మొదలుపెట్టి, పరమాత్మతో లేదా బ్రహ్మతో సమానం చేస్తుంది. కొన్నిసార్లు బ్రహ్మతో మొదలుపెట్టి, బ్రహ్మ వేరెవరో కాదు, జీవాత్మ అసలు స్వరూపమే అంటుంది. ఈ మంత్రంలో రెండో మార్గం చూస్తాము. జగత్తు మొత్తానికి బ్రహ్మ కారణం. ఏకం, స్వతంత్రం అయిన పరమాత్మ అనేకంగా ఉన్నట్టుగా కనిపిస్తుంది.

సర్వభూత అంతరాత్మా – అందువల్ల పారమార్థిక బ్రహ్మ ప్రతి వ్యావహారిక జీవిలోనూ ఉంది. దానికి ఆత్మస్థం అని వాడింది ఉపనిషత్తు. ఆత్మస్థం అంటే అసలు అర్థం ఆత్మ శరీరంలో ఉంది అని, కాని శంకరాచార్యులు, రెండు కారణాల వల్ల దాన్ని 'అభివ్యక్తం'గా తీసుకున్నారు. అభివ్యక్తం అంటే ప్రకటితం. ఒక కారణం సర్వవ్యాపక ఆత్మను ఒకచోట పరిమితం చేయలేము. రెండో కారణం ఆత్మ శరీరంలో ఉంది అంటే ఆత్మ శరీరం మీద ఆధారపడినట్టు. అప్పుడు శరీరం ఆత్మ కన్నా పెద్దది కాని కనీసం ఆత్మ అంతగానీ ఉండాలి. అందుకని సర్వవ్యాపకమైన ఆత్మ శరీరంలో సాక్షి చైతన్యంగా ప్రకటితమవుతోంది అనాలి. దీనికి ఒక అద్భుతమైన ఉదాహరణ ఇస్తారు శంకరాచార్యులు. అద్దంలో ముఖం అంటే ముఖం అద్దంలో ఉన్నట్టు కాదు, అద్దంలో ప్రకటితమవుతున్నట్టు అర్థం.

సాక్షి చైతన్యం ఎలా ఉంది? అనుభవించే వ్యక్తిగా ఉంది. లోపల ఉంది అంటే లోపల ఏవో అంగాలుగానో, రాగద్వేషాల లాంటి భావాలుగానో లేదు. చూసే నేనుగా ఉంది, చూడబడే వస్తువుగా కాదు.

సర్వగత పరమాత్మ, జీవాత్మరూపేణ, అంతఃకరణ భావ అభావ రూపేణ సాక్షిరూపేణ సదా తిష్ఠతి.

సర్వవ్యాపకమైన పరమాత్మ, జీవాత్మరూపంలో ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుని చూసే సాక్షిచైతన్యంగా నాలో ఎప్పుడూ ఉంది.

| | |
|---|---|
| సర్వభూతాన్తరాత్మా | – పరమాత్మ |
| అత్మస్థం | – జీవాత్మ |
| ఏకరూపం | – ఐక్యం |
| సుఖం శాశ్వతం | – ఫలం |

సాధకుడు ఏం చేస్తాడు? ముందు బయట వెతుకుతాడు, తర్వాత లోపల వెతుకుతాడు. బ్రహ్మ బయటా లేదు, లోపలా లేదు, అది నువ్వే అంటుంది ఉపనిషత్తు. అన్నిటినీ చూసే నేనే, బ్రహ్మని అని గ్రహించాలి. ఇది ధీరుడు మాత్రమే చేయగలడు. ఈ ఉపనిషత్తులోనే ధీరుడు పదం చాలాసార్లు వచ్చింది. అంటే సాధన చతుష్టయ సంపన్నుడు, డైకాటమీ పద్ధతిని వదిలి, సూక్ష్మబుద్ధి పెంచుకున్నవాడు. ధీరుడికి సంస్కృతమైన మనసు ఉంటుంది. మనసు సంసిద్ధత పొందాలి. సంస్కరించబడాలి. ఉదాహరణకు పరీక్షకి హాల్ టిక్కెట్టు తీసుకువెళ్ళాలి, పరీక్షకి తగ్గట్టుగా నేర్చుకోవాలి. జ్ఞానం పొందటానికి సంసిద్ధత మాత్రమే చాలదు. గురుశాస్త్ర ఉపదేశం కూడా ఉండాలి.

తేషాం శాశ్వతం సుఖం – ఇది ఫలం. పూర్ణత్వ దర్శనం కలుగుతుంది. ఇది జ్ఞానం వల్ల వస్తుంది కాబట్టి శాశ్వత ఆనందం కలుగుతుంది. అనుభవంలోంచి వచ్చింది వస్తుంది, పోతుంది. శాశ్వతానందం కలిగితే, జీవన్ముక్తి పొందుతాడు. ఇది అనేక మార్గాల్లో ఒక్కటా? కాదు, ఇదొక్కటే మార్గమంటున్నాడు యమధర్మరాజు. కర్మ, ఉపాసన కుదరదు అని ఉపనిషత్తు ప్రత్యక్షంగా చెప్పదు కాని వేరే మార్గాలు లేవు. మరయితే అవి వదిలేయాలా? వాటిని విమర్శించడం లేదు కాని, అక్కడే ఆగద్దు. మనసు సంసిద్ధం చేసి ఇక్కడికి రావాలి అంటుంది. జ్ఞానమార్గం ద్వారానే, పూర్ణత్వం ప్రాప్తిస్తుంది.

**కర్మయోగం పూర్తికాకుండా జ్ఞానయోగం అసాధ్యం.**
**జ్ఞానయోగం లేకుండా కర్మయోగం అసంపూర్ణం.**

### మంత్రం – 13

**నిత్యోఽ నిత్యానాం చేతనశ్చేతనానాం ఏకో బహూనాం యో విదధాతి కామాన్।**
**తమాత్మస్థం యేఽనుపశ్యన్తి ధీరాః తేషాం శాన్తి శ్శాశ్వతీ నేతరేషామ్॥**

**ప్రతిపదార్థం:** అనిత్యానామ్ నిత్యః – అనిత్యాల మధ్య నిత్యమైనది; చేతనానామ్ చేతనః – ప్రాణులలో చైతన్యం; బహూనాం ఏకః – అనేకంలో ఏకం; కామాన్ విదధాతి – కోరికలు తీర్చేవాడూ; యః – ఎవరో; తమ్ – ఆయనని; ఆత్మస్థం – హృదయంలో వసించే వారిగా; యే ధీరాః – ఏ వివేకవంతులు; అనుపశ్యన్తి – గ్రహిస్తారో; తేషాం – వారికి; శాశ్వతీ – శాశ్వతమైన; శాంతిః – శాంతి; న ఇతరేషామ్ – వేరే మార్గం లేదు.

**తాత్పర్యం:** అనిత్యవస్తువుల్లో నిత్య వస్తువుగానూ; చేతన ప్రాణులలో చైతన్యంగానూ, అనేకంలో ఏకంగానూ, కోరికలు తీర్చేవాడుగానూ, ఉండేది ఎవరో, ఆయనను హృదయంలో వసించేవారిగా ఏ వివేకవంతులు గ్రహిస్తారో వారికి శాశ్వతమైన శాంతి దొరుకుతుంది. వేరే మార్గం లేదు.

**వివరణ:** ఇది కూడా ఒక మహా వాక్య మంత్రం. ఇందులో కూడా పరమాత్మ స్వరూపం, జీవ ఈశ్వర ఐక్యం, ఐక్య జ్ఞాన ఫలం ఉన్నాయి. ఇంకా ఈ జ్ఞానం పొందటానికి కావాల్సిన అర్హత కూడా సూచించబడింది 'ధీరాః' అన్న పదం ద్వారా.

సర్వ అధిష్టానం పరమాత్మ కారణరూపంగా నిత్యం, కార్యరూపంగా అనిత్యం. మొదటి రెండు పాదాలు పరమాత్మ తత్త్వాన్ని వివరిస్తాయి. ముందు మంత్రంలో పరమాత్మను జగత్కారణంగా అభివర్ణిస్తే, ఈ మంత్రంలో పరమాత్మను సర్వ అధిష్టానం బ్రహ్మగా వర్ణిస్తుంది. అన్ని జీవరాసుల్లోనూ బ్రహ్మ ఉంది. బ్రహ్మ, సృష్టి అంతటా సత్ రూపంలోనూ, చిత్ రూపంలోనూ ఉంది.

బ్రహ్మ నిత్యం, కేవలం అదే శాశ్వతం. ఎక్కడ ఉంది? ఎక్కడ వెతకాలి? ప్రతి అశాశ్వతమైన వస్తువు అంతటా ఉంది. ప్రపంచాన్ని వదిలి ఎక్కడికో వెళ్ళనక్కరలేదు.

చేతనానాం చేతనః – ప్రతి ప్రాణిలోనూ చిత్‌రూపంలో ఉంది. ఉదాహరణ చేయి, కాంతి. కాంతి అంతటా ఉంది. చేయి తీసినా, ఉంచినా కాంతి ఉంది. శరీరం ప్రతి అణువులోనూ చైతన్యం ఉంది. అది నిత్యమైనది. ఇంకో ఉదాహరణ అగ్ని. అగ్నితో చేరితే, వస్తువు కూడా వేడిగా ఉన్నట్టుగా, జడం కూడా చేతనత్వం పొందుతుంది. ఇది నిర్గుణ బ్రహ్మ. ఒకటే ఆత్మ అనేకంగా కనిపిస్తోంది.

మాయాశక్తితో పరమాత్మ కలిస్తే, అదే బ్రహ్మ సగుణబ్రహ్మ అవుతుంది. ఈ బ్రహ్మ సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడు. అందువల్ల అతను కర్మఫలదాత అవుతాడు. ఉన్నట్టుండి కర్మకాండ వచ్చింది. సగుణ ఈశ్వరుని ప్రార్థిస్తే కోరికలు తీరుస్తాడు. కర్మఫలము ఆయన శ్రమ పడకుండా కేవలం సంకల్పం వల్ల ఇస్తాడు. అది జీవుల పూర్వజన్మ సుకృతాన్ని బట్టి ఉంటుంది. ఇది సగుణ ఈశ్వర పాత్ర.

తమాత్మస్థం యేఽను పశ్యన్తి ధీరాః – ముందు మంత్రంలో ఉన్న మూడవ పాదం అలాగే వచ్చింది. ఆ బ్రహ్మ నీ దేహేంద్రియ మనోబుద్ధులలో ఉంది. వస్తువుగా కాదు, ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుని సాక్షిచైతన్యంగా చూసే బ్రహ్మగా. కాని ఇది అందరూ గుర్తించరు. ధీరాః – వివేకవంతులు మాత్రమే గుర్తిస్తారు. తక్కినవారు ప్రయాణం చేస్తూనే ఉంటారు.

తేషాం శాంతిః శాశ్వతీ – ఫలం ఇంతకు ముందు మంత్రంలో 'సుఖం శాశ్వతం' – శాశ్వత ఆనందం దొరుకుతుందని చెప్తే, ఇందులో శాంతిః శాశ్వతీ అంటోంది. ఆనందానికి, శాంతికి ఏమిటి తేడా? వేదాంతంలో ఆనందం అంటే సుఖప్రాప్తి, శాంతి అంటే దుఃఖ నివృత్తి; శ్రీ శంకరాచార్యులు ఈ శాంతిని ఇంకా వివరిస్తున్నారు. శాంతి అంటే మనసుకి సంబంధించిన శాంతి కాదు. అది చెదిరే శాంతి. ఈ శాంతి ఆత్మది. ఆత్మ శాంతి పొందితే, మనశ్శాంతి అదే తోడుగా వస్తుంది.

న ఇతరేషాం – వేరే మార్గం లేదు. ఈ రెండు మంత్రాలూ మహా వాక్య మంత్రాలు.

**మంత్రం – 14**

**తత్ ఏతత్ ఇతి మన్యన్తే, అనిర్దేశ్యం పరమం సుఖమ్।**
**కథం ను తద్విజానీయాం కిము భాతి విభాతి వా॥**

**ప్రతిపదార్థం:** అనిర్దేశ్యం – గుర్తించి చెప్పటానికి అశక్యమైనది; పరమం – శ్రేష్ఠమైన; తత్ సుఖం – ఆ ఆనందాన్ని; ఏతత్ ఇతి – ప్రత్యక్షంగా; మన్యంతే – అనుభవిస్తున్నారు; తత్ – ఆ అనుభవం, కిము భాతి – స్వయంగా ప్రకాశిస్తోందా; వా – లేక; విభాతి – మరొకదాని చేత ప్రకాశింపబడుతోందా? కథం ను – ఏ విధంగా; విజానీయం – తెలుసుకోగోరుచున్నాను.

**తాత్పర్యం:** గుర్తించి చెప్పటానికి అశక్యమైనదీ, శ్రేష్ఠమైనదీ అయిన ఆ ఆనందాన్ని ప్రత్యక్షంగా అనుభవిస్తున్నారు. అనుభవం స్వయంగా ప్రకాశిస్తుందా లేక మరొకదానిచేత ప్రకాశింపబడుతోందా? దీనిని గురించి తెలుసుకోగోరుచున్నాను.

**వివరణ:** జ్ఞానఫలాన్ని శాశ్వత ఆనందంగా వర్ణించింది ఉపనిషత్తు. దాని ఆధారంగా నచికేతుడు ఈ ప్రశ్న అడిగినట్టుగా ఊహించుకోవాలి. కాని ప్రశ్న అడిగే ముందు, ఒక మాట చెప్తున్నాడు. జ్ఞానులు, ఆత్మానందం ఎక్కడో దూరంగా లేదు. సన్నిహితంగా ఉంది అంటారు. అదే సాక్షి చైతన్యం అంటున్నారు. ఇది స్వయం ప్రకాశమా, లేదా ఏదైనా ప్రకాశింపజేస్తోందా? అది నాకు అందుతుందా? తేలికా, కష్టమా? యమధర్మరాజుని ఇరకాటంలో పెట్టున్నాడు. దానికి జవాబు ఇవ్వాలి.

ఇంకో విధంగా చెప్పాలంటే, అందరికీ బ్రహ్మ యొక్క సత్,చిత్ స్వరూపాలు అర్థం అవుతాయి. కాని ఎలా ఆనంద స్వరూపమో అర్థం కాదు. ముఖ్యంగా తాము దుఃఖంలో మునిగి తేలుతుంటే. అది మాటలకందనిది అయితే, ఎలా వర్ణించాలి? దీనికి జవాబు తేలిక. ఏది సత్తో అది చిత్. ఏది చిత్తో అది ఆత్మానందం. సత్,చిత్‌లని అర్థం చేసుకుంటే, ఆత్మానందాన్ని అర్థం చేసుకున్నట్టే. ఎందుకంటే చైతన్యమే ఆత్మానందం. అది అనుభవించే వస్తువు కాదు.

ఆత్మానందాన్ని ఎందుకు మాటల్లో పెట్టలేము? ఆత్మ చైతన్యం అంతా ఒకటే. ఏదైనా ఒక ప్రత్యేక అనుభవాన్ని వర్ణించవచ్చు, కాని అది శాశ్వతానందం కాదు. బ్రహ్మానందం శాశ్వతానందం. అందుకని ప్రత్యక్షంగా వర్ణించలేరు. కాని అపరోక్షానుభూతిని పొందవచ్చు

**మంత్రం – 15**

**న తత్ర సూర్యోభాతి, న చన్ద్రతారకం నేమా విద్యుతో భాన్తి, కుతోఽ యమగ్నిః।**
**తమేవ భాన్తమనుభాతి సర్వం తస్య భాసా, సర్వమిదం విభాతి॥**

**ప్రతిపదార్థం:** న తత్ర సూర్యోభాతి – ఆత్మను సూర్యుడు ప్రకాశింపచేయలేడు; న చంద్రతారకం– చంద్రుడు, తారకలు ప్రకాశింపచేయలేవు; ఇమాః – ఈ, విద్యుతః న భాతి – మెరుపులు మెరిపించలేవు; అయమ్ అగ్నిః – ఈ అగ్ని; కుతః భాన్తమ్ – ఎక్కడ ప్రకాశిస్తుంది? సర్వం తమేవ అనుభాతి – సృష్టిలో ప్రతిదీ దానివల్లే ప్రకాశిస్తుంది; భాంతం – స్వయం ప్రకాశం; తస్య భాసా – ఆ చైతన్యం వల్ల; ఇదం సర్వం విభాతి – ప్రతి వస్తువూ ప్రకాశిస్తుంది.

**తాత్పర్యం:** ఆత్మను సూర్యుడు ప్రకాశింపచేయలేడు; చంద్రుడు, తారకలు ప్రకాశింపచేయలేవు; మెరుపులు మెరిపింపలేవు. ఇంక అగ్నిమాట వేరే చెప్పాలా? సృష్టిలో ప్రతిదీ దానివల్లే ప్రకాశిస్తోంది. అది స్వయంప్రకాశం.

**వివరణ:** యమధర్మరాజు ఇస్తాడనుకున్న జవాబు ఉపనిషత్తు ఇస్తోంది. ఇదే మంత్రం ముండకోపనిషత్తు (2.2.11)లో అక్షరాలా ఇలాగే ఉంది.

**న తత్ర సూర్యోభాతి న చన్ద్ర తారకం**
**నేమా విద్యుతో భాన్తికుతోఽ యమగ్నిః।**
**తమేవ భాన్తమనుభాతి సర్వం**
**తస్య భాసా సర్వమిదం విభాతి॥** – ముండక 2.2.11

గీతలో కూడా ఇంచుమించు అలాగే ఉంది. ఈ మంత్రం చాలా ముఖ్యమైనది. అర్థం పరంగానే కాదు, ఆలయాల్లో దేవునికి హారతి ఇచ్చేటప్పుడు ఈ మంత్రం పఠిస్తారు. (ఇళ్ళల్లో కూడా హారతి ఇచ్చేటప్పుడు పఠించవచ్చు)

బ్రహ్మానందం ఎలా పొందాలి అంటే ముందు మంత్రంలోనే చూసాము. అది పొందే వస్తువు కాదు. ఒక ప్రత్యేక అనుభవం కాదు. దాన్ని అనుభవంగా వర్ణిస్తే కాలపరంగా, వస్తుపరంగా, దేశపరంగా పరిమితం చేసినట్టవుతుంది. ప్రతి అనుభవం కాలంలో వచ్చిపోయే ఒక అనుభవం. బ్రహ్మానందం వచ్చిపోయే అనుభవం కాకపోతే ఏమిటి?

ఆనందంకి ఇంకో అర్థం అనంతః అనంతః అంటే శాశ్వత చైతన్యం, వచ్చిపోయేది కాదు.

ఎలా పొందాలి? కేవలం జ్ఞానరూపంలో. ఎటువంటి జ్ఞానం? చైతన్యరూమైన నేనే బ్రహ్మానందం. అనుభవాలు రాకముందు, పోయాక కూడా ఉండేది చైతన్యం.

బ్రహ్మానందం చైతన్యం అంటే ఎప్పుడు దొరుకుతుంది? దానికి జవాబు చెప్పకూడదు. ఎప్పుడు దొరకదుఅని తిరుగుప్రశ్న వేయాలి.

బ్రహ్మానందాన్ని వర్ణించటానికి,ఉపనిషత్తు చైతన్య తత్త్వాన్ని వర్ణిస్తోంది.

తత్ర సూర్య న భాతి – సూర్యుడు చైతన్యాన్ని ప్రకాశింపజేయలేదు. నిజానికి చైతన్యమే సూర్యుడిని ప్రకాశింపజేస్తోంది. కాంతి పుస్తకాన్ని ప్రకాశింపచేస్తోంది. పుస్తకం కాంతిని ప్రకాశింపజేయదు. అలాగే చంద్రుడూ, తారకలూ విద్యుల్లతలు ఏవీ ప్రకాశింపజేయలేవు. అగ్ని మాటేమిటి? ఎంతో కాంతివంతమైన సూర్యుడూ, మెరుపులూ ప్రకాశింపజేయ లేకపోతే మామూలు అగ్ని మాటేమిటి?

దీన్ని కౌముతిక న్యాయం అంటారు. కిమ్ ఉత? కాంతివంతమైన సూర్యుడినే చైతన్యం ప్రకాశింపచేస్తే, దానికన్నా తక్కువైన అగ్ని గురించి వేరే చెప్పాలా? చైతన్యం అనుభవించే వస్తువు కాదు. అనుభవించే నేను, ఏ ప్రమాణానికీ అందని వస్తువు – సర్వ ప్రమాణ అగోచరం.

ఏ ప్రమాణానికీ అందకపోతే ఎలా తెలుస్తుంది? ఎన్నోసార్లు దానికి జవాబు చూసాము.చైతన్యాన్ని అనుభవించలేము నిజమే. కాని అన్ని అనుభవాలు చైతన్యం వల్లనే సాధ్యమవుతాయి. నేను చూడలేను. వినలేను ఎందుకు? నేను ఆ చైతన్యాన్ని కాబట్టి. దానికి నిదర్శనం అఖ్ఖరలేదు. ఏ ఫోటోలోనూ కెమెరా కనబడదు కాని దాని ఉనికిని అనుమానించము.

సర్వం తమేవ అనుభాతి – సృష్టిలో ప్రతిదీ చైతన్యం వల్లే తెలుస్తుంది. నువ్వు ఉన్నావా అంటే ఏమో తెలీదు. మా అమ్మనడిగి చెప్తాను అనరు కదా! నేను ఉన్నాను అనటానికి నిదర్శనం అఖ్ఖరలేదు.

అది–భాంతం–స్వయంప్రకాశం. ఆ చైతన్యం వల్ల ఇదం సర్వం విభాతి – ప్రతి వస్తువూ ప్రకాశిస్తోంది. అన్ని సమయాల్లోనూ చాలా స్పష్టంగా దొరుకుతుంది. నువ్వే ఆనందం. దాన్ని పొందనఖ్ఖరలేదు. ఆనందం అంటే అనంతం. అనంతం అంటే శరీరానికి, ఆలోచనకి పరిమితం కాదు.

స్వయం ప్రకాశక ఆత్మ అనాత్మ ప్రపంచాన్ని ప్రకాశింపజేస్తోంది. అనేక మెరిసే వస్తువుల్లో అవగతమవుతుంది. కుండ దేన్నీ ప్రకాశవంతం చేయలేదు, కాని సూర్యుడు చేయగలడు. కాని అతను కూడా బ్రహ్మని ప్రకాశవంతం చేయలేదు. తనకి కాంతిని బ్రహ్మ నుంచే తీసుకోవాలి. దీనివల్ల కేవలం బ్రహ్మే స్వయం ప్రకాశక ఆత్మ. అన్నిటినీ అదే ప్రకాశవంతం చేయగలదు.

# అధ్యాయం - 2 వల్లీ - 3

ఈ వల్లీలో కూడా ఆత్మ విద్య గురించి, బ్రహ్మవిద్యాసాధనల గురించి, బ్రహ్మవిద్యా ఫలం గురించి వస్తుంది. ఉపసంహారంగా మళ్ళీ చెప్తున్నాడు యమధర్మరాజు.

బ్రహ్మ గురించి రెండు మార్గాల ద్వారా తెలుసుకోవచ్చు. శృతి ప్రమాణం, కార్యకారణ సంబంధం. జగత్ అనే కార్యం నుంచి, బ్రహ్మ అనే కారణాన్ని తెలుసుకోవచ్చు.

**మంత్రం - 1**

**ఊర్ధ్వమూలోఽవాక్శాఖ ఏషోఽశ్వత్థః సనాతనః**
**తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే**
**తస్మింల్లోకాః శ్రితాః సర్వే నాత్యేతి కశ్చన। ఏతద్వై తత్ ॥**

**ప్రతిపదార్థం:** ఏషః – ఈ; అశ్వత్థః – ప్రపంచమనే అశ్వత్థ వృక్షము; సనాతనః – ఆది, అంతం లేనిది; ఊర్ధ్వమూలః – వేళ్ళు పైకి ఉన్నది; అవాక్ శాఖః – క్రిందికి శాఖలు కలది; తద్ ఏవ – అదే; శుక్రం – శుద్ధం; తద్ బ్రహ్మ – అదే ఆత్మ; తదేవ అమృతముచ్యతే – దాన్ని అమరం అంటారు; సర్వేలోకాః – అన్ని లోకాలూ; తస్మిన్ శ్రితాః – అందులోనే ఉన్నాయి; కశ్చన తత్ ఉ అత్యేతి – దాన్ని దాటి ఏదీ లేదు; ఏతద్వై తత్ – అదే నువ్వు అడిగిన తత్త్వం.

**తాత్పర్యం:** ఈ ప్రపంచం అశ్వత్థ చెట్టు లాంటిది. ఆది, అంతం లేనిది. వేళ్ళు పైకి ఉండి, క్రిందికి శాఖలు ఉన్నది. అదే శుద్ధం. అదే ఆత్మ. దాన్ని అమరం అంటారు. దాంట్లోనే అన్ని లోకాలూ ఉన్నాయి. దాన్ని దాటి ఏదీ లేదు. అదే నువ్వు అడిగిన తత్త్వం.

**వివరణ:** ఈ వల్లీ చాలా ముఖ్యమైన మంత్రంతో మొదలవుతుంది. దీన్నుంచే గీత 15వ అధ్యాయంలో ఈ మంత్రం వచ్చింది.

**ఊర్ధ్వమూలమధశ్శాఖమ్ అశ్వత్థం ప్రాహురవ్యయమ్**
**ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్** – గీత 15.1

భగవద్గీత ఉపనిషత్తుల సారం. ఎన్నో మంత్రాలు కఠోపనిషత్తు నుంచే వచ్చాయి. ఉదాహరణకు

**న జాయతే మ్రియతే వా కదాచిత్**
**నాయం భూత్వా భవితా వా న భూయః।** – గీత 2.20

**ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్ ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః।**
**ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతి శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్॥** – గీత 2.29

ఈ మంత్రంలోని రెండు మూడు పాదాలు, అక్షరాలా రెండవ వల్లీలో ఎనిమిదో మంత్రంలోని పాదాలే. అశ్వత్థవృక్షం అంటే రావిచెట్టు. కొన్ని చోట్ల మర్రిచెట్టు. చెట్టుకీ, జగత్తుకీ అనేక పోలికలున్నాయి. అవి వివరంగా చెప్తున్నారు శంకరాచార్యులు. అందులో కొన్ని –

1. మహత్వం – అశ్వత్థ వృక్షం చాలా పెద్దది. ప్రపంచం చాలా పెద్దది. పరిమితి లేదు.

2. ఆది–అంతరహితత్వం – ప్రవాహ నిత్యత్వం అని కూడా అంటారు. చెట్టు నుంచి విత్తనం. విత్తనం నుంచి చెట్టు వచ్చినట్టు కనిపిస్తాయి. విత్తు ముందా, చెట్టు ముందా? దీనికి జవాబు చెప్పలేము. ఎందుకంటే ఇది ఒక నిరంతర ప్రవాహం. అలాగే జగత్తు కూడా. మన కర్మల వల్ల జగత్ వచ్చింది. కర్మ నుంచి జన్మా? జన్మ వల్ల కర్మా? ఇది ఒక వృత్తం. అవ్యక్తం నుంచి వ్యక్తంలోకి వచ్చి మళ్ళీ ప్రళయంలో అవ్యక్తంలోకి వెళ్ళిపోతుంది.

3. అనిర్వచనీయత్వం – ఏది కారణమో, ఏది కార్యమో చెప్పలేము. ముందు అంశానికి దగ్గరగా ఉంది ఇది. చెట్టు నుంచి చూస్తే విత్తనానికి చెట్టు కారణం, విత్తు నుంచి చూస్తే చెట్టుకి విత్తు కారణం. అలాగే కర్మఫలానికి, ఫ్రీవిల్‌కీ కార్య కారణ సంబంధం ఉంది.

4. మూలతత్వం – కనబడని వేరు, కనబడే చెట్టు కింద ఉంది. వేరు ఉందని తెలుసు. అది ఆధారం చెట్టుకి. అలాగే కనబడే జగత్తునుంచి కనబడని బ్రహ్మను తెలుసుకోవచ్చు. కార్యం నుంచి కారణం తెలుసుకోవటం. బ్రహ్మను తెలుసుకునే మార్గాల్లో ఇది ఒకటి. కనబడని ఆధారం, ఇంద్రియ అగోచరమైన బ్రహ్మను కనబడే నామ, రూపాల నుంచి తెలుసుకోవటం. దీన్ని తటస్థ లక్షణం అంటారు.

5. శాఖవత్వం – పైన, మధ్యలో, కింద అనేక శాఖలు ఉంటాయి చెట్టుకి. జగత్తుకు అనేక లోకాలు – ఊర్ధ్వలోకాలు, భూలోకం, పాతాళ లోకాలు.

6. ఫలవత్వం – ఏ చెట్టుకైనా మూడు ఫలాలుంటాయి. తీపి, చేదు, ఓ మోస్తరు రుచి. అలాగే జగత్తుకు మూడు ఫలాలుంటాయి. సుఖం, దుఃఖం, మిశ్రఫలం.

7. ఆశ్రితత్వం – చెట్టుకున్న ఫలాల కోసం చెట్లని ఆశ్రయించుకుని పక్షులు ఉంటాయి. అందుకని చెట్టు పక్షుల కిలకిలారావాలతో సందడిగా ఉంటుంది. సంసార వృక్షాన్ని ఆశ్రయించుకుని జీవాత్మ పక్షులు ఉంటాయి. పక్షి గూడు, ఇక్కడ శరీరం. పక్షుల కిలకిలారావాలులా, ఒక్కో ఇంట్లో ఒక్కో సందడి – పెళ్ళి, చావు, కోలాహలం, శోకం.

8. చలనత్వం – ఎంత పెద్ద చెట్టయినా, తుఫానుగాలికి నేలరాలుతుంది. సంసారవృక్షంలో ప్రారబ్ధకర్మ వల్ల ఒక ఊరి నుంచి ఇంకో ఊరికి, ఒక లోకం నుంచి ఇంకో లోకానికి చలనం ఉంటుంది.

9. ఛేదత్వం – చెట్టు అనాది, అనంతం అయినా, దాన్ని కూకటి వేళ్లతో పెకళించవచ్చు. తేలిక కాదు కాని, అసాధ్యం మాత్రం కాదు. పెద్ద చెట్టుని కొట్టాలంటే ముందు చిన్న చిన్న కొమ్మలతో మొదలెట్టి, తర్వాత బోదెని కొట్టి తర్వాత వేళ్లని కొడతారు. అలాగే సంసారమనే వృక్షాన్ని, జ్ఞానమనే ఖడ్గంతో పెకళించవచ్చు. జగత్తుకు బ్రహ్మ ఆధారం. ఆ బ్రహ్మ నీ స్వరూపం. వేదాంత శాస్త్రాన్ని శ్రవణ, మనన, నిధి ధ్యాసనల ద్వారా గురువు దగ్గర అధ్యయనం చేసి, సంసార వృక్షం నుంచి ముక్తి పొందాలి. ఇప్పుడు మంత్రంలోకి వెళ్దాము.

ఉపాదాన కారణం – బ్రహ్మ ఉపాదాన కారణం. ఊర్ధ్వం అంటే మామూలుగా పైన. ఇక్కడ లక్ష్యార్థం బ్రహ్మగా తీసుకోబడింది. బ్రహ్మగా తీసుకున్నా, బ్రహ్మ పైన ఉంది అని ఎలా చెప్తాము? బ్రహ్మ జగత్ అధిష్టానంగా పైన మాత్రమే లేదు. ఊర్ధ్వం వాడటానికి రెండు కారణాలు. పైన అన్న పదం ఉన్నతం అని సూచిస్తుంది. ఉన్నత పదవి అంటాం. బ్రహ్మ అత్యంత ఉన్నతం. బ్రహ్మను మించి ఉన్నతమైనదేదీ లేదు. ఇంకో అర్థం పైన అంటే సూక్ష్మమైనది అని. బ్రహ్మతత్త్వం ప్రమాణాలకు అందదు. దుర్విజ్ఞేయం. సూక్ష్మాతిసూక్ష్మం. అందుకే కనబడదు.

అవాక్‌శాఖ – తక్కువ శాఖలు అనేకం ఉన్నాయి. తక్కువ అంటే మళ్ళీ లక్ష్యార్థం, లక్షణంలో తక్కువ. జగత్తుఎందుకు తక్కువ, బ్రహ్మ ఎందుకు ఎక్కువ? జగత్తు వచ్చిపోయే కార్యం, బ్రహ్మ శాశ్వత కారణం. జగత్తు మిథ్య, బ్రహ్మసత్యం. కనబడని వేరు ఆధారమయినట్టుగా కనబడని బ్రహ్మ జగత్తుకు ఆధారం.

తదేవ శుక్రం – బ్రహ్మస్వరూపమిది. జగత్తులో అశుద్ధి ఉంది. కాని ఆధార బ్రహ్మ శుద్ధం. ఉదాహరణకు మనం స్వప్నంలో బాగా తడిసినా, జాగృతిలో తడవము.

తదేవ అమృతముచ్యతే – ఆ బ్రహ్మ మాత్రమే అమృతం. అందుకే ఆ మూలంని (ఆ బ్రహ్మని) గట్టిగా పట్టుకో. అంటే ఆధారాన్ని పట్టుకో. గంగానదిలో స్నానం చేసేటప్పుడు,

అక్కడ వేసిన చైనుని గట్టిగా పట్టుకోవాలి. లేదా గంగా ప్రవాహంలో కొట్టుకుపోతాము. పధ్నాలుగు లోకాలూ ఆ బ్రహ్మ మీదే ఆధారపడ్డాయి.

తదు న అత్యేతి కశ్చన – బ్రహ్మ బయట ఏదీ లేదు. స్వప్నలోకం మన మనసులోనే ఉంది.

ఆత్మ స్వరూపం అడిగితే బ్రహ్మ గురించి చెప్తావేమిటి అనచ్చు నచికేతుడు. అందుకని అదే నువ్వు అడిగినది అని మళ్ళీ గుర్తు చేస్తున్నాడు.

**మంత్రం – 2**

**యదిదం కించ జగత్సర్వం ప్రాణ ఏజతి నిఃసృతమ్।**
**మహద్భయం వజ్రముద్యతం య ఏతద్విదురమృతాస్తే భవన్తి॥**

**ప్రతిపదార్థం:** ఇదం జగత్ – ఈ జగత్తు; యదిదం కించ – ఉన్నవన్నీ, ఒక్కటి కూడా వదలకుండా; ప్రాణ – (ఇక్కడ) బ్రహ్మ; నిః సృతమ్ – అభివ్యక్తమౌతోంది; ఏజతి మహత్ భయం – గొప్ప భయం కారణంగా ఇవన్నీ చేస్తున్నాయి; వజ్రం ఉద్యతం – ఎత్తబడిన వజ్రాయుధం; యః ఏతద్ విదుః – ఎవరు దీనిని తెలుసుకుంటారో; తే అమృతాః భవన్తి – వాళ్ళు ముక్తి పొందుతారు.

**తాత్పర్యం:** ఈ మొత్తం జగత్తు, బ్రహ్మనుంచి అభివ్యక్తమౌతోంది; వజ్రాయుధం ఎత్తి పట్టుకున్నాడన్న గొప్ప భయం చేతనే జగత్తులో పనులన్నీ జరుగుతున్నాయి. దీనిని తెలుసుకున్న వారు ముక్తిని పొందుతారు.

**వివరణ:** ఇంతకుముందు మంత్రంలో ఉపనిషత్తు బ్రహ్మను ఉపాదాన కారణంగా చూపి, బ్రహ్మ అస్తి అనటానికి శ్రుతి ప్రమాణం చూపించింది. ఇప్పుడు ఈ మంత్రంలో బ్రహ్మ అస్తి అని చూపటానికి తర్కం ఉపయోగిస్తోంది. ఇలా చెప్పటం వల్ల పూర్వపక్షిని ఖండించటం జరుగుతోంది. శంకరాచార్యులు పూర్వపక్షిని శూన్యవాది అంటారు. ప్రళయంలో అన్ని నాశనమయినప్పుడు ఏమీ మిగలదన్నది వాళ్ల వాదన. అంటే అసత్ నుంచే అన్నీ వస్తాయని. ఈ మంత్రంలో దానికి ఖండన వస్తుంది.

1. ఒక కార్యం ఉందంటే, దాని వెనుక కారణం ఉందని అర్థం. ప్రపంచం ఉందంటే, దాని వెనుక కారణం బ్రహ్మ ఉన్నట్టు అర్థం. జగత్తు అనే కార్యం, బ్రహ్మ అనే కారణంనుంచి పుట్టిందంటే ఏమిటి అర్థం? బ్రహ్మ అస్థి అయి తీరాలి. ఇక్కడ బ్రహ్మను ఉపాదాన కారణంగా చూపుతోంది.

2. బ్రహ్మ నిమిత్త కారణం కూడా. జగత్తు ఇంత క్రమపద్ధతిలో సాగుతోందంటే దానికి నిమిత్త కారణం బ్రహ్మ.

ఈ మంత్రంలో బ్రహ్మకు ప్రాణ అన్నపదం వాడింది ఉపనిషత్తు మామూలుగా ప్రాణ అంటే పంచప్రాణాలు. ఇక్కడ ప్రాణస్య ప్రాణ – బ్రహ్మ. ఏజతి అంటే కదులుతుంది. అంటే బ్రహ్మ సృష్టికారణం, స్థితి కారణం కూడా.

ఎలా తెలుసు? బ్రహ్మ పోలీసులాగా భయపెడ్తున్నాడు. వెంటనే కొట్టటానికి వీలుగా వజ్రాయుధాన్ని ఎత్తి పట్టుకున్నాడుట. దాన్ని చూడలేం కదా ఎలా తెలుసు? దానివల్లే ప్రపంచమంతా క్రమ పద్ధతిలో నడుస్తోంది. ప్రకృతిలో ఏదైనా ఆగితే, మన ఉనికే కష్టం. దీన్నించి ఒక ప్రకృతి సూత్రం తెలుస్తుంది. ఎక్కడ క్రమశిక్షణ ఉంటే, అక్కడ నిమిత్త కారణం ఉంది. భయం లేకపోతే, క్రమశిక్షణ ఉండదు. మామూలు మనిషికే చట్టం ఉంటే, జగత్తుసృష్టిలో ఈశ్వర నియమాలు ఉండాలి. అందువల్ల బ్రహ్మ అభిన్న నిమిత్త, ఉపాదాన కారణం, సృష్టి స్థితి లయ కారణం అని తెలుసుకున్న వ్యక్తి ముక్తిని పొందుతాడు.

### మంత్రం – 3

**భయాదస్యాగ్నిస్తపతి భయాత్తపతి సూర్యః।**
**భయాదిన్ద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పంచమః॥**

**ప్రతిపదార్థం:** అస్య భయాత్ – ఈశ్వరభయంవల్ల; అగ్నిః – అగ్ని; తపతి – మండుతోంది; భయాత్ తపతి సూర్యః – సూర్యుడు ప్రకాశిస్తున్నాడు; భయాదింద్రశ్చ – భయంవల్లే ఇంద్రుడు కూడా; వాయుశ్చ – ఋతుపవనాలు; పంచమః – ఐదవదైన; మృత్యుః – మృత్యుదేవత; ధావతి – పరిగెడుతున్నారు.

**తాత్పర్యం:** ఈశ్వర భయంవల్లే అగ్ని మండుతోంది; సూర్యుడు ప్రకాశిస్తున్నాడు, ఇంద్రుడు, ఋతుపవనాలు తమ తమ పనులను నిర్వహిస్తున్నారు, ఐదవ దేవత అయిన యమధర్మరాజు కూడా ఆ భయంవల్లనే తన నిర్వహణలో పరుగులు పెడ్తున్నాడు.

**వివరణ:** ఇంతకుముందు మంత్రంలో బ్రహ్మని 'మహాద్భయం వజ్రముద్యతం' అని వర్ణించాడు యమధర్మరాజు. ఎత్తిపెట్టిన వజ్రాయుధంతో గొప్ప భయం సృష్టిస్తున్నాడు. ఆ 'మహాద్భయం'ని ఈ మంత్రంలో వివరిస్తున్నాడు. ఈ భయం వల్ల అందరు దేవతలూ తమ ధర్మాన్ని అధిగమించకుండా పనిచేస్తున్నారు. ఈశ్వర భయం వల్ల అగ్ని తన పని చేస్తోంది; సూర్యుడు ప్రకాశిస్తున్నాడు, ఇంద్రుడు, వాయువు తమ ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారు.

ఇవన్నీ యాదృచ్ఛికంగా జరుగుతున్నాయా? లేదు. యాదృచ్ఛికంగా జరగటానికి అవకాశమే లేదు. వీళ్లని ఎవరు చూస్తున్నారు? కనబడని తెలివి. దేన్నైనా ఉద్దేశపూర్వకంగా సృష్టించటానికి నిమిత్త కారణం కావాలి. జీవుల పుణ్యపాపాలను క్షయం చేయటం కోసం, కొత్త పుణ్యపాపాలు సంపాదించుకోవటం కోసం మొత్తం జగత్తు సృష్టించబడింది. ఇది

నిమిత్త కారణాన్ని చూపించటానికి వాడే సృష్టి కారణం. కాని ఇక్కడ యమధర్మరాజు నిమిత్త కారణాన్ని చూపించటానికి స్థితిమీద ఆధారపడ్డ తర్కాన్ని ఉపయోగిస్తున్నాడు.

నిమిత్త కారణం – చక్కగా సృష్టించబడిన జగత్తు సవ్యంగా సాగుతోందంటే, దాని వెనుక తెలివైన సృష్టికర్త ఉండాలి. ఏ నియమమైనా అధిగమిస్తే జగత్తుకు ఉనికే లేదు. నియమాలు సరిగా ఉన్నాయంటే, ఆ నియమాలకు అధిష్ఠానదేవతలు బ్రహ్మకు భయపడి తమ పనులు తాము సక్రమంగా చేస్తున్నట్లు లెక్క.

తపతి అంటే చేస్తున్నారు. క్రియాపదం. దాన్ని అగ్నికి, సూర్యునికి, ఇంద్రునికి, వాయువుకి కలుపుకోవాలి. అన్నింటినీ మించి ముఖ్యమైనది పంచమదేవత. అతను మృత్యుదేవత. అతను పరుగెడుతున్నాడట. ఈవిషయం చెబుతున్నదెవరు? అక్షరాలా మృత్యుదేవతయైన యమధర్మరాజే. అందరూ యమధర్మరాజుకి భయపడితే, అతను ఈశ్వరునికి భయపడుతున్నాడు. అందుకే బిగ్‌బాస్‌ని పట్టుకోవాలి. మృత్యుభయం ఈశ్వర ఐక్యంవల్లే పోతుంది. జీవ ఈశ్వర ఐక్యం సూచిస్తోంది ఈ మంత్రం కూడా. శివుడే జీవుడు. జీవుడే శివుడు. ఈ ఈశ్వరుడు జగత్తు నిమిత్తకారణం.

### మంత్రం – 4

**ఇహ చేదశకద్ బోద్ధుం ప్రాక్ శరీరస్య విస్రసః।**
**తతః సర్గేషు లోకేషు శరీరత్వాయ కల్పతే।।**

**ప్రతిపదార్థం:** ఇహ – మనుష్యజన్మలో; శరీరస్య విస్రసః ప్రాక్ – శరీరం పోయేలోపల; బోద్ధుం – తెలుసుకోవటానికి; అశకత్ చేత్ – వీలయితే; తతః – లేకపోతే; సర్గేషు లోకేషు– జీవరాశులు ఉన్న లోకాలలో; శరీరత్వాయ – శరీరం; కల్పతే – ఏర్పడుతుంది.

**తాత్పర్యం:** ఇక్కడ, మనుష్య జన్మలో, శరీరం పోయే లోపల ఆత్మను తెలుసుకుంటే సంసారం నుంచి విముక్తి పొందుతాడు (ఇది కలుపుకోవాలి), లేకపోతే మళ్ళీ మళ్ళీ లోకాల్లో పుట్టాల్సి వస్తుంది.

**వివరణ:** మొదటి మూడు మంత్రాల్లోనూ బ్రహ్మను ఉపాదాన కారణంగానూ, నిమిత్త కారణంగానూ చూపించాక, యమధర్మరాజు బ్రహ్మజ్ఞానాన్ని మోక్షసాధనగా చూపిస్తున్నాడు. అవికాక ఆ జ్ఞానం పొందటానికి కావాల్సిన సాధనలు, దాని ఫలం, మోక్షస్వరూపంలాంటి అనేక విషయాలు కూడా చెబుతున్నాడు.

ఈ మంత్రం మనుష్య జన్మని స్తుతిస్తోంది. ఆత్మజ్ఞానం పొందటానికి మనుష్యజన్మ మాత్రమే అనువైన జన్మ. అందుకని శరీరం రాలిపోయే లోపల, ఈ జ్ఞానం పొందటానికి

పూర్తి కృషి చేయాలి. ఈ జన్మలో చేయకపోతే మంచి అవకాశం పోగొట్టుకున్నట్టే. మళ్ళీ మనుష్యజన్మ పొందుతాడన్న నమ్మకం లేదు. శరీరత్వయాకల్పతే అంటున్నాడు. మనుష్య శరీరం అనటం లేదు. ఏదైనా అవచ్చు. అంతకుముందు మంత్రాల్లో స్థాణువుగా కూడా పుడతారన్నాడు. స్వర్గేషు లోకేషు అంటే 14 లోకాల్లో ఎందులోనైనా, ఎలాగైనా పుట్టొచ్చు. యమధర్మరాజు మనమీద జాలికొద్దీ, మనకి విసుగుపుట్టినా, పుట్టకపోయినా, తను విసుగు చెందకుండా తనని తప్పించుకునే మార్గం చెప్పి అలా తప్పించుకోమని చెప్తున్నాడు.

కాని ఈ మంత్రం కొంచెం స్పష్టంగా లేకపోవడంతో మనని కొంత అయోమయంలో పడేస్తుంది. కాని ఎప్పటిలాగే శంకరాచార్యులవారు మనకి సహాయం చేస్తున్నారు. ఒక వ్యక్తి ఈ జన్మలో బ్రహ్మ గురించి తెలుసుకుంటే, అతనికి పునర్జన్మ ఉంటుందని చెప్పినట్టు వస్తుంది. శంకరాచార్యులు, దానికి రెండు షరతులు చేర్చి అర్థం వివరించారు. దానివల్ల వచ్చిన అర్థం ఏమిటి? ఈ జన్మలో బ్రహ్మ గురించి తెలుసుకున్న వ్యక్తికి పునర్జన్మ ఉండదు; ఈ జన్మలో తెలుసుకోకపోతే, పునర్జన్మ ఉంటుంది.

### మంత్రం – 5

**యథాదర్శే తథాత్మని యథా స్వప్నే తథా పితృలోకే।**
**యథాప్సు పరీవ దదృశే తథా గంధర్వలోకే ఛాయాతపయోరివ బ్రహ్మలోకే॥**

**ప్రతిపదార్థం:** యథా ఆదర్శే – అద్దంలో ఎలాగో; తథా ఆత్మని – అలా బుద్ధిలో స్పష్టంగా చూడవచ్చు; యథా స్వప్నే – స్వప్నంలో ఎలాగో; తథా పితృలోకే – పితృలోకంలో అలా అస్పష్టంగా ఉంటుంది; అప్సు – నీటిలో; యథా – ఎలాగో; పరి ఇవ – అస్పష్టంగా; దదృశే– కనబడుతుందో; తథా – అలాగే; గంధర్వలోకే – గంధర్వలోకంలో; ఛాయా తపయోరివ – నీడ ఎండలాగా స్పష్టంగా; బ్రహ్మలోకే – బ్రహ్మలోకంలో.

**తాత్పర్యం:** ఇక్కడ బుద్ధిలో, అద్దంలో స్పష్టంగా కనబడ్డట్టు, పితృలోకంలో కలలోలాగా, గంధర్వలోకంలో నీటిలో లాగా అస్పష్టంగా, బ్రహ్మలోకంలో నీడ ఎండలాగా స్పష్టంగానూ ఆత్మజ్ఞానం కలుగుతుంది.

**వివరణ:** ఈ జ్ఞానం ఎక్కడన్నా పొందవచ్చా? కొన్ని లోకాల్లో కూడా పొందవచ్చు, కాని అన్నిట్లోకి అత్యుత్తమమైనది మనుష్యలోకం. అది ఎలాగో వేరే లోకాల గురించిన వివరణలో చూపిస్తున్నాడు. ముందు మంత్రంలో ఉన్న 'ఇహ'ని ఇక్కడ కలుపుకోవాలంటున్నారు శంకరాచార్యులు. మనుష్యజన్మలో బ్రహ్మజ్ఞానం ప్రత్యేకంగా కలుగుతుంది. పితృలోకం (స్వర్గలోకం), గంధర్వలోకంలో అది స్పష్టంగా ఉండదని చెప్పటానికి కలలానూ, నీటిలో నీడలానూ ఉంటుందంటున్నాడు.

స్పష్టమైన అద్దంలో మన ప్రతిబింబం స్పష్టంగా కనబడుతుంది. అలాగే బుద్ధి అనే అద్దంలో మనని స్పష్టంగా చూసుకోవచ్చు. అంటే మన గురించి తెలుసుకోవచ్చు.

పితృలోకంలో నేర్చుకుంటే కలలో లాగా ఉంటుంది. కల నిముషాల మీద మారుతుంది. ప్రారబ్ధ కర్మ వల్ల రేగిన ఆలోచనల ప్రతిరూపమే స్వప్నం. అది ఆలోచనలంత వేగంగానూ కరిగిపోతుంది. అందుకే ఒక్కోసారి కల గుర్తుండదు. అస్పష్టంగా ఉంటుంది. అందరూ పితృలోకం లేదా స్వర్గ లోకంలో పుణ్య కర్మఫలాన్ని అనుభవించే కార్యక్రమంలో ఉంటారు కాబట్టి వాళ్లకి బ్రహ్మజ్ఞానం పొందటానికి తీరిక ఉండదు. ఉన్నా ఆనందంలో మునిగి తేలుతుండుటం వల్ల జ్ఞానం అరకొరగా ఉంటుంది.

గంధర్వలోకంలోనూ అంతే. రోజంతా ఆటపాటలలో మునిగి తేలుతుంటారు. అక్కడ నేర్చుకుంటే మొహాన్ని నీటిలో చూసుకున్నట్టు ఉంటుంది. నీటిలో రూపురేఖలు వివరంగా తెలీవు. నీరు కదిలితే అసలే కనబడవు.

ఇంక మిగిలింది బ్రహ్మలోకం. ఇక్కడ క్రమముక్తి కలుగుతుంది. ఆత్మవిద్యా అవగాహన ఖచ్చితంగా సాధ్యం. నీడ, వెలుగు ఎంత స్పష్టంగా ఉంటాయో అంత స్పష్టంగా అర్థమవుతుంది. అందులోనూ చెప్పేదెవరు? సాక్షాత్తూ బ్రహ్మదేవుడు. నేర్చుకునేదెక్కడ? సత్యలోకంలో. ఎవరి దగ్గర? సాక్షాత్ చతుర్ముఖబ్రహ్మగారి దగ్గరనుంచి, నేర్చుకునే సాధకుడు కూడా అత్యంత సాత్విక ఉపాధితో ఉన్నాడు. బ్రహ్మగారు చెప్పింది చెప్పినట్టు గ్రహించగలడు. అయితే మరి దీనికన్నా భూలోకంలోనే ఎందుకు శ్రేష్ఠం? రెండు కారణాలు. భూలోకంలో నేర్చుకుంటే జీవన్ముక్తి కలుగుతుంది. జీవన్ముక్తి తరువాత శేషజీవితం ఆనందంగా గడుస్తుంది. బ్రహ్మలోకానికి ఖచ్చితంగా వెళ్ళగలమా? ఇది పెద్ద సందేహమే. జన్మంతా ఉపాసన చేసి, మరణం సమయంలో బ్రహ్మరంధ్రంద్వారా సూక్ష్మశరీరం బ్రహ్మలోకం చేరితే అప్పుడు అవకాశం ఉంటుంది. అందుకని అది గాలిలో దీపం పెట్టడం లాంటిది.

మనుష్యజన్మ పొందడం కష్టమా? మనం ఇప్పుడు ఉన్నది మనుష్యజన్మలోనే. ఎక్కడో ఏదో కాస్త పుణ్యం చేసుకోవటం వల్ల ముందే మనిషిగా పుట్టాము. అందుకని ఏమాత్రం ఆలస్యం చేయవద్దు. వీలున్నంత ఈ జన్మని సద్వినియోగం చేసుకోండి. ఎవరు చెప్పారు? యమధర్మరాజే సూచిస్తున్నాడు. నాకు పని కల్పించవద్దని పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు.

### మంత్రం - 6

**ఇన్ద్రియాణాం పృథగ్భావముదయాస్తమయౌ చ యత్।**
**పృథగుత్పద్యమానానాం మత్వా ధీరో నశోచతి॥**

**ప్రతిపదార్థం:** ఇంద్రియాణాం – ఇంద్రియాలు; పృథగ్భావం – నా నుంచి విభిన్నం; ఉదయాస్తమయౌ చ – ఉదయాన్ని, అస్తమయాన్ని; పృథక్ ఉత్పద్యమానానాం – విడిగా పుట్టి మరణిస్తాయి; మత్వా – ఈ విషయం అర్థమయితే; ధీరాః – వివేకవంతుడు; న శోచతి – దుఃఖించడు.

**తాత్పర్యం:** ఇంద్రియాలు నా నుంచి విభిన్నం. అవి ఉదయించి అస్తమిస్తాయి. అవి విడిగా పుట్టి మరణిస్తాయి. ఈ విషయం అర్థమయిన వివేకవంతుడు దుఃఖించడు.

**వివరణ:** ఇంతకుముందు మంత్రంలో మనుష్య జన్మ ప్రత్యేక జన్మ అనీ, అందులోనే జ్ఞానం స్పష్టంగా పొందవచ్చనీ వచ్చింది. అందుకని సాధకుడు చేయాల్సిన మొదటి సాధన – మనుష్య జన్మ గొప్పతనాన్ని గుర్తించి, దాన్ని వినియోగించుకోవాలి. రెండో సాధన ఆత్మ–అనాత్మ వివేకం చేయాలి. అప్పుడే అహం బ్రహ్మ అని అనగలుగుతాడు.

అహంలో నాలుగు ఉన్నాయి. స్థూల శరీరం, సూక్ష్మ శరీరం, కారణ శరీరం, చైతన్యం. గురువు తత్ త్వం అసి అంటే శిష్యుడు అహం బ్రహ్మ అస్మి అనగలగాలి. కాని మనం స్థూల సూక్ష్మ శరీరాలతో కలిసిపోయి, అనేక బాధలు, బెంగలు పెట్టుకుంటాము. అందువల్ల గురువు నువ్వు ఆనంద స్వరూపుడివి అంటే, ఆయన గురించి చెపుతున్నాడేమో అనుకుంటాం.

మనం త్వం పద శోధన చేయాలి. ఇంద్రియాలు అనాత్మ ప్రపంచాన్ని సూచిస్తాయి. అహం అంటే అనాత్మ నుంచి విడివడి, ఆత్మలో పెనవేసుకోవాలి.

ఆత్మ దృష్ట్యా అహం బ్రహ్మ. వ్యవహారం నడిపే పరికరాల నుండి విడదీసుకోవాలి. ఎలా? జాగృత్, స్వప్న, సుషుప్తి అవస్థలను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఇంద్రియాలు నా స్వరూపం కాదు, నా వ్యవహారానికి తాత్కాలిక పరికరాలని తెలుస్తుంది. ఉదాహరణ కళ్ళజోడు. కళ్ళజోడు ఉంటేనే చూడగలను, లేకపోతే చూడలేను. కాని నాకు ఉనికి ఉంది. వ్యవహారం ముగిసినా, వ్యవహారం నడిపే నేను ఉంటాను.

సమస్య ఎక్కడ ఉంది? కళ్ళజోడును దగ్గరగా పెట్టుకోవటం వల్ల, దాన్ని నేనుగా భావించి, బయట వస్తువుగా భావించను. ముందు ఏం ఉంది అని అడిగితే ఎన్నో చెప్తాను. కళ్ళజోడు గురించి తప్ప. ఎందుకు? అతి సన్నిహితమైన వస్తువు, నేను (సబ్జెక్ట్)గా తోస్తుంది. కాంటాక్ట్ లెన్స్ అయితే ఇంకా సన్నిహితంగా ఉంటాయి. ఇంద్రియాలను జాగ్రదావస్థలో వాడతాను గాని, సుషుప్తిలో వాడను. అవి జాగ్రదావస్థలో పుట్టి, సుషుప్తిలో మనసుతోపాటు లీనమైపోతాయి. ఆత్మకు చావు పుట్టుకలు లేవు. షడ్వికారాలు లేవు.

పృథక్ భావం – మొదటి దశలో ఇంద్రియాలు అనాత్మ. నేను ఆత్మ. అవి ఉదయించి, అస్తమిస్తాయి. నేను కొనసాగుతాను అని తెలుసుకోవాలి. రెండో దశలో అవి నా నించి విభిన్నంగా ఉన్నాయి. నేను నిత్యచైతన్యంగా ఉన్నాను. నేను స్థూల, సూక్ష్మ కారణ శరీరాలకన్నా వ్యతిరిక్తమైన వాడిని అని అర్థమయితే, మూడవ దశలోకి చేరుకుని, అహం బ్రహ్మ అస్మి అని అర్థం చేసుకుంటాము.

ధీరః న శోచతి – ఇది అర్థం చేసుకున్న వివేకవంతునికి శోకం ఉండదు. 'తరతి శోకం ఆత్మవిత్' నేను శరీరాన్ని. నేను అశాశ్వతం అనుకుంటే దుఃఖం ఉంటుంది. శరీరం నేను కాదు అని తెలుసుకుంటాను.

అహం బ్రహ్మ అస్మి జ్ఞానానికి ఆత్మ, అనాత్మ వివేకం ఉండితీరాలి. త్వం పద వివేకం కలిగితే తత్పద ఐక్యం సాధ్యం. ఇదే భావం 7, 8 మంత్రాలలో కూడా.

### మంత్రం – 7

**ఇన్ద్రియేభ్యః పరం మనో మనసః సత్త్వముత్తమమ్।**
**సత్త్వాదధి మహానాత్మా మహతోఽవ్యక్తముత్తమమ్॥**

**ప్రతిపదార్థం:** ఇంద్రియేభ్యః – ఇంద్రియాల కన్నా; పరం మనః – మనసు బలమైనది; మనసః సత్త్వమ్ ఉత్తమమ్ – మనసుకన్నా బుద్ధి బలమైనది; సత్త్వాత్ – బుద్ధికన్నా; ఆత్మా – సమష్టి బుద్ధి; అధి మహాన్ – అమిత శ్రేష్టమైనది; మహతః – సమష్టి బుద్ధికన్నా; అవ్యక్తమ్ ఉత్తమమ్ – అవ్యక్తమ్ ఉత్తమమైనది.

**తాత్పర్యం:** ఇంద్రియాల కన్నా మనసు బలమైనది; మనసు కన్నా బుద్ధి బలమైనది. బుద్ధికన్నా సమష్టి బుద్ధి అమిత శ్రేష్ఠమైనది; శ్రేష్ఠమైన బుద్ధికన్నా అవ్యక్తం శ్రేష్ఠమైనది.

**వివరణ:** 7, 8 మంత్రాలు ఈ ఉపనిషత్తులోనే అంతకుముందు వచ్చిన రెండు మంత్రాలకు దగ్గరగా ఉన్నాయి.

**ఇన్ద్రియేభ్యః పరా హ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః**
**మనసస్తు పరా బుద్ధిః బుద్ధేరాత్మా మహాన్పరః** – కఠ 1.3.10

**మహతః పరమ వ్యక్తమ్ అవ్యక్తాత్ పురుషః పరః**
**పురుషాన్న పరం కించిత్ సా కాష్ఠా సా పరా గతిః** – కఠ 1.3.11

పంచకోశ వివేకం ద్వారా ఆత్మ–అనాత్మ వివేకం చూపిస్తున్నాడు యమధర్మరాజు. ఇంతకుముందు చూసిందే, మళ్ళీ చెప్తున్నాడు దశలవారీగా.

1. ఇంద్రియేభ్యః పరం మనః – దీని ముందు దశ ఊహించుకోవాలి. మన దృష్టిని బాహ్య ప్రపంచం నుంచి మన శరీరం స్థాయికి మరల్చాలి. అందువల్ల మన ఆత్మ–అనాత్మ వివేకం బయట ప్రయాణం కాదు, అంతర్గత ప్రయాణం. స్థూలమైన దాని నుంచి అంతకంతకీ సూక్ష్మమైన దాని వైపుకి, దానికన్నా దగ్గరగా, దానికన్నా శ్రేష్ఠంగా ఉన్న వాటివైపు ప్రయాణిస్తున్నాము. ఇంద్రియాలకన్నా మనసు గొప్పది. ఎలా? మనసు ఇంద్రియాలని అదుపులో పెడుతుంది కాబట్టి, కన్ను పోయిన వైపు మనసు పెట్టకపోతే అది మనను ఆకర్షించదు. అదుపులో పెట్టేది అదుపులో పెట్టబడేదానికన్నా సూక్ష్మంగా ఉంటుంది. అందువల్ల మనసు ఇంకా శక్తివంతమైనది.

2. మనసః సత్త్వముత్తమమ్ – మనసుకన్నా బుద్ధి శ్రేష్ఠమైనది. మనోమయ కోశం కన్నా విజ్ఞానమయ కోశం ఇంకా సూక్ష్మం. మనసు సంకల్ప వికల్పాత్మకమైనది. సంశయాత్మకంగా ఉంటుంది. బుద్ధి నిశ్చయాత్మకం.

3. సత్త్వాత్ అతి మహానాత్మా – ఇక్కడ సత్త్వం అంటే బుద్ధి. ఆత్మ అంటే సమష్టి బుద్ధి. వ్యష్టి బుద్ధి కన్నా సూక్ష్మమైనది, సమష్టి బుద్ధి. వ్యష్టి నుంచి సమష్టికి ప్రయాణం. అహం బ్రహ్మ అస్మి జ్ఞానానికి మనసు సూక్ష్మంగా, లోతుగా, విశాలంగా, తీవ్రంగా ఉండాలి. బ్రహ్మ సూక్ష్మమైన ఆకాశం కన్నా సూక్ష్మం, సర్వవ్యాపకం. సమష్టి బుద్ధి అంటే హిరణ్యగర్భ బుద్ధి. వ్యష్టి సమష్టి నుంచి విడిగా లేదు అని అర్థం చేసుకోవటం వల్ల విశాలభావం ఏర్పడుతుంది. జ్ఞానమయ కోశం కన్నా సమష్టి విజ్ఞానమయ కోశం శ్రేష్ఠం.

4. మహతః అవ్యక్తముత్తమమ్ – సమష్టి బుద్ధికన్నా అవ్యక్తం సూక్ష్మతమం. అవ్యక్తం అంటే సమష్టి ఆనందమయ కోశం లేదా సమష్టి కారణ శరీరం. సమష్టి విజ్ఞానమయ కోశం కన్నా సమష్టి ఆనందమయ కోశం ఇంకా శ్రేష్ఠం, ఇంకా సూక్ష్మం. వ్యష్టి కారణ శరీరం సుషుప్తిలో అనుభవమవుతుంది. మనసు, ఇంద్రియాలు అన్నీ సుషుప్తిలో లయమైనా, పొద్దున లేవగానే మళ్ళీ శక్తి పుంజుకున్నట్టుగా, ప్రళయంలో సృష్టి అవ్యక్తంలోకి వెళ్ళినా, తర్వాత మళ్ళీ వ్యక్తంలోకి వస్తుంది. ప్రయాణం ఆగలేదు. తర్వాత వచ్చే మంత్రంలో కొనసాగుతుంది.

### మంత్రం – 8

**అవ్యక్తాత్తు పరః పురుషో వ్యాపకోఽలిఙ్గ ఏవ చ।**
**యం జ్ఞాత్వా ముచ్యతే జన్తురమృతత్వం చ గచ్ఛతి॥**

**ప్రతిపదార్థం:** అవ్యక్తాత్ తు – అవ్యక్తం కన్నా; పురుషః – ఆత్మచైతన్యం; పరః – శ్రేష్ఠము; వ్యాపకః – సర్వత్రా వ్యాపించినది; అలింగ ఏవ చ – గుణాలు లేని; యం జ్ఞాత్వా – ఈ ఆత్మను

గుర్తిస్తే; జన్తుః – మనిషి; ముచ్యతే – విడివడిలేదు; అమృతత్వం చ – అమరతత్వాన్ని కూడా, గచ్ఛతి – పొందుతాడు.

**తాత్పర్యం:** అవ్యక్తం కన్నా చైతన్యం శ్రేష్ఠం. సర్వ వ్యాపకం, నిర్గుణం. ఆ ఆత్మను గుర్తించిన మనిషి (బంధాల నుండి) విడివడతాడు, అమరత్వాన్ని కూడా పొందుతాడు.

**వివరణ:** ముందు మంత్రంలో భావం కొనసాగుతుంది. అన్ని కార్యకలాపాలు ఆపినప్పుడు అది శూన్యం కాదు. అవ్యక్తం. దానికి వేరే పేర్లు ప్రకృతి, మాయ.

5. అవ్యక్తాత్తు పరః పురుషః – అవ్యక్తం కన్నా శ్రేష్ఠమైనది ఆత్మ లేదా చైతన్యం. ఆత్మ ఎక్కడ దొరుకుతుంది? మనకు దర్శనమిస్తుందా? మనసు శూన్యం చేస్తే ఆత్మ సాక్షాత్కారమవుతుందా? అవదు. మనసు శూన్యంగా ఉంది అన్న ఎఱుక ఉంది. ఎవరూ రాలేదు అని నేను చెపితే, దాని అర్థమేమిటి? నేను తప్ప ఎవరూ రాలేదు అని. నేను ఉన్నానా లేదా అని సందేహం లేదు కదా.

వ్యాపకో అలింగ ఏవ చ – ఏ విధమైన చైతన్యం? సర్వవ్యాపకం. అలగా చూస్తే పరిమితి ఉన్నది, రూపం ఉన్నది. నీరుగా చూస్తే శాశ్వతమైంది. దీనికి గుణాలు లేవు. నిర్గుణ చైతన్యం.

యం జ్ఞాత్వా ముచ్యతే జన్తుః – ఈ నిర్గుణ చైతన్యాన్ని ఎవరు తెలుసుకుంటారో అతను అమృతత్వాన్ని పొందుతాడు. మనిషికి 'జన్తుః' పదం వాడాడు. జాయతే ఇతి జన్తుః అంటే శాశ్వతం కానిది. మనిషి తను అశాశ్వతమైన జంతువు కాదు, శాశ్వతమైన ఆత్మ అని తెలుసుకోవాలి.

అమృతత్త్వం చ గచ్ఛతి – అమరత్వం పొందుతాడు. గచ్ఛతి అంటే వెళ్తాడు. దాన్ని అక్షరాలా తీసుకోకూడదు. బంగారానికి అంటిన అశుద్ధాన్ని తుడిస్తే, బంగారం మెరుస్తుంది. అలాగే అజ్ఞానాన్ని తొలగిస్తే, జ్ఞానం కలుగుతుంది. సంసారం బుద్ధికి సంబంధించిన సమస్య. బుద్ధికి సంబంధించిన సమస్యను బుద్ధితోనే తీర్చాలి.

### మంత్రం – 9

**న సందృశే తిష్ఠతి రూపమస్య న చక్షుషా పశ్యతి కశ్చనైనమ్।**
**హృదా మనీషా మనసాఽభిక్లుప్తో య ఏతద్విదురమృతాస్తే భవన్తి॥**

**ప్రతిపదార్థం:** అస్య – ఆ చైతన్యం యొక్క; రూపమ్ – రూపం; న సందృశే తిష్ఠతి – ఎవరూ చూడలేదు; ఏనమ్ కశ్చన – దానిని ఎవరూ; చక్షుషా న పశ్యతి – కళ్లతో ఎవరూ చూడలేరు; హృదా – అది హృదయంలో ఉంది. మనీషా – బుద్ధితో; మనసా – (ఇక్కడ)

సంయక్ దర్శనం; అభిక్లుప్తః – ప్రకటితమవుతుంది; యే ఏతత్ విదుః – దానిని ఎవరు తెలుసుకుంటారో; తే – వారు; అమృతాః భవన్తి – అమరులు అవుతారు.

**తాత్పర్యం:** ఆ చైతన్యం రూపాన్ని ఎవరూ చూడలేరు. దానిని ఎవరూ కళ్లతో చూడలేరు. అది హృదయంలో ఉంది. జాగృతం చెందిన బుద్ధితో, సంయక్ దర్శనంతో ప్రకటిత మవుతుంది. దానిని ఎవరు తెలుసుకుంటారో వాళ్లు అమరులు అవుతారు.

**వివరణ:** ఇంకో నియమం చెప్తోంది ఉపనిషత్తు. సంయక్ దర్శనం ఉన్న బుద్ధి కావాలి ఆత్మజ్ఞానానికి. మనుష్య జన్మ ఎత్తగానే సరిపోదు. బుద్ధి ఉండగానే చాలదు. దాన్ని వాడాలి. దానితో ఆత్మ, అనాత్మ వివేకం చేయాలి. తత్ పద ఐక్యం తెలుసుకోవాలంటే త్వం పద వివేకం చూపాలి. బ్రహ్మ గురించి ఇంద్రియ అగోచరమనీ, సర్వవ్యాపకమనీ చెప్పి,

> **అశబ్దమస్పర్శమరూపమవ్యయం**
> **తథాఽ**రసం నిత్యమగన్ధవచ్చయత్ – కఠ 1.3.15

అది నువ్వే అంటుంది. ఇది అర్థం చేసుకోవటానికి చాలా ఏకాగ్రత కావాలి.

దీనికి ఒక ఉదాహరణ. పూర్వం ఒక పల్లెటూరులో భార్యాభర్తలు నెత్తిమీద పాలకుండలు మోస్తూ, మాట్లాడుకుంటూ వెళ్ళేవారు. మధ్యలో భార్య ఎక్కడో ఆగుతుంది, కాలి అందె సరిచేసుకోవటానికి. అది గమనించని భర్త మాట్లాడుకుంటూ వెళ్ళిపోతాడు. అలాగే గురువు అన్నమయకోశం నుంచి ప్రయాణం చేయిస్తున్నప్పుడు, మధ్యలో ఏ మనోమయ కోశం దగ్గరో శిష్యుడు ఆగిపోతే, చివర్లో గురువు తత్త్వమసి అన్నప్పుడు శిష్యుడు అయోమయంలో పడతాడు. అసలు సాధారణంగా మనం పూర్తిగా, శ్రద్ధగా ఏదీ వినము. అందుకే విషయం సరిగ్గా అర్థం కాదు.

కాని యమధర్మరాజు చెప్పిన సూక్ష్మబుద్ధి ఉంటే, చిత్త ఏకాగ్రత ఉంటే కేవలం శ్రవణం వల్లే జ్ఞానం పొందుతాము. మనకి ఏకాగ్రత లేదు అనకండి. ఏదైనా పరీక్షాఫలితం (ఆరోగ్యం విషయం కూడా కావచ్చు) వింటున్నప్పుడు, రెండు రోజుల ముందు నుంచే దాని గురించే ఆలోచిస్తాము, దాని గురించే మాట్లాడతాం. అలా ఉండాలి. అలాంటిది ఉంటే టక్కున పట్టేస్తాము. పరీక్షిత్ మహారాజు కేవలం ఏడురోజుల్లో విన్నాడు మహాభారతం, దాని మీదే దృష్టి నిలిపి.

ఉపనిషత్తు ఆత్మ గురించి కొత్తగా చెప్పదు. తప్పుడు భావాలని తొలగిస్తే స్వయంప్రకాశక ఆత్మ వెల్లడి అవుతుంది, బంగారాన్ని మెరుగుపెట్టినట్టుగా. ఆత్మజ్ఞానం అంటే మన దృష్టిని జనం నుంచి చైతన్యానికి మరల్చటం. ఇంతవరకూ మనం స్థూల బుద్ధితో చూస్తున్నాం. అందుకని సూక్ష్మబుద్ధి కావాలి.

యశ్చక్షుషా న పశ్యతి – కేన 1.7

యత్తదద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ – ముండక 1.1.6

ఇక్కడ మళ్ళీ చెప్తోంది ఉపనిషత్తు ఆత్మ ఇంద్రియ అగోచరమని. అంటే తక్కిన ప్రమాణాలకు కూడా అందదు. దానికి సూక్ష్మబుద్ధి కావాలని అంతకు ముందే యమధర్మరాజు చెప్పాడు.

అగ్ర్యయా బుద్ధ్యా – ఏకాగ్ర బుద్ధి కావాలి.

ఎవరైనా ఆత్మను చూసాను, మాట్లాడాను అంటే అతను చూసింది నిర్గుణ ఈశ్వరుడిని కాదు. సగుణ ఈశ్వరుడిని. అది మధ్య స్థాయి మాత్రమే. ఎందుకు? అది చూపులకు దొరకదు.

యశ్చక్షుషా న పశ్యతి – కళ్లు అంటే అన్ని ఇంద్రియాలూ అని అర్థం తీసుకోవాలి.

ఎలా తెలుస్తుంది? గురుశాస్త్ర ఉపదేశం వల్లనే తెలుస్తుంది. ఉదాహరణకు కళ్ళను చూసుకోవాలంటే అద్దంలో చూడాలి. రెండూ బాగుండాలి. అద్దం చూస్తున్నా గుడ్డివాడికి కన్ను కనబడదు. కన్ను బాగుండి, అద్దం బాగుండకపోయినా చూడలేడు. శాస్త్ర ఉపదేశం అద్దం లాంటిది. సంసిద్ధత చెందిన మనసు కన్ను లాంటిది. సూక్ష్మబుద్ధి లేనివాడికి ఎంత చెప్పినా తలకెక్కదు. ఇక్కడ మనసు అంటే సంయక్‌దర్శనం.

బ్రహ్మను బుద్ధితోనే తెలుసుకోవాలి. దాన్ని పక్కన పెట్టే ప్రయత్నం చేయకూడదు. మనసు సంసిద్ధత చెంది ఉండాలి. సంస్కృతమై ఉండాలి. అంటే ఒక పరీక్ష రాయాలంటే దానికి తగ్గట్టుగా అన్నీ నేర్చుకోవాలి. అలాగే దానికి అవసరమైన హాల్ టికెట్ లాంటివి తీసుకెళ్ళాలి.

మనసా అభిక్లుప్తః – ఏకాగ్రత చెందిన మనసుతో వింటే శ్రవణంలోనే అర్థమయిపోతుంది. సంయక్ దర్శనం వల్ల ప్రకాశితమవుతుంది. దానిని ఎవరు తెలుసుకుంటారో వాళ్ళు అమరులు అవుతారు.

ఈ విధంగా ఈ మంత్రంలో సాధన, జ్ఞానం, ఫలం మూడూ చెప్పబడ్డాయి. చిత్త ఏకాగ్రతతో సాధన చేస్తే, అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందుతారు. ఆ జ్ఞానంవల్ల అమృతత్వం అనే ఫలం పొందుతారు. అందువల్ల ఇదొక పరిపూర్ణ మంత్రం. ఒక మహావాక్య మంత్రం.

### మంత్రం – 10

**యదా పంచావతిష్ఠన్తే జ్ఞానాని మనసా సహ।**
**బుద్ధిశ్చ న విచేష్టతే తామాహుః పరమాం గతిమ్॥**

**ప్రతిపదార్థం:** యదా – ఎప్పుడు; పంచ జ్ఞానాని – ఐదు ఇంద్రియాలు; మనసా సహ – మనసుతో పాటు; అవతిష్ఠన్తే – ఏకాగ్రత చెదరకుండా; బుద్ధిశ్చ న విచేష్టతి – బుద్ధి కూడా వేరే ఆలోచన లేకుండా ఉంటుందో; తామ్ – అది; పరమాం గతిమ్ – అతి ఉత్కృష్టమైన స్థితి; ఆహుః – చెప్పబడుతోంది.

**తాత్పర్యం:** ఎప్పుడు పంచేంద్రియాలు, మనసుతో సహా ఏకాగ్రత చెదరకుండా ఉంటాయో, బుద్ధి కూడా వేరే ఆలోచన లేకుండా ఉంటుందో, అది ఉత్కృష్టమైన స్థితి అని చెప్పబడుతోంది.

**వివరణ:** ముందు మంత్రంలో చిత్త ఏకాగ్రత గురించి చెప్పాడు యమధర్మరాజు. ఇది ఏర్పడటానికి ముందే రెండు సాధనలను పేర్కొంది శాస్త్రం – సగుణ ఈశ్వర ఉపాసన, అష్టాంగయోగం. ఈ రెండూ చేసి రావాలి జ్ఞానయోగానికి. అలా వచ్చిన వ్యక్తికి శ్రవణ, మననాలే చాలు జ్ఞానంఫలం పొందటానికి. అవి చేయనివాళ్ళు నిధిధ్యాసనం చేయాలి.

గుర్తుంచుకోండి. యోగ అభ్యాసం ఆత్మజ్ఞానం పొందటానికి కాదు.

ఉపాసనకీ నిదిధ్యాసనకీ మధ్య ఏమిటి తేడా? ఉపాసనలో భేదధ్యానం చేస్తే, నిదిధ్యాసనలో శ్రవణ, మననాల ద్వారా పొందిన అభేదజ్ఞానం ద్వారా భేదభావాన్ని పూర్తిగా చేతన, సుప్తచేతనాత్మక మనసులోంచి తొలగిపోవటానికి ధ్యానం చేస్తారు.

ఆత్మజ్ఞానం కేవలం గురుశాస్త్ర ఉపదేశం ద్వారానే పొందగలరు. అంటే శాస్త్రాన్ని గురువు చెపితే శ్రవణం చేయాలి. యోగాభ్యాసం మనసు ఏకాగ్రత పొందటానికే కాని, సిద్ధులు పొందటానికి కాదు. వేదాంతం యోగాభ్యాసాన్ని, సిద్ధి పొందటాన్ని తీసిపారేయదు కాని, దానివల్ల ఆత్మజ్ఞానం కాని, మోక్షం కాని కలుగదు అంటుంది. ఉదాహరణకు శాస్త్రం నేర్చుకోవటానికి సంగీతం రావటం అర్హత కాదు. అలా అని సంగీతం వస్తే అర్హత లేదు అనలేము. అలాగే సిద్ధులు పొందటానికీ, వేదాంతం నేర్చుకోవటానికీ మధ్య ఏమీ సంబంధం లేదు.

ఏకాగ్రత చూపితే దాన్ని సమాధి అంటారు. కృష్ణభగవానుడు 10, 11 మంత్రాలను ఆధారంగా తీసుకున్నాడు తన మంత్రాలకి,

**యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా।**
**యోగినో యతచిత్తస్య యుంజతో యోగమాత్మనః॥** – గీతా 6.19

అవతిష్ఠంతే – అంటే విశ్రాంతి స్థితిలో ఉన్నాయి. ఇంద్రియాలు, మనసు విశ్రాంతి స్థితిలో ఉన్నాయి. ఎక్కడ? 'ఆత్మని ఏవ' అని కలుపుకోవాలంటున్నారు శంకరాచార్యులు. సృష్టిలో సమస్తం, మనసుతో సహా ఆత్మలోనే సర్వకాల సర్వావస్థలందూ ఉంటే, కష్టపడి

మనసును ఆత్మలో లయం చేయటం ఎందుకు? అంటే ఆత్మను గురించిన ఆలోచన మనసులో వస్తోంది. ఎలా? ముందు ప్రయత్నపూర్వకంగా చేస్తే, తర్వాత దానంతట అదే కలుగుతుంది. ఆ ఆలోచన ఈ మాటల చుట్టూ ఉండాలి.

'బ్రహ్మ సత్యం', 'జగత్ మిథ్య' – ధ్యాన వస్తువుని కాక వేరే ఆలోచించనిది. ఆలోచనలు లేకపోవటం కాదు, ఒకే ఆలోచన ఉండటం. సజాతీయ ప్రత్యయ ప్రవాహం అంటారు దీన్ని. ముందు ప్రయత్నపూర్వకంగా ఒకే ఆలోచన పెంచుకుంటే, దాన్ని సవికల్ప సమాధి అంటారు. దీని ఫలితంగా ఆ ఆలోచన సహజంగా వస్తుంది. కష్టపడి తెచ్చుకోనక్కరలేదు. అలా సహజంగా వస్తే, దాన్ని నిర్వికల్ప సమాధి అంటారు. నిర్వికల్ప సమాధి పొందితే పరమాగతి పొందుతాం. ఇది యోగాభ్యాసంలో ఉత్తమగతి, జీవితంలో కాదు. అటువంటి మనసుతో వేదాంతం మొదలవుతుంది. శ్రవణ, మననాలు చేయటానికి మనసు సిద్ధంగా ఉంటుంది.

శ్రవణ, మననాలు చేసాక నిదిధ్యాసన రెండు రకాలుగా చేయవచ్చు. బ్రహ్మ అభ్యాస రూప నిదిధ్యాసనం లేదా సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం. బ్రహ్మ అభ్యాసరూప నిదిధ్యాసనం అంటే మళ్ళీ మళ్ళీ వినటం, మళ్ళీ రాయటం, బోధించటం వగైరా. సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం అంటే 'సర్వ అధిష్టానం అయిన బ్రహ్మని నేనే లేదా జగత్తుమిథ్య అన్న ఆలోచనని పదే పదే ధ్యానించటం. ఈ రెండు పద్ధతుల్లో బ్రహ్మ అభ్యాసరూప నిదిధ్యాసనం మెరుగైనదని, ఇది చేస్తేచాలని పంచదశిలో స్వామి విద్యారణ్య పేర్కొన్నారు. బోధ పూర్తిగా అర్థం కాక, దాన్ని ఒక విద్యగా మాత్రమే పరిగణించిన వాళ్ళకి సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం కావాలి. బాగా అర్థమయిన వాళ్లకి, అసలు ఏ నిదిధ్యాసనమూ అవసరం లేదు. కేవలం శ్రవణ, మననాలే చాలు.

కాని 10, 11 మంత్రాల్లో యమధర్మరాజు సమాధి అభ్యాసరూప నిదిధ్యాసనం గురించి మాత్రమే మాట్లాడుతున్నాడు. దాన్ని యోగం అన్నాడు. నిర్వికల్ప సమాధిలో మనసు, ఇంద్రియాలు ఏకాగ్రత చెంది ఉంటాయి. ఎందుకంటే సాధకుడూ, సాధ్య వస్తువూ ఒకటే అవుతాయి.

**మంత్రం – 11**

**తాం యోగమితి మన్యన్తే స్థిరామిన్ద్రియధారణామ్।**
**అప్రమత్తస్తదా భవతి యోగో హి ప్రభవాప్యయౌ॥**

**ప్రతిపదార్థం:** ఇంద్రియ ధారణామ్ – ఇంద్రియాలను నిగ్రహించటాన్ని; స్థిరామ్ తాం – స్థిరంగా నిలబడ్డ ఆ స్థితిని; యోగమ్ ఇతి మన్యన్తే – యోగం అని అంటారు; తదా –

అప్పుడు; అప్రమత్తః భవతి – ఆత్మ జాగృతి చెందిన వాడు అవుతాడు; హి – కాని; యోగః– యోగస్థితి; ప్రభవాప్యయౌ – వృద్ధి, క్షయాలకు లోనవుతుంది.

**తాత్పర్యం:** ఇంద్రియాలను నిగ్రహించటాన్ని, స్థిరంగా నిలబడ్డ ఆ స్థితిని యోగం అంటారు. ఆ స్థితిని పొందినవాడు ఆత్మ జాగృతి చెందినవాడు అవుతాడు. కాని యోగసిద్ధి వృద్ధి, క్షయాలకు లోనవుతుంది.

**వివరణ:** ఇంద్రియాలను నిగ్రహించటాన్ని నిర్వికల్ప సమాధి అంటారు. ఇంద్రియాలు స్థిరంగా ఎక్కువసేపు ఉండవు. ముందు ఏకాగ్రత ఉండదు. ఒక ప్రసంగం వింటుండగా, మన ముందు నుంచి ఎవరైనా వెళ్తే వాళ్ళని చూస్తాము. ఏకాగ్రత చెదురుతుంది. బాహ్యంగా చెదరకపోయినా, ఆలోచనలు స్థిరంగా ఉండవు. పిల్లలకు చిత్త ఏకాగ్రత బాగా ఉంటుంది. కాని మనకు ఎదిగినకొద్దీ తగ్గుతుంది. వృద్ధి, క్షయాలకు లోనవుతుంది. అలా అవకుండా మనసుకు శిక్షణనివ్వాలి.

ఈ మంత్రం కూడా సమాధి అభ్యాస నిధి ధ్యాసనం గురించి మాట్లాడుతోంది. యోగం అంటే ఐక్యం.ఇక్కడ యోగం అంటే అనాత్మ నుంచి విడివడటం. ఎందుకంటే జీవాత్మ, పరమాత్మ ఐక్యం ముందే ఉంది. అది సాధ్యవస్తువు కాదు. ఇంకో మాటలో చెప్పాలంటే, కర్తృత్వ భోక్తృత్వం లాంటి లక్షణాలను దేహేంద్రియ మనో బుద్ధులకు అధ్యాసం చేసిన అనాత్మను విడదీసిన జీవాత్మే పరమాత్మ. అందువల్ల శంకరాచార్యులు, యోగం అంటే ఇక్కడ వియోగంగా తీసుకోవాలి అంటున్నారు. ఎందుకంటే ఎప్పుడైతే జీవాత్మను అనాత్మ నుంచి విడదీసి చూస్తామో అప్పుడే అది పరమాత్మ. అందువల్ల యోగం అన్న పదం వ్యతిరేక అర్థాన్ని సూచించటానికి వాడబడింది. దీన్ని విపరీత లక్షణం అంటారు.

అయితే, ఆత్మమీద అధ్యాసం చేసిన ఈ అనాత్మను విడదీసి చూడటం ఎలా? మనసుని శూన్యం చేయటం వల్ల మాత్రం కాదు. జ్ఞానంతో కూడిన ఆలోచనలే ఈ అధ్యాసని పోగొట్టగలవు. అంటే నిధి ధ్యాసన చేయాలి. అందులో బ్రహ్మసత్యం, జగత్తు మిథ్య, అహం బ్రహ్మ లాంటి ఆలోచనలు ప్రయత్నపూర్వకంగా తెచ్చుకోవాలి.

ముందు మంత్రంలో చెప్పినట్టుగా, ఈ నిదిధ్యాసనం అన్నది శ్రవణ, మననాల ద్వారా జ్ఞానం పొందినవాళ్ళే చేయాలి. ఇది జ్ఞానం పొందటానికో, సిద్ధులు పొందటానికో, మోక్షం పొందటానికో కాదు. మరి అయితే నిధి ధ్యాసనం ఎందుకు? నేర్చుకున్న జ్ఞానాన్ని జీర్ణించుకోవటానికి. వేరే వ్యాపకాలూ, ఆలోచనలూ లేకుండా, ఆ ధ్యాసలో నిలవటానికి. దానివల్ల విపరీత భావనలు పోయి, నేను బ్రహ్మని అన్న భావన నిలుస్తుంది. ఈ ఆలోచన

సుప్త చేతనాత్మక మనసులో స్థిరంగా నిలబడి, మనకి సహజంగా కలిగేదాకా చేస్తూనే ఉండాలి నిధి ధ్యాసనం.

నిజానికి భగవద్గీతలో ఆరవ అధ్యాయంలోని 47 శ్లోకాలూ ఈ రెండు మంత్రాల మీద వ్యాఖ్యానమే.

**మంత్రం – 12**

**నైవ వాచా న మనసా ప్రాప్తుం శక్యో న చక్షుషా।**
**అస్తీతి బ్రువతోఽన్యత్ర కథం తదుపలభ్యతే॥**

**ప్రతిపదార్థం:** వాచా – మాటల చేతనో; మనసా – మనసు చేతనో; చక్షుషా – కన్నుల చేతనో; ప్రాప్తుం – పొందటాన్ని; న శక్యః ఏవ – సాధ్యం కాదు; అస్తి ఇతి బ్రువతః – అది ఉన్నది అని నమ్మినవాళ్లే అర్థం చేసుకోగలరు; అన్యత్ర – తక్కిన వాళ్ళు; కథం తదుప లభ్యతే – ఎలా నేను బ్రహ్మను అనుకోగలడు?

**తాత్పర్యం:** మాటల చేతనో, మనసు చేతనో, కన్నుల చేతనో ఈ ఆత్మను పొందటానికి సాధ్యం కాదు. అది ఉన్నది అని నమ్మినవాళ్ళే అర్థం చేసుకోగలరు. తక్కినవాళ్ళు ఎలా నేను బ్రహ్మ అనుకోగలడు? (అంటే అనుకోలేడు)

**వివరణ:** ఈ మంత్రంలో ఇంకో సాధన గురించి చెప్తున్నాడు యమధర్మరాజు. అంతకు ముందు యోగాభ్యాస లేదా నిదిధ్యాసన. ఇప్పుడు శ్రద్ధ. నిర్గుణ బ్రహ్మ ఉందన్న శ్రద్ధ. నిర్గుణ బ్రహ్మ గురించి చెప్పిన కొద్దీ అనుమానం ఇంద్రియ అగోచరం కాబట్టి.

**అశబ్దమ స్పర్శమరూప మవ్యయం**
**తథాఽరసం నిత్య మగన్ధవచ్చయత్।** – కఠ 1.3.1 5

మనసుకి అందనిది, తర్కానికి అందనిది అంటే బ్రహ్మ ఉందా, లేదా అన్న అనుమానం, కలుగుతుంది. బ్రహ్మ గురించి ఇదంతా వింటే ఇలా హాస్యాస్పదంగా ఉంటుందని చెప్పే ఒక శ్లోకం సంస్కృతంలో ఉంది.

వంధ్యాపుత్ర గమనః
మృగతృష్ణాం బసిస్నాతః
కపుష్పమత శేఖరః
శశి శృంగ ధనుర్ధరః

గొడ్రాలు కొడుకు వెళుతున్నాడు; మృగతృష్ణలో స్నానంచేసి, ఆకాశంలో పూసిన పూలతో అలంకరించుకున్నాడు. కుందేలు కొమ్ముతో చేసిన ధనుస్సు ధరించాడు అని ఈ శ్లోకం

అర్థం. దీనిలా ఉంది మీ నిర్గుణబ్రహ్మ వర్ణన అంటారు అనాలోచనాపరులు. పిచ్చెక్కినట్టు ఉంటుంది బ్రహ్మ గురించిన వర్ణన. అందుకే గుణాలు లేని బ్రహ్మ లేడనేస్తారు కొందరు.

బ్రహ్మ అస్తి అనే వాళ్లని అస్తిత్వవాదులు అంటారు. అస్థిత్వ జ్ఞానాన్ని శ్రద్ధ ఉన్నవాళ్ళే పొందగలరు. వాళ్ళు వేదాంత బోధని నమ్ముతారు.

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః।**
**జ్ఞానం లబ్ధ్వా పరామ్ శాంతిమ్ అచిరేణాధిగచ్ఛతి॥** – గీత 4.39

బ్రహ్మ అస్థి అని తెలుసుకోవటానికి శాస్త్రమొక్కటే ప్రమాణం. అందుకే శృతిని ప్రమాణంగా తీసుకుని, మనం అనుభవిస్తున్న ద్వైత ప్రపంచాన్ని మిథ్యగా తెలుసుకోవాలి. అది శాస్త్రం మీద శ్రద్ధ ఉంటే కాని సాధ్యం కాదు. శ్రద్ధ అంటే నమ్మకం, గురి, గౌరవం వగైరా. శాస్త్రం మీద శ్రద్ధ ఉండాలి. శ్రద్ధ అంటే ఏమిటో 12,13 మంత్రాల్లో చూపిస్తున్నాడు యమధర్మరాజు.

శాస్త్రం కొన్ని చోట్ల బ్రహ్మని సత్‌రూపంగాను, కొన్ని చోట్ల చిత్ రూపంగానూ చూపిస్తుంది. 'చిత్' రూపంగా వర్ణన చాలా తక్కువ ఉంటుంది. అలాంటి అరుదైన వర్ణనల్లో ఇది ఒకటి. జగత్తు కారణం బ్రహ్మగా అస్తి అని శంకరాచార్యులు నిరూపిస్తున్నారు. బ్రహ్మను కారణంగా ఒప్పుకున్నాక, తార్కికంగా రెండు దశల్లో బ్రహ్మ అస్తి అని నిరూపించవచ్చు. ఈ తర్కాన్ని శాస్త్ర సమ్మత తర్కం అంటారు.

మొదటి దశలో కార్యం ఉంటే, కారణం ఉంది. కుండ ఉంటే, దానికి కారణమైన మట్టి కూడ ఉన్నట్టే. మట్టి లేకుండా కుండలేదు. రెండో దశలో, కార్యం పోయినా, కారణం – ఉంది. ఉత్పత్తి అయిన ఏ వస్తువుకైనా రెండు అంశాలు ఉంటాయి. నామరూపాలు, దాని అధిష్టానం. అంటే కుండ కుండ నామరూపాలు, దాని అధిష్టానం మట్టి. కుండ నామ రూపాలు పోయినా, అధిష్టానం మిగులుతుంది. బంగారు ఆభరణాలకి నామరూపాలు – గాజు, గొలుసు వగైరా. వాటి నామరూపాలు పోయినా బంగారం ముద్దగా మిగులుతుంది. నామరూపాలు పోయినా, వాటి అసలు కారణంకి వెనక్కి వెళితే అది అంతకంతకూ సూక్ష్మ కారణమవుతుంది. ఉదాహరణకి ఒక చొక్కా తీసుకుంటే, దాని నామరూపాలు తీసేస్తే అది ఒక గుడ్డగా మిగులుతుంది. ఇంకా విశ్లేషిస్తూ పోతే ఫైబర్‌గా, దారంగా అలా అలా వెనక్కి వెళ్ళాల్సి ఉంటుంది. గుడ్డ, ఫైబర్‌లాంటివి మధ్యలో వచ్చేకారణం. అసలు కారణం చాలా సూక్ష్మంగా ఉంటుంది.

అలాగే జగత్తు అనే కార్యానికి, కారణం వెతుక్కుంటూ పోతే ఎన్నో మధ్య కారణాలు వస్తాయి. కొన్ని దశలు దాటాక, సూక్ష్మ కారణం కంటికి కనబడదు. మధ్య కారణాలను బట్టి, ఆ కారణాన్ని అంగీకరించాలి. అలా చేస్తూ పోతే బ్రహ్మ అస్తి అని తేలుతుంది.

అందుకని సాధకుడు మొదట్లో శాస్త్రం మీద కేవలం శ్రద్ధ ఉంచి, బ్రహ్మ అస్తిత్వ భావనని పెంచుకోవాలి. 'బ్రహ్మ అస్తిత్వ బుద్ధి', 'బ్రహ్మ అస్మి' సత్యానికి తీసుకువెళుతుంది. ఈ బ్రహ్మ అస్తిత్వ బుద్ధి లేకపోతే, మోక్షం సాధ్యం కాదు. శాస్త్రం ఈ విధంగా చెప్పకుండా రెండు వ్యతిరేక పదాలతో చెప్తోంది. అలా చెప్పటం వల్ల నొక్కి వక్కాణించటం జరుగుతుంది.

అన్యత్ర కథం తదుపలభ్యతే – శ్రద్ధ లేనివాడు, నేను బ్రహ్మని అని ఎలా అనుకోగలడు? ఇది ప్రశ్న కాదు. అనుకోలేడు అని నొక్కి వక్కాణించటం.

**మంత్రం – 13**

**అస్తీత్యేవోపలబ్ధవ్యః తత్త్వభావేన చోభయోః।**
**అస్తీత్యేవోపలబ్ధస్య తత్త్వభావః ప్రసీదతి॥**

**ప్రతిపదార్థం:** అస్తి – ఉన్నది; ఇతి ఏవ – అని; తత్త్వ భావేన ఉపలబ్ధవ్యః – సత్యం గ్రహించాలి; ఉభయోః – రెండింటిలో; అస్తి – ఉంది; ఇతి ఏవ – అని; ఉపలబ్ధస్య – గ్రహించేవానికి; తత్త్వభావః – సత్యస్థితి అనుభూతి; ప్రసీదతి – సహజంగానే ప్రాప్తిస్తుంది.

**తాత్పర్యం:** ఈ సత్యం 'ఉన్నది' అని మొదట తెలుసుకోవాలి. తర్వాత దాన్ని సత్యస్థితిలో గ్రహించాలి. ఉన్నది అని లోతుగా గ్రహించినప్పుడు, దాన్నుంచి సత్యస్థితి అనుభూతి, సహజంగానే ప్రాప్తిస్తుంది.

**వివరణ:** శ్రద్ధ ఉంటే బ్రహ్మ అస్తి అంటాడు. ఈ నమ్మకంతో మొదలుపెడితే బ్రహ్మ అస్థిత్వ జ్ఞానం (బ్రహ్మ అస్మి) నుంచి (నేను బ్రహ్మను) జ్ఞానంకు వెళతాడు. బ్రహ్మ అస్తి అన్న జ్ఞానాన్ని పరోక్షజ్ఞానం అంటారు. ఇది శ్రద్ధ వల్ల వస్తుంది. బ్రహ్మ అస్మి అన్న జ్ఞానాన్ని అపరోక్ష జ్ఞానం అంటారు. యమధర్మరాజు దీన్ని తత్త్వభావ జ్ఞానం అంటున్నాడు. బ్రహ్మ అస్మి వెంటనే రాదు. బ్రహ్మనాస్తి నుంచి బ్రహ్మ అస్తికి వెళ్లాలి. తర్వాత బ్రహ్మ అస్తి నుంచి బ్రహ్మ అస్మికి రావాలి.

బ్రహ్మ అస్తి అన్నప్పుడు, బ్రహ్మ అస్తిత్వాన్ని కారణరూపంలో నిరూపిస్తున్నాము. అందువల్ల అస్తిత్వ జ్ఞానాన్ని కారణత్వజ్ఞానం అంటారు. కాని కారణత్వ జ్ఞానం అంతిమ జ్ఞానం కాదు. బ్రహ్మను కార్యకారణ విలక్షణంగా చూపించే జ్ఞానాన్ని తత్త్వభావ జ్ఞానం అంటారు. అందువల్ల శంకరాచార్యులు అస్తిత్వ జ్ఞానాన్ని కారణత్వ జ్ఞానంగానూ, తత్త్వభావ జ్ఞానాన్ని కార్యకారణ విలక్షణజ్ఞానంగానూ చూపిస్తున్నారు.

ఇలా బ్రహ్మను కార్యకారణ విలక్షణంగా చూపించటానికి వేదాంతం ఒక తేలిక పద్ధతిని పాటిస్తుంది. దాన్ని అధ్యారోప అపవాదన్యాయం అంటారు. ఏమిటది?

ముందు ఒక ఉదాహరణ చూద్దాం. ఒక కుండని తీసుకుంటే కుండ కార్యం, మట్టి దానికి కారణం – అందువల్ల కుండ అనే కార్యం నుంచీ, మట్టి అనే కారణాన్ని చూపిస్తోంది శాస్త్రం. మట్టి దాని కారణం అని తేల్చాక, కుండని మిథ్యగా కొట్టిపారేస్తుంది. ఎందుకు? మట్టి లేందే కుండకి విడిగా ఉనికి లేదు. అంటే ఇప్పుడు కార్యం లేదు, కారణం మాత్రం ఉంది. ఎప్పుడైతే కార్యం లేదో, కారణ లక్షణం లేదు మట్టికి. ఇంక మిగిలింది ఏమిటి? కార్యకారణ విలక్షణ మట్టి.

ఇప్పుడు దీన్ని జగత్తు బ్రహ్మలకి ఉపయోగించి చూద్దాం. జగత్తు కార్యం,బ్రహ్మ దానికి కారణం. అందువల్ల జగత్తు అనే కార్యం నుంచీ, బ్రహ్మ అనే కారణాన్ని చూపిస్తోంది శాస్త్రం. బ్రహ్మ దాని కారణం అని తేల్చాక, జగత్తును మిథ్య అని కొట్టిపారేస్తుంది. ఎందుకు? బ్రహ్మ లేనిదే జగత్తుకి విడిగా ఉనికి లేదు. అంటే ఇప్పుడు కార్యం లేదు, కారణం మాత్రం ఉంది. ఎప్పుడైతే కార్యం లేదో, కారణ లక్షణం లేదు బ్రహ్మకు. ఇంక మిగిలింది ఏమిటి? కార్యకారణ విలక్షణ బ్రహ్మ. బ్రహ్మను జగత్తు కారణంగా అంగీకరించటాన్ని అధ్యారోప అనీ, జగత్తు కారణలక్షణాన్ని కొట్టిపారేయటాన్ని అపవాదం అనీ అంటారు. కార్యకారణ విలక్షణ బ్రహ్మ నిర్వికార బ్రహ్మ, కారణం బ్రహ్మ అన్నప్పుడు సవికార బ్రహ్మ అవుతాడు. ఎందుకంటే అధ్యారోప అపవాదం న్యాయానికి ఆధారం కాబట్టి ఇది చాలా ముఖ్యమైన మంత్రం.

ముందు బ్రహ్మను సోపాధిక బ్రహ్మ లేదా కారణం బ్రహ్మగా తెలుసుకున్నాక, నిరుపాధిక బ్రహ్మ లేదా కార్యకారణ విలక్షణ బ్రహ్మగా తెలుసుకోవాలని శాస్త్రం అంటోంది. బ్రహ్మసూత్రాలు, తైత్తరీయ ఉపనిషత్తు ముందు బ్రహ్మని జగత్తుకారణంగా చూపించి తర్వాతే కార్యకారణ విలక్షణ బ్రహ్మగా చూపించాయి.

లక్షణాలు లేని, వస్తువు కాని బ్రహ్మని ఎలా చూస్తాము? అందుకే దీనికి సూక్ష్మ బుద్ధి కావాలి. ఇంత కష్టమయింది కాబట్టే యమధర్మరాజే ముందు మంత్రంలో చెప్పాడు– ఆశ్చర్యోవక్తా, కుశలోస్య శిష్యా– అందుకని శాస్త్రాన్ని గురువు మీద, బోధల మీద శ్రద్ధతో వెళ్ళి, శంక చూపకుండా నేర్చుకోవాలి. రాబోయే మంత్రాల్లో బ్రహ్మవిద్యాఫలం వస్తుంది.

### మంత్రం –14

**యదా సర్వే ప్రముచ్యంతే కామా యేఽస్య హృది శ్రితాః।**
**అథ మర్త్యోఽమృతో భవతి అత్ర బ్రహ్మ సమశ్నుతే॥**

**ప్రతిపదార్థం:** యదా – ఎప్పుడు; హృది శ్రితాః – మనసుకి చెందిన; సర్వే కామాః – అన్ని కోరికలూ; ప్రముచ్యంతే – తొలగిపోతాయో, అస్య – అతనికి; అథ – తర్వాత; మర్త్య –

మనిషి; అమృతో భవతి – అమరుడు అవుతాడు; అత్ర – ఇక్కడే; బ్రహ్మ సముశ్నుతే – బ్రహ్మ ప్రాప్తిని పొందుతాడు.

**తాత్పర్యం:** మనసులో ఉత్పన్నమయ్యే అన్ని కోరికలూ ఎప్పుడు తొలగిపోతాయో, అపుడు మనిషి అమరుడు అవుతాడు. ఇక్కడే ఇప్పుడే బ్రహ్మ ప్రాప్తిని పొందుతాడు.

**వివరణ:** 14, 15 మంత్రాలు ఫలాన్ని సూచిస్తాయి. ఇది అద్వైత వాదులకు చాలా ముఖ్యమైన మంత్రం. ఎందుకంటే దీనితో విశిష్టాద్వైతుల వాదనను ఖండించవచ్చు. విశిష్టాద్వైతులు ఇక్కడే, ఇప్పుడే జీవన్ముక్తి అంగీకరించరు. శుక్లగతిలో వైకుంఠంకి వెళ్ళాలని, మోక్షం మరణం తర్వాత మాత్రమే సాధ్యమనీ అంటారు వాళ్ళు. మనం కూడా శుక్లగతిలో స్వర్గలోక ప్రయాణం అంగీకరిస్తాము కాని, అది క్రమముక్తికి మార్గం కాని, మోక్షానికి కాదంటాము. క్రమముక్తి కూడా మోక్షం పొందటానికి ఒక మార్గమే కాని, అది ఆలశ్యమవుతుంది. జీవ–బ్రహ్మ ఐక్యం ద్వారా ఇక్కడే, ఇప్పుడే మోక్షం పొందవచ్చు.

ముందు మంత్రంలో సగుణ, నిర్గుణ బ్రహ్మల గురించిన చర్చ వచ్చింది. దాన్ని గీతలో ఏడవ అధ్యాయంలోనూ, తొమ్మిదవ అధ్యాయంలోనూ జ్ఞానం, విజ్ఞానంగా పేర్కొన్నాడు శ్రీకృష్ణభగవానుడు. అపరాప్రకృతి లేదా సగుణ బ్రహ్మజ్ఞానాన్ని జ్ఞానమనీ పరాప్రకృతి లేదా నిర్గుణ బ్రహ్మజ్ఞానాన్ని విజ్ఞానం అనీ అంటారు. వాటి ఫలాలను ఈ మంత్రంలోనూ, రాబోయే మంత్రాల్లోనూ చూస్తాము. 14, 15 మంత్రాలు నిర్గుణ బ్రహ్మ జ్ఞాన విద్యా ఫలాన్ని చూపిస్తాయి. ఒక ఫలం– సర్వకామ నివృత్తి, ఇంకోటి పూర్ణత్వం. అజ్ఞానం వల్ల మనుష్యులు తమని అపూర్ణ అనాత్మగా పరిగణించి, అనాత్మ వస్తువులను కోరతారు. అనాత్మ వస్తువుల ద్వారా అపూర్ణత్వం నుంచి పూర్ణత్వం పొందాలనుకుంటారు. కాని విజ్ఞానం అలాంటి కోరికల నుంచి విడుదల చేస్తుంది. దీన్ని సర్వకామ నివృత్తి అంటారు.

సర్వకామ నివృత్తి అంటే అధార్మిక కోరికలనుంచి, బంధించే కోరికల నుంచి విముక్తి. అంటే జ్ఞానిలో ధార్మిక, బంధవిముక్తి కలిగించే కోరికలు ఉంటాయి కాని వాటిని పట్టించుకోడు. అధార్మిక, బంధకత్వ కోరికలను తన మనసు నుంచి పూర్తిగా తొలగిస్తాడు.

అజ్ఞానం వల్ల నేను చేస్తున్నాననే అహంకారం కలుగుతుంది. దానివల్ల కర్తృత్వ భావన కలుగుతుంది. కోరికలకు తగ్గ కర్మలు చేస్తారు. చేసే కర్మలు పుణ్యపాపాలని ఇచ్చి, వాటికి తగ్గట్టుగా సుఖదు:ఖాలని ఇస్తాయి. దానికి తగ్గట్టుగా పునర్జన్మ ఉంటుంది.

జ్ఞానికి మాత్రం అన్ని కోరికలూ తొలగిపోతాయి. పునరపి జననం ఉండదు. పునర్జన్మ గురించి శ్రీకృష్ణభగవానుడు 8వ అధ్యాయంలో పేర్కొన్నాడు.

**యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేవరమ్।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః॥** – గీత 8.6

అందువల్ల పునర్జన్మ ఉండదు. అమృతత్వం పొందుతాడు. జ్ఞాని ఇక్కడే, ఇప్పుడే జీవన్ముక్తుడవుతాడు. తక్కిన మతాలలో జీవించివుండగా ముక్తి సాధ్యం కాదు. హిందూమతంలో కూడా పుణ్యలోకాలకి వెళ్లటం అన్నభావన కొందరిలో ఉంది. మోక్షం అంటే ఎక్కడికో వెళ్లటం కాదు. జీవన్ముక్తి అని ఈ మంత్రంలో తెలుస్తుంది.

### మంత్రం – 15

**యదా సర్వే ప్రభిద్యన్తే హృదయస్యేహ గ్రన్థయః।**
**అథ మర్త్యోఽమృతో భవతి ఏతావద్ధ్యనుశాసనమ్॥**

**ప్రతిపదార్థం:** ఇహ – ఇక్కడే; హృదయస్య – మనసులో; సర్వే గ్రన్థయః – అన్ని ముడులూ; యదా ప్రభిద్యన్తే – ఎప్పుడు విడిపోతాయో; అథమర్త్యః – అప్పుడు మనిషి; అమృతః భవతి– అమరుడు అవుతాడు; ఏతావద్ధ్యను శాసనమ్ – ఇంతే ఈ ఉపదేశం.

**తాత్పర్యం:** మనసు యొక్క అన్ని ముడులూ ఇక్కడే విడిపోయినప్పుడు మనిషి అమరుడవుతాడు. ఇంతే ఈ ఉపదేశం.

**వివరణ:** ముందు మంత్రంలో కోరికలను నాశనం చేస్తే అమరత్వం పొందుతారని ఉంది. వాటి మూలమేమిటి? ఈ మంత్రంలో దానికి జవాబు వస్తుంది. కోరికలకు మూలం మనసులో ఉన్న గ్రంథులు.

**భిద్యతే హృదయ గ్రన్థిః ఛిద్యన్తే సర్వసంశయాః।**
**క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే॥** – ముండక 2.2.8

ఈ హృదయ గ్రంథిని అనేక సందర్భాలలో అనేక విధాలుగా వివరించింది శాస్త్రం. ముండకలో గ్రంథి అన్నపదం మూడు చోట్ల వస్తుంది. ఒకచోట శంకరాచార్యులు దాన్ని కోరికగానే తీసుకున్నారు. కాని ఇక్కడ హృదయ గ్రంథి అంటే, శంకరాచార్యులు, అజ్ఞానపు భావనలు అంటున్నారు. అజ్ఞానం వల్ల అనాత్మ అభిమానం కలుగుతుంది. 'నేను శరీరాన్ని', 'ఇది నాది,' 'నేను సుఖంగా ఉన్నాను,' 'నేను దుఃఖంలో ఉన్నాను' వగైరా. దీన్ని అన్యోన్య అధ్యారోపం అంటారు. ఇది అపూర్ణత్వంలోకి దారితీస్తుంది. ఇది మూడు గ్రంథుల్లోకి దారితీస్తుంది. ఇవి ఆత్మజ్ఞానం వల్లనే విడివడతాయి. శంకరులు అజ్ఞాన ముడులను విడదీస్తున్నాడు. అజ్ఞానం ముడి ఇక విడిపోతే కర్మ, ఉపాసనల అవసరం లేదు.

'గ్రంథి' అంటే ముడికి ఇంకో అర్థం కూడా ఉంది. ముడి రెండింటిని కలుపుతుంది. ఉదాహరణకు పెళ్ళిలో వేసే మూడు ముళ్ళు ఇద్దరిని పెనవేస్తాయి. వేదాంతంలో అజ్ఞానం అనే ముడి ఆత్మను, దేహేంద్రియ మనోబుద్ధులతో ముడివేసింది.

అహంకార మమకార గ్రంథిః ఏవ అవిద్యా గ్రంథిః.

జ్ఞానికి అంటే శరీర అభిమానం పోతుంది. అశాశ్వత భావన పోతుంది. ఏతావద్ధ్యను శాసనమ్ – ఇదే నా బోధ, ఉపదేశం అని ముగిస్తున్నాడు యమధర్మరాజు.

### మంత్రం – 16

**శతం చైకా చ హృదయస్య నాడ్య స్తాసాం మూర్ధనమభినిఃసృతైకా।**
**తయోర్ధ్వమాయన్ అమృతత్వమేతి విష్వఙ్న్యా ఉత్క్రమణే భవన్తి॥**

**ప్రతిపదార్థం:** హృదయస్య నాడ్యః – హృదయం యొక్క నాడులు; శతం చ ఏకాచ – నూట ఒక్కటి; తాసాం ఏకాః – వాటిలోంచి ఒకటి; మూర్ధానమ్ – శిరస్సుపై భాగాన్ని అభినిః సృతా– చొచ్చుకుని పోతుంది. తయా ఊర్ధ్వమ్ – దాని ద్వారా పైకి, ఆయన్ – వెళ్లేవాడు; అమృతత్వమ్ ఏతి – అమరత్వాన్ని పొందుతాడు (క్రమ ముక్తి); అన్యాం – వేరే నాడుల ద్వారా; ఉత్క్రమణే – బయటకి వచ్చి– విష్వఙ్ భవన్తి – పలుదిశలుగా వేరే లోకాలకి వెళ్తారు.

**తాత్పర్యం:** హృదయంలో నూటొక్క నాడులున్నాయి. ఉపాసకుని ప్రాణం మరణం తర్వాత సుషుమ్నానాడి నుంచి బ్రహ్మ రంధ్రం ద్వారా శుక్లగతిలో బ్రహ్మలోకం వెళుతుంది. ఉపాసకుడు తర్వాత క్రమముక్తి పొందుతాడు. ఉపాసకుడు కాని వ్యక్తి, వివిధ నాడుల ద్వారా వివిధ లోకాలకు వెళ్తాడు.

**వివరణ:** ఈ ఉపనిషత్తు ప్రధాన బోధ నిర్గుణ బ్రహ్మజ్ఞానం, దాని ఫలం ఇక్కడే, ఇప్పుడే జీవన్ముక్తి. అంటే జ్ఞానికి ప్రయాణం లేదు. అంతేకాక బ్రహ్మవిద్యాసాధనలు, బ్రహ్మవిద్య స్వరూపం కూడా చర్చించింది. కాని ముగించే ముందు ఉపనిషత్తు అజ్ఞాని గురించి కూడా చెప్పదలచుకుంది. అజ్ఞాని చేసేది సగుణ ఈశ్వర ఉపాసన కాబట్టి అతనికి ఊర్ధ్వలోకాలకి ప్రయాణం ఉంటుంది. అందువల్ల ఉపనిషత్తు కొంచెం పక్కకి వెళ్లి రెండు రకాల అజ్ఞానుల గురించి మాట్లాడుతోంది. వాళ్ళు అజ్ఞాని ఉపాసకులు, అజ్ఞాని కర్మఠులు.

వీళ్ళు అజ్ఞాని ఉపాసకులు. శుక్లగతి ద్వారా బ్రహ్మలోకానికి వెళ్ళి క్రమ ముక్తి పొందుతారు. అజ్ఞాని కర్మఠులు కృష్ణగతి ద్వారా స్వర్గలోకానికి వెళ్ళి, పుణ్యం తీరాక, మళ్ళీ పునర్జన్మ పొందుతారు. క్రమ ముక్తి గురించి చెప్పటానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి దీని

ద్వారా జీవన్ముక్తి స్తుతి చేయటం. ఇంకో కారణం నచికేతుడు, తన రెండో కోరిక కింద, స్వర్గలోక ప్రాప్తికి చేయాల్సిన యజ్ఞం గురించి కోరాడు. ఆ సందర్భంలో యమధర్మరాజు ఒక యజ్ఞం నేర్పి, తర్వాత దానికి నాచికేతాగ్ని అని పేరు పెట్టాడు. అంతటితో ఆగకుండా, యమధర్మరాజే స్వయంగా నాచికేతాగ్ని యజ్ఞంలో విరాట్ ఉపాసన కలిపాడు. అలా కర్మకు ఉపాసన జోడిస్తే దాన్ని కర్మ ఉపాసన సముచ్చయం అంటారు. కేవల కర్మ చేసిన సాధకుడు (యజ్ఞం చేసిన) కృష్ణగతి ద్వారా స్వర్గలోకానికి వెళ్తాడు. కర్మ ఉపాసన సముచ్చయం (నాచికేతాగ్ని యజ్ఞం + విరాట్ ఉపాసన) చేసిన సాధకుడు శుక్లగతి ద్వారా బ్రహ్మలోక ప్రాప్తి పొంది, తద్వారా క్రమముక్తి పొందుతాడు. ఆ విషయం ఈ మంత్రంలో మళ్ళీ గుర్తుచేస్తున్నాడు యమధర్మరాజు.

మన హృదయం నుంచి నూటొక్క ప్రధాన నాడులు బయటకి వస్తాయి. చిన్న నాడులు కొన్ని వేలల్లో ఉన్నాయి. నూటొక్క నాడుల్లో ఒక నాడిని సుషుమ్న నాడి అంటారు. అది హృదయంలో మొదలయి, మెడ మధ్యభాగంలోంచి, తలలోకి వెళ్ళి తలపై భాగంకి వెళుతుంది. ఒక వ్యక్తి మరణించినప్పుడు, అతని సూక్ష్మశరీరం, శరీరంలోంచి ఈ నాడుల్లో ఏదో ఒకదాని ద్వారా బయటకి వస్తుందని శాస్త్రం చెప్తుంది. బయటకి వచ్చాక శుక్లగతి లేదా కృష్ణగతి లేదా అధోగతిద్వారా, తదనుగుణమైన లోకానికి చేరుకుంటుంది. ఉపాసకుని విషయంలో కపాలమోక్షం జరిగి, బ్రహ్మరంధ్రం నుంచి బ్రహ్మలోకం చేరుకుంటుంది అతని సూక్ష్మ శరీరం (ఇదంతా చాలా వివరంగా వస్తుంది బ్రహ్మసూత్రాల్లో). అక్కడ బ్రహ్మలోకంలో ఉపాసకుడు అవకాశం దొరికిన దాన్ని బట్టి సాక్షాత్తు బ్రహ్మనుంచి ఆత్మజ్ఞానం పొంది, అక్కడే జీవన్ముక్తి పొందుతాడు. మహాప్రళయం వచ్చినప్పుడు, అంతా అవ్యక్తంలోకి వెళ్ళిపోయినప్పుడు, బ్రహ్మలోకంలో జీవన్ముక్తి పొందిన ఈ ఉపాసకుడు విదేహముక్తి పొందుతాడు. దీన్నే క్రమ ముక్తి అంటారు. జ్ఞాని, ఉపాసకుడు – రెండూ కాని అజ్ఞాని కర్మఠుడి గతి ఎలా ఉంటుందో నాలుగో పాదంలో వస్తుంది. సుషమ్నా నాడి తప్ప తక్కిన నాడులు అతన్ని అన్ని దిశలలో తీసుకువెళ్తాయి. అంటే అతనికి పునర్జన్మ తప్పదు.

| | | | |
|---|---|---|---|
| టూకీగా – | జ్ఞానికి | – జీవన్ముక్తి | – మరణానంతరం ప్రయాణం లేదు |
| | ఉపాసకునికి | – క్రమముక్తి | – శుక్లగతి ద్వారా బ్రహ్మలోక ప్రాప్తి |
| | కర్మఠునికి | – పునరపి జననం | – కృష్ణగతి ద్వారా స్వర్గలోక ప్రాప్తి |

**మంత్రం – 17**

**అఙ్గుష్ఠమాత్రః పురుషోఽన్తరాత్మా**
**సదా జనానాం హృదయే సన్నివిష్టః।**
**తం స్వాచ్ఛరీరాత్ప్రవృహేన్ముఞ్జాదివేషీకాం ధైర్యేణ**
**తంవిద్యాచ్ఛుక్రమమృతం తం విద్యాచ్ఛుక్రమమృతమితి॥**

**ప్రతిపదార్థం:** అఙ్గుష్ఠమాత్రః పురుషః – బొటనవేలి ఆకారంలో శరీరంలో ఉంది; అంతరాత్మ– ఆత్మ; సదా జనానాం హృదయే సన్నివిష్టః – అది అందరి హృదయం (మనసు)లో ఉంది, తం – దానిని; ముఞ్జాత్ – ముంజగడ్డి నుంచి; ఇషీకాం ఇవ – ఈనెలను వేరు చేసినట్టుగా; స్వాత్ శరీరాత్ – స్వంత శరీరం నుంచి; ధైర్యేణ – వివేకంతో; ప్రవృహేత్ – విడదీయలేని; తమ్ – ఆ; శుక్రం – శుద్ధం; అమృతం – నిత్యం; ఇతి విద్యాత్ – అని తెలుసుకో.

**తాత్పర్యం:** శరీరంలో నివసిస్తున్న ఆత్మ బొటనవేలు పరిమాణంలో ఉంటుంది. అది ఎప్పుడూ అందరి హృదయంలో ఉంటుంది. ముంజ గడ్డి నుండి ఈనెలను వేరుచేసినట్టుగా, ఆత్మను స్వంత శరీరం నుంచి వివేకంతో వేరు చేయాలి. ఆ ఆత్మ శుద్ధం, నిత్యం అని తెలుసుకో.

**వివరణ:** యమధర్మరాజు క్రమముక్తితో ముగిద్దామనుకున్నాడు కాని, చివర చెప్పినదే గుర్తుండిపోతుందేమో అని ఆందోళన చెంది, మళ్ళీ బ్రహ్మ విద్య, దాని ఫలం – జీవన్ముక్తి గురించి చెప్తున్నాడు. బొటనవేలి పరిమాణంలో ఆత్మ ఉందని యమధర్మరాజు అంతకు ముందే చెప్పాడు.

అఙ్గుష్ఠమాత్రః పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి। – కఠ 2.1.12

అఙ్గుష్ఠమాత్రః పురుషో జ్యోతిర్వివాధూమకః। – కఠ 2.1.13

ఈ విషయం మళ్ళీ గుర్తు చేస్తున్నాడు. హృదయం పిడికిలి అంత పరిమాణంలో ఉంటుంది కాబట్టి అందులో పట్టేది బొటనవేలు. ఆత్మ బొటనవేలి పరిమాణంలో అందరి హృదయంలో (మనసులో) సాక్షి చైతన్యంలా ఉన్నట్టుగా ఉంటుంది.

ఇది కూడా ఒక మహావాక్య మంత్రం. మొదటి రెండు పాదాల్లో 'త్వం పదార్థ' గురించి, మూడవ పాదంలో 'ఆత్మ అనాత్మల వివేకం గురించి, నాలుగవ పాదంలో 'ఐక్యం' గురించీ వస్తుంది.

అంగుష్ఠమాత్రః పురుషః అంతరాత్మ – అంతరాత్మ బొటనవేలి ఆకారంలో ఉన్నట్టుగా ఉంది. పురుషః అంటే ఇక్కడ శరీరంలోఉంది అని అర్థం. ఎవరి శరీరంలో? సదా జనానాం హృదయే సన్నివిష్టః – అది అందరి హృదయాలలో ఉంది. ఎలా? సాక్షి చైతన్యంలా ఉంది.

ఆలోచనలు ఉన్న, ఆలోచనలు లేని మనసుని సాక్షీభూతంగా చూస్తోంది. అనాత్మ శరీరంలో కలిసిపోయింది.

బ్రహ్మ విద్య అంటే ఆత్మ–అనాత్మ వివేకం చూపటం. ఆత్మను స్వంత శరీరం నుంచి విడదీసి చూడటం. ఉదాహరణకు చేతి మీద కాంతి ఉంది. మనం చేతిని చూస్తాము కాని, దాన్ని ప్రసరింపజేస్తున్న కాంతిని చూడము. చేయి ఉన్నా లేకపోయినా కాంతి వుంటుంది. కాంతినీ, చేతినీ విడదీసి చూడగలగటమే ఆత్మ అనాత్మ వివేకం. దీన్నే దృక్ దృశ్య వివేకం అనీ, శరీరం శరీరీ వివేకం అని కూడా అంటారు. కాంతిని విడదీసి అంటే దాన్ని ఏమీ చేయము. బుద్ధితో అర్థం చేసుకోవాలి. దానికి సూక్ష్మ బుద్ధి కావాలి అని యమధర్మరాజే చెప్పాడు. నేను తప్ప ఎవరూ అర్థం చేసుకోలేరు అని కూడా అన్నాడు. అంటే తనంత సూక్ష్మమైన బుద్ధి ఉన్నవాళ్ళు తప్ప అని అర్థం.

ధైర్యేన అంటే ఇక్కడ ధైర్యం కాదు. వివేకంతో విడదీయాలి. ఎలా? ముంజాత్ ఇషీకాం ఇవ – ముంజ గడ్డిలోంచి లేత భాగం జాగ్రత్తగా విడదీయాలి. జాగ్రత్తగా ఎందుకంటే ఆ లేతగడ్డి పదునుగా ఉంటుంది. చేతిని కోయగలదు. అలా సూక్ష్మ బుద్ధితో ఆత్మ–అనాత్మలను విడదీయాలి.

తం విద్యాచ్ఛుక్రమమృతం – తను శుద్ధం, నిత్యం బ్రహ్మను అని వివేకంతో తెలుసుకోవాలి. ఆత్మ ఏకత్వం శాస్త్రప్రమాణం ద్వారానే తెలుస్తుంది. జ్ఞాని ప్రపంచం నుంచి పారిపోనక్కరలేదు. ప్రపంచం సృష్టి, స్థితి, లయ కారణం నేనే అని తెలుసుకుంటే చాలు.

తం విద్యాచ్ఛుక్రమమృతం తం విద్యాచ్ఛుక్రమమృతమితి – అని రెండుసార్లు చెప్తున్నాడంటే, ఇక్కడితో బోధ ముగిసిందని అర్థం. దీనిని ఉపసంహారం అంటారు.

### మంత్రం – 18

**మృత్యుప్రోక్తాం నచికేతోఽథలబ్ధ్వా**
**విద్యామేతాం యోగవిధిం చ కృత్స్నమ్।**
**బ్రహ్మప్రాప్తో విరజోఽభూద్విమృత్యు–**
**రన్యోఽప్యేవం యో విదధ్యాత్మమేవ॥**

**ప్రతిపదార్థం:** అథ – ఆ తర్వాత; నచికేతః – నచికేతుడు; మృత్యు ప్రోక్తామ్ – యమధర్మరాజు చెప్పిన; ఏతామ్ విద్యామ్ – ఈ విద్యను; యోగ విధించ కృత్స్నమ్ లబ్ధ్వా – సంపూర్ణంగా తెలుసుకుని; బ్రహ్మప్రాప్తః విరజః అభూత్ – బ్రహ్మతో ఐక్యం చెంది; విమృత్యుః – మరణం నించి విముక్తుడు అయ్యాడు; అత్ర (కలుపుకోవాలి) – ఇక్కడే; ఇప్పుడే; ఏవం విత్ – అలా

తెలుసుకున్న; అధ్యాత్మమ్ – ఆత్మజ్ఞానం; అన్యః – ఇతరులు; సహ అపి ఏవ – పుణ్యపాపాల నుంచి విముక్తుడవుతారు.

**తాత్పర్యం:** యమధర్మరాజు చెప్పిన ఈ విద్యను, యోగాభ్యాసాన్ని కూడా (నిధిధ్యాసనార్థం) సంపూర్ణంగా తెలుసుకున్న నచికేతుడు విముక్తి పొందాడు ఇక్కడే ఇప్పుడే. ఎవరైనా ఈ జ్ఞానం ఇలా తెలుసుకుంటే ఇలాగే సంసారం నుంచి విముక్తి పొందుతారు.

**వివరణ:** 17వ మంత్రంలో నచికేతుడు, యమధర్మరాజుల మధ్య సంభాషణ ముగిసింది. వాళ్ళను ప్రవేశపెట్టిన ఉపనిషత్తే ఉపసంహారం చెప్తోంది. నచికేతుడు యమధర్మరాజు చెప్పిన ఆత్మవిద్యను, నిధిధ్యాసనను (యోగవిధిని) చక్కగా నేర్చుకుని ఇక్కడే ఇప్పుడే ముక్తి పొందాడు. నేను 'అసంగ ఆత్మ' అన్న ధ్యాస అతనికి సహజంగా రావటాన్ని నిధి ధ్యాసనం అంటారు. దానివల్ల నిత్యముక్తి పొందుతాడు. అతనికి కోరికలు ఉండవు. మోక్షం కావాలన్న కోరిక కూడా ఉండదు. ఎందుకంటే అతను బ్రహ్మలో రమిస్తాడు కాబట్టి. విదేహ ముక్తి అంటే మోక్షం సాధ్యవస్తువు కాదు, సిద్ధవస్తువు అని గ్రహిస్తాడు.

బ్రహ్మవిద్య మనకున్న మూడు ముళ్లను – అజ్ఞానం, కోరిక, పుణ్యపాప కర్మలను – విడదీస్తుంది. అంటే ఈ మూడింటినీ బ్రహ్మవిద్య ప్రత్యక్షంగా నాశనం చేయదు. జ్ఞానం అజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. ఎప్పుడైతే అజ్ఞానం నాశనం అవుతుందో, అప్పుడే అజ్ఞాన జనిత కోరికలు, కోరికల నుంచి పుట్టిన పుణ్యపాపాలు నశిస్తాయి.

ఇక్కడ ఇంకో విషయం కూడా గుర్తుంచుకోవాలి. నాచికేతాగ్ని యజ్ఞం, విరాట్ ఉపాసనలు సకామ కర్మలుగా చేస్తే స్వర్గలోక ప్రాప్తి, బ్రహ్మలోక ప్రాప్తి చెందుతారని యమధర్మరాజు చెప్పాడు. అవే నిష్కామ కర్మలుగా చేస్తే అవి చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రతనిస్తాయి. నిజానికి రెండవ వరంగా వీటి గురించి చెప్పటంలోని అంతరార్థం కూడా ఇదే. స్వర్గలోక ప్రాప్తి, బ్రహ్మలోక ప్రాప్తి కన్నా సాధకుడు చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రత కోసం సాధన చేయాలి. ఇంకో అంతర్లీన సందేశం – కర్మతో ఆగిపోకూడదు. జ్ఞానానికి ఎదగాలి.

నచికేతుడే కాదు, ఎవరు మోక్షం పొందాలన్నా ఇదే మార్గం. అన్యః అన్న పదంలో ఎవరైనా అని వస్తుంది. జాతి, మత, కుల భేదాలు లేవు. పుణ్యపాపాభ్యాం విముక్తః భవతి–సంసార విముక్తి పొందుతాడు. అంటే దీని అర్థం జీవాత్మ, పరమాత్మ ఐక్యం తెలుసుకోవాలి. అది గురుశాస్త్ర ఉపదేశం ద్వారానే పొందాలి. దానివల్ల మోక్షం కలుగుతుంది.

ఇంకో ముఖ్యమైన విషయం – బ్రహ్మని పొందాడు, మోక్షం పొందాడు అంటే ఎక్కడికో వెళ్లాడు అని కాదు. అజ్ఞానం తొలగటమే జ్ఞానప్రాప్తి. అది సాధ్య వస్తువు కాదు. సిద్ధ వస్తువు.

**ఓమ్ సహ నావవతు। సహనౌ భునక్తు। సహవీర్యం కరవావహై।**
**తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై॥**
**ఓం శాంతిః శాంతిః శాంతిః॥**

మళ్ళీ శాంతి పాఠంతో ముగిస్తున్నాము. ఈసారి కృతజ్ఞత చూపిస్తున్నాము. చెప్పటంలో గాని, వినటంలో గాని దోషం ఉంటే అంటే విద్యా ప్రతిపాదనలో గాని, విద్యా గ్రహణంలో దోష ప్రక్షాళనార్థం పఠిస్తున్నాము. **నేను నేర్చుకున్న జ్ఞానం నాలో జీర్ణమగు గాక. దాన్ని నా సహజ స్వభావంగా అమర్చుకోగాక!**

ఓం శాంతి శాంతి శాంతి